Dwaraka


'ఎవరినైనా బలహీనవర్గాలు అని అంటున్నామంటే అది వాళ్ళ ఆర్థిక స్తోమతను బట్టే. మేధస్సులో వాళ్ళు ఎవరికీ తీసిపోరు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 301

సోమవారం 22-1-2018

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR| KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మహిళల కోసం..

ప్రత్యేక రుణ పథకాలు, తక్కువ వడ్డీ రేట్లతో బ్యాంకుల ప్రోత్సాహకాలు - 14లో



నాదల్ కష్టపడి...

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరిన స్పెయిన్ స్టార్ –స్పోర్ట్స్‌లో

ప్రజాకర్షక బడ్జెట్ కాదు!



రానున్న బడ్జెట్‌పై ప్రధాని మోదీ సంకేతాలు

- ప్రజలు ఏవీ ఉచితంగా కోరుకోరని, అది భ్రమేనని వ్యాఖ్య
- జీఎస్టీలో లోపాలను సరిచేసేందుకు సిద్ధం
- నోట్ల రద్దు ఒక విజయ గాథ
- న్యాయవ్యవస్థ సంక్షోభం వారి అంతర్గత విషయం
- 'టైమ్స్ నౌ' ఇంటర్వ్యూలో ప్రధాని స్పష్టీకరణ - 11లో

"ఎన్నికలు ఎన్నటికీ నా లక్ష్యం కాదు. ఎన్నికల కోసం నా టైంటేబుల్‌ను మార్చుకోను. దేశ ప్రజలకు సేవ చేయటం, ఇందుకోసం ముందుగా నిర్ణయించుకున్న పనులు పూర్తి చేయడమే నా లక్ష్యం - ప్రధాని మోదీ



బడ్జెట్లో 'ఐటీ' ఊరట!

ఆదాయ పన్ను రేట్లు, శ్లాబుల్లో మార్పులు...


పన్ను మినహాయింపు పరిమితి పెంపునకు అవకాశం

డివిడెండ్‌పై పన్నులో మార్పులు చేయకపోవచ్చు

2018 బడ్జెట్‌పై ఎర్నెస్ట్ అండ్ యంగ్ సర్వేలో అంచనాలు

- వివరాలు 16లో

అటెన్షన్.. ఆధార్!



విశిష్ట గుర్తింపు సంఖ్య భద్రత ప్రశ్నార్థకం

- వివరాలు తస్కరిస్తున్న అక్రమార్కులు
- ఇష్టారాజ్యంగా దుర్వినియోగం
- ఇతరుల ఆధార్‌తో మొబైల్ కనెక్షన్లు
- ఢిల్లీలో ఓ మహిళ ఆధార్ నంబర్‌తో 9 బోగస్ మొబైల్ కనెక్షన్లు
- ట్వీటర్‌లో పోస్టు చేయడంతో కలకలం
- వేలాదిగా స్పందించిన నెటిజన్లు
- అలా జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేయండి: యూఐడీఏఐ

సాక్షి, హైదరాబాద్

➡ ఆర్.డి.ప్రియా.. ఢిల్లీలోని వసంత్‌కుంజ్‌లో ఉంటారామె.. తన మొబైల్ నంబర్‌ను ఆధార్‌తో అనుసంధానం చేసేందుకు కొద్దిరోజుల కిందట ఎయిర్‌టెల్ స్టోర్‌కు వెళ్లింది.. కానీ అప్పటికే ఆమె ఆధార్‌తో ఏకంగా 9 మొబైల్ కనెక్షన్లు అనుసంధానమై ఉన్నాయని అక్కడి సిబ్బంది చెప్పడంతో ప్రియా షాక్‌కు గురైంది!

..ఆధార్ వివరాలు ఏమాత్రం బయటకు వెళ్లే అవకాశం లేదని, అత్యంత పకడ్బందీగా పరిరక్షిస్తున్నామని కేంద్రం చెబుతున్న మాటల్లోని డొల్లతనం ఈ ఉదంతంతో మరోసారి బయటపడింది! ఆధార్ గోప్యతపై అనేక అనుమానాలను రేకెత్తించింది. తనకు ఎదురైన ఈ అనుభవాన్ని వివరిస్తూ ప్రియా తాజాగా ట్వీటర్‌లో చేసిన పోస్టు కలకలం రేపుతోంది. వాస్తవానికి ఆమె గత 18 ఏళ్ల నుంచి ఒకే మొబైల్ నంబర్‌ను వినియోగిస్తోంది. ఇప్పటివరకు ఆ నంబర్‌తో సహా ఏ మొబైల్ నంబర్‌ను ఆధార్‌తో లింక్ చేయలేదు. తీరా ఇప్పుడు అనుసంధానం చేసేందుకు వెళ్లగా 9 కనెక్షన్లు మిగతా 2వ పేజీలో ▶

నూతన సీఈసీగా ఓపీ రావత్



నేడు పదవీ విరమణ చేయనున్న ఏకే జోతి

■ ఎన్నికల సంఘం నూతన ప్రధాన కమిషనర్(సీఈసీ)గా ప్రస్తుత కమిషనర్ ఓం ప్రకాశ్ రావత్ నియమితులయ్యారు. నేడు పదవీ విరమణ చేయనున్న ప్రస్తుత సీఈసీ ఏకే జోతి స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు. ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి అశోక్ లావాసా ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు.

- వివరాలు 11లో



నేటి నుంచి దావోస్ సదస్సు

- వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొంటున్న ప్రధాని మోదీ, ఇతర ప్రపంచ దేశాల అధినేతలు
- భారతీయ వంటకాలతో విందు, ప్రత్యేక ఆకర్షణగా యోగా
- భారత్ నుంచి 130 మంది ప్రతినిధులు

- వివరాలు 11లో

2024లో మనమే నంబర్ వన్

జనాభాలో చైనాను దాటనున్న భారత్ - వివరాలు 11లో

కుల వృత్తులకు నేరుగా రుణం

బీసీల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- 80 శాతం సబ్సిడీపై స్వయం ఉపాధి రుణాలు
- బ్యాంకులతో సంబంధం లేకుండా లబ్ధిదారులకు
- సబ్‌ప్లాన్ లేనట్లే.. ఎంబీసీ జాబితాలో 96 కులాలు!
- బడ్జెట్‌కు ముందే భారీ కసరత్తు

6 లో



కాంగ్రెస్‌లో కలి'విడి' యాత్ర!



అనుమతి ఇవ్వాలని కోరిన భట్టి, కోమటిరెడ్డి, రేవంత్

- వేర్వేరుగా చేయిద్దామా.. కలిపి నడిపిద్దామా?
- టీపీసీసీ తర్జనభర్జన.. ఉమ్మడి యాత్రకే మొగ్గు!
- మార్చిలో యాత్ర షురూ.. జూన్ 2న పరేడ్ గ్రౌండ్‌లో భారీ సభ
- సభకు రాహుల్‌ను ఆహ్వానించాలని నిర్ణయం

6 లో

కాంగ్రెస్‌తో పొత్తుకు సీపీఎం నో!

■ కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకోవాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వర్గం ప్రతిపాదించిన ముసాయిదా తీర్మానాన్ని పార్టీ కేంద్ర కమిటీ తోసిపుచ్చింది. ఈ మేరకు మంగళవారం కోల్‌కతాలో జరిగిన ఓటింగ్‌లో పొలిట్ బ్యూరో సభ్యుడు ప్రకాశ్ కారత్ నేతృత్వంలోని కేరళ బృందం ఏచూరి తీర్మానాన్ని ఓడించింది.

- వివరాలు 11లో


సాక్షి ప్రాఫిట్ ప్లస్

మరింత వినూత్నం..

మార్కెట్లు బాగా పెరిగిన ఈ తరుణంలో ఏ ఫండ్లయితే బెటర్? బ్యాంకుల్లో ఇపుడు డిపాజిట్లపై వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయి? అసలు బిజినెస్ ప్రపంచంలోని పరిణామాలపై మనకున్న అవగాహనెంత? ఇవన్నీ తెలియజేయటానికే... ఫండ్ రివ్యూ, వడ్డీ ఎట్ బ్యాంక్స్ కాలమ్‌లు మీ 'ప్రాఫిట్ ప్లస్'లో..

ఈ వారం నుంచి...

Dwaraka



67వ రోజు

21-01-2018, ఆదివారం
శ్రీకాళహస్తి,
చిత్తూరు జిల్లా

ప్రభుత్వ సంస్థలను మూతవేయించడం బాబుగారికి వెన్నతో పెట్టిన విద్య

ఉదయం లేవగానే బాగా అలసటగా అనిపించింది. నిన్నంతా చలిజ్వరం, జలుబు, తలనొప్పి బాధపెట్టాయి. జనం మధ్య తెలియలేదుగానీ.. రాత్రి కొద్దిగా కష్టంగానే అనిపించింది. డాక్టర్లు చూసి మందులిచ్చారు. తెల్లవారుజామున మరోసారి మాత్ర వేసుకోవాల్సి వచ్చింది. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారు. నాకు గమ్యం గుర్తుకొచ్చింది. నా కోసం వేచి ఉండే వేలాది జనం గుర్తుకొచ్చారు. మరో ఆలోచన లేకుండా శక్తి కూడదీసుకుని పాదయాత్రకు సిద్ధమైపోయాను. బహుశా.. ఈ శక్తంతా ఆ ప్రజలదేనేమో. వారి ప్రేమ, ఆప్యాయత, నా పట్ల నమ్మకం చూస్తుంటే.. ఆ ప్రజా కుటుంబాన్ని కలవకుండా, మాట్లాడకుండా రోజెలా గడపగలను? ఈ రోజు కూడా దారి పొడవునా ప్రజలు అదే ఆదరణతో, అదే ప్రేమతో స్వాగతిస్తుంటే.. నేను జ్వరానపడ్డ విషయమే మర్చిపోయాను. చెర్లోపల్లి హరిజనవాడకు చేరుకున్నప్పుడు పార్టీ నేతలు అక్కడ ఓ రావి మొక్కను నాటమన్నారు. పాదయాత్రలో 900 కిలోమీటర్లు పూర్తయ్యాయని గుర్తుచేశారు. అప్పుడే 900 కిలోమీటర్లు నడిచానా.. అన్న భావన మెదిలింది.


శ్రీకాళహస్తి నియోజకవర్గం చెర్లోపల్లె వద్ద 900 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసుకున్న వైఎస్ జగన్

కాళహస్తి శివార్లలో రాష్ట్ర పర్యాటకశాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, వర్కర్లు, డైలీ వేజెస్‌పై పనిచేసే వారు కలిశారు. ప్రభుత్వం ఆ సంస్థను ప్రైవేటుపరం చేయాలని చూస్తోందట. ఆ సంస్థకు చెందిన హోటళ్లు, బోటింగ్ యూనిట్లు, బస్సులు, విలువైన ఆస్తులన్నింటినీ కావాల్సిన వారికి కట్టబెడుతున్నారట. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉంటేనే సంస్థకు లబ్ధి, ఉద్యోగులకు శ్రేయస్సు, ప్రజలకు రక్షణ సాధ్యమని మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదట. విజయవాడ బోటింగ్ యూనిట్‌ను ప్రైవేటుపరం చేయొద్దని సంవత్సరం కిందటే హెచ్చరించామని, ధర్నా కూడా చేశామని, అయినా పెడచెవిన పెట్టారని.. దాని ఫలితమే గత నవంబర్‌లో జరిగిన ఘోర బోటు ప్రమాదమని చెప్పారు. ఆ దుర్ఘటనలో 23 మంది దుర్మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. టూరిజం సంస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ, వసతులు కల్పించకుండా, నిర్వహణను గాలికొదిలేసి, నష్టాల ఊబిలోకి నెట్టి.. ఆ సాకుతో ప్రైవేటుపరం చేస్తున్నారట. తన స్వార్థం కోసం ప్రభుత్వ సంస్థలను ప్రణాళిక ప్రకారం మూతవేయించడం, అయినవారికి కట్టబెట్టడం, ఆ సంస్థలపై ఆధారపడిన కుటుంబాలను రోడ్డున పడేయడం బాబుగారికి వెన్నతో పెట్టిన విద్య. ఇదే జిల్లాలోని సహకార చక్కెర ఫ్యాక్టరీలు, డెయిరీలు, ప్రభుత్వరంగ సంస్థలు, మోడల్ స్కూళ్లు మొదలుకుని.. ఇతర ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులూ.. అవే కథలను చెబుతున్నాయి.

కొంతదూరం పోగానే కలంకారీ వృత్తిలో ఉన్న అక్కచెల్లెమ్మలు కలిశారు. దాదాపు మూడు వేల మంది ఈ హస్తకళలపై ఆధారపడి బతుకుతుండగా, అందులో రెండు వేల మంది దాకా మహిళలే ఉన్నారట. ప్రపంచమంతా మెచ్చిన శ్రీకాళహస్తి కలంకారీ పనితనానికి ప్రభుత్వం నుంచి సరైన గుర్తింపు, ప్రోత్సాహం లేదన్నది వారి బాధ. శ్రీకృష్ణదేవరాయల కాలం నుంచి విలసిల్లిన ఈ కళకు గ్రహణం పట్టకూడదు. ప్రాచీన నాగరికతను ప్రతిబింబించే ఈ కళను కాపాడుకుని, భావితరాలకు అందించే బాధ్యత పాలకులపై ఉంది.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. చిత్తూరు జిల్లాలో విజయా డెయిరీ, సహకార చక్కెర ఫ్యాక్టరీలను పక్కా ప్రణాళికతో మూతవేయించారు. అదే తరహాలో ఏపీ టూరిజం సంస్థ ఆస్తులను మీ బినామీలకు, మీ అనుయాయులకు కట్టబెట్టాలనుకోవడం వాస్తవం కాదా? వేలాదిమంది ఉద్యోగులు, కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేయడం న్యాయమేనా?

వైఎస్. జగన్.

పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. గత 24 గంటల్లో ఆదిలాబాద్‌లో 6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. సాధారణం కంటే 6 డిగ్రీలు తక్కువగా మెదక్‌లో 9 డిగ్రీలు, రామగుండంలో 11 డిగ్రీలు, ఖమ్మంలో 13 డిగ్రీల చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హకీంపేట, హైదరాబాద్‌లలో 13 డిగ్రీల చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. నిజామాబాద్‌లో 14, హన్మకొండలో 15, మహబూబ్‌నగర్‌లో 16, నల్లగొండలో 17 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అటుఇటుగా నమోదయ్యాయి. సోమవారం ఆదిలాబాద్ జిల్లాలో పలుచోట్ల చలిగాలుల తీవ్రత ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

ఇదీ సాక్షి పాఠకుల సంఖ్య | **ఐఆర్ఎస్ సర్వేలో వెల్లడి**

93,41,000



సాక్షి, హైదరాబాద్

సాక్షి దినపత్రికను ప్రతిరోజూ 93.41 లక్షల మంది పాఠకులు చదువుతున్నారని ఇండియన్ రీడర్‌షిప్ సర్వే (ఐఆర్ఎస్)-2017 తేల్చింది. ఈ సర్వేలో ప్రాంతీయ, హిందీ పత్రికలే అగ్రస్థానంలో నిలిచాయి. ఇంగ్లిష్ పత్రికలను వెనక్కినెట్టి టాప్-10 స్థానాలను ఇవే కైవసం చేసుకున్నాయి. హిందీ పత్రికల పాఠకుల సంఖ్యలో ఏకంగా 45 శాతం వృద్ధి నమోదైంది. 7 కోట్లపైచిలుకు పాఠకులతో దైనిక్ జాగరణ్ మొదటి స్థానంలో, 5.23 కోట్లతో హిందుస్థాన్, 4.6 కోట్లతో అమర్ ఉజాలా పత్రికలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. రీడర్‌షిప్ స్టడీస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్ఎస్‌సీఐ), మీడియా రీసెర్చ్ యూజర్స్ కౌన్సిల్(ఎంఆర్‌యూసీ)లు తాజాగా ఈ సర్వే ఫలితాలను వెల్లడించాయి. గత నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా పత్రికలు కొత్తగా 11 కోట్ల మంది పాఠకులను సంపాదించుకున్నాయి. 2014 ఐఆర్ఎస్ నివేదిక ప్రకారం దేశంలో మొత్తం పాఠకుల సంఖ్య 29.5 కోట్లు కాగా ప్రస్తుతం అది 40.7 కోట్లకు చేరింది. కొత్తగా చేరిన ఈ పాఠకులు పట్టణ ప్రాంతాల్లో 4 కోట్లు ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 7 కోట్లు ఉండటం గమనార్హం. అలాగే 12 ఏళ్లు పైబడిన వారిలో పాఠకుల సంఖ్య 9 శాతం పెరిగినట్టు తేలింది. ''ఈ అంకెలు ప్రింట్ రంగానికి మున్ముందు ఉజ్వల భవిష్యత్ ఉందనడానికి అద్దం పడుతున్నాయి'' అని ఎంఆర్‌యూసీ చైర్మన్ ఆశిష్ భాసిన్ పేర్కొన్నారు.

అ'టెన్షన్'.. ఆధార్!

AADHAAR

▶ మొదటి పేజీ తరువాయి

లింక్ అయి ఉన్నాయని చెప్పడంతో ఆశ్చర్యపోయింది. 'ఇది నా జీవితంలో అతిపెద్ద షాక్'అంటూ ఐదు రోజుల కింద ఆమె ట్వీటర్‌లో పేర్కొంది. వేలాది మంది ఆమె ట్వీట్‌ను షేర్ చేయడంతో సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు తెరదీసింది. ఆధార్‌తో పౌరుల వ్యక్తిగత సమాచారానికి భంగం వాటిల్లుతోందని నెటిజన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త సిమ్ కార్డు జారీ లేదా ఇప్పటికే వినియోగిస్తున్న మొబైల్ నంబర్లను ఆధార్‌తో అనుసంధానం చేసే సమయంలో టెలికం కంపెనీలు వినియోగదారుల వేలి ముద్రల(బయోమెట్రిక్)ను స్కాన్ చేసి ఆధార్ డేటాతో సరిపోల్చి చూసుకుంటాయి. అయితే తాజా ఘటనలో బాధితురాలికి సంబంధించిన బయోమెట్రిక్ డేటాతో నిర్ధారించుకోకుండానే టెలికం కంపెనీలు ఆమె ఆధార్ నంబర్‌తో 9 మొబైల్ కనెక్షన్లు ఎలా జారీ చేశాయని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఒక ఆధార్ నంబర్‌పై గరిష్టంగా 6 మొబైల్ కనెక్షన్లు మాత్రమే జారీ చేయాలని ట్రాయ్, డీఓటీ నిబంధనలు చెబుతుండగా.. 9 కనెక్షన్లు ఎలా జారీ అయ్యాయన్నది అర్థం కాని ప్రశ్నగా మారింది.

ఆధార్ వినియోగాన్ని ఇలా తెలుసుకోవచ్చు

https://resident.uidai.gov.in/notification-aadhaar వెబ్‌సైట్ లింక్‌ను క్లిక్ చేయడం ద్వారా ప్రతి ఒక్కరూ.. ఇప్పటివరకు ఎక్కడెక్కడ తమ ఆధార్ నంబర్ వినియోగమైందన్న సమాచారం తెలుసుకోవచ్చు. 12 అంకెల ఆధార్ గుర్తింపు నంబర్, సెక్యూరిటీ కోడ్(వెబ్‌సైట్‌లోనే ఉంటుంది)ను ఎంటర్ చేయగానే, ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్‌కు వన్ టైమ్ పాస్‌వర్డ్(ఓటీపీ) వస్తుంది. ఆ ఓటీపీని ఎంటర్ చేయగానే ఆధార్ వినియోగ వివరాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి.

అలా చేస్తే ఫిర్యాదు చేయండి

ఈ వివాదం తీవ్రం కావడంతో ఆధార్ కార్డులను జారీ చేస్తున్న భారతీయ విశిష్ట గుర్తింపు యాజమాన్య సంస్థ (యూఐడీఏఐ)తోపాటు ఎయిర్‌టెల్ స్పందించింది. బాధితురాలు ప్రియాతో ట్వీటర్‌లో సంప్రదింపులు జరిపాయి. తమ ఆధార్ నంబర్‌తో ఎన్ని మొబైల్ కనెక్షన్లు అనుసంధానమై ఉన్నాయో తెలుసుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని యూఐడీఏఐ పేర్కొంది. తమ ఆధార్ నంబర్‌తో మొబైల్ కంపెనీలు మోసపూరితంగా సిమ్‌కార్డులు జారీ చేస్తే ట్రాయ్, లేదా డీఓటీలకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. మరోవైపు బాధితురాలిని 'సాక్షి'ట్వీటర్‌లో పలకరించగా.. ఈ ఘటనపై ఇంకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని వివరించింది. తనకు పూర్తి సమాచారం ఇస్తానని ఎయిర్‌టెల్ హామీ ఇచ్చిందని, కొద్దిరోజులు వేచి చూసి ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపింది.

భద్రతకు ఏదీ భరోసా?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు, కార్యక్రమాలకు ఆధార్‌ను తప్పనిసరి చేశాయి. రేషన్ కార్డులు, బ్యాంక్ ఖాతా, గ్యాస్ కనెక్షన్, డ్రైవింగ్ లైసెన్స్, ఉపకార వేతనాలు, స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు, విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ఎరువులు, పాస్‌పోర్టు, సామాజిక పింఛన్లు, సంక్షేమ పథకాలు.. ఇలా ప్రతి అవసరానికి ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతిని తీసుకుంటున్నారు. అయితే వాటిని పకడ్బందీగా సంరక్షించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కార్యాలయాల్లో పని చేసే కొంతమంది సిబ్బంది లబ్ధిదారుల ఆధార్ జిరాక్స్ ప్రతులను తస్కరించి తమ సొంత అవసరాల కోసం దుర్వినియోగం చేస్తున్నారని చాలాకాలంగా ఆరోపణలు న్నాయి. ప్రధానంగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల లబ్ధి కోసం రాష్ట్రంలో ఏటా లక్షల మంది విద్యార్థులు తమ దరఖాస్తులతో పాటు ఆధార్ ప్రతిని జత చేస్తున్నారు. స్కాలర్‌షిప్‌లు జారీ చేసే సంక్షేమ శాఖలు, విద్యా సంస్థల కార్యాలయాల్లో విద్యార్థుల దరఖాస్తులను కుప్పలు తెప్పలుగా పడేస్తుండడంతో వారి ఆధార్ గుర్తింపు ప్రమాదంలో పడింది.

లింక్‌కు మార్చి 31 వరకు గడువు

ప్రతి మొబైల్ ఫోన్‌ను ఆధార్‌తో అనుసంధానం చేసే ప్రక్రియను కేంద్రం చేపట్టింది. టెలికం సర్వీస్ ప్రొవైడర్లు తమ వినియోగదారుల మొబైల్ ఫోన్ నంబర్లను ఆధార్‌తో అనుసంధానం చేసేందుకు వచ్చే మార్చి 31 వరకు గడువు పొడిగిస్తూ టెలికం శాఖ ట్రాయ్ నోటిఫికేషన్ జారీ చేశాయి. వినియోగదారులు టెలికాం కంపెనీ స్టోర్‌కు వెళ్లినప్పుడు తమ ఆధార్ నంబర్‌తో ఇంకా ఏమైనా మొబైల్ కనెక్షన్లు అనుసంధానమై ఉన్నాయా? అన్న విషయాన్ని అడిగి తెలుసుకోవచ్చు. ఒకవేళ తమకు సంబంధం లేని మొబైల్ కనెక్షన్లు లింక్ అయి ఉంటే తక్షణమే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ట్రాయ్ అధికార వర్గాలు సూచిస్తున్నాయి.

పహాణీ కుదింపు



- భూ రికార్డుల నిర్వహణలో కీలక మార్పు కోసం కసరత్తు
- ధరణి వెబ్‌సైట్‌లో ప్రత్యేక డిజైన్ తయారీకి నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: భూ రికార్డుల నిర్వహణలో కీలక పాత్ర పోషించే పహాణీని కుదించే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. పహాణీలో ఇప్పటివరకు రాస్తున్న వాటిలో ఉపయోగం లేని కాలమ్‌లను తొలగించి ప్రత్యేక ఫార్మాట్‌ను తయారు చేయాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రెవెన్యూ యంత్రాంగం దీనిపై దృష్టి పెట్టింది. ఇప్పటివరకు 31 కాలమ్‌లుగా ఉన్న పహాణీలను 14-15 కాలమ్‌లకు తగ్గించే కోణంలో అధికారులు కసరత్తు చేస్తున్నారు. భూ రికార్డుల ప్రక్షాళన అనంతరం వచ్చిన వివరాలను పాత ఫార్మాట్‌లోనే పహాణీలు చేస్తున్నా.... భవిష్యత్తు భూ రికార్డుల నిర్వహణ కోసం ఉపయోగించేందుకు ధరణి వెబ్‌సైట్‌లో కొత్త పహాణీ కోసం ప్రత్యేక డిజైన్ చేయాలని నిర్ణయించారు.

ఆ 15 అప్‌డేట్ కావడం లేదు...

ప్రస్తుతం పహాణీలో 31 కాలమ్‌లున్నా పంటల సాగు వివరాలతో కూడిన 15 కాలమ్‌లను కొంతకాలంగా అప్‌డేట్ చేయడం లేదు. దీంతో మిగిలిన 16 కాలమ్‌లలోనే పహాణీలోని వివరాలను పొందుపరుస్తున్నారు. అయితే ఆ 16 కాలమ్‌లలో కూడా కొన్ని కాలమ్‌లు ఉపయోగం లేదనే అభిప్రాయం ఉంది. ముఖ్యంగా వ్యవసాయ భూములకు శిస్తు ఎప్పుడో రద్దయినా అందుకు సంబంధించిన కాలమ్ కొనసాగుతోంది. దీంతోపాటు పొజిషన్ (కబ్జా) కాలమ్, జలాధారం లాంటి కాలమ్‌లను తొలగించాలనే అభిప్రాయం రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమవుతోంది. టైటిల్, సీరియల్ నంబర్, సర్వే నంబర్, సబ్ డివిజన్, అనుభవదారుని పేరు తదితర వివరాలుంటే సరిపోతుందని, వాటికితోడు ఆ సర్వే నంబర్‌లోని ఎంత భూమిలో ఏ పంట సాగుచేశారనే వివరాలను కూడా నమోదు చేస్తే సరిపోతుందని రెవెన్యూ వర్గాలంటున్నాయి. అందరికీ అర్థమయ్యేలా పహాణీని తయారు చేయడం ద్వారా పారదర్శక విధానాన్ని అందుబాటులోకి తేవాలని రెవెన్యూ వర్గాలంటున్నాయి. సీఎం కేసీఆర్ కూడా పహాణీలోని కాలమ్‌ల కుదింపు, మార్పులకు అంగీకారం తెలపడంతో కొత్త పహాణీ రూపకల్పనకు రెవెన్యూ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతానికి భూ రికార్డుల ప్రక్షాళన అనంతరం వచ్చిన వివరాలను మాత్రం పాత ఫార్మాట్‌లోని పహాణీలోనే మాన్యువల్‌గా రాస్తున్నారు. అయితే దీనిని కంప్యూటరీకరించి వ్యవసాయ భూముల రికార్డుల నిర్వహణకుగాను తయారు చేసే 'ధరణి'వెబ్‌సైట్‌లో నమోదు చేసే సమయంలో కొత్త పహాణీ ఆధారంగా చేస్తామని, ఇందుకోసం ప్రత్యేకంగా పహాణీని డిజైన్ చేస్తున్నామని రెవెన్యూశాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

నీటి బకెట్‌లో ముంచి చిన్నారి హత్య

తండ్రిపైనే అనుమానం!



అలంపూర్: నీటి బకెట్‌లో ముంచి ఐదు నెలల చిన్నారిని హత్య చేశారు. తండ్రే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఈ ఘటన ఆదివారం రాత్రి జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుర్వ విజయ్‌కు ఇదే మండలంలోని భైరాపురం గ్రామానికి చెందిన వెన్నెలతో వివాహమైంది. దంపతులకు ఐదు నెలల పాప సంతానం. తొలికాన్పు కావడంతో వెన్నెల తన స్వగ్రామానికి వెళ్లింది. పాప ఇంటికి రావడంతో కుటుంబంలో సంతోషం వెల్లివిరిసింది. సాయంత్రం వరకు అందరినీ మురిపించిన చిన్నారి.. ఏమైందేమో తెలియదు కానీ రాత్రి బకెట్‌లో విగతజీవిగా మారింది. విజయ్ మానసికస్థితి బాగా లేదని గ్రామస్తులు చెబుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సైబర్ నేరగాళ్ల బారిన ఎమ్మెల్సీ రామచంద్రరావు



సాక్షి,హైదరాబాద్: ఎమ్మెల్సీ రామచంద్రరావును కూడా సైబర్ నేరగాళ్లు మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 1న సైబర్ నేరగాళ్లు ఆయనకు ఫోన్ చేసి ఆర్‌బీఐ అధికారిని మాట్లాడుతున్నానంటూ క్రెడిట్ కార్డు వివరాలు అప్‌డేట్ చేయాలని కోరారు. దీంతో సీవీవీ, మొబైల్‌కు వచ్చిన ఓటీపీ సంఖ్యలను కూడా చెప్పేశారు. వెంటనే ఆయన కార్డునుంచి రూ.70 వేలను ఇతర ఖాతాల్లోకి మళ్లించేశారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

మృత్యుంజయుడు!

పాడుబడిన బావిలో నవజాత శిశువు...

నర్సాపూర్‌రూరల్: పాడుబడిన బావిలో ఓ నవజాత మగ శిశువు లభ్యమైంది. కాగజ్‌మద్దూరు గ్రామంలో ఆదివారం పాడుబడిన బావి నుంచి శిశువు ఏడుపు వినిపించడంతో అటుగా వెళ్తున్న గ్రామస్తులు తొంగి చూశారు. పాడుబడిన బావిలో గాజుపెంకులు, చెత్తాచెదారం మధ్యలో శిశువు కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు..8 మీటర్ల లోతులో ఉన్న శిశువును క్షేమంగా పైకి తీసుకొచ్చి నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. కాలుకు చిన్న గాయం తప్ప ఎలాంటి ప్రాణాపాయం లేదని నిర్ధారించారు. పుట్టిన మరుక్షణమే



శిశువును బావిలో పడివేసి ఉంటారని వైద్యులు భావిస్తున్నారు. సోమవారం సంగారెడ్డిలోని చైల్డ్‌వెల్ఫేర్ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్ఐ వెంకటరాజాగౌడ్ చెప్పారు. నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన కాంగ్రెస్ నేత సునీతారెడ్డి.. శిశువు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. శిశువుకు 'మృత్యుంజయుడు'అనే పేరు పెట్టించాలన్నారు.

దేశ రెండో రాజధానిగా హైదరాబాద్‌ను ఒప్పుకోం

ప్రొఫెసర్ కోదండరాం

హైదరాబాద్: దేశ రెండో రాజధానిగా హైదరాబాద్‌ను అంగీకరించేది లేదని టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్‌కోదండరాం స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని సూచించారు. ఆదివారం రాత్రి కూకట్‌పల్లిలో జరిగిన టీజేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు రెండో బెంచి ఏర్పాటును ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. రెండో రాజధానిగా హైదరాబాద్‌ను ప్రకటిస్తే తెలంగాణలోని జిల్లాలు నగరానికి దూరమవుతాయన్నారు.

బీసీలకు మంత్రిత్వ శాఖ

ఆర్.కృష్ణయ్య డిమాండ్



హైదరాబాద్: బీసీలకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి రూ. 50 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం నేత, టీటీడీపీ ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో టీఎస్ఆర్టీసీ బీసీ ఉద్యోగ సంఘాన్ని బీసీ సంక్షేమ సంఘానికి అనుబంధం చేసినట్లు తెలిపారు. టీఎస్ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ చైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య, గౌరవాధ్యక్షులుగా కొమ్ము ఉమాదేవి, అధ్యక్షుడిగా ఆంజనేయులు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా హరికిషన్, సంయుక్త కార్యదర్శిగా జి.వెంకటేశ్ గౌడ్ తదితరులు ఎన్నికయ్యారు.

అంగట్లో కూరగాయల్లాగా ఉద్యోగాలను అమ్మేశారు.. పోస్టులు లేకున్నా ఎడాపెడా నియామకాలు చేపట్టారు. నియామకాలపై నిషేధం ఉన్నా.. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 1,731 మందిని దర్జాగా నియమించేశారు. ఈ విషయం ఇటీవల వెలుగు చూసేసరికి 'అరే.. ఇదేం విడ్డూరం'అంటూ ఉన్నతాధికారులు ఆశ్చర్యపోయారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. కానీ కొద్ది రోజులకే పరిస్థితి మారిపోయింది. ఆ నియామకాలన్నింటినీ సక్రమం చేసేందుకు ఫైలు కదిలింది.. పైగా నజరానాగా ఆ అక్రమ ఉద్యోగులందరికీ వేతన సవరణ చేసేందుకు రంగం సిద్ధమైంది. దళారులు తలుచుకుంటే జరగని దేముంది... అదీ అక్రమాలకు నిలయంగా మారిన దేవాదాయశాఖలో మరింత సులభమని మరోసారి రుజువైంది.

'అక్రమ ఉద్యోగుల' క్రమబద్ధీకరణ!

- నిషేధ సమయంలో దొడ్డి దారిలో చేరిన ఉద్యోగుల రెగ్యులరైజేషన్?
- పైగా వారికి వేతన సవరణ చేసేందుకూ రంగం సిద్ధం

సాక్షి, హైదరాబాద్: ఎన్నో అవినీతి ఆరోపణలతో పరువుపోగొట్టుకున్న దేవాదాయ శాఖలో తాజాగా జరుగుతున్న తంతు విస్మయం కలిగిస్తోంది. నియామకాల్లో అక్రమాలు జరుగుతున్నందున కొత్త నియామకాలు చేపట్టకుండా ప్రభుత్వం నిషేధం విధించిన కాలంలో దొడ్డిదారిన చేరిన అక్రమ ఉద్యోగులను క్రమబద్ధం చేసేందుకు రంగం సిద్ధమైంది. దేవాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, అర్చకులకు ప్రభుత్వం ఇటీవల వేతన సవరణ చేసింది. వేతన సవరణ కసరత్తు సమయంలో దేవాదాయశాఖలో నియామకాలపై నిషేధం ఉన్న సమయంలో 1,731 మంది అక్రమంగా ఉద్యోగాలు పొందారన్న విషయం బయటపడింది. దీంతో కంగుతున్న ఉన్నతాధికారులు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. దీంతో అక్రమంగా నియమితులైన వారికి వేతన సవరణ చేస్తే న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తుతాయని భావించిన సర్కారు వారికి వేతన సవరణను వర్తింపచేయొద్దని ఆదేశించింది. డిసెంబర్ నుంచి కొత్త వేతనాలు రావాల్సి ఉన్నందున వారిని పక్కనపెట్టి మిగతా వారికి వేతనాలు పెంచి బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేసింది. దీంతో ఆ అక్రమ ఉద్యోగులపై చర్యలు తప్పవనుకున్నారు. 2004లో దేవరయాంజాల్‌శ్రీరామచంద్రస్వామి భూముల అక్రమ ధారాదత్తం వెలుగు చూసినప్పుడు ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దేవాదాయశాఖలో పెద్ద సంఖ్యలో అక్రమంగా ఉద్యోగుల నియామకం జరిగినట్లు తేలింది. దీనికి ఓ కమిషనర్, కొందరు అధికారులు బాధ్యులని గుర్తించిన ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకుంది. అక్రమంగా నియమితులైనట్లు తేలిన కొందరు ఉద్యోగులను కూడా తొలగించింది.

దళారుల మాయ...

దేవాదాయశాఖలో తాజాగా బయటపడిన అక్రమ ఉద్యోగులను ఇప్పుడు కూడా ప్రభుత్వం తొలగిస్తుందన్న ప్రచారం జరిగింది. అవసరానికి మించి ఉద్యోగులు ఉన్నందున జీతాల రూపంలో దేవాదాయశాఖపై ఆర్థికభారం కూడా పడుతున్న విషయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందన్న వార్తలు వచ్చాయి. కానీ ఇదే సమయంలో కొందరు దళారులు రంగప్రవేశం చేశారు. అక్రమ ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు భారీగా డబ్బు వసూలు చేశారు. ఆ తర్వాత తెర వెనక ఇంకేం మతలబులు చోటుచేసుకున్నాయోగానీ అక్రమ ఉద్యోగులకు కూడా వేతన సవరణ చేసేందుకు అడ్డుగా ఉన్న అంశాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. ఆ ఉద్యోగులకు కూడా వేతన సవరణ చేయాలంటూ డిమాండ్ చేసిన దేవాదాయశాఖ అర్చక ఉద్యోగ సంఘాలకు ఆ మేరకు సమాచారం కూడా అందింది. ఈ నెలాఖరు వరకు ఆ తంతు పూర్తవుతుందని భావిస్తున్నారు. మార్చి నుంచి వారికి కూడా వేతన సవరణ అమలవుతుందని పేర్కొంటున్నారు. ఇదే జరిగితే అక్రమార్కులకు భరోసా లభించి భవిష్యత్తులో వారు మరిన్ని అక్రమాలకు తెగబడేలా ప్రోత్సహించినట్లు అవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇదం జగత్



ప్రధాని ఎలా అయ్యారు.. పార్టీని సమర్థవంతంగా ఎలా నడుపుతున్నారు, సంసారం లేకుండా హాయిగా ఎలా ఉన్నారనే కదా సార్ మీ ప్రశ్నలు..!

2019లో ఒకే ఇంజనీరింగ్ పరీక్ష!

- ఈ ఏడాదే అమలు చేయాలని భావించినా ఎన్‌టీఏ ఏర్పాటులో జాప్యంతో వాయిదా
- వచ్చే ఏడాదిలో అమలుపై అభిప్రాయాలు తెలియజేయాలన్న ఏఐసీటీఈ
- అన్ని రాష్ట్రాలకు లేఖలు రాసిన అధికారులు
- తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్ మార్కుల వెయిటేజీపై తర్జనభర్జన




సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు ఒకే ప్రవేశపరీక్ష నిర్వహించే అంశం పై చర్యలను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. జేఈఈ మెయిన్ ద్వారానే ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలతోపాటు రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల్లోని సీట్ల భర్తీకి కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) అన్ని రాష్ట్రాలకు లేఖలు రాసింది. దేశ వ్యాప్తంగా ఒకే పరీక్షపై తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఆ లేఖలో పేర్కొంది. మధ్యప్రదేశ్, హరియాణా, ఉత్తరాఖండ్, నాగాలాండ్, ఒడిశా ఇప్పటికే జేఈఈ మెయిన్ మెరిట్ ఆధారంగానే తమ రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లోని సీట్లను భర్తీ చేస్తుండగా.. తాజాగా కేరళ దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష ద్వారా ఇంజనీరింగ్ ప్రవేశాలకు అంగీకారం తెలిపింది. మిగతా రాష్ట్రాలు త్వరలోనే తమ అభిప్రాయాన్ని తెలియజేస్తే, దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని ఏఐసీటీఈ పేర్కొంది. ఈ విద్యా సంవత్సరంలోనే(2018–19) ఒకే ప్రవేశ పరీక్షను నిర్వహించాలని కేంద్రం గతేడాది భావించింది. జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణకు అవసరమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఏర్పాటులో జాప్యం కావడంతో వాయిదా వేసింది. పైగా రాష్ట్రాలతో ముడిపడి ఉన్న అంశం కావడం, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నందునా వచ్చే ఏడాదిలో అమలుకు అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను రాతపూర్వకంగా సేకరించే బాధ్యతను ఏఐసీటీఈకి అప్పగించింది. దీంతో ఏఐసీటీఈ లేఖలు రాసింది.

ఎన్‌టీఏ ఆధ్వర్యంలోనే..

జాతీయ స్థాయిలో వివిధ పరీక్షలను ప్రస్తుతం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్వహిస్తోంది. అయితే ఇతర విద్యా కార్యక్రమాలను కూడా చూస్తున్న సీబీఎస్ఈకి వాటి నిర్వహణ సమస్యగా మారుతుండటంతో కేంద్రం ప్రత్యామ్నాయ నిర్ణయం తీసుకుంది. జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఓకే చెప్పింది. ఎన్‌టీఏ ఏర్పాటుకు సంబంధించిన చర్యలపై కసరత్తు ప్రారంభించింది. మరోవైపు మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న నీట్, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు సీబీఎస్ఈ నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్ వంటి పరీక్షలను 2019 నుంచి ఎన్‌టీఏ ఆధ్వర్యంలోనే నిర్వహించాలన్న నిర్ణయానికి కేంద్రం వచ్చింది. ఇక ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను కూడా ఎన్‌టీఏ ద్వారానే నిర్వహించాలన్న ఆలోచన చేస్తోంది. దీనిపై ఐఐటీ కౌన్సిల్‌తో చర్చలు జరుపుతోంది. అయితే ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలు కేంద్ర ప్రభుత్వ సంస్థలు. వాటి కోసమే జేఈఈ మెయిన్‌ను సీబీఎస్ఈ నిర్వహిస్తోంది. ఇక రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లను మాత్రం పలు రాష్ట్రాలు తమ సొంత ప్రవేశ పరీక్షల ద్వారానే భర్తీ చేస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కూడా అదే చేస్తున్నాయి. అయితే మన రాష్ట్రంలో ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ విధానం ఉంది. ఈ నేపథ్యంలో జాతీయ స్థాయిలో ఒకే పరీక్ష ద్వారా ప్రవేశాలు చేపట్టే అంశంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అయితే ఇప్పటికే రాష్ట్రంలో ఇంజనీరింగ్‌కు డిమాండ్ తగ్గిపోతున్న నేపథ్యంలో ఎంసెట్ అవసరమే లేదన్న భావన ఉన్నత విద్యాశాఖ, సాంకేతిక విద్యాశాఖ వర్గాల్లో ఉంది. ఈ నేపథ్యంలో ఇంటర్ మార్కులకు వెయిటేజీ అంశమే అప్రస్తుతం అవుతుందన్న భావన నెలకొంది. అయితే వీటిపై రాష్ట్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఆ తర్వాత తమ అభిప్రాయాన్ని ఏఐసీటీఈకి తెలియజేయాలని భావిస్తున్నట్లు తెలిసింది.

మాజీ డీజీపీ రాగాల కన్నుమూత



హైదరాబాద్: మాజీ డీజీపీ రామకొండల రాగాల (80) ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని హబ్సిగూడ కాకతీయ నగర్‌లో గల తన నివాసంలో కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తూర్పు గోదావరి జిల్లా పత్తిపాడు మండలం చదలవాడ గ్రామానికి చెందిన ఆర్.కె.రాగాల 1994లో ఏడు నెలలపాటు ఆంధ్రప్రదేశ్ డీజీపీగా పనిచేశారు. కమ్యూనికేషన్ ఐజీ, ఫైర్ సర్వీసెస్ డీజీ, రాష్ట్ర హోంశాఖ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. పోలీసుశాఖలో 33 ఏళ్లపాటు సేవలందించి బలోపేతానికి పలు చర్యలు చేపట్టారు. ఆయనకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు అమెరికా నుంచి వచ్చిన తర్వాత మంగళవారం రాగాల అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఎన్నికల హామీలను అమలు చేయండి

సీఎం కేసీఆర్‌కు సీపీఐ కార్యదర్శి చాడ లేఖ



సాక్షి, హైదరాబాద్: ఉద్యమ సందర్భంగా, ఎన్నికల ప్రణాళికలో టీఆర్ఎస్ పేర్కొన్న హామీలను అమలు చేయాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. తమ పార్టీ నిర్వ హించిన పోరుబాట యాత్రలో ప్రజల నుంచి అనేక అర్జీలందాయని, వాటిలో ముఖ్యమైన సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు చాడ బహిరంగ లేఖ రాశా రు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగ యువత భావించిందని, అయినా వారికి నిరాశే మిగిలిందన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కూడా జరగలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో చెల్లించడం లేదన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం కొనసాగుతోందని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయాలని అన్నారు.

ఫీజు దరఖాస్తుల పరిశీలన షురూ!

- తొలుత ఫైనల్ ఇయర్ విద్యార్థుల అర్జీల పరిశీలన
- ఆధార్ అథెంటికేషన్ కోసం వేలిముద్రల స్వీకరణ
- మీ సేవా కేంద్రాల్లో ఫింగర్ ప్రింట్స్ ఇవ్వాలని సూచన



సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తుల పరిశీలనను సంక్షేమ శాఖలు మొదలుపెట్టాయి. 2017–18 విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గడువును ఫిబ్రవరి 10 వరకు పొడిగించిన ప్రభుత్వం.. వివిధ కోర్సుల్లో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థుల దరఖాస్తులను ముందుగా పరిశీలించాలని నిర్ణయించింది. ఈ మేరకు విద్యార్థుల అర్జీలను క్షుణ్నంగా పరిశీలించి అర్హతను తేల్చాలని జిల్లా సంక్షేమాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. గత కొన్నేళ్లుగా విద్యాసంవత్సరం ముగిసిన తర్వాతే ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులూ ప్రభుత్వం ఇస్తూ వచ్చింది. దీంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కోర్సులు ముగిసినా ఫీజులు చెల్లించని కారణంగా ఒరిజినల్ సర్టిఫికెట్లను కళాశాల యాజమాన్యాలు అట్టిపెట్టుకుంటున్నాయి. సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు ఫీజులు చెల్లించడమో.. లేక ప్రభుత్వం నిధులిచ్చే వరకు వేచి చూడటమో జరుగుతోంది. విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా కోర్సు ముగిసేనాటికి వారికి సర్టిఫికెట్లు అందించాలని సంక్షేమ శాఖలు నిర్ణయించాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 3.5 లక్షల మంది విద్యార్థులు ఫైనల్ ఇయర్ చదువుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.


మీ సేవా కేంద్రాల్లో..

దరఖాస్తుల పరిశీలనలో తొలుత విద్యార్థుల ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు తనిఖీ చేసి తర్వాత వేలిముద్రలు సేకరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం చివరి ఏడాది చదువుతున్న విద్యార్థుల ఆధార్, బ్యాంకు ఖాతా వివరాల పరిశీలన మొదలైంది. ఆ ప్రక్రియ పూర్తయితే వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు సంక్షిప్త సమాచారం వస్తుంది. తర్వాత సమీప మీ సేవా కేంద్రాల్లో బయోమెట్రిక్ ప్రక్రియను విద్యార్థులు పూర్తి చేయాలి. మీ సేవా సర్వర్‌ను ఈ–పాస్ వెబ్‌సైట్‌తో లింక్ చేశారు. వేలిముద్రలు సరిపోలిన వెంటనే కళాశాల ప్రిన్సిపాల్ ఐడీకి దరఖాస్తు చేరుతుంది. ధ్రువపత్రాల పరిశీలన తర్వాత తిరిగి సంక్షేమాధికారి ఐడీకి వాటిని సమర్పిస్తారు. పరిశీలన ప్రక్రియ పూర్తవగానే ఉపకార వేతనం, రీయింబర్స్‌మెంట్ పథకాలకు అర్హులుగా తేల్చుతారు. 2017–18 విద్యా సంవత్సరం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఉపకారవేతనాలు, రీయింబర్స్‌మెంట్‌కు రూ.650 కోట్ల బడ్జెట్ అవసరమని అంచనా వేసిన అధికారులు.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు.

19 నుంచి 24 వరకు 'గురుకుల' మెయిన్స్


సాక్షి, హైదరాబాద్: గురుకులాల్లోని పలు పోస్టులకు వచ్చే నెల 19 నుంచి 24 వరకు మెయిన్స్ పరీక్షలను నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ఆదివారం తెలిపింది. గురుకుల డిగ్రీ కాలేజీల్లోని డిగ్రీ లెక్చరర్స్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్, జూనియర్ లెక్చరర్, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్ పోస్టులకు 1:15 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసినట్లు పేర్కొంది. మరిన్ని వివరాలకు www.tspsc.gov.in చూడవచ్చు.

4
సాక్షి
సాహిత్యం
హైదరాబాద్ I సోమవారం I జనవరి I 22 I 2018
అభిప్రాయాలకు: sakshisahityam@gmail.com



ప్రేమ గెలిచిన బహుమతి

కథాసారం



ప్రేమ ప్రేమనే అడుగుతుంది.
కానీ ప్రేమను చూపించేదెలా?
అవును! ప్రేమను చూపించాలంటే త్యాగం చెయ్యాలి.
నిన్ను నువ్వు ఇచ్చుకోవాలి.
నీ ఇష్టాన్ని వదులుకోవాలి.
తనలో... తన సంతోషంలో నిన్ను చూసుకోవాలి.
నువ్వే బహుమతి కావాలి...
ప్రేమ గెలిచేంత బహుమతి కావాలి.

ఒక డాలరు ఎనభై ఏడు సెంట్లు. మొత్తం ఉన్నది అంతే. మాంసమో, మరోటో కొన్నప్పుడల్లా జాగ్రత్తగా మిగిల్చిన ఒక్కో సెంటు అది. మూడుసార్లు లెక్కించింది డెల్లా. ఒక డాలర్ ఎనభై ఏడు సెంట్లు. రేపే క్రిస్మస్! మంచం మీద పడి ఏడవటం తప్ప ఇంకేమీ చేయలేని పరిస్థితి. డెల్లా అదే చేసింది.

జేమ్స్ డిలింగ్ హమ్ యంగ్‌కు గతంలో వారానికి 30 డాలర్లు వచ్చేవి. ఇప్పుడు 20 డాలర్లే వస్తున్నప్పుడు ఆ పేరు మరీ పొడుగ్గా కనబడుతోంది. జేమ్స్ డి.యంగ్ అంటే చాలు. దాన్ని కూడా పొట్టి చేసి 'జిమ్' అని పిలుస్తుంది డెల్లా.

ఏడ్చిన తర్వాత ఆ శోకపు గుర్తులను ముఖం మీద తుడిచేసుకుంది. కిటికీ దగ్గర నిలబడి నిరాసక్తంగా బయటకు చూసింది. రేపే క్రిస్మస్ పండుగ. జిమ్ కోసం బహుమతి కొనడానికి ఆమె దగ్గర ఉన్నవల్లా 1.87 డాలర్లు మాత్రమే. నెలలుగా పోగేసినదానికి ఇదీ ఫలితం! ఇరవై డాలర్లతో వారంపాటు ఇల్లు గడపడం సాధ్యమా? అన్నీ ధరలు పెరిగిపోయే.

1.87 డాలర్లు మాత్రం ఉన్నాయి జిమ్‌కు బహుమతి కొనడానికి. తన జిమ్ కోసం. జిమ్‌కు తగ్గ బహుమతి ఇవ్వాలని గంటలు గంటలు ఆలోచించింది. కానీ ఏం లాభం?

గది కిటికీల మధ్య ఒక సన్నటి అద్దం ఉంది. దాన్లో మొత్తం మనిషి ఒకేసారి కనబడటం కష్టం. మొత్తం కనబడాలంటే కొంత నైపుణ్యం ఉండాలి. డెల్లా లాంటి నాజూకు అమ్మాయి ఆ కళలో నిష్ణాతురాలైంది. కిటికీ దగ్గర నుంచి వచ్చి అద్దం ముందు నిలబడింది. ఆమె కళ్లు కాంతిమంతంగా మెరుస్తున్నాయి. కానీ ముఖం వివర్ణమైంది. తన జుట్టును మొత్తంగా కిందికి వదిలేసింది.

డెల్లా, జిమ్ దంపతులు రెండు విషయాలకు గర్వపడతారు. ఒకటి జిమ్ బంగారపు వాచీ. అది వాళ్ల నాన్న నుంచి అతడికి వచ్చింది. అంతకు చాలా ఏళ్ల క్రితం వాళ్ల తాతది. ఏ రాజు దగ్గర కూడా అలాంటి వాచీ ఉండివుండదు. ఇక వాళ్లు గొప్పగా భావించే రెండో విషయం, డెల్లా జుట్టు. ఆ జుట్టు ఏ రాణి దగ్గర ఉన్న వజ్రాభరణాల కన్నా కూడా అందమైనది.

డెల్లా వదిలిన జుట్టు చూడ్డానికి గోధుమ రంగు నీటిప్రవాహంలా మెరుస్తోంది. ఆమె మోకాళ్ల దగ్గరకు వచ్చింది. అదే ఆమెను దుస్తుల్లాగా కప్పింది. దాన్ని మళ్లీ త్వరగా ముడేసుకుంది. ముడేసుకున్నాక ఒక్క క్షణం అలా నిస్తేజంగా నిలుచుంది. రెండు కన్నీటి చుక్కలు ఆమె చెంపల మీదుగా జారిపోయినై.

తన పాత బ్రౌన్ కోటు వేసుకుని, పాత బ్రౌన్ టోపీ పెట్టుకుని వీధిలోకి వచ్చింది. నడుస్తూ ఒక బోర్డు ఉన్న చోట ఆగింది. 'మిసెజ్ సోఫ్రోనీ. అన్ని రకములైన జుట్టు సరుకులు'.

రెండో అంతస్థు వరకు ఆగకుండా పరుగెత్తి, అలుపు తీర్చుకోవడానికి ఆగింది డెల్లా. తెల్లగా భారీగా వున్న మిసెజ్ సోఫ్రోనీ నిరాసక్తగా చూసింది డెల్లా వంక.

'మీరు నా జుట్టు కొంటారా?' అడిగింది డెల్లా.

'నేను ఉన్నదే అందుకు' అంది సోఫ్రోనీ. 'నీ టోపీ తీసేయ్; జుట్టు చూడాలి'.

మరోసారి గోధుమవర్ణపు నీటిప్రవాహం కిందకు జారింది. జుట్టు బరువును అంచనా వేస్తున్నట్టుగా ఎత్తి, 'ఇరవై డాలర్లు' అంది సోఫ్రోనీ.

'త్వరగా ఇవ్వండి'

మరి రెండు గంటల పాటు డెల్లా నగరంలోని ఒక దుకాణం నుంచి మరో దుకాణానికి పరుగెత్తింది, జిమ్‌కు తగిన బహుమతి వెతకడం కోసం. అన్ని దుకాణాలు గాలించిన తర్వాత ఎట్టకేలకు దొరికింది. అది కచ్చితంగా జిమ్ కోసమే తయారైవుండాలి. అదొక బంగారు వాచీ గొలుసు. నిరాడంబరంగా ఉంది. దాని గొప్పతనం అంతా దానికోసం వాడిన మెటీరియల్‌లో ఉంది. ఒకటేదైనా సరళంగా, నిరాడంబరంగా ఉందంటే అది విలువైనదని అర్థం చేసుకోవచ్చు. మంచి వస్తువులన్నీ అలాగే వుంటాయి. జిమ్ వాచీకి ఈ గొలుసు సరిగ్గా నప్పుతుంది. దానికోసం 21 డాలర్లు చెల్లించింది. దాన్ని తీసుకుని చేతిలో మిగిలిన ఎనభై ఏడు సెంట్లతో ఇంటికి వేగంగా నడిచింది.

ఇక ఈ గొలుసు గనకవుంటే జిమ్ తన వాచీని ఎప్పుడైనా ఎక్కడైనా చూసుకోవచ్చు. అంత మంచి వాచీకి తగిన పట్టీ లేదు. అందువల్ల జిమ్ ఎవరి సమక్షంలోనైనా దాన్ని బయటకు తీసి టైమ్ చూసుకోవడానికి ఇబ్బంది పడేవాడు. ఇప్పుడిక ఆ బాధ లేదు.

ఇంటికి వచ్చిన డెల్లా మనసు కాస్త కుదుటపడింది. ఇప్పుడు మరింత యుక్తిగా ఆలోచించి, కత్తిరించినది పోగా మిగిలిన జట్టును తన ముఖానికి నప్పేలా దువ్వింది. నలభై నిమిషాల తర్వాత ముఖం చూడబుద్ధేసేలా తయారైంది. పాఠశాల పిల్లాడిలాగా కనబడుతోంది. అద్దంలో తనను తాను చాలాసేపు అలాగే చూసుకుంది. 'జిమ్ గనక నన్ను చంపకపోతే' తనలో తాను అనుకుంది డెల్లా. 'రెండోసారి నన్ను చూసినప్పుడు, డబ్బుల కోసం ఆడిపాడే అమ్మాయిలా ఉన్నాననుకుంటాడు. కానీ ఏం చేయగలను నేను? ఉన్న ఒక డాలర్ ఎనభై ఏడు సెంట్లతో.'

ఏడు వరకు డిన్నర్ రెడీ చేసింది. జిమ్ ఏరోజూ ఆలస్యంగా రాడు. వాచీ గొలుసును చేతిలో పట్టుకుని జిమ్ వచ్చే తలుపు దగ్గర కూర్చుంది. అతడి అడుగుల శబ్దం వినపడగానే ఆమె ముఖం పాలిపోయింది. 'దేవుడా, ఆయన నేను ఇప్పుడు కూడా అందంగా ఉన్నాననుకునేట్టు చేయి' అని లోలోపల ప్రార్థించింది.

గుమ్మంలోంచి జిమ్ ఇంట్లోకి వచ్చాడు. డెల్లాను వింతగా చూశాడు. అతడి ముఖం అభావంగా ఉంది. డెల్లాకు దాన్ని చదవడం సాధ్యం కాక, భయపడింది.

'జిమ్, డియర్' అంటూ ఏడ్వడం మొదలుపెట్టింది. 'నన్ను అలా చూడకు. నేను జుట్టును అమ్మేశాను. నీకు బహుమతి ఇవ్వకుండా ఈ క్రిస్మస్ గడపడం నా వల్లకాలేదు. నా జుట్టు త్వరగానే పెరుగుతుంది. నువ్వు పట్టించుకోవుకదా? మనం సంతోషంగా ఉందాం. నీకోసం ఏం తెచ్చానో చూడు'.

'నువ్వు జుట్టు కత్తిరించావా?' నెమ్మదిగా అడిగాడు జిమ్. జరిగినది అర్థం చేసుకోవడానికి అతడు శ్రమపడ్డాడు.

'కట్ చేసి అమ్మేశాను' చెప్పింది డెల్లా. 'ఇప్పుడు నేను నచ్చడం లేదా? జుట్టు లేకపోయినా నేను నీ పాత డెల్లానే'.


జిమ్ ఊరడిస్తున్నట్టుగా ఆమె చుట్టూ చేతులు వేశాడు. పది సెకన్ల తర్వాత తన కోటు జేబులోంచి కాగితంలో చుట్టివున్నదాన్ని టేబుల్ మీద పెట్టాడు. 'నీ జుట్టు పోయినంత మాత్రాన నీ మీద నా ప్రేమ ఏమీ తగ్గదు డెల్. కానీ నువ్వు ఆ కాగితం తెరిచి చూస్తేగానీ నా బాధేమిటో నీకు అర్థం కాదు'.

ఆ కాగితం విప్పుతూనే డెల్లా సంతోషంతో అరిచింది. 'ఓ ఓ'. వెంటనే ఆ సంతోషం కన్నీళ్లుగా కరిగిపోయింది. అందమైన దువ్వెనలు! వాటికి నగలు పొదిగివున్నాయి. డెల్లా అందమైన జుట్టుకు బాగుంటాయని తెచ్చాడు. ఆమె వాటినో షాపులో చూసి ఇష్టపడింది. అవి ఖరీదైనవైనా తన సొంతం అవుతాయన్నంత విశ్వాసంతో చూసింది. అవి వచ్చేసరికి ఆమెకు జుట్టు లేకుండా పోయింది.

ఇంకా జిమ్ తన బహుమతి ఏమిటో చూడలేదు. డెల్లా చేతిలో ఉన్న ఆ బంగారు గొలుసు ఆమె చేతిలా మెరుస్తోంది. 'బాగుందా జిమ్? దీని కోసం నగరమంతా గాలించాను. నీ వాచీ ఇవ్వు'.

జిమ్ కూర్చుని నవ్వాడు. 'డెల్లా, మన క్రిస్మస్ బహుమతుల్ని కాసేపు పక్కన పెడదాం. ఆ దువ్వెనలు కొనడానికి నేను వాచీని అమ్మేశాను. మనం డిన్నర్ చేయడం మంచిదేమో'.

భూమ్మీద ఎందరో బహుమతులు ఇచ్చుకుంటారు. కానీ ఈ యువదంపతులు ఒకరిమీద ఒకరికి గల అపారమైన ప్రేమతో ఇచ్చుకున్న బహుమతులు ఎంత గొప్పవి!



ఒ.హెన్రీ అన్న కలంపేరుతో కీర్తినొందిన కొసమెరుపు కథల మాస్టర్ విలియమ్ సిడ్నీ పోర్టర్ కథ 'ద గిఫ్ట్ ఆఫ్ మ్యాజీ' సారం ఇది. 1862లో జన్మించి 1910లో మరణించిన ఈ అమెరికన్ కథకుడి 'ద లాస్ట్ లీఫ్' కథ కూడా జగత్ప్రసిద్ధం.

ఒ. హెన్రీ

సాహిత్య మరమరాలు

కాఫీ గ్లాసు కూడా తీసుకుపొండి

ఇది 1939 నాటి సంగతి. ఆంధ్రవిశ్వవిద్యాలయం తరఫున తిరుమల రామచంద్ర, కొమ్మనమంచి జోగయ్య శర్మ 'ద్విపద భారతం' ముద్రణప్రతిని సిద్ధపరచడానికి తంజావూరు వెళ్లారు. కాఫీ తాగాలని స్టేషను దగ్గరి హోటల్‌కు వెళ్లారు. అప్పటికి కాఫీ గానీ, మంచినీళ్లు గానీ ఎంగిలి చేసి తాగరాదనే నియమం హోటళ్ల నుంచి పోలేదు. గాజు గ్లాసును మాత్రం ఎంగిలి చేయవచ్చు. అందుకే జోగయ్య శర్మ సర్వరును కాఫీని గాజుగ్లాసులో తెమ్మన్నారు. అతడు ఏ లోకంలో




ఉన్నాడో ఇత్తడి గ్లాసులో పట్టుకొచ్చాడు. ఎటూ తెచ్చాడు కదా అని జోగయ్య ఎంగిలి చేసి తాగేశారు. తాగేవరకు ఆగి, దగ్గరికి వచ్చి, ప్రొప్రయిటర్ ''అయ్యా! కప్పు వెల కూడా కడుతున్నాను– కప్పు వాంగిడు పోరగసి– కప్పు వెల కూడా ఇచ్చి కప్పు తీసుకుపొండి'' అన్నాడు. గోడ మీద నోటీసు చూపించాడు. నాకు తమిళం రాదు, నేను గాజుగ్లాసులోనే తెమ్మన్నాను, అంటారు జోగయ్య. 'ఇదంతా ముడియాదు, డబ్బు చెల్లించాల్సిందే' అంటాడు ప్రొప్రయిటర్. 'హోరాహోరీ పోట్లా'ట తర్వాత, తిరుమల రామచంద్రకు తెలిసిన రాజగోపాలయ్యర్ అనే స్థానిక కాంగ్రెస్ నాయకుడు వచ్చి వారిని శాంతపరిచాడు. గాజుగ్లాసులోనే తెమ్మన్నా ఇత్తడి గ్లాసులోనే తెచ్చిన మతిమరుపు సర్వరుది తప్పుగా తేల్చారు. సర్వరు నష్టపోవడం ఇష్టంలేక జోగయ్య శర్మ గ్లాసు నష్టం చెల్లించడానికి సిద్ధపడ్డారు. ఈలోపు ప్రొప్రయిటరే 'ఠండా అయి సర్వరును చీవాట్లు పెట్టి' ఆ గ్లాసును వాళ్ల ఎదుటే గాడిపొయ్యిలో వేసి కాల్చి తోమించారు.

('పలుకులమ్మ తోటమాలి'లోని తిరుమల రామచంద్ర 'నా తీరని కోరిక' వ్యాసం ఆధారంగా)

కొత్త బంగారం

భూమంత లోతైన సమస్య

ఒడిశా జిల్లా తాంబాపుర్లో ఉన్న 'భారత్ కాపర్ లిమిటెడ్' సంస్థ ప్రైవేటీకరణ అవడంతో, ఉద్యోగం పోయిన ప్లంబర్ గిరీశ్ పని వెతుక్కుంటూ దిల్లీ వెళ్తాడు. అక్కడ ఒక వ్యాపారవేత్త గిరీశ్‌ను పనిలో పెట్టుకుంటాడు. పని ఏమిటంటే– వేదాల్లో పేర్కొనబడి, కాల్పనిక భవిష్యత్తులో జరగబోయే యుద్ధాలన్నింటినీ అంతం చేసి, శాంతి నెలకొలిపే– ఉనికిలో లేని సరస్వతి నదిని కనుక్కొనేటంత లోతుగా నేలను తవ్వడం! నదిని వెతికే ప్రక్రియలో– నీళ్ళని దురుపయోగించిన నేరానికి భూమినుండి బహిష్కరించబడిన కల్నల్ గంభీర్ అవస్థీ, ఫిలిప్పా కారీ జోన్స్ కనిపిస్తారతనికి.



సారనాథ్ బెనర్జీ రాసిన గ్రాఫిక్ నవల ఇది. మన దేశంలో ఇంకా ఎక్కువ గుర్తింపు రాని సాహిత్య ప్రక్రియ. 150 పేజీలున్న ఈ పుస్తకం– మాటల, రేఖా చిత్రాల మిశ్రమం.

నీటి కొరతతో ఎండిపోయిన దిల్లీ పట్టణపు నేపథ్యంతో, మధ్యతరగతి వికాస్‌పురి కాలనీని ఆధారంగా చేసుకుని రాసిన నీటి కష్టాల, హాస్య నవల. డబ్బున్న కుటుంబాలు వసతులున్న గుర్గావ్‌కు తరలిపోగా, మధ్య తరగతివారూ,పేదవారూ నీటికోసం చేసే యుద్ధాలు పరమ భీకరమైనవి. కథనం కథాంశం ఆధారంగా కాక, పాత్రల ఆధారంగా నడుస్తుంది. దిల్లీ స్థానిక సంఘాల పైన రాజకీయ వ్యంగ్యమూ, చమత్కారమైన ఉదాహరణలూ, వ్యాఖ్యానాలూ ఉంటాయి.

పుస్తకం కల్పిత యుద్ధాలు, నదుల గురించినది కనుక, కథనం కల్పిత కథారూపంలో ఉంటుంది. ఉపదేశాలేమీ లేకుండా హాస్యం, వ్యంగ్యంతో జోడించి ఇచ్చిన సమాచారంలా ఉంటుంది. అయితే సమస్యలు మాత్రం నేటి కాలానికి సంబంధించినవి. పక్కనే ఉన్న దిల్లీలో నీటికొరత ఉండగా, గుర్గావ్ ధనికుల గేటెడ్ ఇళ్ళకి అందే నిరంతర నీటి, విద్యుత్ సరఫరా గురించీ, వారికి సామాజిక హోదా కల్పించే గాల్ఫ్ ఆట గురించీ చెప్తూ, 'ఇంత అసమానత్వాన్ని సమాజం ఎంతకాలం సహించగలదు?' అని ప్రశ్నిస్తారు రచయిత.

మొదటి పేజీలో పాస్‌పోర్ట్ ఆఫీసులో క్యూలు కట్టే మధ్య తరగతి కనిపిస్తుంది. ఇందులోని రేడియో ప్రెజెంటర్ నవీన్ సయానీ పాత్రను 'బినాకా గీత్ మాలా'కు ఒకానొకప్పుడు ప్రస్తుతకర్త అయిన అమీన్ సయానీ మీదే మలిచారని స్పష్టంగా తెలుస్తుంది. ఒక హాస్య భరితమైన సన్నివేశంలో–''భారత దేశంలో 80 శాతం పట్టణాలు 'తమకి నీరూ, విద్యుత్తూ పంపిణీ చేసేది తాము ఉంటున్న బిల్డింగే'' నని నమ్మే గుర్గావ్‌లాగే తయారవుతాయి' అని రాస్తారు బెనర్జీ.




సారనాథ్ బెనర్జీ

తిత్తర బిత్తరగా ఉన్న పట్టణ ప్రణాళిక, భూగర్భ జలాన్ని తవ్వి తీయడానికి అవసరం అయిన శాస్త్రీయ పరిజ్ఞానం లేకపోవడం, పేదలపైన ప్రైవేటీకరణ ప్రభావం గురించిన రచయిత పరిశీలనలే ఈ నవల. 'షార్ట్ టెర్మిజం' అన్న మొదటి అధ్యాయం సమాంతర కథాంశం. తాలిబన్ నుంచి లైంగిక వేధింపుల వరకూ ఏ సమస్యనీ విడిచిపెట్టరు రచయిత. పాత వాటిని బాగు చేయకుండా కొత్త బిల్డింగులు కట్టడం, చిన్నపాటి అనారోగ్యాలకి కూడా బలమైన యాంటీబయాటిక్స్ వాడటం వంటి అంశాలన్నిటినీ ఈ చిన్న పుస్తకంలో కూరడం వల్ల కొంచెం కిక్కిరిసి ఉన్నట్టుగా కనబడినప్పటికీ కథాంశం ఆసక్తికరమైనది.

సారనాథ్ బెనర్జీ ఇతర గ్రాఫిక్ పుస్తకాలు: 'కారిడార్' (2004), 'ద బార్న్ అవుల్స్ వండ్రస్ కేపర్స్' (2007), 'ద హరప్పా ఫైల్స్' (2011). (తాంబాపుర్లో ఉన్న 'తాంబా' కి అర్థం రాగి.)

◆ **క్రిష్ణవేణి**

ప్రతిధ్వనించే పుస్తకం



పురూరవ

చలం

ఊర్వశి: ఏం చేశావు ఇన్నేళ్లు?
పురూరవుడు: యుద్ధాలు చేశాను. రాజ్యపరిపాలన చేశాను.
ఊర్వశి: ప్రేమించావా?

చలం రాసిన పురూరవ నాటకాన్ని మూడు ముక్కల్లో పరిచయం చేయాల్సివస్తే... ఇంతే.

మనుషులు అధికారం కోసం ఏదేదో చేస్తారు. 'ఏదీ చేసీ ఏది చెయ్యకా పోయిందేమీ లేదని గ్రహించరు'. అనవసరమైన దానికోసం బాధపడుతారు. 'అసలు బాధలో అంత బాధ లే'దని తెలుసుకోరు. అసలైనది అందివచ్చినప్పుడు పోల్చుకోరు. 'ఎన్నాళ్ళు? ఎప్పుడు? ఏం జరుగుతుంది? ఇట్లా ఆలోచిం'చి, ప్రశ్నలతో బుర్ర పాడుచేసుకుంటారు. 'యోచనంత నిష్ఫలం ఏదీ లేదు'. లౌకిక ఆడంబరాలను వస్త్రాలుగా ధరిస్తారు. జ్ఞానం, పాండిత్యం అనుకునేవి 'బుద్ధిహీనత'గా గ్రహించరు. భయం, రోగం, మృత్యువు, ఆకలి... వీటన్నింటినీ జయించగలిగే మార్గం ప్రేమ మాత్రమే. ప్రేమకు మించిన ఐశ్వర్యం లేదు. ప్రేమకు మించిన సత్యం లేదు. ప్రేమకు మించిన సౌందర్యం లేదు. 'నేనే నీ లోకం. నేనే నీ అన్వేషణ. నేనే నీ అనుభవం. నానుంచే నీకు సమస్త సృష్టి రహస్యాలూ బోధపడుతాయి' అంటుంది శాపవశాన భూమ్మీదకు వచ్చిన ఊర్వశి. ఇంకొకరు చెప్పడం వల్ల ఇది అర్థమయ్యేది కాదు. 'మాటలతో నేర్చుకునేవి చాలా అల్పమైన విషయాలు'. కానీ ప్రేమ వూరికే వాంఛిస్తే వస్తుందా? ప్రేమ ముందు మోకరిల్లడం తెలియాలి. ప్రేమించడం ఒకరికి చేసే ఉపకారం కాదని తెలియాలి. ఆ యోగ్యత సంపాదించలేక, తన అహంకారపు చక్రవర్తితనాన్ని వదులుకోలేక, జీవితాన్ని ముక్కలుగా కాక మొత్తంగా చూడలేక, రంగులూ కాంతులూ లోకాలూ శ్రావ్యగాన మాధుర్యాలూ పరిమళాలూ అన్నీ తానైవున్న ఊర్వశిని అర్థం చేసుకోలేక, తనలో ఉన్న తననే తెలుసుకోలేక, ఊర్వశిని దూరం చేసుకుని విరహంతో కుమిలిపోయే పురూరవుడి వ్యథ ఇది. 'వెళితే వెతుకుతావ్ వెయ్యేళ్లు' అని ముందే హెచ్చరిస్తుంది ఊర్వశి.

అసలైన శాంతికీ స్వేచ్ఛకూ ప్రతీక ఊర్వశి. దాన్ని అందుకోలేని క్షుద్రత్వానికీ అల్పత్వానికీ సూచిక పురూరవుడు. నాటకమంతా రెండు పాత్రల సంభాషణగానే సాగుతుంది. వాక్యాలన్నింటా కొత్త వెలుగూ గొప్ప చింతనా కనబడుతుంది. ప్రకృతి వర్ణన సున్నితంగా మనసును తాకుతుంది. చివర్లో శాపవిముక్తి అయిన ఊర్వశి దేవలోకానికి వెళ్లిపోతుంది. అసలైన శాపగ్రస్థుడిలాగా పురూరవుడు భూమ్మీద మిగిలిపోతాడు.

చలం సృజించిన మొత్తం సాహిత్యానికి ఒక ముందుమాటగా ఉంటుంది 'పురూరవ'. చలం సాహిత్యంతో పరిచయం లేనివారు దీనితో మొదలుపెట్టొచ్చు.

రారండోయ్

- ఫన్‌డేలో ధారావాహికగా ప్రచురితమై, ఇప్పుడు పుస్తక రూపం దాల్చిన డాక్టర్ గోపరాజు నారాయణరావు చారిత్రక నవల 'ఆకుపచ్చ సూర్యోదయం' ఆవిష్కరణ జనవరి 26న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరగనుంది.
- జైని ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారి లక్ష్మీనారాయణ జైని జాతీయ సాహిత్య పురస్కారం–2018ని డాక్టర్ ఎన్.గోపి 'జలగీతం'కు ఇస్తున్నట్టు ప్రభాకర్ జైని తెలియజేస్తున్నారు. ఈ లక్ష రూపాయల పురస్కారాన్ని జనవరి 29న సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతిలో ప్రదానం చేస్తారు.
- నోరి నరసింహాశాస్త్రి చారిటబుల్ ట్రస్ట్ వారి నోరి నరసింహాశాస్త్రి పురస్కారాన్ని ఆచార్య అనుమాండ్ల భూమయ్యకు ఫిబ్రవరి 6న సాయంత్రం 6 గంటలకు త్యాగరాయ గానసభలో ప్రదానం చేయనున్నారు. నోరి యువ రచయిత ప్రోత్సాహక పురస్కారాన్ని డాక్టర్ బోచ్కర్ ఓంప్రకాశ్ స్వీకరిస్తారు.

పదం పలికింది - పాట నిలిచింది

తెల్లారబోతుంటే నా కల్లోకి వస్తాడే...

సినిమా పాటకు ఒక నమూనాను ఇచ్చిన కవి, వేటూరి సుందరరామ్మూర్తి. అటు పండితులూ పామరుల కోసమూ, ఇటు పండితుల్లోని పామరుల కోసమూ అన్ని రకాల పాటలనూ రాశారు. 'పదహారేళ్ల వయసు' చిత్రం కోసం వేటూరి రాసిన 'సిరిమల్లె పువ్వా సిరి మల్లె పువ్వా' మాత్రం అన్ని వర్గాలనూ మెప్పించే పాట. అందులోని ఈ పాదాలు చూడండి: ***'తెల్లారబోతుంటే నా కల్లోకి వస్తాడే/ కళ్ళారా చూదామంటే నా కళ్ళు మూస్తాడే'.*** ఇందులో వాక్యాల్లోని సొగసు ఎంత ముఖ్యమో, ఒక కన్నెపిల్ల మానసిక స్థితిని సరిగ్గా పట్టుకోవడం కూడా అంతే ముఖ్యం. అందుకే ఇది మంచి కవిత్వం అయింది. భారతీరాజా దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'పతినారు వయతినిలే'కు



రీమేక్ అయిన ఈ సినిమాకు దర్శకుడు కె.రాఘవేంద్రరావు. మూలచిత్రానికి ఇళయరాజా ఇచ్చిన బాణీనే తెలుగులోనూ సంగీత దర్శకుడు చక్రవర్తి వాడుకున్నారు. పాడింది అక్కడా ఇక్కడా కూడా ఎస్.జానకి. నాయిక కూడా అక్కడా ఇక్కడా శ్రీదేవే!

గ్రేట్ రైటర్


అలెగ్జాండర్ డ్యూమా



అత్యంత సాహసాలతో కూడిన రచనలకు పేరెన్నికగన్న అలెగ్జాండర్ డ్యూమా(1802–1870) తన జీవితకాలంలో సుమారు లక్ష పేజీల సాహిత్యాన్ని సృష్టించాడు. హైతీ మూలాలున్న ఈ ఫ్రెంచ్ రచయిత ఫ్రాన్స్‌లో అత్యధికంగా చదవబడే రచయితల్లో ఒకడిగా నిలిచాడు. ద త్రీ మస్కెటీర్స్, ద కౌంట్ ఆఫ్ మాంటె క్రిస్టో, ట్వెంటీ ఇయర్స్ ఆఫ్టర్ లాంటి రచనలు ఆయనకు ప్రపంచవ్యాప్త కీర్తిని తెచ్చి పెట్టాయి. నవలలు, నాటకాలు, యాత్రా కథనాలు, వ్యాసాలు సహా విస్తృతంగా రాసిన డ్యూమా రచనల ఆధారంగా సుమారు 200 సినిమాలు వచ్చాయి. డ్యూమాకో చిత్రమైన అలవాటు ఉండేది. తన రచనల వర్గానికి అనుగుణంగా, వాటిని రాయడానికి భిన్నమైన రంగులు వాడేవాడు. ఫిక్షన్ కోసం నీలం రంగు ఉపయోగించేవాడు. కవిత్వం కోసం పసుపు రంగునూ, నాన్ ఫిక్షన్ రచనల కోసం గులాబీ రంగునూ వాడేవాడు.


ఈవారం పుస్తకాలు

రెక్కలు (సమగ్ర సంపుటం)




రచన: సుగమ్‌బాబు; పేజీలు: 384; వెల: 200; ప్రతులకు: ఎం.కె.సుగమ్‌బాబు, 502, సాయితేజ ఎన్‌క్లేవ్, సూరారం క్రాస్‌రోడ్స్, హైదరాబాద్–55. ఫోన్: 8096615202

సబ్బండ వర్ణాల సారస్వతం




రచన: వుప్పల నరసింహం; పేజీలు: 618; వెల: 450; ప్రతులకు: జ్ఞానం పబ్లికేషన్స్, మిలీనియం హోమ్, 2–3–764/1/4, తులసీనగర్ కాలనీ, హైదరాబాద్–13. ఫోన్: 9986781799

జమీలాబాయి (నవల)



రచన: అన్వర్; పేజీలు: 110; వెల: 80; ప్రతులకు: ఇండస్ బుక్ ట్రస్ట్, 2–1–325, సమ్మయ్య నగర్, హన్మకొండ–506009. ఫోన్: 9866089066

నల్లారన్న



సంపాదకులు: సాకం నాగరాజ, కోట పురుషోత్తం; పేజీలు: 250(గట్టి అట్ట); వెల: 150; ప్రచురణ: తిరుపతి మిత్రులు; ప్రతులకు: కోట పురుషోత్తం, 9–66–15ఎ, న్యూ మారుతీ నగర్, తిరుపతి–517502; ఫోన్: 7207301233

గ్రహం అనుగ్రహం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం. తిథి శు.పంచమి ప.12.55 వరకు, తదుపరి షష్ఠి. నక్షత్రం ఉత్తరాభాద్ర తె.4.52 వరకు (తెల్లవారితే మంగళవారం). వర్జ్యం ప.2.11 నుంచి 3.49 వరకు. దుర్ముహూర్తం ప.12.32 నుంచి 1.16 వరకు, తదుపరి ప.2.48 నుంచి 3.30 వరకు. అమృత ఘడియలు రా.11.38 నుంచి 1.35 వరకు.

సూర్యోదయం : 6.39
సూర్యాస్తమయం : 5.44
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు
ఫజర్ : 5.34
జొహర్ : 12.28
అసర్ : 4.30
మగ్రీబ్ : 6.06
ఇషా : 7.21




మా మెంబర్లకు
రెండింతల ఉత్తేజాన్ని కల్పిస్తూ
22 మరియు 23 జనవరి
పొందండి ₹200* షాపింగ్‌కి ముందే
₹2500 షాపింగ్ పై, పొందండి ₹500* నగదు మీ ఫ్యూచర్ పే వాలెట్‌లో
HYPERCITY DISCOVERY CLUB
fbb SBI STYLEUP CARD
PAYBACK
T24
FUTURE PAY
future pay
SAVINGS CLUB
PROFIT CLUB
ఈవెంట్ ప్రివిలేజ్ మెంబర్లకి అందుబాటులో ఉంది.
BIG BAZAAR
అతి తక్కువ ధరలు
5 రోజులు
24-28 జనవరి
అదనపు సేవింగ్స్‌కై బిగ్‌బజార్ ప్రివిలేజ్‌లో జాయిన్ అవ్వండి.
ఫ్యూచర్ పే యాప్‌ని డౌన్‌లోడ్ చేసి, ₹100*
మీ ఫ్యూచర్ పే వాలెట్‌లో తక్షణమే పొందండి
future pay
DOWNLOAD NOW
Scan QR Code
Give a missed call on 8010 350000
కస్టమర్ హెల్ప్‌లైన్ నెంబర్: 1800 200 2255
/bigbazaar @bigbazaar
/big.bazaar bigbazaar.com
AXIS BANK Additional 10%# Off on Axis Bank Credit & Debit Cards
Select offers also available at
HyperCITY Something Fresh every day
FOOD HOME FASHION
BIG BAZAAR
ఇండియాని చేస్తుంది బ్యూటిఫుల్


HONDA
The Power of Dreams
కలలను సాకారం చేస్తాం
With aero-sharp design
and striking good looks,
bring out the sharp in you.
TIME TO
LOOK
SHARP
LIVO
TIME TO LIVE. TIME TO LIVO.
₹ 5,999# DOWN PAYMENT
0 PROCESSING FEE#
Disc Brake
Attractive 3D Emblem
HET BS-IV
Automatic Headlamp On AHO
Low Rolling Resistance Tyre
HDFC BANK We understand your world
IndusInd Bank TWO WHEELER LOANS
హోండా అంటే HONDA



నవరత్న గోష్టిగానం చేస్తున్న సంగీత విద్వాంసులు

ఘనంగా రామదాసు జయంత్యుత్సవాలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో భక్త రామదాసు 385వ జయంత్యుత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈఓ ప్రభాకర శ్రీనివాస్, శ్రీచక్ర సిమెంట్ అధినేత నేంద్రగంటి కృష్ణమోహన్, ప్రముఖ సంగీత విద్వాంసుడు మల్లాది సూరిబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా తొలుత పవిత్ర గోదావరి జలాలను తీసుకొచ్చి ఆలయ ప్రాంగణంలోని భక్త రామదాసు విగ్రహానికి అభిషేకం చేశారు. తర్వాత గర్భగుడిలోని స్వామి వారి మూలమూర్తుల వద్ద ఉత్సవాలకు అనుజ్ఞ తీసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులంతా ఒకేసారి భద్రాచల రామదాసు నవరత్న కీర్తనల గోష్టి గానం చేశారు.

కాంగ్రెస్‌లో కలి‘విడి’ యాత్ర!

అనుమతి ఇవ్వాలని కోరిన భట్టి, కోమటిరెడ్డి, రేవంత్

- వేర్వేరుగా చేయిద్దామా.. కలిపి నడిపిద్దామా?
- టీపీసీసీ తర్జనభర్జన.. ఉమ్మడి యాత్రకే మొగ్గు!
- మార్చిలో యాత్ర షురూ.. జూన్ 2న పరేడ్ గ్రౌండ్‌లో భారీ సభ
- సభకు రాహుల్‌ను ఆహ్వానించాలని నిర్ణయం



సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై పాదయాత్రలతో ప్రజల్లోకి వెళ్లేందుకు కాంగ్రెస్ నేతలు సిద్ధమవుతున్నారు. తాము పాదయాత్రలు చేస్తామని, అందుకు అనుమతి ఇవ్వాలని ముగ్గురు ముఖ్య నేతలు టీపీసీసీపై ఒత్తిడి తెస్తున్నారు. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే ఎ.రేవంత్‌రెడ్డి ఈ మేరకు వేర్వేరుగా పార్టీకి తెలిపారు. అయితే వేర్వేరుగా అనుమతించాలా లేదా ముగ్గురు నేతలను కలిపి పాదయాత్రకు అనుమతించాలా అన్న దానిపై టీపీసీసీ తర్జనభర్జన పడుతోంది. ముగ్గురు నాయకులకు వేర్వేరుగా అనుమతిస్తే సమస్యలు తలెత్తుతాయని, ఉమ్మడిగానే పాదయాత్ర చేస్తేనే బాగుంటుందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. వేర్వేరుగా పాదయాత్రలకు అనుమతిస్తే పార్టీలో గ్రూపులను పెంచి పోషించినట్టు అవుతుందని సీనియర్లు హెచ్చరిస్తున్నారు. దీంతోపాటు పార్టీ శ్రేణులు, ప్రజలు, మీడియా దృష్టి కూడా పెద్దగా ఉండదని అభిప్రాయపడుతున్నారు. అందుకే ముగ్గురిని ఒక దగ్గరకు చేర్చి, పాదయాత్రను పార్టీ భుజాలకు ఎత్తుకోవాలని యోచిస్తున్నట్టుగా తెలుస్తోంది. అయితే ఉమ్మడి పాదయాత్రకు వారు అంగీకరిస్తారా అనే దానిపైనా కొందరు నేతలు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

జోగులాంబ ఆలయం నుంచి యాత్ర

మార్చి తొలివారంలో గద్వాల జిల్లా ఆలంపూర్‌లోని జోగులాంబ దేవాలయం నుంచి పాదయాత్ర ప్రారంభించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. మే వరకు పాదయాత్ర చేసి ఆదిలాబాద్ జిల్లాలో ముగించాలని యోచిస్తున్నారు. పాదయాత్ర ముగింపు సభను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని ఈ సభకు ఆహ్వానించనున్నారు. మార్చిలో పాదయాత్ర ఆరంభించడానికి ముందుగానే టీపీసీసీకి కార్యవర్గాన్ని ప్రకటించనున్నారు. ఫిబ్రవరి మొదటి, రెండో వారంలో టీపీసీసీ కార్యవర్గ జాబితాను ప్రకటించనున్నారు. డీసీసీలకు కూడా అధ్యక్షులను నియమించనున్నారు. పార్టీ సంస్థాగత ప్రక్రియను ఫిబ్రవరి రెండోవారంలోగా పూర్తి చేసి, ఆ తర్వాత పాదయాత్రకు సిద్ధం కావాలని భావిస్తున్నారు. భారీ బహిరంగ సభను ఎన్నికలకు సమరశంఖంగా భావించి, సుమారు 10 లక్షల మందితో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని యోచిస్తున్నారు. పాదయాత్రకు సిద్ధంగా ఉన్న ముఖ్య నేతలందరితో సమావేశం తర్వాతే పూర్తి వివరాలు, ప్రణాళిక రూపొందించే అవకాశం ఉందని టీపీసీసీ ముఖ్య నాయకుడొకరు వెల్లడించారు.

✦ కల్తీ లేని సరుకులందిస్తాం: పోచారం



సాక్షి, హైదరాబాద్: గిట్టుబాటు ధర లేనప్పుడు ప్రభుత్వమే కొనుగోలు చేసి కల్తీ లేని మిర్చి, పసుపు వంటి ఉత్పత్తులను వినియోగదారులకు అందించే దిశగా కృషి చేస్తున్నట్లు వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తద్వారా రైతులకు, వినియోగదారులకు మేలు జరుగుతుందన్నారు. ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కిసాన్ కాల్ సెంటర్ 15వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 1.50 కోట్ల భూమి సాగులో ఉందన్నారు. రెండు రకాల పంటలు వేస్తే ఏడాదికి భారీగా పంట పండించవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడాలేని విధంగా వ్యవసాయ పథకాలను విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. ఉచిత విద్యుత్‌తో పాటు పంట పెట్టుబడికి డబ్బులు అందించడం ఎక్కడా లేదన్నారు. తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరందించేందుకు సీఎం కేసీఆర్ తీవ్రంగా శ్రమిస్తున్నారన్నారు. కిసాన్ కాల్ సెంటర్ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రైతులకు సలహాలు ఇవ్వడానికి రాష్ట్రంలో 2,638 మంది వ్యవసాయ విస్తరణాధికారులు ఉన్నారన్నారు. వారి సూచనల మేరకు పంటలు వేయాలన్నారు. సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

✦ కేసీఆర్, పవన్ ఒప్పందాన్ని బయటపెట్టాలి

మాజీ ఎంపీ పొన్నం డిమాండ్



కరీంనగర్: ముఖ్యమంత్రి కేసీఆర్, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మధ్య కుదిరిన చీకటి రహస్య ఒప్పందాన్ని బయటపెట్టాలని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటును పూర్తిగా వ్యతిరేకించడమే కాకుండా ముఖ్యమంత్రి కేసీఆర్‌నే తాట తీస్తా అన్న పవన్ పర్యటనకు ఎర్ర తివాచీలు పరచడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ కోసం పోరాడిన జేఏసీ చైర్మన్ కోదండరాం, పార్లమెంట్‌లో బిల్లును ఆమోదింపజేసిన మాజీ స్పీకర్ మీరాకుమార్‌లు రాష్ట్రంలో పర్యటిస్తే ఆంక్షలు విధించిన ముఖ్యమంత్రి.. పవన్‌పై అమిత ప్రేమ చూపించడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు. 2009లో ప్రమాదం జరిగితే ఎనిమిదేళ్ల తరువాత మొక్కులు చెల్లించడానికి వస్తున్నానని పవన్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పలు సమస్యలపై ఆందోళన చేస్తున్న ఆయనకు నాలుగేళ్ల తర్వాత తెలంగాణ ప్రజలు గుర్తుకొచ్చారా అని ప్రశ్నించారు. టీఆర్‌ఎస్‌కు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని వచ్చిన సంకేతాలతోనే పవన్ లాంటి వారిని తెలంగాణలో తిప్పుకుంటూ ప్రజలను గందరగోళంలో పడేయడానికి ప్రభుత్వం కుట్రలకు తెరలేపుతోందని ఆరోపించారు.

✦ గవర్నర్ పదవికే కళంకం: చాడ



కరీంనగర్ రూరల్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావును గవర్నర్ నరసింహన్ పొగడ్తలతో ముంచెత్తడం ద్వారా ఆయన పదవికే కళంకం తెచ్చారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా బొమ్మకల్‌లో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన అత్యున్నతమైన గవర్నర్ పదవిలో ఉన్న నరసింహన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. గవర్నర్‌కు ప్రజలపై ప్రేమ ఉంటే సిరిసిల్లలోని చేనేత కార్మికులు, నేరెళ్ల బాధితులను పరామర్శించాలని కోరారు.

✦ త్వరలో తిరగబడ్డ తెలంగాణ ధూంధాం

తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు సుధాకర్



హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం చంద్రశేఖర్‌రావు కాదు.. కాళరాత్రి చంద్రశేఖర్‌రావు అని తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ విమర్శించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా తిరగబడ్డ తెలంగాణ ధూంధాం కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. ఆదివారం ఇక్కడ తెలంగాణ సాంస్కృతిక సైన్యం రాష్ట్ర కన్వీనర్ గుండమల్ల శ్రీనివాస్ తెలంగాణ ఇంటి పార్టీలో చేరారు. సుధాకర్ మాట్లాడుతూ ‘సీఎం జాతీయ చానెల్‌ను పిలిపించుకొని గొప్పలు చెప్పుకోవడం కాదు, రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాల సమస్యలపై అదే చానెల్‌లో బహిరంగంగా చర్చించడానికి సిద్ధమా’అని సవాల్ విసిరారు. మంద కృష్ణమాదిగను అరెస్ట్ చేయడం అన్యాయమని, ఆయన విడుదలకై ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. దళిత వ్యతిరేక ప్రభుత్వాన్ని పారదోలేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సామాజిక వర్గాల అధికారం, అభివృద్ధి కోసం కృషిచేసేవారితో కలసి పనిచేసేందుకు తాము సిద్ధమని ప్రకటించారు. ప్రభుత్వతీరును నిరసిస్తూ కళాకారులు చేపట్టే సాంస్కృతిక ప్రదర్శనలకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఇంటి పార్టీ వ్యవస్థాపక సభ్యులు, మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దొమ్మాట వెంకటేశ్, తెలంగాణ స్టూడెంట్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సందీప్, రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ మాదిగ, యువజన విభాగం అధ్యక్షుడు గుర్రం సంతోశ్‌రెడ్డి, నాయకులు గౌని నర్సింహగౌడ్, దేవేందర్‌రెడ్డి, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

✦ ఆరె కులాన్ని ఓబీసీల్లో చేర్చాలి

కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని నేతల విజ్ఞప్తి

హైదరాబాద్: ఆరె కులాన్ని ఓబీసీల్లో చేర్చేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానించింది. దోమలగూడలో ఆదివారం జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో స్టీరింగ్ కమిటీ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రాజు, రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ మాట్లాడారు. 2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఆరె కులాన్ని బీసీ– డీ గ్రూపులో చేర్చిందని, ఓబీసీల్లో చేర్చాలని కోరుతూ రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని గుర్తు చేశారు. అయితే, ఆ తర్వాత అది అమలుకు నోచుకోలేదని విచారం వ్యక్తం చేశారు. ఓబీసీల్లో చేర్చాలని కోరుతూ ఈ నెల 25న జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు, ఆ తర్వాత ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వాలని, ఎంపీలు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రంపై ఒత్తిడి తేవాలని సమావేశం తీర్మానించిందని చెప్పారు. ఆరె భవన్ నిర్మాణానికి ఎకరం భూమి, రూ. 10 కోట్లు కేటాయించాలని కోరారు., జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం సాధించుకునేందుకు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు డాక్టర్ రాంనర్సయ్య, రవీందర్‌రావు, జె.రాజేష్, బావండ్ల శివాజీ, అంజన్‌రావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మా గురించి ఎవరు మాట్లాడినా ఏజెంట్లేనా?

గవర్నర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలి: హరీశ్



మంథని: పదేళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఒక్క మంచి పని చేయలేదని, తాము చేస్తున్న పనులను మెచ్చుకుంటున్న వారిని ఏజెంట్లుగా పోల్చుతూ బురదజల్లడం మంచిది కాదని భారీ నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా మంథని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. తాము చేస్తున్న పనులను వివిధ రాష్ట్రాలకు చెందిన పార్టీలు, అధికారులు మెచ్చుకుంటుంటే కాంగ్రెస్ మాత్రం నొచ్చుకుంటుందన్నారు. తమకు రాజకీయ భవిష్యత్ ఉండదని, బతుకు ఆగమవుతుందని కాంగ్రెస్‌లో ఆందోళన కనిపిస్తోందన్నారు. గవర్నర్ నరసింహన్ కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిస్తుందని, ఎంతో గొప్ప ప్రాజెక్టు అన్న మాటల్లో ఏం తప్పుందని ప్రశ్నించారు. సెంట్రల్ వాటర్ కమిషన్ ఇంజనీర్లు మెచ్చుకోవడమే కాకుండా ప్రాజెక్టు పనితీరు అద్భుతమని, దేశంలో ఎక్కడా జరుగలేదని కొనియాడారన్నారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుపై ప్రశంసల జల్లు కురిపించారన్నారు.

కాంగ్రెస్‌కు సంస్కారం లేదు..

మంచిని మంచి అనే సంస్కారం కాంగ్రెస్‌కు లేదని హరీశ్‌రావు విమర్శించారు. గవర్నర్ పట్ల విమర్శ.. సంస్కారహీనాన్ని తెలియజేస్తుందని మండిపడ్డారు. రాజకీయాలకు అతీతంగా పనిచేసే గవర్నర్‌పై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాము ప్రతిపక్షంలో ఉన్న సమయంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన 108, ఆరోగ్యశ్రీ తదితర పథకాలను శాసనసభలోనే అభినందించామని గుర్తుచేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కాళేశ్వరం ప్రాజెక్టు అటవీ, పర్యావరణ, అంతర్రాష్ట్ర, మహారాష్ట్ర ఒప్పందం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ అధికారులు చెప్పారని, మహారాష్ట్ర సైతం ఆ ప్రాజెక్టును కట్టనివ్వమని తేల్చి చెప్పిందన్నారు. కాంగ్రెస్ నాయకులు కేవలం కాలువలు తవ్వి కమీషన్ల కోసం మొబిలైజేషన్, సర్వే డిజైన్ల పేరిట జేబులు నింపుకున్నారని విమర్శించారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం మొబిలైజేషన్, సర్వే డిజైన్లను రద్దు చేసి ప్రభుత్వమే ఆ పనులు చేయిస్తుందన్నారు.

ఆ ఘనత కేసీఆర్‌దే..

నీళ్లు లేని చోట కాంగ్రెస్ హయాంలో ప్రాణహిత ప్రతిపాదన చేస్తే నీళ్లు ఉన్న చోటకి కాళేశ్వరం ప్రాజెక్టును తీసుకువచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని హరీశ్‌రావు అన్నారు. ఈ విషయాన్ని సీడబ్ల్యూసీ చెప్పిందని, కేంద్ర ప్రభుత్వం హైడ్రాలజీ క్లియరెన్స్ ఇచ్చిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం పెద్దపల్లిలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీధర్‌బాబు అడ్డంకులు సృష్టించారని విమర్శించారు. తాము ఎన్నడూ అలా చేయలేదని, ప్రాణహిత ప్రాజెక్టు విషయంలో ఆనాడు అడ్డు చెప్పలేదన్నారు. తెలంగాణకు అన్యాయం చేసే పోతిరెడ్డిపాడు, పులిచింతల లాంటి ప్రాజెక్టులను మాత్రం కాంగ్రెస్ నేతలు అద్భుతంగా కట్టారన్నారు. తెలంగాణకు రావాల్సిన కృష్ణా జలాలు ఆంధ్ర, రాయలసీమలకు పంపించారన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి నీళ్లు ఇచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు.

టీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి: లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: కులం, మతం ఆధారంగా జనాన్ని చీల్చి ఓట్లు దండు కోవాలనుకుంటున్న టీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. గుజరాత్‌లో కులం పేరుతో సీట్లు గెలిచేందుకు ప్రయత్నించి బొక్కబోర్లాపడ్డ కాంగ్రెస్‌కు పట్టిన గతి ఇక్కడ టీఆర్‌ఎస్‌కు పట్టేలా చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఐటీ సెల్ సమావేశంలో పాల్గొన్న లక్ష్మణ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న టీఆర్‌ఎస్‌పై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, మోదీ వైపు ప్రజలు దృష్టి సారిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతలు టీఆర్‌ఎస్ గొడుగు నీడలో పనిచేస్తున్నారని విమర్శించారు.

కేసీఆర్ ఏజెంట్‌లా గవర్నర్: జీవన్‌రెడ్డి



ధర్మారం(ధర్మపురి): రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న గవర్నర్ నరసింహన్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోటుపాట్లను గాలికొదిలి సీఎం కేసీఆర్‌కు ఏజెంట్‌లా మాట్లాడారని సీఎల్పీ ఉపనేత, జగిత్యాల ఎమ్మెల్యే టి.జీవన్‌రెడ్డి విమర్శించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మేడారం చెరువుకట్ట నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గవర్నర్ నరసింహన్ కాళేశ్వరం ప్రాజెక్టు గురించి నిజాలు తెలుసుకొని మాట్లాడితే బాగుండేదన్నారు. సీఎం కేసీఆర్ మెప్పు పొందాలనే తాపత్రయం తప్ప గవర్నర్‌కు వేరే ఉద్దేశం లేదన్నారు. గవర్నర్ పదవి కాలం ముగుస్తున్నందున రాజ్యసభ సీటు పొందాలనే ఆశతోనే పొగుడుతున్నాడన్నారు. అవసరమైతే టీఆర్‌ఎస్‌లో చేరాలే కానీ గవర్నర్ పదవిని అగౌరవపరచ రాదన్నారు.

మెడికల్ కాలేజీలకు అటానమస్: లక్ష్మారెడ్డి



ఆదిలాబాద్: రాష్ట్రంలో అన్ని మెడికల్ కాలేజీలకు స్వయం ప్రతిపత్తి (అటానమస్) కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి వెల్లడించారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా రిమ్స్ ఆస్పత్రి, ఉట్నూర్ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్లను ప్రారంభించారు. వీటితోపాటు అధునాతన పరికరాలు సిటీ స్కానింగ్, డయాలసిస్ సెంటర్, డిజిటల్ ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, ఈ హెల్త్‌సెంటర్, పేయింగ్ రూమ్స్, పీడియాట్రిక్ ఐసీయూ, టెలీ మెడిసిన్ సెంటర్లను మంత్రులు జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డిలతో కలసి ప్రారంభించారు. దేశంలో తొలిసారిగా రాష్ట్రంలో సింగిల్ ఫిల్టర్ ద్వారా డయాలసిస్ సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రెండు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైద్యశాఖలో 10 వేల పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

రాజ్యాంగాన్ని మలినం చేశారు

గవర్నర్ పై కాంగ్రెస్ ధ్వజం

- రాజ్‌భవన్ పేరును టీఆర్‌ఎస్ కార్యాలయంగా మారుస్తారా: భట్టి
- అంబేడ్కర్ పేరు మార్పు, కాళేశ్వరం వ్యయం పెంపు కనిపించదా? అని ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును కాళేశ్వరం చంద్రశేఖర్‌రావు అని పొగిడిన గవర్నర్ నరసింహన్, తాను ఉంటున్న రాజ్‌భవన్ పేరును టీఆర్‌ఎస్ కార్యాలయంగా మారుస్తారా అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. ఏఐసీసీ కార్యదర్శి వి.హనుమంతరావు, మాజీమంత్రి డి.శ్రీధర్‌బాబుతో కలిసి గాంధీభవన్‌లో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షకుడిగా ఉండాల్సిన గవర్నర్ హోదాను కించపరిచే విధంగా వ్యవహరించి ఒక పార్టీపై పొగడ్తలు కురిపించడం ద్వారా రాజ్యాంగాన్ని మలినం చేశారని ఆరోపించారు. బి.ఆర్.అంబేడ్కర్ పేరుతో నాటి సీఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డి చేపట్టిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు పేరు మార్చిన విషయం గవర్నర్‌కు కనిపించలేదా అని భట్టి ప్రశ్నించారు. మొత్తం 38వేల కోట్లతో రూపకల్పన చేసిన ప్రాజెక్టుకు అప్పటికే 10వేల కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. కేవలం 28వేల కోట్లతో పూర్తికావాల్సిన ప్రాజెక్టును, కాళేశ్వరం ప్రాజెక్టుగా పేరు మార్చి 80 వేల కోట్ల వ్యయానికి పెంచారన్నారు. 50 వేల కోట్లు ఎవరికి పోతున్నాయో గవర్నర్‌కు అర్థం కాలేదా అని భట్టి ప్రశ్నించారు. డీపీఆర్ గురించి మాట్లాడకుండా, వ్యయం పెంపును ప్రశ్నించాల్సిన బాధ్యతలను గవర్నర్ విస్మరించడమే కాకుండా సీఎం కేసీఆర్‌ను, హరీశ్‌ను పొగడటంలో రహస్యం ఏమిటని ప్రశ్నించారు.

పేరు మార్చి వ్యయం పెంచారు

ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్ 1,500 కోట్లతో పూర్తయ్యేవని, వాటికి సీతారామ ప్రాజెక్టు అనే పేరు మార్చి 10వేల కోట్లకు వ్యయాన్ని పెంచారని చెప్పారు. టీడీపీ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించినప్పుడే గవర్నర్ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అవమానించారని భట్టి ఆరోపించారు. ప్రాజెక్టుల అంచనా వ్యయం పెంచడంద్వారా ప్రజలపై లక్షకోట్ల అదనపు భారం పడుతుందని, ఈ పెరిగిన భారం ఎవరిపై పడుతుందో ప్రశ్నించాల్సిన బాధ్యత గవర్నర్‌పై ఉందన్నారు. ఏఐసీసీ కార్యదర్శి వీహెచ్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ పూర్తి కాకుండానే గవర్నర్ పొగడటంతో అనేక అనుమానాలు వస్తున్నాయన్నారు. గవర్నర్ టీఆర్‌ఎస్ ఏజెంటుగా పనిచేస్తున్నాడన్నారు. ఈ ప్రాజెక్టుల అవినీతిలో గవర్నర్‌కు భాగస్వామ్యం ఉన్నట్టేనని వీహెచ్ ఆరోపించారు. మాజీ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రాజెక్టు వ్యయం, నిర్వాసితులకు జరుగుతున్న అన్యాయం, ప్రజాభిప్రాయ సేకరణలో ప్రభుత్వం తీరు గురించి గవర్నర్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. భూసేకరణ చట్టాన్ని ఎందుకు అమలు చేయలేదో గవర్నర్ తెలుసుకోవాలన్నారు.

ప్రాజెక్టులు కేంద్రం చలవే

రాష్ట్రాలకు కేంద్రం నిధులు పెంచట్లేదనడం తగదు: దత్తాత్రేయ



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర ప్రాజెక్టులు సీఎం కేసీఆర్ ఘనతగా చెప్పుకోవడం తగదని, అవి కేంద్రం చలవేనని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. అనుమతులు, నిధుల మంజూరులో కేంద్ర ప్రభుత్వమే కీలకమన్న విషయం మరిచిపోవద్దని గుర్తు చేశారు. ఆదివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టును తొలుత బీజేపీ ప్రతిపాదించిందని, ఇప్పుడు తమ ప్రభుత్వమే పెద్ద ఎత్తున నిధులూ కేటాయిస్తోందన్నారు. ఇటీవల ఓ ప్రైవేటు పత్రిక నిర్వహించిన సదస్సులో రాష్ట్రాలకు కేంద్రం నిధులు పెంచటం లేదని కేసీఆర్ అన్నారని, ఇందులో వాస్తవం లేదని దత్తాత్రేయ ఖండించారు. మిషన్ భగీరథకు రూ.3,939 కోట్లు, దానికి సంబంధించే ఇంట్రా విలేజ్ డెవలప్‌మెంట్ ఫర్ డ్రింకింగ్ వాటర్ కింద రూ.1,767 కోట్లు, మిషన్ కాకతీయకు రూ.677 కోట్లు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.874 కోట్లు, గ్రామీణ మౌలిక వసతుల కల్పన కింద రూ 5,666 కోట్లు మంజూరు చేసిన విషయం మరిచిపోయారా అని ప్రశ్నించారు. ఆర్ఐడీఎఫ్, ఎల్‌టీఐఎఫ్ కింద దేశవ్యాప్తంగా 99 పథకాలుంటే, అందులో తెలంగాణకే 11 పథకాలు మంజూరు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. కరెంటు ఉత్పత్తికి రూ.17,275 కోట్లు, పంపిణీ కోసం రూ.22,412 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పంచాయతీ ఎన్నికలను పరోక్ష విధానంలోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఇది అప్రజాస్వామికమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన సమయంలో సీఎంను పొగిడిన గవర్నర్ కేంద్రప్రభుత్వ పాత్రను నామమాత్రంగా కూడా ప్రస్తావించకపోవటం ఏమిటని ప్రశ్నించారు.

నేను గవర్నర్‌గా పోను... ఎన్నికల్లో పోటీ చేస్తా...

వచ్చే ఎన్నికల్లో తాను మళ్లీ పోటీ చేస్తానని దత్తాత్రేయ తేల్చి చెప్పారు. గవర్నర్‌గా వెళ్లే ఆలోచన లేదని, రాజ్‌భవన్‌లో ఉండటం కంటే ప్రజాభవన్‌లో ఉండేందుకే ఇష్టపడతానని పేర్కొన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలనపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు.

కుల వృత్తులకు నేరుగా రుణం

బీసీల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- 80 శాతం సబ్సిడీపై స్వయం ఉపాధి రుణాలు
- బ్యాంకులతో సంబంధం లేకుండా లబ్ధిదారులకు
- సబ్‌ప్లాన్ లేనట్లే.. ఎంబీసీ జాబితాలో 96 కులాలు!
- బడ్జెట్‌కు ముందే భారీ కసరత్తు



సాక్షి, హైదరాబాద్

సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీసీల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. కుల వృత్తులపై ఆధారపడిన వారికి బ్యాంకులతో సంబంధం లేకుండా ప్రభుత్వం నుంచే నేరుగా లబ్ధి చేకూర్చాలని యోచిస్తోంది. 80 శాతం సబ్సిడీపై ఇచ్చే స్వయం ఉపాధి రుణాలకు తగినన్ని నిధులు కేటాయించాలని భావిస్తోంది. వచ్చే బడ్జెట్‌లో ఈ రెండు అంశాలకు అత్యంత ప్రాధాన్యమిచ్చేలా కసరత్తు చేస్తోంది. గతేడాది బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసినప్పటికీ ఆచరణలో పెట్టలేకపోయింది. బీసీల్లో అత్యంత వెనుకబడిన కులాలకు (ఎంబీసీలు) రూ.వెయ్యి కోట్లు, నాయీ బ్రాహ్మణులు, రజకులకు రూ.250 కోట్ల చొప్పున కేటాయించింది. కానీ బీసీల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక పేరుతో జాప్యం జరగడంతో ఆ నిధులు ఖర్చు కాలేదు.

ఎంబీసీ కులాలపై కొరవడిన స్పష్టత

మరోవైపు ఎంబీసీ కులాలపై ఇప్పటికీ స్పష్టత లేదు. ఏయే కులాలను ఎంబీసీల జాబితాలో చేర్చనున్నారో వెల్లడించాలని ప్రభుత్వం యోచిస్తోంది. బీసీల్లో మొత్తం 113 కులాలు ఉండగా, వీటిలో 96 కులాలను ఎంబీసీలుగా పరిగణించాలని సీఎం సమక్షంలో జరిగిన చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. దీంతో ఈసారి బడ్జెట్‌లో ఎంబీసీల జాబితా, వారి సంక్షేమానికి అమలు చేసే కార్యక్రమాలపై పూర్తి స్పష్టత వస్తుందని అధికారులు భావిస్తున్నారు. యాదవులకు గొర్రెల పంపిణీ, మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ, నేతన్నలకు ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రభుత్వం ఈ ఏడాది అమలు చేసి చూపింది. ఈ నేపథ్యంలో వచ్చే బడ్జెట్‌లో నాయీ బ్రాహ్మణులు, రజకులకు కులవృత్తికి వీలుగా రాయితీతో ఆధునిక పనిముట్లు అందించాలని ఇప్పటికే నిర్ణయించింది. సంబంధిత కంపెనీల ఉత్పత్తులతో ప్రదర్శన కూడా ఏర్పాటు చేసింది. విశ్వకర్మలు, శాలివాహనులు, సంచార జాతులకు కూడా ప్రత్యేక పథకాలు అమలు చేయాలని భావిస్తోంది. ప్రధానంగా స్వయం ఉపాధి కల్పన కార్యక్రమాలకు బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా రాయితీతో కూడిన రుణాలను ఇవ్వాలని యోచిస్తోంది. రూ.లక్ష లోపు రుణాలను 80 శాతం రాయితీతో అందించేందుకు ప్రాధాన్యమివ్వనుంది. వీలైతే బడ్జెట్‌కు ముందుగానే ఈ పథకాలను పట్టాలెక్కించాలని సీఎం భావిస్తున్నారు. సంచార జాతులు, రజకులు, నాయీ బ్రాహ్మణులు, విశ్వకర్మలు.. ఇలా ఆయా వర్గాల ప్రతినిధులతో విడివిడిగా ప్రగతి భవన్ వేదికగా కేసీఆర్ సమావేశమవుతారు. ఆయా వర్గాల కార్యక్రమాలను ప్రకటించడంతోపాటు లబ్ధిదారులకు రుణాల చెక్కులను కూడా అక్కడే మంజూరు చేయాలని భావిస్తున్నారు.

సీఎం వద్ద నివేదికలు

బీసీల సంక్షేమంపై ఎమ్మెల్సీ గంగాధర్ నేతృత్వంలో అసెంబ్లీ కమిటీ ఒక నివేదికను సిద్ధం చేయగా, బీసీ ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో ముఖ్యమంత్రి నేతృత్వంలో చర్చలు జరగ్గా, అదే వరుసలో బీసీ ప్రజాప్రతినిధులు తమ సిఫారసులతో నివేదికను సిద్ధం చేశారు. ఈ నివేదికలన్నీ ఇటీవల సీఎం కేసీఆర్‌కు చేరాయి. ఈ నేపథ్యంలో బీసీ సబ్‌ప్లాన్ అమలు చేయాలన్న డిమాండ్ వ్యక్తమైనప్పటికీ బడ్జెట్‌లో ప్రణాళిక, ప్రణాళికేతర పద్దులే లేనందున ఉప ప్రణాళికకు అవకాశం ఉండబోదని ప్రభుత్వ వర్గాలు తేల్చేశాయి. ఎస్సీ, ఎస్టీలకు మాదిరే ప్రత్యేక అభివృద్ధి నిధిని అమలు చేయాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ.. బడ్జెట్‌లో బీసీలకు భారీ వాటా కేటాయించే దిశగానే ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.



సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం
22-1-2018



జెట్ స్పీడ్
సినిమా పేజీలో



పుతిన్‌కు సబ్ చెక్
లోపలి పేజీలో

చేంజ్ పీరియడ్

STAIN the Stigma

'క్లాస్‌లో అన్ని సబ్జెక్టులకూ ఒక్కో పీరియడ్ ఉంటుంది. మన మైండ్‌సెట్ చేంజ్ చేసుకోవడానికి ఒక పీరియడ్ ఉండాలి. ఆ పీరియడ్‌లో అమ్మాయిలకు పీరియడ్స్ గురించి ధైర్యంగా మాట్లాడే భరోసానివ్వాలి'. కేరళలో మొదలైన 'స్టెయిన్.. ది స్టిగ్మా' ఉద్యమ లక్ష్యం ఇది! దేశంలోనే అత్యధిక అక్షరాస్యత శాతం ఉన్న కేరళలో కూడా ఇప్పటికీ రుతుక్రమం గురించి గోప్యత పాటించే పరిస్థితులే ఉన్నాయి. రుతుక్రమంపై అనేక అపోహలున్నాయి. ఆ అపోహలను పోగొట్టి, గోప్యతను ఛేదించడానికి జరిగిన ప్రయత్నమే 'స్టెయిన్.. ది స్టిగ్మా' క్యాంపెయిన్.

జోసెఫ్ అన్నంకుట్టి... కేరళలోని రేడియో మిర్చిలో రేడియోజాకీ. అతడికి ఓ రోజు ఎర్నాకుళంలోని థెరిస్సా కాలేజ్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. తమ కాలేజ్‌లో ముఖ్యమైన కార్యక్రమానికి అతిథిగా వచ్చి మెన్‌స్ట్రువల్ హైజీన్ (రుతుక్రమంలో పాటించాల్సిన పరిశుభ్రత) గురించి ప్రసంగించాల్సిందిగా కోరారు నిర్వాహకులు. తానేమి వింటున్నాడో అర్థం కాలేదు జోసెఫ్‌కి. 'సారీ, మీరు చెప్పింది అర్థం కాలేదు, మళ్లీ చెప్పండి' అని అడిగాడు. అప్పటికే ఆ కాలేజ్‌లో జరిగిన ఇతర కార్యక్రమాలలో రెండుసార్లు అతిథిగా పాల్గొని ప్రసంగించాడు అతడు. అయితే ఈసారి వాళ్లు ఆహ్వానించిన సందర్భం పూర్తిగా వేరే. అందుకే అతడు మొదట కంగారు పడ్డాడు.

అయితే థెరిస్సా కాలేజ్ నిర్వాహకుల ఉద్దేశం వేరు. మెన్‌స్ట్రువల్ పీరియడ్ టాపిక్ ఆడవాళ్ల మధ్య మాత్రమే ఉండాల్సిన విషయం కాదు, అవసరమైతే ఎటువంటి బిడియం లేకుండా మగవారితో కూడా మాట్లాడాల్సిందేనని తెలియ చెప్పడానికే ఈ అవేర్‌నెస్ స్పీచ్ మగవారి చేత ఇప్పించదలచుకున్నారు. జోసెఫ్ కేరళలో అమ్మాయిలు ఎక్కువగా ఆసక్తి చూపే రేడియో జాకీ కావడంతో అతడిని ఆహ్వానించారు.

ఇంకా అపోహలున్నాయా?!

చదువుకుంటున్న కాలేజ్ అమ్మాయిల్లో కూడా మెన్‌స్ట్రువల్ సైకిల్‌ను ఎలా అర్థం చేసుకోవాలనే అవగాహన తక్కువ. అందుకు ఓ ఉదాహరణ రితిక (పేరు మార్చాం). రితిక క్రమం తప్పకుండా స్కూల్‌కి వచ్చేది. ఎనిమిదవ తరగతి వరకు హాజరు పట్టీలో ఆబ్సెంట్‌లు మూడు నెలలకొకటి కూడా ఉండేవి కాదు. అలాంటిది తొమ్మిదో తరగతి నుంచి సెలవులు ఎక్కువయ్యాయి. స్కూల్ నుంచి ఎప్పుడు మాయమవుతుందో తెలియదు. ఆటల్లో కూడా రితిక చురుకైనదే. కానీ ఒక్కోసారి ఉదయం అన్ని క్లాసులకూ హాజరయ్యి, గేమ్స్ పీరియడ్‌కు మాత్రం మిస్ అయ్యేది. క్లాస్‌లకు సరిగ్గా రావడం లేదంటూ టీచర్లు మరింత జాగ్రత్తగా హాజరుపట్టీ పరిశీంచారు. అప్పుడు ఆ అమ్మాయి వరుసగా కొద్ది నెలల నుంచి 22 నుంచి 25వ తేదీల్లో గేమ్స్ పీరియడ్‌లో మాయమవుతోందని తెలిసింది. రితిక క్లాస్‌కు ఎందుకు మిస్సయిందో టీచర్లకు తెలియనంత కాలం, అలా మాయమైనందుకు మర్నాడు టీచర్లు కోప్పడేవారు. అయితే ఎంతగా మందలించినా ఆమె నోరు విప్పేది కాదు. కళ్లనీళ్లు తుడుచుకుంటూ వెళ్లిపోయేది. ఈ సంగతి తెలిసిన థెరిస్సా కాలేజ్ నిర్వాహకులు (అందులోనే స్కూలు కూడా),



ఎర్నాకుళంలోని థెరిస్సా కాలేజీలో రుతుసమయంలో పాటించాల్సిన పరిశుభ్రత గురించి విద్యార్థినులకు వివరిస్తున్న రేడియో జాకీ జోసెఫ్ అన్నంకుట్టి

ఇలాంటి రితికలు ఇంకా ఎంతమంది ఉన్నారోనని నిశితంగా అధ్యయనం చేసి ఆశ్చర్యపోయారు. రుతుక్రమం సమయంలో స్కూలుకు వచ్చిన అమ్మాయికి తగలకుండా మిగతా ఆడపిల్లలు కూర్చోవడం వంటి అపోహలు కూడా ఇంకా కొనసాగుతున్నాయని తెలిసి విస్మయానికి లోనయ్యారు. ఈ సోషల్ స్టిగ్మా (సామాజిక అపసవ్యత) నుంచి సమాజాన్ని బయటపడేయాలంటే అమ్మాయిలను చైతన్యవంతం చేయాలి. అందుకు ఓ తొలి అడుగు పడాలి. అది తమ కాలేజ్ నుంచే మొదలవ్వాలి అనుకున్నారు. అప్పుడే 'స్టెయిన్ ది స్టిగ్మా' క్యాంపెయిన్ మొదలైంది. ఇదిప్పుడు దేశంలోని మిగతా ప్రాంతాలకూ విస్తరించవలసిన అవసరం ఉంది.

– మను

ప్రతీకాత్మక చిత్రం



భోపాల్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటుచేసిన శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ మెషీన్ నుండి న్యాప్‌కిన్స్ తీసుకుంటున్న మహిళలు

విమెన్‌స్ట్రువల్ విష్

హ్యాపీ జర్నీ

అత్యవసర పనుల రీత్యా ఆడవారు దూర ప్రదేశాలకు ప్రయాణం చేయవలసి వస్తుంది. గబగబా సామాన్లు సర్దుకుని రైలు ఎక్కడానికి స్టేషన్‌కి వచ్చేస్తారు. తీరా అక్కడికి వచ్చాక అనుకోని ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యంగా ఆడవారికి నెలసరి సమస్య సహజం. ఆ సమయంలో అవసరమయ్యే న్యాప్‌కిన్లు మరచిపోతే ... ఆ ఇబ్బంది రెట్టింపవుతుంది. వారి అవసరాలకు అనుగుణంగా భోపాల్ రైల్వే స్టేషన్ శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ మెషీన్‌ను ప్రారంభించింది.

సాధారణంగా అన్ని రైల్వే స్టేషన్లలోనూ టికెట్ కౌంటర్, ప్యాసెంజర్ హెల్ప్ డెస్క్, తిండి పదార్థాల స్టాల్స్, వెయిటింగ్ రూమ్స్... కనిపిస్తాయి. భోపాల్ రైల్వే స్టేషన్ ఒక అడుగు ముందుకు వేసింది. అతి తక్కువ ధరకే శానిటరీ న్యాప్‌కిన్స్ అందించే మెషీన్‌ను రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసింది. ఒక శానిటరీ న్యాప్‌కిన్ ఐదు రూపాయలే. ఒక్కొక్కరు రెండు న్యాప్‌కిన్స్ తీసుకోవచ్చు.

భోపాల్ రైల్వే మహిళా సంక్షేమ శాఖ ఈ మెషీన్‌కి 'హ్యాపీ నారీ' అని పేరు పెట్టింది. జనవరి 1, 2018 నుంచి ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. రాజకీయ నాయకులు, అధికారులు కాకుండా, రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగి అంజలి థాంకూ ఈ మెషీన్‌ను ప్రారంభించారు.

ఈ సదుపాయం నచ్చడంతో ఎంతోమంది ముందుకు వచ్చి న్యాప్‌కిన్‌లను ఉచితంగా అందించారు. స్థానికంగా ఉన్న ఆరుషి అనే ఎన్‌జీవో ప్రతినిధులు 500 న్యాప్‌కిన్‌లను ఉచితంగా అందించారు. మెషీన్ ప్రారంభించిన పది గంటలలోపే 600 న్యాప్‌కిన్‌లను మహిళలు ఈ మెషీన్ నుంచి తీసుకున్నారు. ఈ మెషీన్‌ను తయారీకీ, సిబ్బందికీ అయిన ఖర్చు కేవలం రూ. 20 వేలు మాత్రమే.

భోపాల్ డివిజన్ రైల్వే మేనేజర్ శోభన్ చౌదరి ఆలోచన నుంచి ఏర్పడినదే హ్యాపీ నారీ. 'ఇది ఒక మంచి ఆలోచన. రైళ్లలో ప్రయాణం చేసే మహిళలు పీరియడ్స్ సమస్య వల్ల ఇబ్బంది పడకుండా ఈ మెషీన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సాధారణ ప్రయాణికులకు సైతం అందుబాటులో ఉండేలా అతి తక్కువ ధరకు అందచేస్తున్నారు' అంటున్నారు చౌదరి. కేవలం రైలు ప్రయాణికులు మాత్రమే కాకుండా, చుట్టుపక్కల ప్రాంతాలలో నివసిస్తున్న సామాన్యులు కూడా ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఈ మెషీన్‌ను ఎలా ఉపయోగించాలి, న్యాప్‌కిన్స్ లోడ్ చేయడం, డబ్బులు వేయగానే బయటకు తీయడం... వంటి అంశాలలో రైల్వే ఉద్యోగులకు ఎన్‌జీవోలు శిక్షణ ఇస్తున్నారు.

వారు ఇక్కడితో ఆగిపోవట్లేదు. మరొక కొత్త ఆలోచన చేస్తున్నారు. ఉపయోగించిన న్యాప్‌కిన్‌లను పారేయడానికి అనుగుణంగా మహిళలు వేచిచూసే గదుల దగ్గర, వీటిని కాల్చి బూడిద చేసే యంత్రాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నారు.

ఈ వెండింగ్ మెషీన్ విధానం విజయవంతమైతే కనుక, మరిన్ని న్యాప్‌కిన్ మెషీన్లను మధ్య ప్రదేశ్ అంతటా ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. ఎన్‌జీవోలతో పాటు, కొన్ని కంపెనీల దగ్గరకు కూడా వెళ్లి, తక్కువ ధరలకు న్యాప్‌కిన్స్‌ను సరఫరా చేయమని అడగాలనే ఉద్దేశంతో ఉన్నారు.

మహిళలకు అత్యవసరమైన న్యాప్‌కిన్‌లను ఈ విధంగా సరఫరా చేస్తున్న భోపాల్ రైల్వే అధికారులను ప్రశంసించడమే కాకుండా, వారిని స్ఫూర్తిగా తీసుకుని అన్ని రైల్వే స్టేషన్‌లలోనూ వీటిని ఏర్పాటుచేస్తే బావుంటుందని మహిళలు భావిస్తున్నారు.

చెట్టు నీడ

జాతిపితా... నన్ను దీవించండి

'ఎవరిది వాళ్లకుంటుంది'.. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలోని డైలాగ్ ఇది. ఎవరిది వాళ్లకు ఉన్నప్పుడు అడాల్ఫ్ హిట్లర్‌కి, నేతాజీ సుభాస్ చంద్రబోస్‌కి ఇంకెంతుండాలి? హిట్లర్ నియంత. నేతాజీ.. నియంతలకే ఒక వింత! స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ గైడ్ లైన్స్ ఏవీ ఫాలో కాలేదు నేతాజీ. 'శత్రువుకు చెంప చూపిస్తే స్వరాజ్యం రాదు, గన్ తీసి కణతలకు గురిపెడితే వస్తుంది' అని గాంధీజీతోనే వాదించినవాడు నేతాజీ. అలాంటి వాడు జర్మనీతో టై–అప్ అయి, బ్రిటిష్‌వాళ్లకు వ్యతిరేకంగా పోరాడి ఇండియాకు స్వాతంత్ర్యం సంపాదించాలని ప్లాన్ వేసుకుని హిట్లర్‌ని కలవడానికి వెళ్లాడు. సహాయం కోసం కాదు, 'ఇచ్చిపుచ్చుకోవడం' అనే డీల్ కోసం వెళ్లాడు. హిట్లర్ కూడా బ్రిటన్‌పై పోరాడుతున్నాడు కాబట్టి, నేతాజీ సైన్యం (సొంత సైన్యం) హిట్లర్‌కు, హిట్లర్ సైన్యం నేతాజీకి హెల్ప్ చేస్తుంది. అది మాట్లాడ్డానికి వెళ్లాడు. 'శత్రువుకి శత్రువు మిత్రుడు' అవుతాడు అనే సింపుల్ లాజిక్‌తో వెళ్లాడు. తగ్గి వెళ్లలేదు. దేశం కోసం తగ్గితే మాత్రం ఏముంది అనీ వెళ్లలేదు. చెయ్యి కలిపితే కలిపాడు, లేకుంటే లేదు. ఎవరిది వాళ్లకు ఉంటుంది.. అనుకుని వెళ్లాడు.



హిట్లర్‌తో సుభాస్ చంద్రబోస్ (1942)

హిట్లర్ అనుచరులు నేతాజీని ఆహ్వానించారు. అయితే హిట్లర్ దగ్గరికి వెళ్లనివ్వలేదు. బయటి గదిలోనే కూర్చోబెట్టారు! 'ఫ్యూరర్ లోపల ఇంపార్టెంట్ మీటింగులో ఉన్నారు' అని చెప్పారు. ఫ్యూరర్ అంటే లీడర్ అని.

నేతాజీ చాలాసేపు బయటే వేచి ఉన్నాడు. బల్ల మీద న్యూస్ పేపర్లు ఉంటే, వాటిని తిరగేస్తున్నాడు. ఎంతసేపటికీ రాడే హిట్లర్! చివరికి వచ్చాడు. వచ్చాక నేతాజీని చూసీచూడనట్లు మళ్లీ లోపలికి వెళ్లిపోయాడు. నేతాజీ కూడా గమనించీ, గమనించనట్లు ఉండిపోయాడు. హిట్లర్ రావడం, నేతాజీని చూడడం; నేతాజీ కూడా హిట్లర్‌ను గమనించడం, గమనించనట్లు ఉండడం.. అలా చాలాసార్లు జరిగింది.

తర్వాత మళ్లీ ఒకసారి వచ్చి, నేతాజీ పక్కన నిలుచున్నాడు హిట్లర్. నేతాజీ పట్టించుకోలేదు. పేపర్ చదువుతున్నట్లుగా ఉండిపోయాడు. హిట్లర్.. నేతాజీ వెనక్కు వెళ్లి నిలుచుని నేతాజీ భుజాలపై చేతులు వేశాడు! వెంటనే నేతాజీ తలతిప్పి చూసి, ''హిట్లర్!'' అన్నాడు.

హిట్లర్ నవ్వాడు. ''హిట్లర్‌నని నువ్వెలా చెప్పగలవ్?'' అన్నాడు.

నేతాజీ నవ్వాడు. ''హిట్లర్‌కి కాకుండా, సుభాస్ చంద్రబోస్ భుజాలపై చేతులు వేసే ధైర్యం మరెవరికి ఉంటుంది?'' అన్నాడు. అంతేగా. ఎవరిది వాళ్లకుంటుంది. హిట్లర్‌కి చాలా మంది డూప్‌లు ఉండేవాళ్లు. డూప్‌లకు పల్టీకొట్టే రకం కాదు నేతాజీ.

ప్రతి లక్ష్యానికీ రెండు దారులు ఉంటాయి. 'కంటికి కన్ను' దారొకటి. 'రెండో చెంప' దారొకటి. మొదటి దారి నేతాజీది. రెండో దారి గాంధీజీది. అలాగని నేతాజీ.. గాంధీజీని గౌరవించకుండా లేరు! సింగపూర్‌లో ఏర్పాటు చేసుకున్న 'ఆజాద్ హింద్' రేడియోలోంచి 1944 జూలై 6న మాట్లాడుతూ, తొలిసారిగా నేతాజీ.. గాంధీజీ పేరెత్తారు! ''జాతిపితా.. నన్ను దీవించండి. ఈ పోరాటంలో నేను గెలవాలని నన్ను దీవించండి''అని కోరాడు. (రేపు.. జనవరి 23.. నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతి).

– మాధవ్ శింగరాజు

వర్ణనాతీతం

నలుపే దైవం

తెలుపును కోరుకోవడంలో తప్పేం లేదు. నలుపును చెరిపేయాలనుకోవడంలోనే.. తెలుపంటే మనకున్న 'పెద్దచూపు' బయటపడుతుంది. చూపు పెద్దదవకూడదు. చిన్నదవకూడదు. సమంగా ఉండాలి.



లవకుశులతో బ్లాక్ సీతమ్మవారు.



బ్లాక్ లక్ష్మీదేవి
(మోడల్ : సురుతి పరియసామి)

శ్రీకృష్ణుడు నల్లనివాడు. ఈవెన్ థో అందగాడు. ఆరాధించేస్తారు గోపికలు. ఆయన మురళీరవంలో ఉందీ అందం. ఫ్లూట్ ప్లే చేస్తున్నప్పుడు కాలు మీదుగా కాలు పోనిచ్చి నిలుచోవడంలో ఉంది అందం. కబుర్లేం చెప్పేవాడో గానీ వాటిల్లో ఉండేది అందం. చుట్టూ చేరేవారు పదహారువేల మంది ఫెయిర్ అండ్ లవ్లీ గర్ల్స్. ఆ నీలమేఘశ్యాముడి కళ్లలోకి చూస్తూ టైమ్ మర్చిపోయేవారు. వాళ్లెప్పుడూ లార్డ్ కృష్ణ.. బ్లాకా వైటా అని చూసుకోలేదు!

అయితే, మనవాళ్లు చూసుకుంటున్నారు. మనవాళ్లు అంటే.. ఇండియన్స్. ఈమధ్య క్యాలెండర్లలో, స్టిక్కర్‌లలో శ్రీకృష్ణుడు ఫెయిర్ స్కిన్‌తో కనిపిస్తున్నాడు. పురాణాలను ఇలా ఇష్టంవచ్చినట్లు మార్చేయొచ్చా! నల్లగా ఉంటే తెల్లగా!! మార్చేస్తున్నారు. ఇంట్లో తగిలించుకునే పోస్టర్‌లో, ఇంటి తలుపుకు అంటించుకునే స్టిక్కర్‌లో నల్లనయ్య తెల్లనయ్యగా దర్శనం ఇస్తున్నాడు.

గణపయ్య అయితే మన చిన్నప్పట్నుంచే వైట్ కలర్‌తో భారతీయ భువిలోకి వచ్చి ఉంటున్నాడు. ఎప్పుడైనా, ఎక్కడైనా చూశామా.. బ్లాక్ విఘ్నేశ్వరుడిని! పోనీ బాడీ మొత్తాన్ని వదిలేసినా ఆయన తల నల్లరంగులోనే ఉండాలి కదా.. ఇండియాలో కనిపించేవన్నీ బ్లాక్ ఎలిఫెంట్సే కాబట్టి! అలా ఉండడు. పాల మీగడ రంగులో ఉంటాడు.

తెలుపంటే మనకు పిచ్చి ప్రేమ కాబట్టి, చర్మాన్ని తెల్లగా మార్చే క్రీములు పూసుకోవడంతో సరిపెట్టుకోవడం లేదు. నలుపు రంగులో ఉండే దేవుళ్లను కూడా తెలుపులోకి మార్చుకుంటున్నాం. పెళ్లి చేసుకోవడానికి తెల్లటివాళ్లు కావాలి. సినిమాల్లో యాక్ట్ చెయ్యడానికి తెలుపే కావాలి. యాడ్ షూటింగుల్లో మోడలింగ్‌కీ వైటే. ఇప్పుడు నల్లగా ఉండే దేవుళ్లకి కూడా వైట్ పెయింట్ వేసుకుంటున్నాం!

తెలుపును కోరుకోవడంలో తప్పేం లేదు. నలుపును చెరిపేయాలనుకోవడంలోనే.. తెలుపంటే మనకున్న 'పెద్దచూపు' బయటపడుతుంది. చూపు పెద్దదవకూడదు. చిన్నదవకూడదు. సమానంగా ఉండాలి.


ఇన్నాళ్లు నలుపుపై ఉన్న చిన్నచూపును పోగొట్టడానికి క్యాంపెయిన్‌లు నడిచాయి. 'డార్క్ ఈజ్ బ్యూటీఫుల్', 'అన్‌ఫెయిర్ అండ్ లవ్లీ' ఇలాంటివి. ఫెయిర్‌నెస్ క్రీములకు పబ్లిసిటీ ఇచ్చే సినీ తారలు కూడా అవేర్‌నెస్‌తో అవతలికి వెళ్లిపోతున్నారు.. మేం చెయ్యం పొమ్మని. అయినా గానీ, వైట్‌కి ఉన్న వెయిట్ తగ్గడం లేదు. బ్లాక్‌కి ఉన్న 'డ్రాబ్యాక్' తగ్గడం లేదు. అమ్మాయిల విషయమైతే మరీ అన్యాయం. ఎంత టాలెంట్ ఉన్నా, ఎంత క్యూట్‌గా ఉన్నా, ఎంత ఎనర్జిటిక్‌గా ఉన్నా.. చివరికి కౌంట్ అయ్యేది తెలుపే కానీ, నలుపు కాదు.

అందుకనిప్పుడు.. భరద్వాజ్ సుందర్ అనే చెన్నై యాడ్ మేకర్, నరేశ్ నీల్ అనే ఫొటో గ్రాఫర్ కలిసి 'డార్క్ ఈజ్ డివైన్' అనే రివర్స్ క్యాంపెయిన్ మొదలుపెట్టారు. తెల్లటి దేవతా మూర్తులను, తెల్లటి పౌరాణిక పాత్రలను నలుపు రంగులో ప్రెజెంట్ చేస్తున్నారు! అందుకోసం డార్క్‌గా, డాషింగ్‌గా ఉన్న మోడల్స్‌ని ఎంపిక చేసుకుని ఫొటోలు షూట్ చేస్తున్నారు.

అపచారం కదా! ''కానే కాదు'' అంటున్నారు సుందర్, నరేశ్ నీల్. ''దేవుడి సృష్టిలో అన్నీ సమానం అయినప్పుడు నలుపు ఇన్ఫీరియరు, తెలుపు సుపీరియరు ఎలా అవుతాయి? కావు అని చెప్పడానికే దేవుణ్ణి ఆశ్రయించాం. దేవుణ్ని దేహీ అనడం అపచారం అవుతుందా'' అంటున్నారు. పాయింటే.

గుడ్‌ఫుడ్

గాయాలను త్వరగా నయం చేసే మినుములు!



మినుముల్లో ప్రోటీన్లు ఎక్కువ. అవి కండరాల రిపేర్లకు ఉపయోగపడతాయి. అందుకే గాయాలైనవారిలో అవి త్వరగా తగ్గడానికి మినుములు మంచి ఆహారం. అంతేగాక మినుములు రోగనిరోధకశక్తిని పెంచి, అనేక వ్యాధులను నివారించడంతో పాటు ఒంటికి బలాన్నీ సమకూరుస్తాయి. మినుములతో కలిగే ప్రయోజనాల్లో కొన్ని...

- మినుముల్లో 72 శాతం పీచు ఉంటుంది. అందుకే అవి మలబద్ధకాన్ని నివారిస్తాయి. ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ వంటి సమస్యలను తొలగిస్తాయి. డయేరియా, డిసెంట్రీ వంటి సమస్యలు ఉన్నవారు మందులకు బదులు మినుముతో చేసిన వంటకాలు తింటే ఆ సమస్య దూరమవుతుందని ఆహార నిపుణుల సిఫార్సు.
- మినుముల్లోని పీచు ఆహారంలోని చక్కెరను మెల్లగా విడుదలయ్యేలా చూస్తుంది. అందుకే డయాబెటిస్ సమస ఉన్నవారికి మినుములు మంచి ఆహారం.
- మినుములు కీళ్లనొప్పులనుంచి ఉపశమనం కలిగిస్తాయి.


బ్యూటిప్



ఒక కప్పు గోరింటాకు, ఉసిరి కాయ ముక్కలు పదింటిని నీటిలో రాత్రంతా నానబెట్టి, మరుసటి రోజు గ్రైండ్ చేయాలి. దానిని 200 మి.లీల కొబ్బరి నూనెలో వేసి సన్నని మంట మీద మరగబెట్టి చల్లారిన తర్వాత వడపోసి బాటిల్‌లో నిలువచేసుకోవాలి. ఈ నూనెను తలకు పట్టిస్తే చుండ్రు తగ్గి జుట్టు ఒత్తుగా, పెరుగుతుంది.

సాక్షి ఫ్యామిలీ
సినిమా
హైదరాబాద్
సోమవారం
22-1-2018

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! నేను మీకు చాలా పెద్ద అభిమానిని. మీరు చెప్పే ఆన్సర్స్ సూపర్‌గా ఉంటాయి. నేను ఒక అబ్బాయిని లవ్ చేశాను. తను కూడా నన్ను లవ్ చేశాడు. అయితే కొన్ని ప్రాబ్లమ్స్ వల్ల విడిపోయాం. ఆ తరువాత నాకు మరో అబ్బాయి ఫ్రెండ్ అయ్యాడు. అది కాస్తా ప్రేమగా మారింది. బట్ నేను ముందు ప్రేమించిన అబ్బాయి నాకోసమే వెయిట్ చేస్తున్నాడని తెలుసుకుని చాలా ఫీల్ అయ్యాను. తప్పు చేశాననుకొని రెండో అబ్బాయికి సారీ చెప్పి.. తనని కలుసుకున్నాను. కొన్ని రోజులు బాగానే ఉన్నాం. అయితే, నేను వాళ్ల ఇంట్లోవాళ్లకి నచ్చలేదు. మళ్లీ మా మధ్య గొడవలు స్టార్ట్ అయ్యాయి. ఈ సమయంలో మా బావ నాకు ప్రపోజ్ చేశాడు. 'నో అంటే చచ్చిపోతాను. కనీసం మాట్లాడు..' అని అంటున్నాడు. ఇక ఇప్పుడు వాడు కూడా 'నువ్వు కావాలి' అంటున్నాడు. నాకు మాత్రం చాలా గిల్టీగా ఉంది. వాళ్లకి ఏం చెప్పాలో అర్థం కావడంలేదు. నాకు మంచి సలహా ఇవ్వండి ప్లీజ్.

- అఖిల

బంగారం.. నువ్వు చాలా కన్ఫ్యూజన్‌లో ఉన్నావు.
ప్రేమ అంటే ఏంటో అర్థం కాని కన్ఫ్యూజన్‌లో ఉన్నావు.
అసలు ప్రేమించకపోతే ఏమీపోదు.
కొంత మంది అమ్మాయిలు అలా అనుకుంటున్నారు.
ప్రేమిస్తేనే లైఫ్ కరెక్ట్ అనుకుంటున్నారు.
ప్రేమించబడితేనే వాల్యూ ఉంటుందని అనుకుంటున్నారు.
నీ చుట్టూ ముగ్గురు అబ్బాయిలు ప్రేమ వలయంలో ఉన్నారు.
అవసరమా?
అంటే మనం గౌరవంగా ఉన్నట్టా?
లేక మనం ఈజీగా దొరుకుతామనుకుంటున్నారా?
నిన్ను నువ్వు ముందు వాల్యూ చేయడం నేర్చుకో..
లైఫ్‌లో ఏదైనా మంచి గోల్ అనుకో..
కాసిన్ని రోజులు ఈ ప్రేమ పెంటలోనుంచి బయటపడు.
డిస్టెన్స్ మెయింటెయిన్ చెయ్యి..
కూల్‌గా నీ లైఫ్‌ని అర్థం చేసుకో..
రేపు పెళ్లి చేసుకున్నాక అబ్బాయి మనల్ని రెస్పెక్ట్ చేసేలా ఉండాలి కానీ తక్కువగా చూడకూడదు.
నా మాట విని... ఈ ప్రేమ ట్రాప్ నుంచి ముందు బయటపడి లైఫ్ గోల్ వైపు పరిగెత్తు.
'కరెక్ట్‌గా చెప్పారు సార్! అమ్మాయిలు ప్రేమించాలి కానీ, ప్రేమకు దాసులయిపోయి లైఫ్‌ని పాడు చేసుకోకూడదు..!!'

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

షిఫ్ట్ టు ముంబై!



నాగార్జున

సైలెంట్‌గా ఇన్వెస్టిగేషన్ చేస్తూ స్పీడ్‌గా దూసుకెళ్తున్నారు హీరో నాగార్జున. ఆ ఇన్వెస్టిగేషన్ ప్రోగ్రెస్ ఎంతవరకు వచ్చిందంటే.. జస్ట్ హైదరాబాద్ నుంచి ముంబైకి షిఫ్ట్ అయ్యింది. నాగార్జున హీరోగా కంపెనీ పతాంకపై సుధీర్ చంద్రతో కలిసి రామ్‌గోపాల్ వర్మ స్వీయ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మైరా సరీన్ ఫిమేల్ లీడ్ క్యారెక్టర్ చేస్తున్నారు. నాగార్జున పోలీసాఫీసర్‌గా నటిస్తున్నారు. శనివారం వరకు చిత్రీకరించిన కీలక సన్నివేశాలతో హైదరాబాద్ షెడ్యూల్ కంప్లీట్ అయ్యిందట. ముంబైలో నెక్ట్స్ షెడ్యూల్‌ను ప్లాన్ చేశారని సమాచారం. ఆల్మోస్ట్ పదిహేను రోజుల పాటు సాగే ఈ ముంబై షెడ్యూల్ ఈ నెల 26న స్టార్ట్ అవుతుందని ఫిల్మ్‌నగర్ టాక్. అంతే కాదండోయ్.. ఫిబ్రవరి ఎండ్ కల్లా ఎంటైర్ షూటింగ్‌కి ప్యాకప్ చెప్పాలనే ఆలోచనలో ఉన్నారట వర్మ అండ్ టీమ్. ఈ సినిమాకు 'శపథం'(రివెంజ్ కంప్లీట్స్ అన్నది ఉపశీర్షిక) అనే టైటిల్‌ను ఫైనలైజ్ చేయాలని చిత్రబృందం ఆలోచిస్తున్నారని వినికిడి. ఈ సినిమాను ఏప్రిల్‌లో విడుదల చేయనున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే.. నాగార్జున తనయుడు అఖిల్‌తో కలిసి రామ్‌గోపాల్ వర్మ ఓ షార్ట్ ఫిల్మ్‌ను ప్లాన్ చేశారట. 'హలో' తర్వాత అఖిల్ చేయబోయే సినిమా గురించి ఇంకా అధికారిక ప్రకటన రాని విషయం తెలిసిందే.

డబ్బింగ్ షురూ



రజనీకాంత్

కాలా స్టార్ట్ చేశాడు. డబ్బింగ్ షురూ చేశాడు. 'కబాలి' ఫేమ్ రంజిత్. పా దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా రూపొందిన చిత్రం 'కాలా'. హ్యూమా ఖురేషి, అంజలి పాటిల్ కథానాయికలు. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ రీసెంట్‌గా స్టార్టైన సంగతి తెలిసిందే. ఈ సినిమాలోని తన క్యారెక్టర్‌కు డబ్బింగ్ చెప్పడానికి చెన్నైలోని ఓ ప్రముఖ స్టూడియోలోకి ఎంట్రీ ఇచ్చారు రజనీ. 'కాలా' చిత్రాన్ని శంకర్ దర్శకత్వంలో రజనీ హీరోగా రూపొందిన '2.0' రిలీజైన రెండు నెలల తర్వాత రిలీజ్ చేయాలనుకుంటున్నారని కోలీవుడ్ టాక్. '2.0' చిత్రం ఏప్రిల్‌లో రిలీజ్ కానుంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. పొలిటికల్ ఎంట్రీపై రజనీ క్లారిటీ ఇచ్చిన సంగతి తెలిసిందే. సో.. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ సినిమా చేసిన తర్వాత రజనీ సినిమాలకు గుడ్‌బై చెబుతారన్న వార్తలు కోలీవుడ్‌లో ఊపందుకున్నాయి. మరోవైపు రజనీ సినిమాలను తగ్గిస్తారేమో కానీ పూర్తిగా ఫుల్‌స్టాప్ పెట్టరన్న వాదనలూ వినిపిస్తున్నాయి. రజనీ అధికారికంగా ప్రకటన ఇస్తే గానీ ఇలాంటి వార్తలకు ఫుల్‌స్టాప్ పడదని అభిమానులు అనుకుంటున్నారట.



నరేష్, తమన్, బీవీఎస్ఎన్ ప్రసాద్, రాశీ ఖన్నా, వెంకీ అట్లూరి, వరుణ్ తేజ్, ప్రియదర్శి, అల్లు అరవింద్, 'దిల్' రాజు, బాపినీడు

తొలిప్రేమ టైటిల్ అనగానే భయపడ్డా - వరుణ్ తేజ్

''ప్రసాద్‌గారికి, నాకు మంచి అనుబంధం ఉంది. 'మగధీర' సినిమాకు ఆయన కో–ప్రొడ్యూసర్. పవన్‌కల్యాణ్‌తో 'అత్తారింటికి దారేది' సినిమా తీసిన ప్రసాద్‌గారు ఇప్పుడు పవన్ టైటిల్ 'తొలి ప్రేమ'తో వరుణ్‌తో సినిమా చేయడం ఆనందంగా ఉంది. ఆ 'తొలిప్రేమ'తో పవన్‌కి ఎంత పేరొచ్చిందో.. ఈ 'తొలిప్రేమ' పెద్ద హిట్ అయి వరుణ్‌కి అంతే మంచి పేరు వస్తుంది'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. వరుణ్‌తేజ్, రాశీఖన్నా జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో బీవీఎస్ఎన్. ప్రసాద్ నిర్మిస్తున్న సినిమా 'తొలిప్రేమ'. ఎస్.ఎస్.తమన్ స్వరపరచిన ఈ సినిమా పాటలను అల్లు అరవింద్ విడుదల చేశారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఫిదా' సినిమాకి ముందు 'తొలిప్రేమ' చిత్రాన్ని వెంకీ మా బ్యానర్‌లో చేయాల్సింది. కానీ, 'ఫిదా' కారణంగా తను బాపినీడుకి కథ వినిపించడం, ఆయనకు నచ్చడంతో సినిమా ఓకే అయ్యింది. మా బ్యానర్‌లో చేయాల్సిన సినిమా వారి బ్యానర్‌లో చేశారనే కారణంతో బాపినీడు ఈ సినిమా టోటల్ రైట్స్‌ను నాకు ఇచ్చేశాడు. ఇలాంటి విషయాలు అరుదుగా జరుగుతుంటాయి'' అన్నారు. ''ఈ సినిమా చేస్తున్నప్పుడు ఆరు నెలల వరకు ఏ టైటిల్ పెడదామని ఆలోచించాం. 'తొలిప్రేమ' టైటిల్ పెడదామని వెంకీ అన్నారు. నాకు ఇష్టమున్నా కాస్త భయపడ్డాను. ఆ టైటిల్ పెట్టుకుని ఏమైనా తేడా వస్తే మనకు పగిలిపోద్ది అన్నాను. ఎందుకంటే అది బాబాయ్‌కి ఐకానిక్ మూవీ. మా పెదనాన్న, బాబాయ్ వేసిన ఈ ఫౌండేషన్‌ను పాడు చేయకుండా మంచి సినిమాలు చేస్తాం'' అన్నారు వరుణ్‌తేజ్. ''నేను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో నన్ను నమ్మిన వ్యక్తి, ఇండస్ట్రీని నన్ను నమ్మేలా చేసిన వ్యక్తి 'దిల్' రాజు గారు. ఎక్కడో కాన్ఫిడెన్స్ కోల్పోతున్న నాకు ఆరు అడుగుల నాలుగు అంగుళాల ధైర్యాన్నిచ్చాడు వరుణ్. నా నమ్మకానికి ఊపిరి పోసిన వ్యక్తి బాపినీడు. నాకు సపోర్ట్ చేసిన అందరికీ థ్యాంక్స్'' అన్నారు వెంకీ అట్లూరి. రాశీఖన్నా, తమన్ పాల్గొన్నారు.

యూనివర్శల్ పాయింట్‌తో...

పొలిటికల్‌గా బిజీ అయ్యాక నటిగా తక్కువ సినిమాలు చేస్తున్నారు జయప్రద. అడపాదడపా సినిమాల్లో కనిపిస్తున్నా తమిళ సినిమాల్లో జయప్రద కనిపించి, దాదాపు పదేళ్లు కావొస్తోంది. కమల్‌హాసన్‌తో చేసిన 'దశావతారం' తమిళంలో తన లాస్ట్ సినిమా. ఇప్పుడు ఎమ్.ఏ నిషాద్ రూపొందిస్తున్న తమిళ, మలయాళ బైలింగ్వల్ 'కేనీ' సినిమాలో 'ఇందిరా' అనే గ్రామీణ స్త్రీ పాత్ర ద్వారా తమిళ తెరకు రీ–ఎంట్రీ ఇస్తున్నారు జయప్రద. తమిళనాడు–కేరళ మధ్యలో సాగుతున్న నీటి వివాదం 'ముల్లైపెరియార్ డ్యామ్' ఆధారంగా ఈ కథ సాగుతుందట. ఈ సినిమా గురించి జయప్రద మాట్లాడుతూ –



జయప్రద

''కేనీ' కేవలం తమిళనాడు–కేరళ కాదు.. ఇది యూనివర్శల్ పాయింట్. పాలిటిక్స్‌లోకి వెళ్లాక రాజస్థాన్, గుజరాత్, బీహార్, తమిళనాడు రాష్ట్రాల్లో నీటి సమస్యలను చూశాను. ఈ సినిమాలో ప్రతి ఫ్రేమ్‌లో ఆ పెయిన్ కనిపిస్తుంది'' అన్నారు. రేవతి, అనూహాసన్, నాజర్ ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. జయచంద్రన్ సంగీతంలో 25 ఏళ్ల తర్వాత జె.ఏసుదాస్, బాల సుబ్రహ్మణ్యం కలిసి ఈ సినిమా కోసం ఒక పాట పాడటం విశేషం.

మంచి ఫీల్

సూపర్‌స్టార్ కృష్ణ తనయ మంజుల ఘట్టమనేని దర్శకురాలిగా పరిచయమవుతోన్న చిత్రం 'మనసుకు నచ్చింది'. సందీప్ కిషన్ హీరోగా, అమైరా దస్తూర్, త్రిదా చౌదరి హీరోయిన్లుగా మంజుల దర్శకత్వంలో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్–ఇందిరా ప్రొడక్షన్స్ పతాకాలపై సంజయ్ స్వరూప్–పి.కిరణ్ నిర్మించారు. ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ సినిమాని ఫిబ్రవరి 16న విడుదల చేస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ –''ఫ్రెష్, రొమాంటిక్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన



అమైరా దస్తూర్, సందీప్ కిషన్

చిత్రమిది. డైరెక్టర్‌గా మంజులకు తొలి చిత్రమైనా అనుభవం ఉన్నవారిలా చక్కగా తెరకెక్కించారు. ఒక మంచి సినిమా చూశామనే భావన ప్రేక్షకులకు కలిగించేలా ఉంటుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, టీజర్, ట్రైలర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. రధన్ మ్యూజిక్ సినిమాకి బిగ్గెస్ట్ ఎస్సెట్‌గా నిలుస్తుంది'' అన్నారు. ప్రియదర్శి, పునర్నవి భూపాలం, నాజర్, అరుణ్ ఆదిత్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: రవి యాదవ్, మాటలు: సాయిమాధవ్ బుర్రా.



జెట్ స్పీడ్

అనురాగ్ కశ్యప్, ఆనంద్ ఎల్. రాయ్, విక్కీ కుషాల్, తాప్సీ, అభిషేక్

వాయిదాల మీద వాయిదాలు. హీరోలు మారారు. డైరెక్టర్స్ కుదర్లేదు. ఫైనల్లీ 'మన్‌మర్జియా' సినిమా సెట్స్ పైకి వెళ్లనుంది. అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో అభిషేక్ బచ్చన్, తాప్సీ, విక్కీ కుషాల్ ముఖ్య తారలుగా నటించనున్నారు. ఈ సినిమాను దర్శకుడు ఆనంద్ ఎల్. రాయ్ నిర్మించనున్నారు. తొలుత మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తాడన్న వార్తలు వచ్చాయి. కానీ ఆ ప్లేస్‌లోకి అభిషేక్ బచ్చన్ వచ్చారు. రెగ్యులర్ షూటింగ్ ఫిబ్రవరిలో స్టార్ట్ కానుంది. ఫస్ట్ షెడ్యూల్ జమ్మూలో, ఆ తర్వాత ఢిల్లీలో షూట్ చేయనున్నారట. ఈ సినిమాలో తాప్సీది మంచి పాత్ర అని సమాచారం. వరుస బాలీవుడ్ ఆఫర్స్‌తో జెట్ స్పీడ్‌తో దూసుకెళుతున్నారు తాప్సీ. స్పోర్ట్స్ డ్రామా 'సూర్మ' సినిమా షూటింగ్ కంప్లీట్ చేసి, 'దిల్ జంగిల్' సినిమాతో బిజీగా ఉన్నారామె. వచ్చే నెల నుంచి 'మన్‌మర్జియా'తో ఇంకా బిజీ అవుతారు. తెలుగులోనూ తాప్సీ ఓ సినిమా చేస్తున్నారు.

వెండితెరకు యామిని కృష్ణమూర్తి జీవితం

ప్రముఖ యోగా గురువు, మార్షల్ ఆర్టిస్ట్ సురేష్ కమల్ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'దివ్య మణి'. వైశాలి, కిమయా కథానాయికలు. మోహ మాయా ఎంటర్‌టైన్మెంట్స్, రెడ్ నోడ్ మీడియా పతాకంపై గిరిధర్ గోపాల్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. గిరిధర్ గోపాల్–స్టీవ్ శ్రీధర్ స్వరపరచిన ఈ సినిమా పాటలు హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. లెజెండరీ డ్యాన్సర్, పద్మశ్రీ, పద్మ విభూషణ్ అవార్డ్‌ల గ్రహీత డా. యామిని కృష్ణమూర్తి పాటల సీడీలను విడుదల చేసారు. సురేష్ కమల్ మాట్లాడుతూ – ''నటుడిగా ఇది నా తొలి చిత్రం. యోగా నేర్పటం కోసం నేను ప్రపంచమంతా తిరిగినా తెలుగు నేలంటే చాలా ఇష్టం. గిరిధర్ గారు మంచి కథ చెప్పారు. ఈ చిత్రంలో డూప్ లేకుండా యాక్షన్ సీక్వెన్స్ చేశా. ఈ సినిమా ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుంది'' అన్నారు. ''మనిషి తనని తాను జాగృతి పరచుకోవటానికి సృజనాత్మకత ఎంతో అవసరం. పాటలు బాగున్నాయంటున్నారు. సినిమా కూడా అందరినీ అలరిస్తుంది. ఈ సినిమా తర్వాత యామిని కృష్ణమూర్తిగారి బయోపిక్ తీస్తాం'' అన్నారు గిరిధర్ గోపాల్. ఫైట్‌మాస్టర్స్ రామ్–లక్ష్మణ్, నటుడు సాయికుమార్, మాటల రచయిత బలభద్రపాత్రుని రమణి పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రాజేష్ కాటా, నేపథ్య సంగీతం: స్టీవ్ శ్రీధర్, సునీల్ కశ్యప్.



సురేష్ కమల్, అరుణా చింత, యామినీ కృష్ణమూర్తి, సాయికుమార్, బలభద్రపాత్రుని రమణి, గిరిధర్ గోపాల్

కాసుకో సుడోకు

			3	6		9		
		6	9		8	7	2	
	7				1	3	6	
			1	8		2	4	
1		5				6		9
	2	8		9	6			
	6	9	5				3	
	5	3	8		2	1		
		2		3	9			

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

7	8	2	6	5	9	3	4	1
6	1	4	7	8	3	5	2	9
5	9	3	4	2	1	6	8	7
9	5	6	2	7	8	1	3	4
4	2	7	3	1	5	8	9	6
8	3	1	9	6	4	7	5	2
3	7	8	1	4	2	9	6	5
2	6	5	8	9	7	4	1	3
1	4	9	5	3	6	2	7	8



మలయాళ నటి భావన, కన్నడ నిర్మాత నవీన్‌ల వివాహం ఈ రోజు త్రిసూర్‌లో జరగనుంది. ఈ సందర్భంగా జరిగిన మెహందీ ఫంక్షన్‌లో స్నేహితులతో కలిసి సందడి చేశారు భావన. నవీన్, భావనల నిశ్చితార్థం గతేడాది మార్చిలో జరిగిన విషయం తెలిసిందే.

పరి పరిశోధన

రేపు ఏం చేయాలో రాసుకోండి.. హాయిగా నిద్రపోండి!

రాత్రిళ్లు నిద్రపట్టడం లేదా..? ఏవేవో ఆలోచనలు కలచివేస్తున్నాయా? ఈ సింపుల్ పనిచేయండి. హాయిగా నిద్రపోండి అంటున్నారు బేలర్స్ స్లీప్ న్యూరోసైన్స్ శాస్త్రవేత్తలు. ఏం లేదు... మర్నాడు పొద్దున్న లేవగానే ఏమేం పనులు చేయాలో ముందురాత్రే ఓ కాగితం మీద రాసిపెడితే చాలు. గందరగోళానికి తెరపడి రెప్పలు వాలిపోతాయని పరిశోధనపూర్వకంగా తెలుసుకున్నారు. చాలామంది పక్కమీదకు చేరేటప్పుడు ఆ రోజు తాము ఏమేం పనులు చేయలేకపోయామో ఆలోచిస్తుంటారని.. దాంతో 'అయ్యో పనులన్ని పెండింగ్‌లో ఉండిపోయాయ'న్న ఆందోళనతో నిద్ర పట్టదని ఈ పరిశోధనలకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త మైకేల్ స్కలిన్ అంటున్నారు. కొంతమంది విద్యార్థులను రెండు గ్రూపులుగా విభజించి, వచ్చే ఐదు రోజుల్లో చేయాల్సిన పనుల జాబితాను పడుకునే ముందు రాయాల్సిందిగా ఒక గ్రూపును కోరామని స్కలిన్ చెప్పారు. మరో గ్రూపు వారికి... గత వారంలో పూర్తి చేసిన పనుల జాబితా రాయమని చెప్పారు. రెండు గ్రూపుల వారు ఆ రోజు నిద్రపోయిన తీరును పరిశీలించినప్పుడు భవిష్యత్తు గురించి రాసిన వాళ్లే సుఖంగా నిద్రపోయారని స్కలిన్ విశ్లేషించారు. అయితే తాము చేసింది చాలా చిన్న అధ్యయనం మాత్రమేనని, మరిన్ని విస్తృత పరిశోధనల ద్వారా మాత్రమే ఈ అంశాలపై ఒక నిర్ధారణకు రావచ్చునని వివరించారు.



చిటికేస్తే పలికే యమహా బైక్...!

లాస్‌వేగస్‌లో జరుగుతున్న కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో (సీఈఎస్ –18)లో జపనీస్ మోటర్‌బైక్ కంపెనీ ఓ వినూత్నమైన మోటర్‌బైక్‌ను ప్రదర్శనకు పెట్టింది. దీన్ని నడిపేందుకు మనిషి అవసరం లేదు. స్టాండ్ వేయాల్సిన పనీ లేదు. రా.. రమ్మని చేత్తో సైగ చేస్తే చాలు.. మన దగ్గరకు వచ్చేస్తుంది. భలే ఉందే ఈ మోటర్‌బైక్... మరి మనమెప్పుడు కొనుక్కోవచ్చు అని ఆలోచిస్తుంటే మాత్రం కొంచెం ఆగాల్సిందే. మోటరాయిడ్ అని పిలుస్తున్న ఈ సూపర్ బైక్‌ను ఇప్పట్లో అమ్మే ఆలోచన లేదట. కాకపోతే యంత్రాలు మనుషులతో ఎంత మెరుగ్గా వ్యవహరించగలవో పరీక్షించేందుకు దీన్ని ఉపయోగించుకుంటున్నామని యమహా కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. మోటరాయిడ్ తనను తాను బ్యాలెన్స్ చేసుకోవడంతోపాటు డ్రైవర్లను గుర్తుపెట్టుకోగలదని బోర్‌లాండ్ తెలిపారు. టెస్ట్ ట్రాక్‌పై మోటరాయిడ్ గంటకు 200 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లగలదు. ఇంకో విషయమండోయ్... ఇప్పటిదాకా తాము జరిపిన పరీక్షల ద్వారా తెలిసింది ఏమిటంటే.. యంత్రాల కంటే మనుషులు చాలా వేగంగా ఆలోచిస్తారని అంటున్నారు యమహా ప్రతినిధి జాన్ బోర్‌లాండ్. అంతేకాకుండా పరిస్థితులకు తగ్గట్టుగా స్పందించడంలోనూ మనుషులే బెటర్ అంట.



కేన్సర్‌పై అస్త్రంగా జన్యుమార్పిడి బ్యాక్టీరియా...

మన పేగుల్లో కనిపించే ఓ సాధారణ బ్యాక్టీరియాను కేన్సర్‌పై అస్త్రంగా మార్చడంలో నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్ శాస్త్రవేత్తలు విజయం సాధించారు. జన్యుమార్పిడి పరిజ్ఞానం ద్వారా ఈ బ్యాక్టీరియా పేగులు, మలద్వార కేన్సర్ కణాలకు అతుక్కుపోతుంది. పచ్చటి కాలీఫ్లవర్ (బ్రాకోలీ)లో కనిపించే ఓ రసాయనం ద్వారా ఆ కణాలను చంపేయవచ్చునని వీరు అంటున్నారు. ఈ–కోలీ నిసెల్ అనే సాధారణ బ్యాక్టీరియా జన్యువుల్లో మార్పులు చేస్తే.. అది కేన్సర్‌కణాల్లోని హెపరాన్ సల్ఫేట్ ప్రొటియోగ్లైకన్‌కు అతుక్కుంటుందని.. బ్రాకోలీలో ఉండే గ్లూకోసినోలేట్స్ అందిన వెంటనే సల్ఫరోఫేన్‌గా మారిపోతాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త మాథ్యూ ఛాంగ్ తెలిపారు. సల్ఫరోఫేన్‌కు కేన్సర్ కణాలను చంపేసే లక్షణముంది. తాము జరిపిన పరిశోధనల్లో దాదాపు 95 శాతం పేగులు, మలద్వార కేన్సర్ కణాలు నాశనమయ్యాయని, ఎలుకల్లో కూడా దాదాపు 75 శాతం కణాలు నశించినట్లు ఛాంగ్ వివరించారు. అయితే జన్యుమార్పిడి చేసిన బ్యాక్టీరియాను మానవుల్లోకి జొప్పించడంపై కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వీటిని అధిగమించగలిగితే భవిష్యత్తులో ఆహార పదార్థాలతోనే ఇలాంటి బ్యాక్టీరియాను అందించడం ద్వారా కేన్సర్‌ను నయం చేయడమే కాకుండా... శస్త్రచికిత్స తరువాత శరీరంలో మిగిలిపోయే కణాలను కూడా నిరపాయకరంగా నాశనం చేయవచ్చునని ఆయన తెలిపారు.



ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం
22-1-2018

ఆమె రాబోయే ఎన్నికలలో పుతిన్‌ను ఢీకొనబోతోంది.
కొందరు ఆమెను గ్లామర్ డాల్ అంటున్నారు.
కొందరు భవిష్యత్ తేజం అని భావిస్తున్నారు.
ఎదిరించడం గొప్ప లక్షణం.
మేరు పర్వతాన్ని తొలిచే పని కూడా
తొలి గునపం పోటుతోనే మొదలవుతుంది.
సెనియా సబ్‌చెక్ రష్యాలో పుతిన్ ప్రాభవానికి
చెక్ పెడుతుందా?

పుతిన్‌కు సబ్‌చెక్


సెనియా సబ్‌చెక్

సెనియా సబ్‌చెక్! రష్యా రాజకీయాలపట్ల ఆసక్తి ఉన్న వాళ్లందరి దృష్టిని మరల్చిన పేరు. గ్లామర్ వరల్డ్‌తో పరిచయం ఉన్నవాళ్లకైతే ఆమె సుపరిచితురాలు. ఫ్యాషన్ షోలు నిర్వహించి ఆ రంగంలో పేరు సంపాదించింది. అన్నిటికన్నా టీవీ యాంకర్‌గా చాలా ఫేమస్. టి.ఎన్.టి. చానల్‌లో ప్రసారమైన 'Dom 2' కు హోస్ట్‌గా ఆమె తొలి గుర్తింపు పొందింది. బిగ్‌బ్రదర్‌కు డర్టీ వర్షన్ అని ఈ షోకి పేరు. ఎమ్‌టీవీ రష్యాలో ఓపెన్ డిబేట్ ప్రోగ్రామ్‌ను లాంచ్ చేసింది. ఫస్ట్ ఎపిసోడ్ 'వేర్ ఈజ్ పుతిన్ లీడింగ్ అస్?' బ్రహ్మాండమైన రేటింగ్ సంపాదించింది. దాంతో సెనియా తనే సొంతంగా 'టీవీరెయిన్' అనే చానల్‌ను ప్రారంభించింది. ఇవన్నీ ఆమెకు రష్యాలో ప్రాచుర్యం కల్పించాయి. ఇక తాను రాజకీయాల్లోకి వస్తున్నట్టు రష్యా అధ్యక్షపదవికి పోటీ చేయనున్నట్టు ఇచ్చిన ప్రకటన, ఆ విధంగా ఆమె పుతిన్‌కు విసిరిన చాలెంజ్ సెనియాను ప్రపంచమంతా పాపులర్ అయ్యేలా చేసింది. నచ్చిన వాళ్లు శభాష్ అన్నారు. గ్లామర్‌డాల్‌కి పాలిటిక్స్ ఏంటీ అనుకున్నవాళ్లు నవ్వుకున్నారు. కొందరు రాజకీయ పండితులు పెదవి విరిచారు. ఎవరు ఏమనుకున్నా తనను తాను 'ఎగైనెస్ట్ ఆల్'గా బ్రాండింగ్ చేసుకుంటోంది. ఈ మాత్రమైనా గొంతెత్తి నిలబడేవాళ్లు ఉండాలి కదా అని ఎక్కువ మంది ఆమె వైపు మురిపెంగా చూస్తున్నారు.

రాజకీయ నేపథ్యం

సెనియా సబ్‌చెక్ ఎవరో కాదు... పుతిన్ రాజకీయ గురువు అనటోలీ సబ్‌చెక్ పుత్రిక. అనటోలీ సెయింట్ పీటర్స్‌బర్గ్ మేయర్. తల్లి ల్యూదిమిలా నరుసోవా కూడా పొలిటీషియనే. వీళ్ల రెండో సంతానమే సెనియా. చిన్నప్పటి నుంచీ రాజకీయ వాతావరణంలోనే పెరిగినా 35 ఏళ్లు వచ్చేవరకు వాటి జోలికి పోలేదు ఆమె. సెయింట్ పీటర్స్‌బర్గ్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో డిగ్రీ చదివింది. ఆ తర్వాత మాస్కోలో పాలిటిక్స్‌లో పీజీ చేసింది. టీవీ యాంకర్‌గా కెరీర్ మొదలుపెట్టి, యాక్టర్‌గా కూడా పని చేసి పొలిటికల్ జర్నలిస్ట్‌గా టర్న్ తీసుకుంది. సామాజిక కార్యకర్తగానూ బాధ్యతలు నిర్వహిస్తోంది.

తొలి నిరసనోద్యమానికి ప్రతీక

ఉన్నట్టుండి సెనియాకు రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి ఎందుకు కలిగింది? దీనికి ముందు కొంత కథ జరిగింది. రష్యా ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడ్డాడని పుతిన్‌కు వ్యతిరేకంగా నిరసనలు, ధర్నాలు జరిగాయి. అందులో పాల్గొంది సెనియా. అయితే పుతిన్‌కు వ్యతిరేకంగా పెద్దగా నినాదాలేమీ ఇవ్వలేదు. కానీ తొలి నిరసనోద్యమానికి ప్రతీకగా పేరు తెచ్చుకుంది. ఆ ర్యాలీలతోనే పుతిన్ పాలన, ప్రస్తుత రష్యా రాజకీయాలపట్ల అవగాహన పెంచుకుంది. 'రష్యా మారిపోతోంది. చరిత్రకు సరైన వైపు ఉండాలనుకునే రాజకీయాల్లోకి రావాలనే నిర్ణయం తీసుకున్నాను' అని చెప్తుంది సెనియా. మరి తన తండ్రికి ఆప్తుడైన పుతిన్‌కు వ్యతిరేకంగానా... అని అడిగితే.. 'నా జీవితంలో పుతిన్‌కు ఎలాంటి రోల్ లేదు. అతనో అస్పష్టమైన జ్ఞాపకం అంతే. 24 గంటలు ఆయన మా నాన్నతో ఉన్నా నేనెప్పుడూ ఆయనను పట్టించుకోలేదు. మా నాన్నకు ఆయన ఆప్తుడే కావచ్చు కాని నాకు తెలిసి... నాన్న అత్యంత సన్నిహిత వర్గంలో పుతిన్ ఎప్పుడూ లేదు. ఎప్పుడూ చేతిలో ఏవో ఫైల్స్‌తో వచ్చేవాడు. వచ్చీరాగానే నాన్న ఆఫీస్ గదిలోకి వెళ్లేవాడు. పుతిన్‌తో కలిసి మేం హాలీడేస్ స్పెండ్ చేసిందీ లేదు. ఓ రెండుసార్లనుకుంటా ఆయనతో కలిసి మేం వెళ్లింది. అదీ ఫిన్‌లాండ్, టర్కీకి. అంతేతప్ప ఆయన దగ్గర కూర్చొని కథలు, కబుర్లు విన్న అద్భుతమైన జ్ఞాపకలేవీ మాకు లేవు. అసలు ఆయన అలాంటి ఎమోషన్స్ ఉన్న మనిషే కాదు. నా దృష్టిలో ఆయనొక యంత్రం. తాను అనుకున్నది సాధించడానికి ఎంతకైనా తెగించగల సమర్థుడు' అని చెప్తుంది. ధరలు సామాన్యులకు అనుకూలంగా ఉండాలని సెనియా భావిస్తోంది. స్త్రీ, పురుషులు సమానమైన పని చేస్తున్నప్పుడు వేతనమూ సమానంగానే ఉండాలన్న వాదన ఆమెది. సెనియా స్త్రీ పక్షపాతిగానూ గుర్తింపు పొందింది. ఎల్‌జీబీటీ హక్కుల కోసం కూడా తన గళం వినిపిస్తోంది. ఆమె అంతర్జాతీయ అవగాహన ప్రకారం ఉక్రెయిన్, సిరియాల్లో రష్యా మిలిటరీ జోక్యం సరికాదని భావిస్తోంది. తన పొలిటికల్ హీరో మార్గరెట్ థాచర్ అంటుంది. 'కష్టపడి పనిచేసే తత్వం థాచర్ సొంతం. తనకు వ్యతిరేకంగా మాట్లాడేవాళ్లను ఏనాడూ పట్టించుకోలేదు. తను నమ్మినదాన్ని ఆచరించిన ఐరన్ లేడీ' అంటూ మార్గరేట్ థాచర్ మీదున్న తన అభిమానాన్ని చాటుకుంది. 'నేను పోటీ చేస్తే నా ప్రత్యర్థులకు ముఖ్యంగా వ్లాదిమిర్ పుతిన్‌కు వ్యతిరేక ఓట్లు పడే అవకాశం ఎక్కువగా ఉన్నట్టు అనిపిస్తోంది'' అని నమ్ముతోంది సెనియా సబ్‌చెక్.



> రష్యా మారిపోతోంది. చరిత్రకు సరైన వైపు ఉండాలనుకునే రాజకీయాల్లోకి రావాలనే నిర్ణయం తీసుకున్నాను.
> – సెనియా సబ్‌చెక్

ప్రీపోల్ రిజల్ట్స్

అయితే ఒక సంస్థ సెనియాకు మద్దతు ఇస్తున్నవాళ్ల గురించి సర్వే నిర్వహించింది. అందులో ఆమెకు కచ్చితంగా ఓటు వేయాలనుకుంటున్న వాళ్లు కేవలం ఒక శాతమేనట. తొమ్మిది శాతం మంది ఓటు వేసేందుకు మొగ్గు చూపుతున్నారట. పదిహేను నుంచి ఇరవై శాతం మంది ఆమెకు ఓటు వేయాలా వద్దా అనే మీమాంసలో ఉన్నారు. ఇది ఆరంభం మాత్రమే అని సెనియా భావన.

క్రెమ్లిన్‌కు గ్లామర్

'ఆమె అభ్యర్థిత్వం వల్ల క్రెమ్లిన్ భవనానికి మళ్లీ గ్లామర్ వచ్చినట్టే. ఎన్నికల్లో పోటీ చేస్తున్న మరో రాజకీయ వారసత్వంగా పుతిన్ ఓట్లను చీల్చే సాధనంగా' ఆమె గురించి విమర్శకులు అంచనాలు వేస్తున్నారు. ''ఈ తరం భిన్నమైన రష్యాను కోరుకుంటోంది. నిజమైన ప్రజాస్వామ్యపాలనలో బతకాలనుకుంటోంది. మార్చిలో జరగబోయే ఎన్నికలు వాళ్ల ఆశను నెరవేరుస్తాయి'' అని సెనియా సబ్‌చెక్ విశ్వాసం. తీర్పు ప్రజల చేతుల్లో ఉంది. తీర్పు ఫలితం తెలియాలంటే ఈ మార్చి వరకు ఆగాలి... చూడాలి!!

- శరాది

ఈ వారం YouTube హిట్స్

సమ్మక్క-సారక్క పాట



నిడివి : 1 ని. 2 సె.
హిట్స్: 6,38,767

తలవంచని మేడరాజు తనయి జాతర
అడవికి యుద్ధం నేర్పిన అమ్మ జాతర
మూడొద్దుల ముత్తయిదువుల కోయ జాతర
ఏడువందల ఏండ్ల జానపదుల జాతర
భూమిని చీల్చిన పచ్చని చెట్టు జాతర
రాజును ఎదిరించిన ధిక్కార జాతర...

సమ్మక్క-సారక్క జాతర (జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3) పురస్కరించుకుని డిజిటల్ చానల్ అయిన మైక్ టీవీ విడుదల చేసిన పాట ప్రోమో ప్రేక్షకులకు ఊపుతో పాటు జాతర పట్ల ఉద్వేగం కలిగించేలా ఉంది. గీత రచయిత కందికొండ రచించిన ఈపాటని యాంకర్ మంగ్లీ అభినయించగా మేడారం చుట్టుపక్కల చిత్రీకరించిన విజువల్స్‌తో పాట ఆకట్టుకుంటోంది. టీజర్‌కే ఐదు లక్షల హిట్స్ దాటిపోతే పూర్తి పాటకు ఇంకా ఆదరణ లభించే అవకాశం ఉంది. సమ్మక్క-సారలమ్మలకు తెలంగాణలో అందునా ముఖ్యంగా గిరిజన సంప్రదాయంలో ఎంత ప్రాముఖ్యం ఉందో మనందరికీ తెలుసు. దాదాపు కోటిమందికి పైగా భక్తులు ఈ జాతరకు హాజరవుతారు. జంపన్నవాగులో స్నానాలు ఆచరిస్తారు. విందు జరుపుకుంటారు. రెండేళ్లకొకసారి వచ్చే ఈ జాతర కోసం భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఛోటే ఛోటే పెగ్



నిడివి : 2 ని. 49 సె.
హిట్స్: 1,37,50,785

ఇద్దరబ్బాయిలు ఒకమ్మాయి కలిసి మందు మీద పాట పాడుకుంటే పార్టీకి ఇంతకుమించి డాన్స్ నంబర్ ఏం ఉంటుంది. యోయో హనీ సింగ్ మళ్లీ ప్రతాపం చూపాడు. 'సోను కె టీటూ కే స్వీటీ' సినిమా కోసం అతడు పాడిన 'ఛోటే ఛోటే పెగ్' పాట కోటి హిట్స్‌ను దాటేసింది. మందేద్దాం చిందేద్దాం అనే అర్థంలో సాగే ఈ పాటకు ఆదరణ జోరుగా ఉంది. టి-సిరిస్ నిర్మాణంలో తయారైన ఈ సినిమాకు 'లవ్ రంజన్' దర్శకుడు. కొత్త కుర్రాళ్లు నటించిన ఈ సినిమాలో ఇద్దరు స్నేహితులు ఉంటారు. ఒకతను ఒకమ్మాయిని ప్రేమిస్తాడు. కాని ఆ అమ్మాయి అతడికి సరి కాదని రెండో స్నేహితుడు ఆ పెళ్లిని చెడకొట్టడానికి నిశ్చయించుకుంటాడు. పెళ్లికూతురికి ఈ సంగతి తెలిసి ఎలా చెడగొడతావో చూద్దాం అని తనూ రంగంలో దిగుతుంది. ఆ తర్వాత ఏం జరిగిందనేది కథ. ఈ సినిమా పాటలన్నింటికీ యూ ట్యూబ్‌లో మంచి ఆదరణ లభిస్తుంది. చాలామంది తలా ఒక పాటకు సంగీతం అందించారు. వీటిలో యోయో హనీ సింగ్ చేసిన 'ఛోటే ఛోటే పెగ్'కు మంచి ఫాలోయింగ్ వచ్చింది.

హజ్బెండ్ కీ హౌస్ పార్టీ (భర్త గారి హోమ్ ఎలోన్)

భార్య ఊరికెళితే భర్తకు స్వాతంత్ర్యం వచ్చినట్టు- అతడు అండమాన్ జైల్లో ఉన్నా సరే. భార్య ఊరికెళితే పార్టీ చేసుకుందామనుకున్న భర్త చివరికి ఏమయ్యాడనేది ఈ ప్రహసనం. హాస్య, వ్యంగ్య వీడియోలు తయారు చేసే 'టివిఎఫ్' సంస్థ తయారు చేసిన మరో షార్ట్ ఫన్నీ వీడియో 'హజ్బెండ్ కి హౌస్ పార్టీ'. ఈ షార్ట్ వీడియోలో భార్య ఫ్రెండ్స్ దగ్గరకు వెళితే భర్త ఫ్రెండ్స్‌ని పార్టీకి పిలుస్తాడు. ఫోన్ చేసి విషయం కూపీ లాగిన భార్య భర్తకు ఆ పార్టీ చేసుకోవడానికి రకరకాల షరతులు పెడుతుంది. వచ్చిన వాళ్లే వంట పాత్రలు కడగాలంటుంది. సోఫాలు వాడకుండా కార్పెట్ మీద కూచోవాలంటుంది. బెడ్‌రూమ్‌లో అడుగుపెట్టడానికి వీల్లేదంటుంది. తీరా పార్టీకి ఫ్రెండ్స్ వచ్చే సమయానికి అత్తగారు ఊడిపడుతుంది. హాయిగా మందు కొడుతూ ఎంజాయ్ చేయాల్సిన ఫ్రెండ్స్ అత్తగారి ఎదుట కూచుని బుద్ధిగా బోజనం చేయడంతో ఈ షార్ట్ వీడియో ముగుస్తుంది. నిధి బిష్ట్, బిస్వపతి సర్కార్ నటించిన ఈ వీడియో ఆరు రోజుల్లోనే దాదాపు తొమ్మిది లక్షల హిట్స్‌కు చేరుకుంది. ఇది డైలాగ్ ఆధారిత హాస్యం. సరదాగా ఉంటుంది.



నిడివి : 8 ని. 10 సె.
హిట్స్: 9,21,978

హృదయానికి హత్తుకుందాం...

**బట్టలు కట్టుకోవడం తెలుసు...
మూటలు కట్టుకోవడం తెలుసు...
పిల్లల్ని కట్టుకోవడం తెలుసా...
సరదాగా ఉంది కదూ...
నిజమే... పిల్లల్ని కట్టుకోవడం...
ఈ మాట వినగానే తల్లిదండ్రుల మనసు పరవశిస్తుంది...
నవమాసాలు కడుపులో మోసిన పాపాయి
భూమి మీద పడగానే ఉయ్యాలలో నిదురిస్తుంది.
తల్లి గుండె మీద నిదురిస్తుంది. అమ్మ కాళ్ల మీద నిదురిస్తుంది.
మరి అమ్మ బయటకు వెళ్లినప్పుడు.
అప్పుడు కూడా అమ్మ గుండెల మీదే పరవశంగా,
ప్రశాంతంగా నిదురిస్తుంది. ఆశ్చర్యంగా ఉంది కదూ..
ఎంఎస్‌ఎల్ సంస్థ ఈ సదుపాయం కల్పిస్తోంది.**

నడుముకి పిల్లవాడిని కట్టుకున్న ఝాన్సీరాణి రూపం అందరికీ గుర్తే. అలా కట్టుకునే యుద్ధం కూడా చేసింది. కూలివారు సైతం పిల్లలను నడుముకి కట్టుకుని పనిచేసుకోవడం భారతదేశంలో చాలాకాలంగా ఒక సంప్రదాయం.


పేదరికంతో కొన్నిసార్లు, అవసరం కోసం కొన్నిసార్లు ఇలా నడుముకి బిడ్డను బిగించి కట్టుకోవడం చూస్తూనే ఉంటాం. కారణం ఏమైనా ఇది పటిష్టమైన తల్లిబిడ్డల బంధానికి ప్రతీక.

చాలా సంస్థలు బేబీవేరింగ్‌ను ఉత్పత్తి చేస్తునే ఉన్నాయి. అయితే ఇప్పుడు ముంబైకి చెందిన ఆరుగురు మహిళలు లాభాపేక్షలేకుండా బ్రాండ్ న్యూట్రల్ స్లింగ్ లైబ్రరీని ప్రారంభించారు. దీని పేరు 'ముంబై స్లింగ్ లైబ్రరీ' (ఎంఎస్‌ఎల్). ఇక్కడ జాతీయ, అంతర్జాతీయ బేబీవేరింగ్ దొరుకుతాయి. ఈ బేబీవేరింగ్‌ను, పిల్లల ఆటవస్తువులను కొనలేనివారు అద్దెకు కూడా తీసుకోవచ్చు. పిల్లలకు చుట్టే వస్త్రాలు, పిల్లలను ఆడించే గిలక్కాయలు, మెత్తగా ఉండే పరుపులు... వంటి పిల్లలకు కావలసిన అన్ని వస్తువులు ఈ లైబ్రరీలో అద్దెకు దొరుకుతాయి. అనేక కంపెనీలు సైతం పిల్లలకు సంబంధించిన అనేక ఉత్పత్తులను వీరికి డొనేట్ చేస్తున్నారు.

అన్‌మోల్ బేబీ యజమాని, ఆర్కిటెక్ట్ అయిన రష్మీ భటియా గాఁజా జూలై, 2014లో ఈ సంస్థను రూపొందించారు. ''కొత్త పేరెంట్స్... పిల్లలను ఎలా ఆడించాలో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. వారి సమస్యలకు పరిష్కారం చూపడం కోసం రూపుదిద్దుకుంది ఎంఎస్‌ఎల్'' అంటారు రష్మీ.

పిల్లలను ఎత్తుకోవడం చాలా కష్టం. కొన్నిసార్లు చేతిలో నుంచి జారిపోతుంటారు. ఒక్కోసారి చెయ్యి నొప్పి వచ్చి, చెయ్యి మార్చుకోవలసి వస్తుంది. చంటి పిల్లల్ని శరీరానికి కట్టుకుంటే ఎంత బావుంటుందోనని ఒక్కోసారి అనిపిస్తుంది. ఇప్పటికే చాలా మంది పిల్లలను ఇలా కట్టుకుని బజారుకి వెళ్లడం, పనులు చేసుకోవడం చూస్తున్నాం. మరింత సౌకర్యంగా ఈ అవకాశాన్ని ఎంఎస్‌ఎల్ కల్పిస్తోంది.


పిల్లలతో 'ముంబై స్లింగ్ లైబ్రరీ' సంస్థ సభ్యులు


ఎంఎస్‌ఎల్ సంస్థకు మద్దతు తెలుపుతున్న మిలింద్ సోమన్

"మేం చేస్తున్న పని కంటే, ప్రేమను పంచుకోవడం మాకు చాలా ఆనందంగా ఉంది. ఈ అభిరుచితో మొదలుపెట్టిందే ఈ ప్రాజెక్టు. మా కంపెనీకి చాలా బేబీ వేరింగ్ బ్రాండ్స్ నుంచి సహకారం లభించింది. ఇక మేం వెనక్కి తిరిగి చూసుకోలేదు" అంటారు ప్రాచీషా. రెండేళ్ల కాలంలో ముంబై, ఆ చుట్టుపక్కల ప్రాంతాలలో ఈ కంపెనీ 40 సమావేశాలు ఏర్పాటు చేసింది. 50 రకాల బేబీవేరింగ్ ఉత్పత్తులు పరిచయం చేసింది.

ఈ సంస్థలో.. రష్మీతో పాటు, ఆర్కిటెక్ట్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ యమన్ బెనర్జీ కోరగావోంకర్, లాక్టేషన్ కౌన్సెలర్ అలోక్ మెహతా గంభీర్, మార్కెటింగ్ ప్రొఫెషనల్ ప్రాచీ షా దేధియా, ఇంజనీర్ అండ్ బిజినెస్ అనలిస్ట్ కోశలి దాల్వి, ఎంబీఏ హెచ్ ఆర్ మేనేజ్‌మెంట్ షర్మిలా డిసౌజా.. భాగస్వాములు.

ఇది ఏ విధంగా సహాయపడుతుంది...

గిరిజన సంస్కృతి నుంచి విదేశీ సంస్కృతి వరకు బేబీవేరింగ్ అలవాటుగా వస్తోంది. ఇందులో పసిపిల్లలను భద్రంగా పట్టుకోవడం వల్ల, వాళ్లు సురక్షితంగా, భద్రంగా ఉన్న భావనతో హాయిగా చిరునవ్వులు చిందిస్తూ నిద్రిస్తారు. అంతేకాదు... ఇందులో పిల్లలకు కావలసిన ప్రాథమిక అవసరాలన్నీ తీరుతాయి.

ప్రీటెర్మ్ బేబీలను మరింత జాగ్రత్తగా చూసుకోవాలి. కంగారూలాగ పొట్టలో దాచుకుంటే, వారి శరీరానికి తల్లి శరీరం తగులుతుంటే వెచ్చగా పడుకుంటారు, భద్రత భావనతో త్వరగా కోలుకొంటారు. బిడ్డకు తల్లి పాలు కూడా పుష్కలంగా లభిస్తాయి. ఇక బిడ్డను అక్కున చేర్చుకోవడం వల్ల, తల్లి నుండి సంతోషకరమైన హార్మోన్లు విడుదల అవుతాయి. ఇదొక అందమైన, ఆనందకరమైన అనుభవం.

తల్లిపాలు, పాలు మాన్పించడం, తప్పటడుగులు వేసే సమయంలో ఇచ్చే ఆహారం, ఫిట్‌నెస్... వంటివి కూడా తెలియపరుస్తారు.

బేబీ వేరింగ్ ఉత్పాదనలకు సంబంధించి కొత్త పేరెంట్స్‌లో ఎన్నో సందేహాలు! పసిపిల్లలు పాడైపోతారా, నడక అలవాటు చేసుకోలేరా, పిల్లల కాళ్లు పాడైపోతాయా, తల్లులకు వీపు నొప్పి వస్తుందా... అంటూ కొందరు తల్లులు సందేహాలు అడుగుతుంటారు. సరైన అవగాహన లేకపోవడం వల్లే వారికి ఇటువంటి అనుమానాలు కలిగి, ఆ అపోహలనే నమ్ముతుంటారని అంటారు రష్మీ. ఇలాంటి అనేక అనుమానాలను నివృత్తి చేస్తుంటారు రష్మీ, భాగస్వాములైన ఆమె స్నేహితులు.

- డా. వైజయంతి

నిప్పులాంటి ఉప్పు

చైనా ఉప్పు... తప్పదు ముప్పు!

మనకు తెలిసిన రుచులు ఆరు. కానీ కొన్నేళ్ల కిందట షడ్రుచుల జాబితాకు మరోటి చేరింది. దాన్ని ఏడో రుచి అందామా? కానీ మన సంప్రదాయంలో ఏడు... ఏడుపుకు చిహ్నం. అందుకే పెద్దలు ఏడును ఆరునొక్కటి అనడం మొదలుపెట్టారు. ఇది ఏడో రుచి కావడంతోనో ఏమోగానీ మన సంప్రదాయపు అశుభాన్ని అంది పుచ్చుకుంది ఆ రుచి. అవును... ఈ రుచి ఎక్కువైందంటే కొందరు కొన్నిసార్లు ఆరోగ్యపరంగా ఆరునొక్కరాగం ఆలపించక తప్పదు. అంటే ఏడుపు తప్పదన్నమాట. ఆ ఏడోదే... 'ఉమామీ' అనే రుచి. ఆ రుచిని ఇచ్చేదే 'చైనా సాల్ట్' అని పిలిచే చైనా ఉప్పు.

వారేవా అనేలోపే - వామ్మో...!

చైనీస్ వంటకాలు ఎంతో రుచిగా అనిపిస్తుంటాయి. రసాయనికంగా 'మోనో సోడియమ్ గ్లుటామేట్' అని పిలిచే చైనా ఉప్పే అందుకు కారణం. దీన్ని కాస్త ఎక్కువగా తీసుకుంటే కొన్ని ఆరోగ్య సమస్యలు వస్తాయి. అవే... తలనొప్పి, ముఖం ఎర్రబారడం (ఫ్లషింగ్), చెమటలు పట్టడం, గుండెదడ, ఛాతీలో నొప్పి, వికారం లాంటి లక్షణాలు. వాటన్నింటినీ కలిపి 'ఎమ్ఎస్‌జీ సింప్టమ్ కాంప్లెక్స్'గా పేర్కొంటారు. పై లక్షణాలు కనిపించే ఆ కండిషన్‌ను 'చైనీస్ రెస్టారెంట్ సిండ్రోమ్' అంటారు.



మరి చాపల్యాన్ని చంపేయాల్సిందేనా?

చైనా ఉప్పు సరిపడని వారు ఉమామీ రుచిని కోల్పోవాల్సిందేనా? అవసరం లేదు. సోయాసాస్‌కు సాధారణ ఉప్పు కలిపితే ఉమామీ రుచే వస్తుంది. అయితే చైనా ఉప్పు సరిపడేవారు కూడా దీన్ని ఎక్కువ వాడకూడదు. చాలా పరిమితంగానే వాడాలి.

చివరగా ఒక్కమాట... ఉప్పుతో తిప్పలు తప్పవన్నది తెలిసిందే. అందుకే చైనాదైనా- ఇండియాదైనా ఉప్పు ఉప్పే. దానితో ముప్పు ముప్పే అని గ్రహించి, వీలైనంత తక్కువగా ఉపయోగించాలి.

సాక్షి ఫ్యామిలీ
సినిమా
హైదరాబాద్
సోమవారం
22-1-2018



ఆస్కార్ వర్సెస్ గోల్డెన్ గ్లోబ్

ఏటా లక్షలాది మంది ఆ అవార్డు వేడుక వస్తోందంటే టీవీల ముందు వాలిపోతుంటారు. ఒక్కో క్యాటగిరీల్లో అవార్డులు అనౌన్స్ అవుతూంటే.. ''అండ్ ది అవార్డ్ గోస్ టూ..'' అనగానే కళ్లన్నీ అప్పగించి చూస్తూంటారు. వాళ్లకిష్టమైన సినిమాకో, నటుడికో, టెక్నీషియన్‌కో అవార్డు వస్తే ఇక పండగే! ప్రపంచవ్యాప్తంగా ఆ స్థాయి క్రేజ్ తెచ్చుకున్న అవార్డు 'ఆస్కార్'. ఆస్కార్ అనేది హాలీవుడ్ సినిమాకు ఒక బ్రాండ్. ఆ బ్రాండ్ తమ సినిమాకు దక్కాలని అందరు ఫిల్మ్‌మేకర్స్ కోరుకుంటూ ఉంటారు. అందుకే ఆస్కార్ అవార్డ్స్ అనౌన్స్ చేస్తున్నారంటే అభిమానులకు అదొక పండగ. సినిమాను సెలబ్రేట్ చేసుకునే పండగ.


వారం క్రితమే 2017 సంవత్సరానికి సంబంధించిన ఆస్కార్ నామినేషన్స్‌ను స్వీకరించే ప్రక్రియ పూర్తయింది. రేపు (జనవరి 23) నామినేషన్స్ ప్రకటిస్తారు. మార్చి 4న అవార్డుల ప్రదానం. ఇంకా చాలా టైమ్ అయితే ఉంది. కానీ సందడి మాత్రం ఇప్పటికే మొదలైపోయింది. ముఖ్యంగా గోల్డెన్ గ్లోబ్ అవార్డుల ప్రదానం కూడా జరిగిపోయాక ఆస్కార్ సందడి ఎక్కువయింది.

హాలీవుడ్‌లో ఆస్కార్ స్థాయిని మించింది ఇంకేదీ లేకపోయినా గోల్డెన్ గ్లోబ్ అవార్డులను కూడా ఓ రకంగా గొప్ప అవార్డులుగానే చెప్పుకుంటారు. ఆస్కార్ కంటే ముందే ఈ అవార్డుల ప్రదానం జరుగుతుంది కాబట్టి ప్రతిసారీ 'గోల్డెన్ గ్లోబ్' అవార్డు వేడుక అయిపోయిన రోజు నుంచీ ఆస్కార్ వరుస ఎలా ఉంటుందీ అన్న చర్చ మొదలవుతుంది. ఈ ఏడాది జనవరి 7న గోల్డెన్ గ్లోబ్ అవార్డుల ప్రదానం జరిగిపోయింది. ఇక అప్పట్నుంచీ గోల్డెన్ గ్లోబ్‌లో సత్తా చాటిన సినిమాలే ఆస్కార్‌లోనూ సత్తా చాటుతాయా అన్న చర్చ మొదలైంది.

ఇక ఇక్కడే ప్రధానంగా అర్థమవుతోన్న విషయం ఏంటంటే.. ఆస్కార్‌కు, గోల్డెన్ గ్లోబ్‌కు చాలా తేడా ఉండడం. గోల్డెన్ గ్లోబ్ బెస్ట్ పిక్చర్ అనిపించుకున్న సినిమా, ఆస్కార్‌లో కనిపించకుండా పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ ఏడాది గోల్డెన్ గ్లోబ్‌లో 'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి' అనే సినిమా బెస్ట్ ఫిల్మ్‌గా డ్రామా జానర్‌లో అవార్డ్ అందుకుంది. ఇక కామెడీ/మ్యూజికల్ జానర్‌లో 'లేడీబర్డ్' బెస్ట్ ఫిల్మ్‌గా ఎంపికైంది. ఈ రెండిట్లో ఏదో ఒక సినిమా ఆస్కార్ అవార్డు అందుకుంటుందా? చెప్పలేం! ఇప్పటికైతే సినీ విశ్లేషకులు ఈ రెండు సినిమాలూ కాకుండా ఆస్కార్‌లో బెస్ట్ ఫిల్మ్ అందుకునే సినిమా 'షేప్ ఆఫ్ వాటర్' కానీ, 'ది పోస్ట్' కానీ, 'డంకర్క్' కానీ ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఆశ్చర్యంగా ఈ రెండిట్లోనే ఏదో ఒక సినిమాయే ఆస్కార్‌నూ అందుకోవచ్చు కూడా!

నామినేషన్స్‌లో ఎలాగూ పైన చెప్పుకున్న సినిమాలన్నీ ఉండొచ్చు. మరి అందులో ఆస్కార్‌ను అందుకునే సినిమా ఏదో తెలియాలంటే మార్చి 4 వరకూ ఎదురుచూడాల్సిందే!!

- గోల్డెన్ గ్లోబ్ అవార్డులు సినిమాలతో పాటు టీవీ సిరీస్‌లకు కూడా ఇస్తూంటారు.
- గోల్డెన్ గ్లోబ్ అవార్డులను హాలీవుడ్ ఫారిన్ ప్రెస్ అసోసియేషన్ ప్రదానం చేస్తుంది.
- గోల్డెన్ గ్లోబ్‌లో ఓటర్లు 90 మంది మాత్రమే.
- ఆస్కార్స్ కేవలం సినిమాలకు మాత్రమే.
- ఆస్కార్ అవార్డులను అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రదానం చేస్తుంది.
- ఆస్కార్స్‌లో 6,000మంది ఓట్లను పరిశీలించి విజేతలను ఎంపిక చేస్తారు.


ఫ్రాన్సెస్ మెక్‌డొర్మాండ్


సాయిర్స్ రోనన్

గోల్డెన్ గ్లోబ్ 2018 విన్నర్స్ లిస్ట్

ఉత్తమ చిత్రం (డ్రామా)
త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి

ఉత్తమ చిత్రం (మ్యూజికల్/కామెడీ): **లేడీబర్డ్**

ఉత్తమ విదేశీ భాషా చిత్రం : **ఇన్ ద ఫేడ్ (జర్మనీ)**

ఉత్తమ దర్శకుడు: **గిలియర్మో డెల్‌తొరొ (ద షేప్ ఆఫ్ వాటర్)**

ఉత్తమ ఒరిజినల్ స్కోర్
అలెగ్జాండర్ డెస్‌ప్లాట్ (ద షేప్ ఆఫ్ వాటర్)

ఉత్తమ నటుడు (డ్రామా): **గ్యారీ ఓల్డ్‌మేన్ (డార్కెస్ట్ అవర్)**

ఉత్తమ నటుడు (కామెడీ/మ్యూజికల్)
జేమ్స్ ఫ్రాంకో (ద డిజాస్టర్ ఆర్టిస్ట్)

ఉత్తమ నటి (డ్రామా)
ఫ్రాన్సెస్ మెక్‌డొర్మాండ్ (త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి)

ఉత్తమ నటి (కామెడీ/మ్యూజికల్) : **సాయిర్స్ రోనన్ (లేడీ బర్డ్)**

ఉత్తమ స్క్రీన్‌ప్లే
మార్టిన్ మెక్‌డొనా (త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి)


గ్యారీ ఓల్డ్‌మేన్


జేమ్స్ ఫ్రాంకో

హాలీవుడ్ స్పైస్

రాయల్ పెళ్లికి మేఘన్ రెడీ!

మే 19, 2018. ప్రపంచాన్ని ఆకర్షించే ఓ వేడుక జరగబోతోంది. అది ఏ అవార్డు వేడుకో, ఫుట్‌బాల్ వరల్డ్‌కప్పో, మరింకోటో కాదు. పెళ్లి. అంత స్పెషల్ ఎందుకంటే.. అది బ్రిటీష్ రాజకుటుంబానికి చెందిన ప్రిన్స్ హ్యారీ పెళ్లి మరి! అంగరంగ వైభవంగా రాయల్ ఫ్యామిలీ రేంజ్‌కి తగ్గట్టుగా జరుగుతుంది ఈ పెళ్లి. హ్యారీ.. మేఘన్ మార్కెల్‌ను కాకుండా ఇంకెవరినో చేసుకుంటే ఈ పేపర్లోకి ఎక్కేవాడు కాదేమో.! మేఘన్‌ను చేసుకుంటున్నాడు కాబట్టి వచ్చేశాడు. మేఘన్ హాలీవుడ్‌లో పాపులర్ స్టార్ కావడంతో ఇటు సినీ పరిశ్రమ, అటు రాజకీయ వర్గాలు ఈ పెళ్లికోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.


ప్రిన్స్ హ్యారీ, మేఘన్

పెళ్లికి సంబంధించిన ఏర్పాట్లు కూడా ఇప్పట్నుంచే మొదలైపోయాయి. ముఖ్యంగా రాయల్ ఫ్యామిలీకి కాబోయే కోడలు వేసుకునే వెడ్డింగ్ డ్రెస్‌కు ఉండే క్రేజ్ అంతా ఇంతా కాదు. కొన్ని నెలల పాటు శ్రమించి ఈ డ్రెస్‌ను డిజైన్ చేస్తారు డిజైనర్స్. డ్రెస్ అణువణువూ రాయల్ కళ ఉట్టిపడేలా చూసుకుంటారు. మేఘన్ కూడా ఈ విషయంలో చాలా కేర్ తీసుకుంటోంది. ఇప్పటికే ఓ డిజైనర్‌ను కూడా రిక్రూట్ చేసుకుంది. ఇంకెవరో ఎందుకు అని చెప్పి, తన ఫ్రెండ్ జెస్సికా మల్రోనిని డిజైనర్‌గా ఎంపిక చేసుకుంది మేఘన్. మేఘన్ కోసం టొరంటో నుంచి లండన్‌కు వెళ్లిపోయి జెస్సికా ఇప్పటికే డ్రెస్ డిజైన్ పనులు మొదలుపెట్టేసిందట. పెళ్లి తర్వాత మేఘన్ సినిమాలకు దూరం కావాలనుకోవడంతో ఆమె అభిమానులు ఈ పెళ్లినే ఓ సినిమాగా చూసుకుంటున్నారు. ఆ సినిమా రిలీజ్ కోసం ఎదురుచూస్తున్నారు!!

టామ్ హ్యాంక్స్ భయపడ్డాడు!!

టామ్ హ్యాంక్స్ అవార్డ్ విన్నింగ్ యాక్టర్. లెజెండ్. లెక్కలేనంత మంది అభిమానులను సంపాదించుకున్నాడు. చెయ్యలేని పాత్రంటూ లేదనిపిస్తాడు. ఎలాంటి పాత్రనిచ్చినా అలవోకగా నటించేస్తాడు. అలాంటి నటుడు భయపడ్డాడు!! అదీ.. ఏ కొత్త పాత్ర చేయడానికో, ఏ దర్శకుడో చెప్పిన సన్నివేశాన్ని అర్థం చేసుకోలేకో, మరింకోటో కాదు. తనతో పాటు కలిసి నటించే నటిని చూసి భయపడ్డాడు. ఆ భయానికి కారణం ఏంటంటే అక్కడున్నది మెరిల్ స్ట్రీప్. ఆమె కొన్ని జనరేషన్స్ స్టార్స్‌కి ఇన్స్‌పిరేషన్. అవార్డ్ విన్నింగ్ యాక్టర్. అలాంటి స్టార్ టామ్ హ్యాంక్స్‌తో కలిస్తే? అభిమానులకు ఎలాంటి పండగో చెప్పక్కర్లేదు. తాజాగా విడుదలై సూపర్ రెస్పాన్స్ తెచ్చుకుంటోన్న 'ది పోస్ట్'లో ఈ ఇద్దరూ కలిసి నటించారు. ఇద్దరూ పోటీ పడి నటించారీ సినిమాలో. ఇక వీరికి తోడు దర్శకుడు స్పీల్‌బర్గ్ మ్యాజిక్ కూడా తోడవ్వడంతో 'ది పోస్ట్' సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడంలో మాస్టర్ అనిపించుకుంటోంది. ఇంతటి సక్సెస్‌ఫుల్ సినిమాలో నటించడం అదృష్టం అంటాడు టామ్ హ్యాంక్స్. మెరిల్ స్ట్రీప్‌తో కలిసి నటించడం కూడా సూపర్ ఎక్స్‌పీరియన్స్ అంటాడు. నిజానికి సినిమా సెట్స్‌పైకి వెళ్లడానికి ముందు మెరిల్ స్ట్రీప్‌తో నటించడానికి భయపడ్డాడట హ్యాంక్స్. 'ఎందుకూ?' అనడిగితే, 'ఏమో! మెరిల్ స్ట్రీప్‌తో నటించడం అంటే భయమేసింది' అంటున్నాడు. ఆస్కార్స్‌లో ఈ సినిమా మెయిన్ అవార్డులన్నీ పట్టుకెళుతుందని హాలీవుడ్ అంచనా వేసుకుంటోంది. పోటీ పడి నటించిన ఈ స్టార్స్‌లో ఎవరో ఒకరు అవార్డు దక్కించుకునేలాగే ఉన్నారు కూడా!!


మెరిల్ స్ట్రీప్, టామ్ హ్యాంక్స్

వాలంటైన్స్ డే స్పెషల్ వచ్చేస్తోంది

అదొక సూపర్‌హిట్ ఫిల్మ్ ఫ్రాంచైజ్. సూపర్‌హిట్ అనేకంటే అందరూ మాట్లాడుకునే, చర్చ పెట్టే, గొడవ పెట్టే ఫిల్మ్ ఫ్రాంచైజ్. రెండు సినిమాలొచ్చాయి ఇప్పటికి ఈ ఫ్రాంచైజ్‌లో! ఈ రెండు సినిమాలనూ ఇటు ఇగ్నోర్ చెయ్యలేరు.. అటు పూర్తిగా యాక్సెప్ట్ చెయ్యనూలేరు. ఎరోటిక్ జానర్ సినిమాలను ఇష్టపడేవారికైతే పండగే. యాక్షన్, డ్రామా, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఏ రేంజ్‌లో ఉంటాయో, రొమాన్స్ అదే రేంజ్‌లో ఉంటుంది. 'ఫిఫ్టీ షేడ్స్' ఫిల్మ్ ఫ్రాంచైజ్ గురించి చెప్పుకుంటున్నాం మనం. ఫిఫ్టీ షేడ్స్ ఆఫ్ గ్రే (2015), ఫిఫ్టీ షేడ్స్ డార్కర్ (2017) రెండు సినిమాలే బాక్సాఫీస్ వద్ద దాదాపు బిలియన్ డాలర్ వసూళ్లు (సుమారు 6,500 కోట్ల రూపాయలు) రాబట్టాయి. తాజాగా ఇప్పుడు ఈ ఫ్రాంచైజ్‌లో మూడో సినిమా 'ఫిఫ్టీ షేడ్స్ ఫ్రీడ్' విడుదలవుతోంది. గత రెండు సినిమాల్లానే ఇది కూడా వాలెంటైన్స్ డే కానుకగా విడుదల కానుంది. కాకపోతే వాలెంటైన్స్ డేకి ఐదు రోజులు ముందుగానే.. అంటే ఫిబ్రవరి 9నే! 'ఫిఫ్టీ షేడ్స్' సిరీస్‌లో ఇది చివరి సినిమా అని ముందే అనౌన్స్ చేశారు కాబట్టి అభిమానులకు ఒక రకంగా ఇది స్పెషల్ సినిమా. అందుకు తగ్గట్టే ఇప్పట్నుంచే అడ్వాన్స్ బుకింగ్స్ కూడా మొదలైపోతున్నాయి. ఓపెనింగ్ వీకెండ్‌కే 40 మిలియన్ డాలర్లు (సుమారు 255 కోట్ల రూపాయలు) వసూలు చేస్తుందని ట్రేడ్ అంచనా వేస్తోంది. ఈసారి యాక్షన్‌కు పెద్ద పీటే వేశారట. ట్రైలర్ చూస్తే అభిమానులు ఈ సినిమా నుంచి కోరుకునే అంశాలకు కొదవే లేదని స్పష్టమైపోతోంది. డకోతా జాన్సన్, జేమీ డోర్నన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు జేమ్స్ ఫోలే దర్శకుడు. మరి 2015, 2017లో వాలెంటైన్స్ డే సెలెబ్రేషన్స్‌ను రెట్టింపు చేసిన 'ఫిఫ్టీ షేడ్స్' ఈసారి కూడా మెప్పిస్తుందా? చూడాలి!!


డకోతా జాన్సన్, జేమీ డోర్నన్

రివీల్ చేస్తారట!

జనవరి 24. హాలీవుడ్ అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న రోజు. విశేషం ఏంటా అనుకుంటున్నారా? మార్చి 4న 90వ ఆస్కార్ వేడుకలు జరగనున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన నామినేషన్స్ ఈ బుధవారం అనౌన్స్ చేస్తారట. ఈ అనౌన్స్‌మెంట్‌కు సంబంధించిన చిన్న క్లూను 'అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్' తమ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా పంచుకున్నారు. ఆ క్లూ ఏంటంటే.. ఆస్కార్ ఫైనల్స్ రౌండ్ వరకూ చేరుకున్న యాక్టర్స్, మూవీస్ నామినేషన్ లిస్ట్‌ను బాలీవుడ్ నటి, హాలీవుడ్ లేటెస్ట్ సెన్సేషన్ ప్రియాంకా చోప్రా రివీల్ చేస్తారట. ప్రియాంకతో పాటు రెబల్ విల్సన్, రొసారియో డాసన్, మిచెల్ రోడ్రిగేజ్ లాంటి హాలీవుడ్ యాక్టర్స్ కూడా ఇందులో పాల్గొంటారట. దీనికి సంబంధించిన షూటింగ్ లొకేషన్ పిక్స్‌ను బయటకు వదిలి ఆస్కార్ అవార్డ్స్ కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు మరింత ఆసక్తి రేపింది 'ఆస్కార్ బృందం'.


ప్రియాంకా చోప్రా



అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ సోషల్ మీడియాలో పోస్ట్‌చేసిన ఫొటో

చచ్చినా మళ్లీ ప్రేమలో పడను!

ఏంజెలినా జోలికి ఇప్పుడు 42 ఏళ్లు. రెండు దశాబ్దాల క్రితం హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చినప్పుడు ఎంత ఎనర్జిటిక్‌గా నటించిందో ఇప్పటికీ అదే ఎనర్జీ. ఇప్పుడింక ఆమెకు ఆరుగురు పిల్లలు. భర్తతో విడిపోయి, ఆ పిల్లలందరినీ తనే పెంచుతోంది. అయినా తనపై ఉన్న ఒత్తిడి సినిమాల్లో కనిపించనివ్వదు. అదెలా సాధ్యమని అడిగితే నవ్వి ఊరుకుంటుంది కానీ, పెద్ద సంఘర్షణే జరుగుతూ ఉండాలి ఆమెలో, ప్రతి రోజూ. అందుకేనేమో భర్త బ్రాడ్‌పిట్‌తో 2016లో విడిపోయాక పిల్లలే ప్రాణంగా గడిపేస్తోన్న ఏంజెలినా, మళ్లీ ప్రేమలో పడతారా? అని అడిగితే, అలాంటివి అస్సలు చెయ్యను. ''మళ్లీ చచ్చినా ప్రేమలో పడను'' అని చెప్పేస్తోంది. ఎందుకు? అని అడిగితే పిల్లలకు తన అవసరం ఉందని, వాళ్లను పెంచాల్సిన బాధ్యత తనపై ఉందని చెబుతోంది. మరోపక్క ఆమె భర్త బ్రాడ్‌పిట్ మాత్రం ఏంజెలినాతో విడిపోయాక వరుసగా ప్రేమలో పడిపోతూనే ఉన్నాడు. అయితే అవేవీ సీరియస్ ప్రేమలు కావట. ఏంజెలినా మాత్రం అదెలాంటి ప్రేమైనా ఆ జోలికి మాత్రం పోనని గట్టిగా చెప్పేస్తోంది.



ఏంజెలినా జోలి

అంతటి స్టార్ డైరెక్టర్ పనైపోయిందా?

ఎంతటి గొప్ప ఫిల్మ్‌మేకర్‌కైనా ఒక రోజు వస్తుంది. ఫేడ్ ఔట్ అయిపోయే రోజు అది. అయితే అది పరిస్థితులకు తగ్గట్టు సినిమాలు తీయలేకపోవడం వల్లనో, మేకింగ్‌లో పట్టు కోల్పోవడం వల్లనో కాకుండా, అప్పటివరకూ సంపాదించిన పేరును పోగొట్టే ఒక కారణం వల్ల అయితే? వినడానికే కష్టంగా ఉంది కదూ!? ఇప్పుడు ప్రముఖ దర్శకుడు ఊడీ అలెన్ పరిస్థితి అలాగే ఉందంటోంది హాలీవుడ్.

అలెన్ హాలీవుడ్‌లో రొమాన్స్ జానర్లో పలు తిరుగులేని సినిమాలను అందించాడు. ఎప్పటికైనా చూసి తీరాల్సిందే అని చెప్పుకునే హాలీవుడ్ సినిమాల్లో ఎవ్వరు లిస్ట్ తీసినా అలెన్ సినిమాలు ఉంటాయి. అంతటి టాలెంటెడ్ ఫిల్మ్‌మేకర్. కొద్దికాలంగా ఆయన గొప్ప సినిమాలేవీ తీయలేదు. అయినా అలెన్ లాంటివాడు ఎప్పుడో ఒకప్పుడు అందరినీ కట్టిపడేసే సినిమా ఇస్తాడన్న నమ్మకం మాత్రం అందరికీ ఉంది. ఆ నమ్మకాన్ని ఇక కట్టకట్టేసి మూలన పడేసే పరిస్థితి కనిపిస్తోంది. అదేమంటే, అలెన్‌పై వచ్చిన ఆరోపణలు. తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని అలెన్‌పై డైలన్ ఫారో చాలాకాలంగా ఆరోపణలు చేస్తోంది. అది ఇప్పుడే అలెన్‌ను దెబ్బతీసే దగ్గరకు వచ్చేస్తోంది. చిత్రమేంటంటే ఫారో.. అలెన్ దత్తత తీసుకొని పెంచుకున్న కూతురు. అలెన్‌పై కూతురే ఆరోపణలు చేయడంతో ఆయనను హాలీవుడ్ మెల్లిగా పక్కన పెట్టేస్తోంది.

కొద్దికాలంగా అలెన్ ఒక పెద్ద బడ్జెట్ సినిమా తీయాలని స్టార్ హీరోయిన్లను సంప్రదిస్తున్నాడట. అయితే ఈ కేసు గొడవ చూసి, అలెన్‌ను కేర్ చేయడం మానేశారట హీరోయిన్స్. ఇక్కడే అలెన్ పతనం మొదలైందని హాలీవుడ్ భావిస్తోంది. 82 ఏళ్ల వయసున్న అలెన్, తనకున్న గొప్ప పేరును ఇలా పాడు చేసుకోవడం గొప్ప విషాదమే!


ఊడీ అలెన్



అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా మహిళలకు సమాన హక్కులు కోరుతూ శనివారం న్యూయార్క్‌లో నిర్వహించిన మహిళా మార్చ్‌కు తరలివచ్చిన ప్రజలు. వాషింగ్టన్, షికాగో, డెన్వర్, బోస్టన్, లాస్ ఏంజెలెస్ లాంటి పట్టణాల్లోనూ ట్రంప్ వ్యతిరేక ప్లకార్డులు పట్టికుని భారీ సంఖ్యలో ఆందోళనకారులు ఈ ర్యాలీల్లో పాల్గొన్నారు. లాస్ ఏంజెలెస్‌లో సుమారు 5 లక్షల మంది, న్యూయార్క్‌లో సుమారు 2 లక్షల మంది నిరసన కార్యక్రమాలకు హాజరయ్యారు.

నూతన సీఈసీగా ఓపీ రావత్



న్యూఢిల్లీ: ఎన్నికల సంఘం నూతన ప్రధాన కమిషనర్(సీఈసీ)గా ప్రస్తుత కమిషనర్ ఓం ప్రకాశ్ రావత్ నియమితులయ్యారు. నేడు విరమణ చేయనున్న ప్రస్తుత సీఈసీ ఏకే జోతి స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు. ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి అశోక్ లావాసా ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు. సునీల్ అరోరా ఎన్నికల సంఘంలో మరో కమిషనర్‌గా ఉన్నారు. రావత్ మంగళవారం బాధ్యతలు చేపడతారని న్యాయ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆయన ఈ పదవిలో డిసెంబర్ వరకు కొనసాగుతారు. రావత్ 1953లో ఉత్తరప్రదేశ్‌లో జన్మించారు. 1977లో మధ్యప్రదేశ్ కేడర్‌లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ విభాగంలో కార్యదర్శిగా, రక్షణ శాఖలో డైరెక్టర్‌గా పనిచేశారు. 2004–08 మధ్య కాలంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి బాబూలాల్ గౌర్‌కు ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. 1980 బ్యాచ్ హరియాణా కేడర్‌కు చెందిన లావాసా కేంద్ర ఆర్థిక, పర్యావరణం, పౌర విమానయానం, విద్యుత్, హోం మంత్రిత్వ శాఖల్లో వివిధ హోదాల్లో పనిచేశారు.

క్షయ వ్యాధిపై పోరాడండి: మోదీ

న్యూఢిల్లీ: క్షయ వ్యాధిపై యుద్ధ ప్రాతిపదికన పోరాడాలని, సవరించిన జాతీయ క్షయ వ్యాధి నియంత్రణ కార్యక్రమం(ఆర్ఎన్‌టీసీపీ) ప్రగతిపై కనీసం మూడు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహించాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రధాని నరేంద్రమోదీ కోరారు. ఈ మేరకు ఆదివారం లేఖ రాశారు. క్షయ వ్యాధికి సంబంధించి కేస్ నోటిఫికేషన్లు, ట్రీట్‌మెంట్ సక్సెస్ రేట్ మొదలైన అంశాలపై నిశితంగా దృష్టి సారించాలని లేఖలో పేర్కొన్నారు. అంటువ్యాధుల్లో అతి ప్రమాదకరమైనది క్షయ అని, ఏటా సుమారు 29 లక్షల మంది దీనిబారిన పడుతున్నారని, ఇందులో సుమారు 4.2 లక్షల మంది ప్రజలు.. ముఖ్యంగా పేదలు టీబీ కారణంగా మరణిస్తున్నారని, దీంతో లక్షలాది మంది చిన్నారులు అనాథలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, క్షయ వ్యాధిగ్రస్థుల పౌష్టికాహారం కోసం నెలకు రూ.500 చొప్పున అందజేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది.

తాలిబన్ల దాడిలో 14మంది విదేశీయులు మృతి



కాబుల్‌లో ఉగ్రదాడి జరిగిన ఇంటర్‌కాంటినెంటల్ హోటల్

కాబూల్: అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్‌లో ఇంటర్ కాంటినెంటల్ హోటల్‌పై తాలిబన్లు శుక్రవారం రాత్రి జరిపిన దాడిలో 14 మంది విదేశీయులు చనిపోయారు. ఒక టెలికం అధికారి, ముగ్గురు పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం రాత్రి 9.30 ప్రాంతంలో సాయుధులైన నలుగురు దుండగులు హోటల్‌లోకి చొరబడి విచక్షణారహితంగా కాల్పులు జరుపుతూ కొందరిని బందీలుగా పట్టుకున్నారు. హోటల్‌లోని కొన్ని గదులకు నిప్పంటించారు. వెంటనే స్పందించిన భద్రతా బలగాలు హెలికాప్టర్ ద్వారా భవనం పైనుంచి ప్రవేశించి ఉగ్రవాదులతో తలపడ్డాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. ఈ ఘటనకు తామే కారణమంటూ ఇస్లామిక్ తీవ్రవాద సంస్థ తాలిబాన్ ప్రకటించుకుంది.

ముజఫర్‌నగర్ కేసుల ఎత్తివేత?

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ అల్లర్ల కేసులో బీజేపీ నేతలపై ఉన్న కేసులు ఎత్తేసేందుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సిద్ధమయ్యారు. కేసుల ఎత్తివేతపై ముజఫర్‌నగర్ జిల్లా మెజిస్ట్రేట్‌తో పాటు ఎస్‌ఎస్పీ అభిప్రాయాలను కోరుతూ యూపీ ప్రభుత్వం ఈ నెల 5న లేఖ రాసినట్లు తెలిసింది. ముజఫర్‌నగర్ అల్లర్లలో 63 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ అల్లర్లకు సంబంధించి ప్రస్తుత యూపీ మంత్రి సురేశ్ రాణా, మాజీ కేంద్ర మంత్రి సంజీవ్ బాల్యాన్, ఎంపీ భరతేందు సింగ్, ఎమ్మెల్యే ఉమేశ్ మాలిక్, సాధ్వీ ప్రాచీలపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్‌తో పొత్తుకు సీపీఎం నో!

ఏచూరి తీర్మానాన్ని ఓడించిన ప్రకాశ్ కారత్ బృందం



కోల్‌కతా: కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకోవాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వర్గం ప్రతిపాదించిన ముసాయిదా తీర్మానాన్ని పార్టీ కేంద్ర కమిటీ తోసిపుచ్చింది. ఈ మేరకు ఆదివారం కోల్‌కతాలో జరిగిన ఓటింగ్‌లో పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాశ్ కారత్ నేతృత్వంలోని కేరళ బృందం ఏచూరి తీర్మానాన్ని ఓడించింది. ఈ తీర్మానానికి అనుకూలంగా 31 ఓట్లు, వ్యతిరేకంగా 55 మంది ప్రతినిధులు ఓటేశారు. కాంగ్రెస్‌తో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి పొత్తు ఉండొద్దని ప్రకాశ్ కారత్ బృందం తేల్చిచెప్పింది. కేంద్రంలో బీజేపీని అడ్డుకోవాలంటే కాంగ్రెస్‌తో ఒప్పందం చేసుకోవడమే మేలని ఏచూరి ప్రతిపాదించారు. మూడు రోజుల పాటు జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశాలు ఆదివారం ముగిసిన తరువాత ఏచూరి మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు. సవరణలు చేసిన తరువాత ఆమోదం పొందిన తీర్మానంలో కాంగ్రెస్‌తో ఎలాంటి ఎన్నికల పొత్తు, అవగాహన కుదుర్చుకోవద్దని నిర్ణయించినట్లు వెల్లడించారు. త్రిపుర, పశ్చిమ బెంగాల్ ప్రతినిధులు అనుకూలంగానే ఉన్నా కేరళ సభ్యులు వ్యతిరేకించినట్లు తెలిపారు.

రాజీనామాకు సిద్ధపడ్డ ఏచూరి!

కారత్ బృందం తీర్మానాన్ని పార్టీలో అంతర్గతంగా చర్చించడానికి ఫిబ్రవరిలో విడుదల చేస్తారు. ఏప్రిల్‌లో పార్టీ సమావేశాలు జరగబోయే ముందు దీనిపై అభిప్రాయాలు సేకరిస్తారు. తన తీర్మానం ఆమోదం పొందకుంటే సీపీఎం ప్రధాన కార్యదర్శిగా తప్పుకోవాలని ఏచూరి అనుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తన ఓటమిని పసిగట్టిన ఏచూరి అసలు ఓటింగ్ జరగకుండా ఉండేలా ఎంతో ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇందుకోసం అత్యవసరంగా పొలిట్ బ్యూరో సమావేశం ఏర్పాటుచేసినా ఏకాభిప్రాయం కుదరలేదు.

కేంద్రకమిటీసభ్యుడి హఠాన్మరణం

ఈ సమావేశాలకు హాజరైన కేంద్ర కమిటీ సభ్యుడు, త్రిపుర అధికార లెఫ్ట్‌ఫ్రంట్ చైర్మన్ ఖగేన్‌దాస్(79) హఠాన్మరణం చెందారు. శనివారం వేకువజామున ఆయన తీవ్ర గుండెపోటుతో మృతి చెందారని కుటుంబసభ్యులు తెలిపారు. దాస్ 1978, 1983 ఎన్నికల్లో శాసనసభ్యుడిగా, 1998–2002 కాలంలో రాజ్యసభ సభ్యుడిగా, 2002 నుంచి 2014 వరకు లోక్‌సభ సభ్యుడిగా పనిచేశారు.

ప్రజాకర్షక బడ్జెట్ కాదు..!

రానున్న బడ్జెట్‌పై ప్రధాని మోదీ సంకేతాలు

- ప్రజలు ఏవీ ఉచితంగా కోరుకోరని, అది భ్రమేనని వ్యాఖ్య
- నోట్ల రద్దు ఒక విజయ గాథ .. జీఎస్టీలో లోపాలను సరిచేస్తాం
- న్యాయవ్యవస్థ సంక్షోభం వారి అంతర్గత విషయం
- 'టైమ్స్ నౌ' ఇంటర్వ్యూలో ప్రధాని స్పష్టీకరణ



న్యూఢిల్లీ: రానున్న బడ్జెట్‌లో ప్రజాకర్షక పథకాలేమీ ఉండకపోవచ్చని ప్రధాని మోదీ సంకేతాలిచ్చారు. ప్రజలు ఉచితాలను కోరుకుంటారన్నది ఒక భ్రమ అని, వారు నిజాయితీతో కూడిన పాలనను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. అన్నదాతను ఆదుకోవడానికి తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. మరో ఏడాదిన్నరలో ఎన్నికలున్న వేళ.. గత మూడున్నరేళ్ల తన పాలనపై రిపోర్ట్ కార్డును, భవిష్యత్ పాలన ప్రాథమ్యాలను ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. జీఎస్టీ, ఉద్యోగ కల్పన, కాంగ్రెస్ ముక్త భారత్, నోట్ల రద్దు, న్యాయవ్యవస్థ, వ్యవసాయ సంక్షోభం, విదేశాంగ విధానం.. తదితర అంశాలపై ఆయన తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టారు. 'ఆంగ్ల న్యూస్ చానెల్ 'టైమ్స్ నౌ' మోదీ ఇంటర్వ్యూను ఆదివారం ప్రసారం చేసింది. ఈ ఇంటర్వ్యూలో పలు కీలక అంశాలపై ప్రధాని స్పందించారు. ఇంటర్వ్యూ సారాంశం ప్రధాని మాటల్లోనే..

జీఎస్టీ...

జీఎస్టీ.. పన్నుల సంస్కరణలో ఓ కీలక ముందడుగు. దేశమంతా ఒకే పన్ను వ్యవస్థ ఉండాలన్న ఈ విధానంలోని లోపాలను సరిదిద్దే చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ చట్టాన్ని మరింత సమర్థవంతంగా మారుస్తాం. దీర్ఘకాలంలో జీఎస్టీ వల్ల దేశ ప్రజలందరికీ మేలు జరుగుతుంది. కొత్త మార్పు వస్తున్నప్పుడు ఆర్నెల్లు, ఏడాది, రెండేళ్ల సమయం పడుతుండవచ్చు. కానీ అన్నీ అడ్డంకులూ తొలగిపోతాయి. ఇందుకు అందరూ కలిసి పనిచేయాలి. స్వార్థ రాజకీయాలు చేయటం మంచిది కాదు. జీఎస్టీ కౌన్సిల్‌లో అన్ని రాష్ట్రాలకూ ప్రాతినిధ్యముంది. కౌన్సిల్ భేటీలో సానుకూలంగా మాట్లాడి.. బయటికొచ్చాక విమర్శలు చేస్తున్నారు. పార్లమెంటులోనూ అంతే.. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటమే. దీనిపై మేమేమీ మాట్లాడబోం. నోట్ల రద్దు కూడా ఒక విజయగాథ.

ఉద్యోగకల్పన..

ఉపాధి గురించి తప్పుడు ప్రచారం జరుగుతోంది. దేశంలో ఓ స్వతంత్ర సంస్థ జరిపిన విచారణలో.. ఏడాదిలో 18–25 ఏళ్ల లోపున్న యువకులతో 70 లక్షల కొత్త ఈపీఎఫ్ అకౌంట్లు వచ్చినట్లు తేలింది. ఇది ఉపాధి కల్పన కాదా? రోడ్లు, రైలుపట్టాల నిర్మాణంలోనూ ఉపాధి పెరిగింది. ముద్ర పథకం ద్వారా 10 కోట్ల మందికి రూ.4లక్షల కోట్ల రుణాలిచ్చాం.

ట్రిపుల్ తలాక్..

ఏ రాజకీయ పార్టీయైనా దేశం కన్నా గొప్పది కాదు. అన్నింటికన్నా ముందు దేశమే. అలాంటి దేశంలో బాధిత వర్గానికి మేలు చేసే చట్టం వస్తున్నప్పుడు దీన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవటం బాధాకరమే. రాజీవ్ గాంధీ చేసిన పొరపాటు (1985లో షాబానో కేసులో)ను కాంగ్రెస్ మళ్లీ మళ్లీ చేస్తోంది. ట్రిపుల్ తలాక్ బాధితుల కథనాలు బాధాకరం. అలాంటి బాధితులకు సరైన గౌరవం కల్పించటం మా బాధ్యత. కాంగ్రెస్ దీన్ని రాజకీయం చేద్దామనుకుంటోంది. ఇది మతానికి సంబంధించిన విషయం కాదు. బాధితురాలి ఆక్రందనను అర్థం చేసుకోవాల్సిన సమయమిది.

సుప్రీం సంక్షోభం..

సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి, నలుగురు సీనియర్ న్యాయమూర్తుల మధ్య నెలకొన్న వివాదం పూర్తిగా వారి అంతర్గత విషయం. ఈ వివాదానికి రాజకీయ పార్టీలు దూరంగా ఉండాలి. మన దేశ న్యాయవ్యవస్థ చాలా గొప్పది. దీనిలో భాగస్వాములైన వారంతా చాలా గొప్పవారు, సమర్థులు. నాకు న్యాయవ్యవస్థపై నమ్మకముంది. ఈ సమస్యను వారే పరిష్కరించుకుంటారు. జమిలీ ఎన్నికలు జరపాలని మేం కోరుకుంటున్నాం. అయితే ఇందుకు అన్ని పార్టీలు సహకరించాలి. బడ్జెట్‌కు ఓ తేదీ ఉన్నట్లే.. ఎన్నికలకూ ఐదేళ్లకోసారి ఓ తేదీని ఫిక్స్‌చేయాలి. దీని ద్వారా ఖర్చులు తగ్గుతాయి. చాలా మేలు జరుగుతుంది.

రానున్న బడ్జెట్..

మొదటినుంచీ పాపులిజం (ప్రజాకర్షక విధానాలు)కు వ్యతిరేకం. బడ్జెట్ విషయంలో ఆర్థిక మంత్రి, దీనికో బృందం పనిచేస్తుంది. ఇందులో నేను జోక్యం చేసుకోను. సామాన్య ప్రజలు ఏవీ ఉచితంగా కోరుకోరు. వారలా కోరుకుంటారనుకోవడం భ్రమ. ప్రజలు నిజాయితీతో కూడిన పాలనను కోరుకుంటారు.

కాంగ్రెస్ ముక్త భారత్

కాంగ్రెస్ ముక్త భారత్ అంటే రాజకీయంగా ఆ పార్టీని అంతం చేయడం కాదు. అవినీతి, కుటుంబ పాలన, ఆశ్రిత పక్షపాతం, ప్రజలను మోసం చేయటం వంటి లక్షణాలున్న కాంగ్రెస్ సంస్కృతిని అంతం చేయడం ఆ నినాదం ఉద్దేశం. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ సంస్కృతి వేరు. ఆ తర్వాతే వారి ఆలోచనా ధోరణి, సంస్కృతిలో చాలా మార్పు వచ్చింది. కాస్త అటుఇటుగా అన్ని పార్టీలకూ ఈ ఆలోచన అలవడింది. కాంగ్రెస్ ముక్త భారత్ అంటున్నానంటే.. అది ఒకపార్టీని ఉద్దేశించినట్లు కాదు. ఆ పార్టీ ఆలోచనలతో నిండిన సంస్కృతిని విమర్శించినట్లు.

పాకిస్తాన్‌తో మన తీరు

ప్రపంచ నేతలతో బలమైన సంబంధాలను ఏర్పర్చుకుంటున్నది.. పాకిస్తాన్‌ను ఏకాకిచేయటానికి కాదు. అసలు మాకు ఆ ఉద్దేశమే లేదు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచాన్ని ఏకం చేస్తున్నాం. మానవాళికి ప్రమాదకరంగా మారిన ఉగ్రవాదంపై పోరాటానికి మానవతావాద శక్తులను ఒకేతాటిపైకి తీసుకొచ్చేందుకు భారత్ ప్రయత్నిస్తోంది. నా దేశం 40 ఏళ్లుగా ఉగ్రవాద బాధిత దేశంగా ఉంది. ఇప్పుడు ప్రపంచానికి ఉగ్ర సెగ తగిలింది. అందుకే కలిసొచ్చే శక్తులను కలుపుకుని ముందుకెళ్తున్నాం. ఇకనైనా భారత్–పాక్‌లు కలిసి పేదరికం, నిరక్షరాస్యత, అనారోగ్యం వంటి సమస్యలపై పోరాటం చేయాలి. కలిసి పోరాడితే మరింత త్వరగా విజయం సాధిస్తామని పాక్ ప్రజలకు చెబుతున్నా.

వ్యవసాయ సంక్షోభం..

అన్నదాతను ఆదుకోవటం మనందరి బాధ్యత. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా మరింత కృషిచేయాల్సిన అసవరముంది. మా ప్రభుత్వం తీసుకొస్తున్న పలు పథకాలు రైతులకు మేలు చేస్తున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్‌పై దృష్టిపెట్టాం. రైతు ఉత్పత్తులకు వాల్యూ అడిషన్ చేస్తాం.

ఎన్నికల వేళ భవిష్యత్ లక్ష్యాలు..

ఎన్నికలు ఎన్నటికీ నా లక్ష్యం కాదు. ఎన్నికల కోసం నా టైంటేబుల్‌ను మార్చుకోను. దేశ ప్రజలకు సేవ చేయటం, ఇందుకోసం ముందుగా నిర్ణయించుకున్న పనులు పూర్తి చేయటమే నా లక్ష్యం. సాంసద్ ఆదర్శ్ గ్రామ్ యోజన మాత్రం అనుకున్నంత స్థాయిలో జరగలేదు.

నేటి నుంచి దావోస్ సదస్సు



- వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొననున్న ప్రధాని మోదీ, ఇతర ప్రపంచ దేశాల అధినేతలు
- భారతీయ వంటకాలతో విందు, ప్రత్యేక ఆకర్షణగా యోగా
- భారత్ నుంచి 130 మంది ప్రతినిధులు

న్యూఢిల్లీ: స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా నేటి నుంచి 'వరల్డ్ ఎకనామిక్ ఫోరం'(డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సు ప్రారంభం కానుంది. సోమవారం సాయంత్రం ప్రారంభ ఉత్సవాలు ముగిశాక.. మంగళవారం నుంచి అధికారికంగా మొదలయ్యే ఈ సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ తొలి ఉపన్యాసం ఇస్తారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే అతిథులకు రుచికరమైన భారతీయ వంటకాలు వడ్డించడంతో పాటు.. సదస్సు జరిగినన్ని రోజులు యోగా శిక్షణ కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. స్విట్జర్లాండ్ ఆల్ప్స్ పర్వతాల మధ్య ఉన్న విడిది కేంద్రం దావోస్‌లో జరగనున్న ఈ 48వ డబ్ల్యూఈఎఫ్ సదస్సుకు ప్రపంచ దేశాల నుంచి వ్యాపార, రాజకీయ, కళలు, విద్యా, సామాజిక రంగాలకు చెందిన 3 వేల మందికి పైగా నేతలు, ప్రతినిధులు హాజరవుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి భారత్ నుంచి 130 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధికి భారత్ చోదక శక్తి అన్న అంశాన్ని ఈ సమావేశాల్లో మోదీ నొక్కి చెప్పనున్నారు. డబ్ల్యూఈఎఫ్ చైర్మన్ క్లాస్ స్వాబ్ సోమవారం సాయంత్రం సదస్సును ప్రారంభిస్తారు. అనంతరం బాలీవుడ్ హీరో షారుక్ ఖాన్, ఆస్ట్రేలియన్ నటి కేట్ బ్లాన్‌చెట్, ప్రముఖ సంగీతకారుడు ఎల్టన్ జాన్‌లను 'క్రిస్టల్' అవార్డులతో సత్కరించనున్నారు.

దేవెగౌడ తర్వాత మోదీనే..

మంగళవారం నాడు ప్రధాని నరేంద్ర మోదీ చేసే ప్రసంగంతో సదస్సు అధికారికంగా ప్రారంభమవుతుంది. 'ముక్కలైన ప్రపంచంలో ఉమ్మడి భవిష్యత్తు నిర్మాణం' అనేది సదస్సు ప్రధాన ఎజెండా. 1997లో అప్పటి ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ అనంతరం దావోస్ సదస్సుకు హాజరవుతున్న మొదటి భారత ప్రధాని మోదీనే. భారత్ స్వేచ్ఛా వాణిజ్య దేశమని, ప్రపంచ వ్యాప్త పెట్టుబడుల కోసం ఎప్పుడూ తలుపులు తెరిచే ఉంటాయని ప్రపంచ దేశాలకు ప్రధాని స్పష్టం చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా కేవలం 24 గంటలు మాత్రమే ప్రధాని దావోస్‌లో ఉంటారు. సోమవారం సాయంత్రం ఆయన ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సీఈవోలకు విందు ఇస్తారు. ఈ కార్యక్రమంలో భారత్‌కు చెందిన 20 కంపెనీలు, 40 విదేశీ కంపెనీల సీఈవోలు పాల్గొంటారు. అలాగే అంతర్జాతీయ వ్యాపార కూటమికి చెందిన 120 మంది సభ్యులతో మోదీ సమావేశమవుతారు. స్విట్జర్లాండ్ అధ్యక్షుడు అలైన్ బెర్సెట్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. మోదీ వెంట కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, సురేశ్ ప్రభు, పియూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, ఎంజే అక్బర్, జితేందర్ సింగ్‌లు కూడా దావోస్ సదస్సులో పాల్గొంటున్నారు. అలాగే భారతీయ పరిశ్రమల విభాగం సీఐఐ నేతృత్వంలోని సీఈవోల బృందంలో ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ, అజీం ప్రేమ్‌జీ, రాహుల్ బజాజ్, ఎన్.చంద్రశేకరన్, చందా కొచ్చర్, ఉదయ్ కొటక్, అజయ్ సింగ్‌లు సదస్సుకు హాజరవుతున్నారు. మోదీతో పాటు సదస్సులో ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్, షారుక్ ఖాన్‌లు కూడా ప్రసంగిస్తారు.

ఆ ఆప్ ఎమ్మెల్యేలు అనర్హులే

20 మంది ఎమ్మెల్యేలపై ఈసీ నిర్ణయానికి రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ: లాభదాయక పదవుల్లో కొనసాగినందుకు ఢిల్లీ అసెంబ్లీలోని 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై వేటు వేయాలన్న ఎన్నికల సంఘం సిఫారసులకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదముద్ర వేశారు. ఆదివారం కేంద్ర న్యాయశాఖ విడుదల చేసిన ఓ నోటిఫికేషన్‌లో రాష్ట్రపతి తన నిర్ణయాన్ని వెల్లడించారు. '20 మంది ఆప్ ఎమ్మెల్యేలు లాభదాయక పదవుల్లో కొనసాగారంటూ ఎన్నికల సంఘం చేసిన సిఫారసులను పరిగణనలోకి తీసుకుంటూ.. 20 మంది సభ్యులను అనర్హులుగా ప్రకటిస్తున్నాను' అని అందులో పేర్కొన్నారు. రాష్ట్రపతి నిర్ణయంపై ఆప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నిర్ణయం రాజ్యాంగవిరుద్ధమని ఆప్ నేత అశుతోష్ వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి నిర్ణయం బాధ కలిగించిందని.. తుది నిర్ణయం తీసుకునే ముందు రాష్ట్రపతి తమను సంప్రదించి ఉండాల్సిందని వేటు పడిన ఎమ్మెల్యే అల్కాలాంబా తెలిపారు.



ఆప్ సమావేశంలో ఎమ్మెల్యే ఆల్కా లాంబా


అందుకే దేవుడు 67 సీట్లిచ్చాడు

'మూడేళ్ల తర్వాత 20 మంది అనర్హులవుతారని దేవుడికి ముందే తెలుసు అందుకే 67 సీట్ల భారీ మెజారిటీ కట్టబెట్టాడు' అని కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. కేంద్రం కుట్ర పన్నిందని, అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తామని అన్నారు.

సుప్రీంలో త్వరలో పారదర్శక రోస్టర్ విధానం

న్యూఢిల్లీ: సుప్రీంలో దాఖలయ్యే సున్నితమైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలను(పిల్) ధర్మాసనాలకు కేటాయించే విషయంలో మరింత పారదర్శకత కోసం అందిన సలహాలను సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా పరిశీలించినట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. కేసులకు సంబంధించిన వివరాలను త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించాయి. మరోవైపు సుప్రీం సంక్షోభం నివారణకు సీజేఐతో నలుగురు సీనియర్ జడ్జీలు సోమవారం భేటీ అయ్యే అవకాశముందని పేర్కొన్నాయి.

పాక్ కాల్పుల్లో 11కు చేరిన మృతులు



జమ్మూలో దెబ్బతిన్న తన ఇంటిని చూసుకుంటున్న మహిళ

జమ్మూ: పాకిస్తాన్ వరుసగా నాలుగోరోజూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. నియంత్రణ రేఖ(ఎల్వోసీ)తో పాటు అంతర్జాతీయ సరిహద్దు వెంట ఉన్న జమ్మూ, కథువా, సాంబా, పూంచ్, రాజౌరీ ప్రాంతాలపై విచక్షణారహితంగా కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడి సైనిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీకే రాయ్ ప్రాణాలు కోల్పోయినట్లు ఓ పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. దీంతో గత నాలుగు రోజుల్లో పాక్ కాల్పుల్లో చనిపోయిన వారి సంఖ్య 11కు చేరుకుందన్నారు. చనిపోయినవారిలో ముగ్గురు ఆర్మీ, ఇద్దరు బీఎస్ఎఫ్ జవాన్లతో పాటు ఆరుగురు పౌరులున్నారు. సరిహద్దు ప్రాంతాల్లోని 40,000 మంది సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. గణతంత్ర వేడుకల వేళ అలజడి సృష్టించేందుకు నలుగురు ఉగ్రవాదులు కశ్మీర్‌లోకి ప్రవేశించవచ్చని నిఘా వర్గాలు హెచ్చరించాయి.

వెంకయ్య నివాసంలో సంక్రాంతి వేడుకలు

హాజరైన ప్రధాని మోదీ, మన్మోహన్, కేంద్ర మంత్రులు

సాక్షి, న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు నివాసంలో సంక్రాంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో జరిగిన ఈ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, మాజీ ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ, బీజేపీ అగ్రనేత ఎల్‌కె అద్వానీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రులు సుష్మా స్వరాజ్, నిర్మలా సీతారామన్, అరుణ్ జైట్లీ, అశోక్ గజపతిరాజు, స్మృతి ఇరానీ, విజయ్ గోయల్, అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్, ఏపీ మంత్రి కామినేని శ్రీనివాస్, ఎంపీలు కె. కేశవరావు, తోట నరసింహం తదితరులు పాల్గొన్నారు. ప్రధాని మాట్లాడుతూ.. భారత సంప్రదాయ పద్ధతులను, విశిష్టతను కాపాడుకోవాలని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దక్షిణాది రాష్ట్రాల పసందైన వంటకాలతో వెంకయ్య అతిథులకు విందు ఏర్పాటు చేశారు.



వెంకయ్య కుటుంబ సభ్యులతో కేంద్రమంత్రి సుష్మా స్వరాజ్



2024లో మనమే నెంబర్ 1

జనాభాలో చైనాను దాటనున్న భారత్ • సంతానోత్పత్తి ఉత్తరాదిలోనే అత్యధికం

ప్రపంచ జనాభాలో రెండో స్థానంలో ఉన్న భారత్ ప్రస్తుతం జనాభా విస్ఫోటనం దిశగా సాగుతోంది. ప్రస్తుతమున్న సంతానోత్పత్తి పెరుగుదల రేటుతో 2024 సంవత్సరానికల్లా చైనాను అధిగమించి ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల దేశంగా ఇండియా నిలవనుంది. 1952లోనే కుటుంబ నియంత్రణ పద్ధతులను అవలంభించినప్పటికీ ఆశించిన ఫలితాలను సాధించడంలో భారత్ విఫలం కాగా, రెండేళ్ల అనంతరం జనాభా నియంత్రణకు చైనా ప్రభుత్వం తీసుకున్న చర్యలు అక్కడ సత్ఫలితాలు ఇచ్చాయి. ప్రస్తుతం రాష్ట్రాలవారిగా జనాభా పెరుగుదల రేటు దేశంపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది చర్చనీయాంశమవుతోంది.

ఉత్తరభారతం పైపైకి..

ఉత్తరాదిలో ముఖ్యంగా బిహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటు గణనీయంగా పెరుగుతోంది. అదే దక్షిణాది రాష్ట్రాలకు వచ్చేసరికి అది తక్కువగా ఉంటోంది. జనాభా పెరుగుదలలో ప్రాంతాలవారీగా తారతమ్యాలు అధికమైతే.. దేశంలో రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో మార్పులకు అవకాశం ఏర్పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. సంతానోత్పత్తి అధికంగా లేకపోవడంతో దక్షిణాదిలో మరణిస్తున్న వారి కంటే పుట్టే పిల్లల సంఖ్య తక్కువగా ఉంటోంది. ఇది ఆ రాష్ట్రాల్లో జనాభా తగ్గుదలకు దారితీస్తోంది. సంతానోత్పత్తి రేటు బిహార్‌లో 3.41 ఉండగా, యూపీలో 2.74గా ఉంది. 1951లో బిహార్ కంటే తమిళనాడు జనాభా కొంత ఎక్కువగా ఉండగా, గడచిన ఆరు దశాబ్దాల్లో తమిళనాడు కంటే బిహార్ జనాభా ఒకటిన్నర రెట్లు పెరిగింది. 1951లో కేరళ కంటే మధ్యప్రదేశ్‌లో 37 శాతం ఎక్కువ మంది ప్రజలుండగా, 2011 వచ్చేసరికి ఈ సంఖ్య 217 శాతానికి చేరుకుంది.

పెద్ద, చిన్న రాష్ట్రాలు..

జనాభా వృద్ధితో పెద్ద, చిన్న రాష్ట్రాల మధ్య అంతరాలు పెరగకుండా సమానస్థాయిలో అభివృద్ధి ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. 1971 జనాభా లెక్కలకు అనుగుణంగా ఒక్కో రాష్ట్రంలోని పార్లమెంట్ సీట్ల సంఖ్యను నిర్ధారించగా, తదుపరి స్థానాల పెంపు గడువు 2026 తర్వాతే.. 2026 వరకు పార్లమెంట్ సీట్ల కూర్పు 50 ఏళ్ల క్రితం జనాభా ఆధారంగా చేసిన కేటాయింపులే కొనసాగుతాయి. ఉదాహరణకు...యూపీలో ఒక ఎంపీ 25 లక్షల ఓటర్లకు ప్రాతినిధ్యం వహిస్తుండగా, బిహార్‌లో 26 లక్షలు, పశ్చిమబెంగాల్‌లో 22 లక్షలు, తమిళనాడులో 18 లక్షలు, కేరళలో 17 లక్షల ఓటర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా పార్లమెంటు సీట్లు పునర్విభజించాలని ప్రతిపాదన ముందుకొస్తోంది.

పెరగనున్న అంతర్రాష్ట్ర వలసలు..

వివిధ రాష్ట్రాల్లో సంతానోత్పత్తి హెచ్చుతగ్గులకు తోడు ఆర్థికాభివృద్ధిలో అంతరాలు జతకలిస్తే అంతర్రాష్ట్ర వలసలకు ఎక్కువ ఆస్కారమేర్పడనుంది. 1991–2001 మధ్య కాలంలో అంతర్రాష్ట్ర వలసల కంటే ఆయా రాష్ట్రాల్లోనే అంతర్గత వలసలు ఐదు రెట్లు పెరిగినట్లు తేల్చారు. మొత్తం దేశ జనాభాతో పోల్చితే అంతర్ రాష్ట్ర వలసలు తక్కువగానే ఉన్నా వాటి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ వలసలు ఎక్కువగా కేంద్రీకృతమయ్యాయి. ఈ పదేళ్ల కాలంలో తమిళనాడుకు 39 రెట్లు వలసలు పెరిగాయి. యూపీ, బిహార్ విషయానికొస్తే రెండింతలే వృద్ధిచెందాయి.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

28న 'వాక్ విత్ జగనన్న'

ప్రజా సంకల్ప యాత్ర 1000 కి.మీ. పూర్తవుతున్న సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పిలుపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజల కష్టాలను తెలుసుకుని, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజా సంకల్పం పాదయాత్ర ఈ నెల 28వ తేదీన నెల్లూరులో 1,000 కిలో మీటర్ల మైలురాయిని అధిగమిస్తున్న సందర్భంగా 'వాక్ విత్ జగనన్న' (జగనన్నతో నడుద్దాం) అనే కార్యక్రమం చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు నిచ్చింది. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ 13 జిల్లాల్లో 3,000 కిలోమీటర్లు చేస్తున్న వైఎస్ జగన్ పాదయాత్ర మూడో వంతు పూర్తి కానుండటంతో పార్టీ వర్గాల్లో, అభిమానుల్లో మరింత ఉత్సాహం నింపేందుకు 'జగనన్నతో నడుద్దాం' అనే కార్యక్రమాన్ని పార్టీ రూపొందించింది. దేశ, విదేశాల్లోని తెలుగు ప్రజలు 700కు పైగా ప్రదేశాల్లో ఏక కాలంలో వైఎస్ జగన్‌కు సంఘీభావం తెలుపుతూ ఆరోజున పాదయాత్రను చేపట్టనున్నారు.రాష్ట్రంలోని 25 పార్లమెంటరీ జిల్లా కేంద్రాల్లోనూ, 664 మండల కేంద్రాల్లోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 28న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పించి పాదయాత్ర ప్రారంభించాలని నేతలకు పార్టీ పిలుపు నిచ్చింది.

విదేశాల్లో..: పదిహేను దేశాల్లోని సుమారు 25 నగరాల్లో కూడా జగన్‌కు సంఘీభావంగా వైఎస్సార్ కాంగ్రెస్ ఎన్నారై విభాగం సభ్యులు పాదయాత్ర కార్యక్రమాన్ని చేపట్టబోతున్నారు. విదేశాల్లో ఉన్న తెలుగు సంఘాలు, ఎన్నారై విభాగం సభ్యులు ఈ యాత్ర సమన్వయ బాధ్యతలు చేపడతారు.

✦ శ్రీవారి సేవలో జస్టిస్ అర్జన్‌కుమార్ సిక్రీ

సాక్షి, తిరుమల: సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అర్జన్‌కుమార్ సిక్రీ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున 3.00 గంటలకు ఆలయానికి విచ్చేసిన ఆయన సుప్రభాత సేవలో పాల్గొన్నారు.



✦ టీడీపీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి అరెస్ట్

- బ్యాంకులను మోసగించిన ఘటనలో కేసు నమోదు
- బెంగళూరులో అరెస్ట్ చేసిన సీబీఐ



నెల్లూరు, సాక్షి ప్రతినిధి/బెంగళూరు: అధికార తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డిని ఆదివారం సాయంత్రం బెంగళూరులో సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. బ్యాంకులను మోసం చేసి భారీగా రుణాలు పొందిన వ్యవహారంలో కొన్నేళ్లుగా వాకాటి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆరోపణలు నిజమేనని నిర్ధారణ కావడంతో ఆదివారం ఉదయం అదుపులోకి తీసుకుని విచారించి, సాయంత్రం అరెస్ట్ చేశారు. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన వాకాటి వీఎన్ఆర్ ఇన్‌ఫ్రా, వీఎన్ఆర్ రైల్, లాజిస్టిక్స్ తదితర కంపెనీలను నిర్వహిస్తున్నారు. ఆయనకు హైదరాబాద్ షామీర్‌పేటలో రూ.12 కోట్లు విలువచేసే భవనం ఉంది. దీనిని నకిలీ డాక్యుమెంట్ల ద్వారా విలువను భారీగా పెంచేసి, రూ.250 కోట్ల రుణం కోరుతూ ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు దరఖాస్తు చేసుకున్నారు. ఫైనాన్స్ కార్పొరేషన్ 2014లో రూ.190 కోట్ల రుణం మంజూరు చేసింది. అసలు, వడ్డీ చెల్లించడంలో వాకాటి నారాయణరెడ్డి విఫలం కావడంతో ఫైనాన్స్ కార్పొరేషన్ బకాయి రూ.205.02 కోట్లకు చేరింది. దీంతో ఫైనాన్స్ కార్పొరేషన్ వాకాటి ఆస్తుల జప్తుపై దృష్టి సారించింది. రుణం కోసం ఆయన సమర్పించిన డాక్యుమెంట్లు నకిలీవని విచారణలో తేలింది. దీంతో గతేడాది మే 5న ఫైనాన్స్ కార్పొరేషన్ ఫిర్యాదు మేరకు సీబీఐ కేసు నమోదు చేసింది. మే 12న నెల్లూరు, హైదరాబాద్, బెంగళూరులోని ఆయన కార్యాలయాలు, నివాసాల్లో సోదాలు నిర్వహించింది. కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంది. అప్పటి నుంచి విచారణ ప్రక్రియ కొనసాగించి ఆదివారం అరెస్ట్ చేసింది.

ఐపీ పెట్టిన రెండు కంపెనీలు: హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న వీఎన్ఆర్ ఇన్‌ఫ్రా, వీఎన్ఆర్ రైల్ కంపెనీలు గతేడాది ఐపీ పిటిషన్ దాఖలు చేశాయి. బ్యాంకుల్లో రుణాలు వడ్డీలతో కలిపి రూ.వందల కోట్లు దాటడంతో రెండు కంపెనీలు ఐపీ(దివాలా) దాఖలు చేశాయి. మరోవైపు నెల్లూరు, బెంగళూరు, హైదరాబాద్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి వాకాటి రూ.443 కోట్ల రుణాలు పొందారు. వాటిని తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకులు ఆస్తుల అటాచ్‌మెంట్, జప్తు ప్రక్రియను కొనసాగిస్తున్నాయి. టీడీపీ ఎమ్మెల్సీ వాకాటి అరెస్ట్‌తో నెల్లూరు జిల్లాలో కలకలం రేగింది.

తెలంగాణ

రైతన్నకు 'మద్దతు'!

- ఎంఎస్‌పీ కన్నా తక్కువ పలికితే తేడా మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించాలి
- ప్రభుత్వానికి మార్కెటింగ్ శాఖ సిఫారసు
- నాలుగు రాష్ట్రాల్లో పర్యటించి నివేదిక రూపొందించిన అధికార బృందాలు
- త్వరలో ఉన్నతస్థాయి సమావేశం



సాక్షి, హైదరాబాద్: పంటకు మద్దతు ధర కంటే మార్కెట్లో తక్కువ ధర పలికితే ఆ తేడాను సర్కారే రైతుకు చెల్లించాలని మార్కెటింగ్ శాఖ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం మేరకు వ్యవసాయ మార్కెట్ల పనితీరు, రైతులకు అందుతున్న మద్దతు ధరలు, సేవలపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖకు చెందిన నాలుగు అధికారుల బృందాలు హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకలో అధ్యయనం చేసి వచ్చాయి. తాజాగా ఆ శాఖ డైరెక్టర్‌కు నివేదిక సమర్పించాయి. మధ్యప్రదేశ్‌లో మద్దతు ధర కంటే తక్కువ పలికితే ఆ తేడాను ప్రభుత్వమే రైతులకు అందిస్తోంది. దీన్ని ప్రధాని మోదీ కూడా ప్రశంసించారు. హరియాణాలో అక్కడి ప్రభుత్వం ఇటీవలే కూరగాయలకు మధ్యప్రదేశ్ మాదిరిగా ఓ పథకానికి రూపకల్పన చేసింది. ఇక కర్ణాటకలో రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు చేసి ఆ నిధులతో రైతులకు మద్దతు ధర కల్పిస్తున్నారు. అయితే కేంద్రం నుంచి పెద్దగా సహకారం లేకపోవడంతో రెండేళ్లుగా అక్కడ సరైన ఫలితాలు రావడంలేదని కర్ణాటక వెళ్లొచ్చిన బృందం తన నివేదికలో తెలిపింది. మహారాష్ట్రలో 1971లోనే పత్తి ఫెడరేషన్ ఏర్పాటైంది. పత్తికి మద్దతు ధర అందించడం దీని ఉద్దేశం. అయితే దాని గుత్తాధిపత్యం కారణంగా మూసేసినా, ఇటీవల మళ్లీ అక్కడక్కడ కార్యకలాపాలు ప్రారంభించినట్లు చెబుతున్నారు. దీని ద్వారా మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేస్తున్నారు.

ఏది ఆచరణీయం?

మార్కెటింగ్ శాఖ బృందాలు ఇచ్చిన నివేదికపై త్వరలో ఉన్నతస్థాయి సమావేశం జరగనుంది. మద్దతు ధర, మార్కెట్ ధర మధ్య తేడాను రైతులకు ఇచ్చే సిఫారసుపైనే అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. దీన్ని అమలు చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వంపై పెద్ద ఎత్తున భారం పడనుంది. పైగా ప్రభుత్వం కూడా రైతులకు మద్దతు ధర అందించేందుకు రైతు సమితులను రంగంలోకి దింపాలని యోచిస్తోంది. వాటి ద్వారా కొనుగోలు చేయాలని భావిస్తోంది. దీనికి పెద్ద ఎత్తున నిధులు కావాలి. ఈ నేపథ్యంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్న దానిపై ఆసక్తి నెలకొంది.

కేంద్ర పథకం ఎలా ఉంటుందో?

కేంద్ర ప్రభుత్వం కూడా రైతులకు మద్దతు ధర అందించేందుకు సరికొత్త పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. వచ్చే బడ్జెట్‌లో దీన్ని వెల్లడించే అవకాశం ఉంది. ప్రస్తుతం దేశంలో ఎఫ్‌సీఐ లేదా ఇతర సంస్థల ద్వారా వరి, గోధుమ పంటలను మాత్రమే మద్దతు ధరకు కొనుగోలు చేసే విధానం ఉంది. అయితే సోయాబీన్, కంది, మినుములు, పెసలు, వేరుశనగ, నువ్వులు, మొక్కజొన్న తదితర పంటలకు మాత్రం ఇది అమలు కావడం లేదు. ఆయా రాష్ట్రాల్లో పండించిన పంట దిగుబడిలో కేవలం 30 శాతం వరకు మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఇది సరికాదని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి చెబుతోంది. కేంద్రం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్ తదితర సంస్థలే ఎంఎస్‌పీకి కొనుగోలు చేస్తున్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేశాక వాటిని అమ్మే సందర్భంలో ఆయా రాష్ట్రాల సంస్థలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతోంది. ఆ నష్టంలో కేంద్రం కేవలం 40 శాతమే భరిస్తానని చెబుతోంది. దాన్ని 55 శాతం చేయాలని రాష్ట్రం కోరుతోంది. అలాగే పంట ఉత్పత్తుల సేకరణకు అవసరమైన నిధులను కేంద్రమే సమకూర్చాలని డిమాండ్ చేస్తోంది. కనీసం 50 శాతం రివాల్వింగ్ ఫండ్‌ను సమకూర్చాలని విన్నవిస్తోంది. మార్కెటింగ్ బృందాల నివేదిక, కేంద్ర పథకం తీరు చూశాక రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకానికి రూపకల్పన చేస్తుందన్న చర్చ జరుగుతోంది.

ఎవరి మీద కోర్టుకు పోతావు?

చంద్రబాబుపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మండిపాటు

- కేంద్రంలో నీ మంత్రులు కొనసాగుతున్నారా? లేదా?
- ఓటుకు కోట్లు కేసు కోసం ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి ఇప్పుడు మళ్లీ కొత్త మోసమా?



చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో జరిగిన బహిరంగ సభలో అశేషజనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న వైఎస్.జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయి విచారణ నుంచి తప్పించుకునేందుకు ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు కోర్టుకు పోతానంటూ కొత్త మోసానికి తెర లేపారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విరుచుకుపడ్డారు. నాలుగేళ్లు సాగిలపడి ఏడాదిలో ఎన్నికలు జరుగుతాయనగా ప్రత్యేక హోదా ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? అని నిలదీశారు. కేంద్రంలో మీ మంత్రులు కొనసాగుతుంటే ఎవరిపై కోర్టుకు పోతావని ప్రశ్నించారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 67వ రోజు ఆదివారం చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ఉత్తేజపూరితంగా ప్రసంగించారు. వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కృషితో వచ్చిన ప్రతిష్టాత్మక మన్నవరం ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయించడం లేదని చంద్రబాబును నిగ్గదీశారు. తమ ప్రభుత్వం వస్తే భావిభారత పౌరులు ఎందాక చదువుకుంటే అంతవరకు ఉచితంగా చదివిస్తానని భరోసా ఇచ్చారు. పిల్లల్ని బడికి పంపే ప్రతి తల్లికీ రూ.15 వేలు ఇస్తామని తెలిపారు. ఈ సభలో జగన్ ఇంకా ఏమన్నారంటే..

నల్లధనాన్ని దాచుకునేందుకు ఎక్కడికి పోతారో తెలుసా?

చంద్రబాబు నాయుడు తాను సంపాదించిన నల్లధనాన్ని దాచుకునేందుకు ఏటా ఎక్కడికి పోతారో తెలుసా? స్విట్జర్లాండ్‌కు. అంతే కాదు సింగపూర్, చైనా, రష్యా, జపాన్‌కు కూడా పోతా ఉంటాడు. అది కూడా మామూలు విమానాల్లో కాదు.. ప్రైవేటు విమానాల్లో. కానీ మన్నవరం ప్రాజెక్టు మాత్రం పూర్తికాదు. అక్కడెక్కడికో పోవడం ఎందుకు? కేంద్రంలో నీ మంత్రులు ఉన్నారు కదా? వారికి చెప్పి ఈ ప్రాజెక్టుకు నిధులు తీసుకువచ్చి పూర్తి చేయిస్తే 6,100 మందికి ఉద్యోగాలు వస్తాయి కదా? సింగపూర్‌కు పోతాడు.. ఆ దేశం మాదిరి ఆంధ్రప్రదేశ్‌ను చేస్తానంటాడు. చైనా పోతాడు.. అక్కడి మాదిరే ఆంధ్రా అంటాడు. జపాన్‌కు పోతే జపాన్‌లా చేస్తానంటాడు. ఇంకా నయం.. సముద్రాన్నే తీసుకువచ్చి చిత్తూరు జిల్లాలో పెడతాననలేదు ఈ పెద్దమనిషి.

మరిన్ని ఫొటోలు టాబ్లాయిడ్‌లో

కేసు వేస్తారట.. ఎవరి మీద?

నాలుగేళ్లుగా ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టిన ఈ పెద్దమనిషికి ఇప్పుడు గుర్తుకువచ్చింది ఆ విషయం. తనపై ఉన్న ఓటుకు కోట్లు కేసు విచారణకు రాకుండా తప్పించుకునేందుకు ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి, కేంద్రం ముందు సాగిలపడిన ఈ పెద్ద మనిషి ఇప్పుడు కోర్టుకు పోతాడట. ఈ నాలుగేళ్లు ఏమి చేసినట్టు? ఏడాదిలో ఎన్నికలున్నాయనగా మళ్లీ మోసానికి తెర తీశాడు. కేంద్రంలో ఆయన పార్టీ మనుషులు మంత్రులుగా ఉన్నారు.. వాళ్ల మీద వేస్తాడా? అన్యాయంగా, అక్రమంగా సంపాయించిన అవినీతి సొమ్ముతో నల్లధనం సూట్‌కేసులతో ఎంఎల్‌ఏలను కొనుగోలు చేస్తూ అడ్డంగా ఆడియో, వీడియో టేపులలో దొరికిపోయినా ఈ పెద్దమనిషి రాజీనామా చేయడు.. దగ్గరుండి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తాడు. ఇంతగా వ్యవస్థలను మేనేజ్ చేస్తున్న వ్యక్తి బహుశా ఎక్కడా ఉండడేమో. ఎవర్ని దగా చేస్తున్నారు? ప్రజలను మభ్య పెట్టేందుకే ఈ ఎత్తుగడలు. ఇదే కాదు.. తన ప్రచారం కోసం తాను హీరోగా ఉండాలనుకుని తీసిన పుష్కరాల షూటింగ్‌లో తొక్కిసలాట జరిగి 29 మంది అమాయకులు చనిపోయినా ఎవ్వరిపైనా కేసులుండవు? ఎవ్వరిపైనా చర్యలు ఉండవు. ఇదే మరెక్కడైనా అయితే జైలుకు పంపి ఉండేవారు. ఎర్రచందనం స్మగ్లర్ల పేరిట పొట్టకూటి కోసం వచ్చిన 21 మంది కూలీలను పిట్టల్ని కాల్చినట్టు కాల్చి వేసినా ఎవ్వరిపైనా చర్యలుండవు, కేసులుండవు? ఇంతటి దారుణాలు ఎక్కడా జరిగి ఉండవేమో'' అని జగన్ అన్నారు.

900 కిలోమీటర్లు దాటిన పాదయాత్ర

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన ప్రజా సంకల్ప యాత్ర శ్రీకాళహస్తి మండలం చెర్లోపల్లి హరిజనవాడ సమీపంలో అశేష జన సందోహం నడుమ 900 కిలోమీటర్లు దాటింది. వైఎస్ జగన్ ప్రజల కోరిక మేరకు రావి మొక్కను నాటారు.

- కేబినెట్ నిర్ణయంపై విస్తుపోతున్న అధికార యంత్రాంగం..
- 30.2 శాతం రెవెన్యూ వాటా ఇస్తానన్న ఏఏఐ
- 21.6 శాతం రెవెన్యూ వాటా ఇస్తానన్న జీఎంఆర్
- చివరకు టెండర్ రద్దు చేస్తూ నిర్ణయం

ముడుపులివ్వని ఎయిర్‌పోర్టులు

మనకేల తమ్ముడూ!



భోగాపురంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా టెండర్ రద్దు

సాక్షి, అమరావతి: ఒక ప్రభుత్వ సంస్థకు కాంట్రాక్టు ఇస్తే ఎస్కలేషన్లు.. ఇష్టమొచ్చిన రేట్లు కుదరవు. సర్కారు పెద్దల మాట చెల్లుబాటు కాదు. కమీషన్లు రావు.. అదే ఒక ప్రయివేటు సంస్థకు కాంట్రాక్టు ఇస్తే ఇష్టమొచ్చినట్లు రేట్లు వేసుకోవచ్చు. సర్కారు పెద్దలకు అనుకూలంగా ఆసంస్థ నడుచుకుంటుంది. కమీషన్లు దండుకోవచ్చు. భోగాపురం విమానాశ్రయ నిర్మాణం టెండర్ దక్కించుకున్న 'ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) విషయంలో సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం గమనిస్తే ఇది స్పష్టంగా అర్థమౌతుంది. ఏఏఐ దక్కించుకున్న భోగాపురం టెండర్‌ను రద్దు చేస్తూ శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. రూ. వేల కోట్ల పనులకు చెందిన టెండర్ల విషయంలో స్వయంగా సీఎం జోక్యం చేసుకోవడం, కావాల్సిన వారికి అనుగుణంగా నిబంధనలను రూపొందించాలని ఆదేశించడం, లేదంటే నామినేషన్, కొటేషన్లపై పనులు అప్పగించడం వంటివి చూసి అధికార యంత్రాంగం విస్తుపోతోంది. ఇపుడు ఏకంగా ఓ ప్రభుత్వ సంస్థ దక్కించుకున్న టెండర్‌ను చంద్రబాబు రద్దు చేయడం చూసి అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కమీషన్లు రావనే రద్దు చేశారా..

ఏఏఐ టెండర్ విషయంలో సీఎం తీసుకున్న నిర్ణయం అనైతికమని ఉన్నతాధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఏఏఐ సంస్థ నుంచి ముడుపులు రావన్న ఉద్దేశంతోనే అంతర్జాతీయ విమానాశ్రయం టెండర్‌ను రద్దు చేశారని విమర్శలు వ్యక్తమౌతున్నాయి. అదే ప్రైవేట్ సంస్థకు టెండర్ ఇస్తే 'ముఖ్య' నేతకు ఆర్థికంగా భారీ ప్రయోజనం కలుగుతుందని, అందుకే అన్ని అర్హతలతో టెండర్ దక్కించుకున్న ఏఏఐకి కాంట్రాక్టు దక్కకుండా ఏకంగా టెండర్‌నే రద్దు చేశారని ఉన్నతస్థాయి అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. సింగిల్ టెండర్ మాత్రమే దాఖలైనా బావనపాడు పోర్టును అయిన వారికి అప్పగించేసిన సీఎం.. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం టెండర్లలో జీఎంఆర్, ఏఏఐలు పాల్గొనగా ఇందులో రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధికంగా రెవెన్యూ వాటా ఇస్తానన్న ఏఏఐకి టెండర్ ఇవ్వకుండా ఎందుకు రద్దు చేశారో చెప్పాల్సిన అవసరం ఉందంటున్నారు.

ఇదీ విమానాశ్రయ స్వరూపం..

2703 ఎకరాల్లో నిర్మించే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి రూ.2,461 కోట్ల వ్యయం కానుందని అంచనా వేశారు. ప్రభుత్వ, అసైన్డ్, ప్రైవేట్ భూమి సేకరణకు హడ్కో రూ.840 కోట్ల రుణం కూడా మంజూరు చేసిందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ విమానాశ్రయం నిర్మాణం కోసం స్పెషల్ పర్పస్ వెహికల్‌గా భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు కార్పొరేషన్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం 5311 ఎకరాలను కేటాయించాలని నిర్ణయించారు. తొలుత రెండు దశల్లో నిర్మాణం చేపట్టాలని భావించినా ఆ తరువాత ఒకే దశలో 2703 ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో ఎయిర్ పోర్టుకు 1733.66 ఎకరాలు, వాణిజ్య అవసరాలకు 592.69 ఎకరాలు, ఎయిర్ పోర్టుకు అప్రోచ్ రోడ్డుతో పాటు వాణిజ్య ప్రాంతానికి 175.70 ఎకరాలు, భోగాపురం అంతర్జాతీయ ఎయిర్ పోర్టు కార్పొరేషన్ లిమిటెడ్‌కు 201.21 ఎకరాలను కేటాయించారు.

ఏఏఐ టెండర్ దక్కించుకుందిలా..

అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి పీపీపీ విధానంలో 2016 జూన్‌లో టెండర్లను ఆహ్వానించారు. అయితే టెండర్ దాఖలుకు గడువును 'ముఖ్య' నేత సూచనల మేరకు 2017 జూలై 31వరకు పొడిగిస్తూ వచ్చారు. ఆ తేదీ నాటికి జీఎంఆర్ ఎయిర్ పోర్టు ప్రైవేట్ లిమిటెడ్, ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) బిడ్లు దాఖలు చేశాయి. అదేరోజున టెక్నికల్ బిడ్లను తెరిచారు. రెండు బిడ్లు సక్రమంగానే ఉన్నాయని ప్రభుత్వం ఏర్పాటుచేసిన టెక్నికల్ కమిటీ తేల్చింది. అనంతరం భోగాపురం అంతర్జాతీయ ఎయిర్ పోర్టు కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ సమక్షంలో 2017 ఆగస్టు 21న ఫైనాన్సియల్ బిడ్స్‌ను తెరిచారు. ఇందులో ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) రెవెన్యూ వాటాగా 30.2 శాతం ఇస్తామని పేర్కొనగా జీఎంఆర్ ఎయిర్ పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ రెవెన్యూ వాటాగా 21.6 శాతం ఇస్తామని పేర్కొంది. జీఎంఆర్ కన్నా ఎక్కువ రెవెన్యూ వాటా ఇస్తానని పేర్కొన్నందున ఏఏఐకే టెండర్‌ను ఇవ్వాలని అధికారులు సిఫార్సు చేశారు.

రద్దు వెనక ఉద్దేశాలు స్పష్టమే...

భూసేకరణ పూర్తి కాకపోవడం వల్లే భోగాపురం టెండర్ రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పిన మాటల్లో ఏ మాత్రం వాస్తవం లేదని అధికార యంత్రాంగమే పేర్కొంటోంది. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కూడా సైట్ క్లియరెన్స్ ఇచ్చిందని, అలాగే పర్యావరణ అనుమతిని కూడా కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ ఇచ్చిందని అధికారులు తెలిపారు. నిబంధనల ప్రకారమే టెండర్‌ను దక్కించుకున్నా, అధిక రెవెన్యూవాటాను ఇవ్వడానికి సిద్ధపడినా ఏఏఐ టెండర్‌పై నిర్ణయం తీసుకోకుండా ముఖ్యమంత్రి పక్కన పెడుతూ వచ్చారని అంటున్నారు. ఇప్పుడు హఠాత్తుగా భూ సేకరణ కాలేదంటూ అవాస్తవాలు చెబుతూ ఇంకా కొన్ని నిర్మాణాలు చేపట్టాలంటూ ఏఏఐకి వచ్చిన టెండర్‌ను ఇవ్వకుండా రద్దు చేయడం పట్ల అధికార యంత్రాంగం విస్తుపోతోంది. పీపీపీలోనే టెండర్ పిలిచినప్పటికీ మళ్లీ పీపీపీలో టెండర్ పిలుస్తామనడం చూస్తుంటే ఎందుకనే విషయం తేలికగానే అర్థమవుతోందని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. దేశంలో అనేక ప్రతిష్టాత్మక అంతర్జాతీయ విమానాశ్రయాలను ఏఏఐ నిర్మించిందని, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయినందున జాప్యం లేకుండా నిర్మాణం పూర్తయ్యేదని ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు. టెండర్ దక్కించుకున్న ఏఏఐ సంస్థ ఇప్పుడు ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

కేంద్రంతో గొడవొద్దు

టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి: రాష్ట్రాన్ని అవమానిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని నిధుల విషయంలో గట్టిగా నిలదీయాలని అనకాపల్లి ఎంపీ అవంతి శ్రీనివాస్ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. మీకు సహనం ఉన్నా ప్రజలకు లేదని, అవసరమైనప్పుడు తీర్పు చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అమలయ్యేలా ఈ బడ్జెట్ సమావేశాల్లో కేంద్రంపై ఒత్తిడి తేవాలని విన్నవించారు. చంద్రబాబు స్పందిస్తూ... తాను అన్ని ప్రయత్నాలు చేస్తున్నానని, చివరిదాకా ప్రయత్నిస్తూనే ఉంటానని బదులిచ్చారు. మిగతా వారిలా తాను కూడా తిరగబడితే ప్రజలు అసహనానికి గురై రెచ్చిపోతారని చెప్పారు. చివరి వరకూ చూద్దామని, అప్పటికీ హామీలు అమలు చేయకపోతే కేంద్రానికి దండం పెడదామని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఆదివారం ఉండవల్లిలోని తన నివాస ప్రాంగణంలో టీడీపీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అవంతి శ్రీనివాస్ ఆవేశంగా మాట్లాడారు. చంద్రబాబు ఢిల్లీకి 42 సార్లు వెళ్లొచ్చినా విభజన చట్టంలోని ఒక్క హామీ కూడా అమలు కావడం లేదని వాపోయారు.

పొలిటికల్ మేనేజ్‌మెంట్ చేయాలి

సమావేశంలో తొలుత చంద్రబాబు మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో 25 ఎంపీ, 175 ఎమ్మెల్యే సీట్లు గెలవాలని, గెలవలేకపోతే మన వైఫల్యాలే కారణమని చెప్పారు. పనులు చేయడమే కాకుండా, పొలిటికల్ మేనేజ్‌మెంట్ కూడా చేయాలని సూచించారు.

సింగరేణి కార్మికుల సొమ్ము గాడిదల పరం

మార్చిలోగా రాష్ట్రాన్ని వంద శాతం ఓడీఎఫ్‌గా మార్చకపోతే ప్రజలు, అధికార యంత్రాంగం, పార్టీ నేతలకు వ్యతిరేకంగా ధర్నా చేస్తానని, నిరసన దీక్ష చేపడతానని చంద్రబాబు తేల్చిచెప్పారు. పని జరగని చోటల్లా దీక్ష చేస్తానన్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో మహిళలపై అరాచకాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి నియంత్రణపై దృష్టి పెట్టాలని సూచించారు. గతంలో సింగరేణి కార్మికులకు జీతాలు వస్తే వాళ్లు మద్యం తాగేసి, ఆ డబ్బులను గాడిదలకు తినిపించిన రోజులున్నాయని చెప్పారు.

భక్తులకు దర్శనమిచ్చిన సంగమేశ్వర శిఖరం



కొత్తపల్లి: కర్నూలు జిల్లా సప్తనది సంగమంలో వెలసిన శ్రీ సంగమేశ్వరస్వామి ఆలయ శిఖరం భక్తులకు దర్శనమిచ్చింది. గతేడాది అక్టోబర్‌లో ఆలయం కృష్ణమ్మ ఒడిలోకి ఒదిగిపోయి ఆదివారం బయటపడింది. తెలంగాణ రాష్ట్రంలోని సింగోటం జాతరను ముగించుకుని సోమశిల నుంచి నది గుండా బోట్లలో స్వగ్రామాలకు చేరుకునే భక్తులు సంగమేశ్వరస్వామి శిఖర దర్శనం చేసుకుని తరిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి అనంతరం శ్రీశైలం డ్యాం నుంచి నీటిని దిగువకు విడుదల చేయడం వల్ల సంగమేశ్వరుని శిఖరం బయటపడిందని భక్తులు చెబుతున్నారు.

తెలంగాణ

ప్రతీ గుంట భూమికీ 'పెట్టుబడి సాయం'

- కేవలం గుంట భూమి ఉన్నా సాయమందేలా చర్యలు
- ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా సాయం లెక్కింపు
- మే 1 నుంచి గ్రామసభల్లో చెక్కుల పంపిణీకి ప్రణాళిక



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతీ రైతు, ముఖ్యంగా పేద రైతులకు లబ్ధికలిగేలా పెట్టుబడి సాయాన్ని అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. 'సన్నకారు రైతుల్లో చాలా మందికి ఐదు గుంటలు... పది గుంటలు భూమి ఉంటుంది. అంతకంటే తక్కువ భూమి ఉండేవారూ ఉన్నారు. అటువంటి వారికి కూడా ప్రతీ గుంటనూ లెక్కించి పెట్టుబడి సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది'అని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. ఉదాహరణకు కేవలం ఒక గుంట భూమి ఉండి, అందులో కూరగాయలు పండించుకునే రైతులకు రూ.100 చొప్పున పెట్టుబడి సాయం అందజేయనున్నారు. పది గుంటల భూమి ఉంటే రూ. వెయ్యి చొప్పున ఇస్తారు. అంతేకాక ఒక రైతుకు ఒక ఎకరా, ఒక గుంట భూమి ఉంటే అతనికి ఆ లెక్కన రూ. 4,100 అందిస్తారు. ఈ మేరకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నట్టు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో రైతుల సంఖ్య ఎంత.., వారికి ఉన్న భూమి ఎంత? అనే వివరాలతో డాటా బేస్ రూపొందిస్తున్నామని, గుంటలతో సహా వారి భూమిని నమోదు చేస్తామని ఆ వర్గాలు తెలిపాయి. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఆధారంగా రైతుల డాటా బేస్ ప్రకారం ఎవరికి ఎంత సొమ్ము ఇవ్వాలన్నదానిపై జాబితా తయారు చేస్తారు. దాన్ని బ్యాంకులకు అందజేస్తారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గ్రామసభలు పెట్టి రైతులకు చెక్కులను పంపిణీ చేస్తారు.

గ్రామాల్లో అర్హుల జాబితా ప్రదర్శన...

భూ రికార్డుల ప్రక్షాళనలో వెల్లడైన సమాచారం ప్రకారం రైతుల సంఖ్యను, భూముల వివరాలను తమకు ఇవ్వాలని వ్యవసాయ శాఖ రెవెన్యూ విభాగాన్ని కోరింది. ఈ మేరకు రెవెన్యూ శాఖకు లేఖ రాసినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా పెట్టుబడి సాయం పథకం కింద అర్హులైన రైతుల జాబితాను గ్రామాల్లో ప్రదర్శించాలని వ్యవసాయ శాఖ యోచిస్తోంది. రైతులందరికీ సొమ్ము ఇస్తున్నా, కొందరు అనర్హులు కూడా ఉండే అవకాశమున్న నేపథ్యంలో ప్రభుత్వం తయారు చేసే తుది జాబితాను ప్రదర్శిస్తే ఎవరికి రాయితీ వచ్చింది, ఎవరికి రాలేదన్న విషయం తెలిసిపోతుంది. దానివల్ల రైతులందరికీ స్పష్టత వస్తుంది. ఎవరికైనా అన్యాయం జరిగితే ఫిర్యాదు చేసే అవకాశముంటుంది. దీనికోసం కూడా ఒక ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసే అవకాశముందని అంటున్నారు.

గ్రామ సభల్లో చెక్కుల పంపిణీ

జాబితాను ప్రదర్శించిన తర్వాత గ్రామ సభల్లో ఆయా రైతులకు చెక్కులను అందజేస్తారు. మే ఒకటో తేదీ నుంచి 15వ తేదీ నాటికి చెక్కులను రైతులందరికీ పంపిణీ చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. అధికారులు రోజుకొక గ్రామంలో సభ పెట్టి చెక్కులను పంపిణీ చేస్తారు. ఏ రోజు ఏ గ్రామంలో చెక్కులను పంపిణీ చేస్తారో ప్రచారం చేస్తారు. గ్రామంలో అర్హులైన రైతులందరికీ ఒకే రోజు చెక్కులు అందించేలా చూడాలని భావిస్తున్నారు. ఆ ప్రకారం 15 రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో చెక్కుల పంపిణీ పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఒకవేళ నిర్ణీత రోజు ఎవరైనా చెక్కులు తీసుకోని పరిస్థితి ఉంటే మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తారు. అక్కడ ప్రతీ రోజూ చెక్కులు ఇచ్చేలా ఏర్పాటు చేస్తారు. గ్రామసభల్లో చెక్కుల పంపిణీ సందర్భంగా సర్పంచ్, ముఖ్యమైన రెవెన్యూ అధికారులు, ఎమ్మెల్యే, ఎంపీపీ తదితర ప్రజాప్రతినిధులు కూడా హాజరయ్యేలా ఏర్పాట్లుంటాయి. పెట్టుబడి సాయం చెక్కుల పంపిణీని ఒక పండుగలా చేయాలని ప్రభుత్వం భావిస్తోందని చెబుతున్నారు.

ఇస్రో శాటిలైట్ సెంటర్‌లో 20 జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్స్

బెంగళూరులోని ఇస్రో శాటిలైట్ సెంటర్(ఐఎస్ఏసీ).. 20 జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. రెండేళ్ల వ్యవధి గల ఈ కోర్సులకు స్టైపెండ్ నెలకు రూ.25వేలు ఇస్తారు. సంబంధిత విభాగాలను బట్టి ఎంఈ/ఎంటెక్/ఎంఎస్సీ(ఇంజనీరింగ్)/ఎంఎస్సీ/తత్సమాన విద్యతోపాటు నెట్/గేట్/జామ్/జెస్ట్ ఉత్తీర్ణులు అర్హులు. వయసు 28 ఏళ్లు మించకూడదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. చివరి తేదీ ఫిబ్రవరి 2, 2018. రిజర్వేషన్లు తదితర పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.isro.gov.in

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సాక్షి
భవిత
స్పర్థయా వర్ధతే విద్య
సోమవారం 22-1-2018

కెరీర్ గైడెన్స్



చిన్న వయసులోనే ఆఫీసర్ హోదాతో దేశ రక్షణ దళాల్లో చేరేందుకు వీలుకల్పించే పరీక్ష .నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ కాడమీ(ఎన్‌డీఏ-ఎన్ఏ) ఎగ్జామినేషన్-1, 2018కు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. పురుష, అవివాహిత అభ్యర్థులు ఇంటర్ అర్హతతోనే త్రివిధ దళాల్లో(ఆర్మీ, నేవీ, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్) ఆఫీసర్ స్థాయి కొలువు అందుకోవచ్చు. డిగ్రీపట్టాతోపాటు సుస్థిరమైన భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చు. తాజాగా ఎన్‌డీఏ-ఎన్ఏ ప్రకటన వెలువడిన నేపథ్యంలో సంబంధిత సమాచారం...

ఎన్‌డీఏ-ఎన్ఏ 2018

దేశ సేవకు ఉత్తమ మార్గం..

ఖాళీల వివరాలు..

- మొత్తం: 415
- నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ): 360 (ఆర్మీ-208, నేవీ-60, ఎయిర్‌ఫోర్స్-92);
- ఇండియన్ నేవల్ అకాడమీ(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీం): 55

విద్యార్హతలు

- ఆర్మీ వింగ్ (ఎన్‌డీఏ): ఏదైనా గ్రూప్‌తో 10+2 ఉత్తీర్ణత.
- ఎన్‌డీఏ(ఎయిర్‌ఫోర్స్, నేవల్), నేవల్ అకాడ మీ(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీం): ఫిజిక్స్, మ్యాథమెటిక్స్‌లతో 10+2 ఉత్తీర్ణత.

గమనిక: నిర్దేశిత శారీరక ప్రమాణాలు ఉండాలి. ప్రస్తుతం సెకండ్ ఇయర్ చదువుతోన్న విద్యార్థులూ అర్హులే.

- **వయసు:** 1999,జూలై2-2002,జూలై1 మధ్య జన్మించిన అవివాహిత పురుషుల అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- **దరఖాస్తు రుసుం:** రూ.100(ఎస్సీ, ఎస్టీలు, ఇతర నిర్దేశిత కేటగిరి అభ్యర్థులకు ఎలాంటి దరఖాస్తు రుసుం లేదు). ఫీజు మొత్తాన్ని ఎస్‌బీఐ, దాని అనుబంధ బ్యాంకుల నుంచి డిపాజిట్/నెట్ బ్యాంకింగ్/డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లించవచ్చు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2018, ఫిబ్రవరి 5(సాయంత్రం 6 వరకు)
- **పరీక్ష తేదీ:** 2018, ఏప్రిల్ 22
- **వెబ్‌సైట్:** upsconline.nic.in

ఎంపిక ఇలా



అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ రెండంచెల్లో ఉం టుంది. మొదటి దశలో యూపీఎస్సీ రాత పరీక్ష నిర్వహిస్తుంది. ఇందులో యూపీఎస్సీ నిర్దేశించిన కటాఫ్ మార్కులు సాధించిన అభ్యర్థులు.. సర్వీస్ సెలక్షన్ బోర్డ్(ఎస్ఎస్‌బీ) ముందు ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్‌కు హాజరు కావాల్సి ఉంటుంది.

రాత పరీక్ష విధానం

ఇందులో రెండు పేపర్లుంటాయి.

1. మ్యాథ్స్ (300 మార్కులు) - 2.30 గంటలు



2. జనరల్ ఎబిలిటీ టెస్ట్ (600 మార్కులు) - 2.30 గంటలు

రెండో పేపర్ జనరల్ ఎబిలిటీ టెస్ట్‌లో భాగంగా పార్ట్-ఎ, పార్ట్- బి అనే రెండు విభాగాలు ఉంటాయి. పార్ట్-ఎలో ఇంగ్లిష్ 200 మార్కులకు, పార్ట్-బిలో జనరల్ నాలెడ్జ్ 400 మార్కులకు ప్రశ్నలడుగుతారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది.

ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్

రాత పరీక్ష లానే సర్వీస్ సెలక్షన్ బోర్డ్ నిర్వహించే ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్‌కూ 900 మార్కులు కేటాయించారు. ఇది రెండు దశల్లో ఉంటుంది. స్టేజ్-1లో ఉత్తీర్ణత సాధించిన వారి ని రెండో దశకు ఆహ్వానిస్తారు. స్టేజ్-1లో పిక్చర్ పర్‌సెప్షన్ టెస్ట్, డిస్క్రిప్షన్ టెస్టులు ఉంటాయి. వీటిల్లో కనబర్చే ప్రతిభ ఆధారం గా రెండో స్టేజ్‌కు విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ దశలో నాలు గు రోజులపాటు వివిధ టెస్టులు నిర్వహిస్తారు. గ్రూప్ డిస్కషన్, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్కులు, సైకాలజీ టెస్టులు, ఇతర కాన్ఫ రెన్సులు ఉంటాయి. ఈ దశలో ఇంటర్వ్యూయింగ్ ఆఫీసర్, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్, సైకాలజిస్టులు విద్యార్థుల శక్తి సామర్థ్యాలను అంచనా వేస్తారు. తుదిగా అభ్యర్థి మానసిక సామర్థ్యం, తెలివితేట లు, సమాజంపై అవగాహన, వర్తమాన వ్యవహారాలపై ఆసక్తి... ఇవన్నీ ఈ పరీక్షల ద్వారా తెలుసుకుంటారు. వీటిల్లోనూ ఉత్తీర్ణత సాధిస్తే తుదిగా ఫిజికల్ టెస్ట్ నిర్వహిస్తారు. నిర్దేశిత ఎత్తు, దానికి తగ్గ బరువు ఉండాలి. ఏ విధమైన శారీరక లోపాలు ఉండకూడదు.

- రాత పరీక్ష, ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్‌లో కనబర్చే ప్రతిభ ఆధారంగా నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), నేవల్ అకాడమీ(10+2 స్కీం) కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.
- ఎయిర్‌ఫోర్స్ విభాగంలో ప్రవేశాలకు ప్రత్యేకంగా పైలట్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను నిర్వహిస్తారు.

శిక్షణ అనంతరం డిగ్రీ ప్రదానం..

నేషనల్ డిఫెన్స్ అకాడమీ..

దీనికి ఎంపికైన అభ్యర్థులు పుణె ఎన్‌డీఏలో మూడేళ్ల కోర్సు చదవాల్సి ఉంటుంది. ఇక్కడ అకడమిక్‌తోపాటు శారీరక అంశాల్లోనూ శిక్షణ ఇస్తా రు. ఇందులో రెండున్నర ఏళ్లు ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ మూడింటికీ ఒకే విధమై న శిక్షణ ఉంటుంది. కోర్సు పూర్తి చేసుకున్న ఆర్మీ కాడెట్స్ అభ్యర్థులకు ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం బీఎస్సీ/ బీఎస్సీ(కంప్యూటర్), బీఏ డిగ్రీలను ప్రదానం చేస్తుంది. నేవీ, ఎయిర్ ఫోర్స్ కాడెట్స్‌కు బీటెక్ డిగ్రీ ఇస్తారు.

- ఎన్‌డీఏలో శిక్షణ పూర్తి చేసుకున్న ఆర్మీ క్యాడెట్‌లకు డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలటరీ అకాడమీలో, నేవీ అభ్యర్థులకు ఎజిమలలోని నేవల్ అకాడమీలో ఏడాది శిక్షణ ఉంటుంది. ఎయిర్‌ఫోర్స్ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ఏడాదిన్నరపాటు ఫ్లైయింగ్‌లో శిక్షణ ఇస్తారు. ఈ ట్రైనింగ్‌లో నెలకు రూ.56,100 స్టైపెండ్ చెల్లిస్తారు.



- **ఇండియన్ నేవల్ అకాడమీ:** ఇండియన్ నేవల్ అకాడమీ(10+2 క్యాడెట్ స్కీం)కి ఎంపికైన అభ్యర్థులకు అకడమిక్‌తోపాటు శారీరక అంశాల్లోనూ శిక్షణ ఇస్తారు. నాలుగేళ్ల కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు బీటెక్ డిగ్రీని ప్రదానం చేస్తారు.

ఉన్నత హోదాలు..

ఎన్‌డీఏ ద్వారా కోర్సుల్లో చేరే విద్యార్థులు అత్యున్నత స్థాయిలకు చేరుకునే వీలు ఉంది.

ఆర్మీ	నేవీ	ఎయిర్‌ఫోర్స్
లెఫ్టినెంట్	సబ్ లెఫ్టినెంట్	ఫ్లైయింగ్ ఆఫీసర్
కెప్టెన్	లెఫ్టినెంట్	ఫ్లైట్ లెఫ్టినెంట్
మేజర్	లెఫ్టినెంట్ కమాండర్	స్క్వాడ్రన్ లీడర్
లెఫ్టినెంట్ కల్నల్	కమాండర్	వింగ్ కమాండర్
కల్నల్ (సెలక్షన్)	కెప్టెన్ (సెలక్షన్)	గ్రూప్ కెప్టెన్ (సెలక్షన్)
కల్నల్ (టైమ్‌స్కేల్)	కెప్టెన్ (టైమ్‌స్కేల్)	గ్రూప్ కెప్టెన్ (టైమ్‌స్కేల్)
బ్రిగేడియర్	కమోడర్	ఎయిర్ కమోడర్
మేజర్ జనరల్	రేర్ అడ్మిరల్	ఎయిర్ వైస్‌మార్షల్
లెఫ్టినెంట్ జనరల్	వైస్ అడ్మిరల్	ఎయిర్‌మార్షల్
జనరల్	అడ్మిరల్	ఎయిర్‌చీఫ్ మార్షల్



'దేశంలో ఉన్నత విద్యలో మార్పులు రావాలన్న అభిప్రాయాలు వ్యక్తమ వుతున్న మాట నిజమే. ఈ దిశగా యూజీసీ ఇటీవల కాలంలో పలు సంస్కరణలు చేపట్టింది. వీటిని మరింత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తున్నాం" అని అంటున్నారు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ ప్రొఫెసర్. ధీరేంద్ర పాల్ సింగ్. తాజాగా ఆయన యూజీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ప్రొఫెసర్. డి.పి.సింగ్‌తో ఈ వారం గెస్ట్ కాలమ్..

గెస్ట్ కాలమ్

మార్పులతోనే భవిత!!

ఉన్నత విద్యలో సంస్కరణలపై యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ డి.పి.సింగ్

మార్పులు అవసరం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నత విద్యలో ముఖ్యంగా బ్యాచిలర్ డిగ్రీ స్థాయి నుంచే మార్పులు తీసుకురావాల్సిన అవస రముంది. దీనికి అనుగుణంగానే ఇన్‌స్టిట్యూట్‌లకు స్వయం ప్రతిపత్తి కల్పించడం, కరిక్యులంలో మార్పుల దిశగా స్వేచ్ఛ కల్పించడం వంటి చర్యలు యూజీసీ చేపడుతోంది.

ఇండస్ట్రీతో అనుసంధానం

ప్రస్తుతం ఇన్‌స్టిట్యూట్, ఇండస్ట్రీ అనుసంధానం అత్యంత ఆవశ్యకం. విద్యా సంస్థల యాజమాన్యాలు.. కరిక్యులం రూపకల్పన, మార్పు-చేర్పుల విషయంలో ఇండస్ట్రీ నిపుణులతో కలిసి కసరత్తు చేయాలి. ఫలితంగా విద్యార్థుల్లో జాబ్ స్కిల్స్ పెంపొందించవచ్చు.

న్యాక్ గుర్తింపుతో ప్రయోజనాలెన్నో!

యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లకు న్యాక్ గుర్తింపు ద్వారా ఎన్నో ప్రయోజనాలు లభిస్తాయి. అవి పొందిన గ్రేడ్ ఆధారంగా స్వయం ప్రతిపత్తి, యూజీసీ నుంచి ఆర్థికంగా చేయూత లభిస్తుంది. అన్నిటికంటే ముఖ్యంగా న్యాక్ గుర్తింపు పొందిన వర్సిటీలు తమ పరిధిలో రీసెర్చ్, కరిక్యులం డెవలప్‌మెంట్ దిశగా స్వేచ్ఛగా వ్యవహరించే వీలు కలుగుతుంది. న్యాక్ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ పట్ల ఇండస్ట్రీ వర్గాల్లోనూ మంచి ఆదరణ లభిస్తుంది. ఫలితంగా సదరు యూనివర్సిటీ లేదా ఇన్‌స్టిట్యూట్‌లో చదువుతున్న విద్యార్థులకు కెరీర్ పరంగా ఉజ్వల అవకాశాలు లభిస్తాయి.

నిధులు పెంచాలి

ఇన్‌స్టిట్యూట్‌లకు గ్రేడింగ్ పరంగా, న్యాక్ అనుసరిస్తున్న నిబంధనల ప్రకారం రాష్ట్రాల స్థాయిలోని యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లు ప్రధానంగా మౌలిక సదుపాయాలు, ఫ్యాకల్టీ తదితర అంశాల్లో ఇబ్బంది ఎదుర్కొంటున్న మాట వాస్తవమే. దీనికి కారణం ఆర్థికపరమైన సాధికారత లేకపోవడమే. రాష్ట్రాల స్థాయిలోని యూనివర్సిటీలకు స్థానిక ప్రభుత్వాల నుంచి నిధుల కేటాయింపులు మరింత పెంచడం సమస్యకు పరిష్కార మార్గం. ప్రస్తుతం అమలవు తున్న రూసా పథకం ప్రకారం-యూనివర్సిటీ లు తమ ప్రదర్శన తీరు ఆధారంగా యూజీసీ నుంచి నిధులు పొందే అవకాశం ఉంది.

టాప్-20 ఇన్‌స్టిట్యూట్‌లు సాధ్యమే



2020 నాటికి దేశంలోని 20 ఇన్‌స్టిట్యూట్‌లను ప్రపంచ శ్రేణికి చేర్చాలనే ప్రణాళికను సాధ్యం చేయడం సులభమే. వీటిలో పది ప్రైవేటు యూనివర్సిటీలను చేర్చడానికి కారణం.. మన దేశంలో ప్రైవేటు యాజమాన్యం లో ఎన్నో ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. వాటికి అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోంది. ఈ విషయంలో విమర్శలకు తావు లేకుండా ప్రైవేటు యూనివర్సిటీల ఎంపిక చేపడతాం.

పనితీరు ప్రాతిపదికగా

సెంట్రల్ యూనివర్సిటీలకు వాటి పనితీరు ప్రాతిపదికగా నిధుల మంజూరు, ఇతర సదుపాయాలు కల్పించాలనే తాజా నిర్ణయంపై ఎలాంటి భిన్నాభిప్రాయాలు లేవు. దీనికి సెంట్రల్ యూనివర్సిటీలు కూడా సిద్ధంగా ఉన్నాయి. సెంట్రల్ యూనివర్సిటీలకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యం ఉంటుందని, రాష్ట్రాల స్థాయి వర్సిటీలకు ఉండదనడం సరికాదు.

ఆసక్తికి ప్రాధాన్యం

విద్యార్థులు తమ ఆసక్తి ఆధారంగానే కెరీర్ లక్ష్యాలను ఎంపిక చేసుకోవాలి. ఇప్పుడు ఆర్ట్స్, హ్యూమానిటీస్, సైన్స్.. ఇలా అన్ని రంగాల్లోనూ అవకాశాలు ఉన్నాయి. అయితే నైపుణ్యాలు ఉంటేనే ప్రాధాన్యం ఉంటుంది. జాబ్ మార్కెట్ క్రేజ్ ఆధారంగా కోర్సు ఎంపిక చేసుకునే విధానానికి స్వస్తి పలకాలి. స్వీయ అభిరుచికి ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే చక్కటి భవిష్యత్తు సొంతమవుతుంది.

ఇంటర్వ్యూ గైడెన్స్



ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్).. జాతీయ స్థాయిలో.. అటవీ, పర్యావరణ శాఖలో చక్కటి హోదా కల్పించే ఆల్ ఇండియా సర్వీస్! ఈ సర్వీస్‌కు ఎంపికైన వారికి.. పేరు పక్కన ఐఎఫ్ఎస్ హోదాతోపాటు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు సరితూగే సదుపాయాలు! డివిజనల్ స్థాయి అధికారిగా నియామకం! అందుకే..సివిల్ సర్వీసెస్ లక్ష్యంగా ప్రిపేరవుతున్న ఇంజనీరింగ్, సైన్స్ విద్యార్థులు.. ఐఎఫ్ఎస్‌కు కూడా హాజరవుతారు. తాజాగా ఐఎఫ్ఎస్-2017 మెయిన్ పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. చివరి దశ.. ఇంటర్వ్యూలు ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరుగను న్నాయి. ఈ నేపథ్యంలో.. ఐఎఫ్ఎస్ ఇంటర్వ్యూలో విజయానికి నిపుణుల సలహాలు...

ఐఎఫ్ఎస్-2017

ఇంటర్వ్యూ విజయానికి వ్యూహాలు

బయోడేటా

ఐఎఫ్ఎస్.. ప్రిలిమ్స్ వరకు సివిల్ సర్వీసెస్‌తోపాటే నిర్వహిస్తారు. ప్రిలిమ్స్‌లో విజయం సాధించిన వారికి తదుపరి దశలో మెయిన్ ఎగ్జామినేషన్‌ను ఐఎఫ్ఎస్ అభ్యర్థులకు వేరుగా నిర్వహిస్తారు. గత డిసెంబర్‌లో ఐఎఫ్ఎస్ మెయిన్ పరీక్షలు జరిగాయి. తాజాగా వాటి ఫలితాలు విడుదలయ్యాయి. ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభం కానున్న ఐఎఫ్ఎస్ ఇంటర్వ్యూలో విజయం దిశగా అభ్యర్థులు ముందుగా బయోడేటాపై దృష్టిపెట్టాలి. అందులో పేర్కొన్న వ్యక్తిగత అంశాలు, కుటుంబ నేపథ్యం, పుట్టిన ప్రదేశం, సొంత జిల్లా, రాష్ట్రం తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగిఉండాలి. తమ ప్రాంత నేపథ్యం, ప్రాధాన్యం, సమస్యల గురించి కూడా పూర్తిస్థాయిలో సిద్ధమవ్వాలి. యూపీఎస్సీ ఆల్ ఇండియా సర్వీస్‌లకు నిర్వహించే ఇంటర్వ్యూలలో.. అభ్యర్థులకు తమ ప్రాంతానికి సంబంధించిన సమస్యలపై ఉన్న అవగాహన పరీక్షించేలా ప్రశ్నలుంటాయి.

కొత్తగా.. 'జోనల్' విధానం

తాజాగా గతేడాది సెప్టెంబర్‌లో కేంద్ర సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ శాఖ ఆల్ ఇండియా సర్వీసుల్లో జోనల్ కేడర్ విధానానికి రూపకల్పన చేసింది. దేశంలోని రాష్ట్రాలను అయిదు జోన్లుగా విభజించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణాది రాష్ట్రాలను అయిదో జోన్‌లో చేర్చారు. ఈ జోనల్ కేడర్ విధానం సివిల్స్, ఐఎఫ్ఎస్-2017 నుంచే అమల్లోకి వస్తుందని పేర్కొంటూ.. దీనికి అనుగుణంగా మెయిన్ పరీక్షకు దరఖాస్తు చేసుకునే సమయంలోనే అభ్యర్థులు జోన్ ప్రాథమ్యాలను తెలియజేయాలని నిర్దేశించింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని.. డిటెయిల్డ్ అప్లికేషన్ ఫామ్‌లో నిర్దిష్టంగా ఒక జోన్‌ను తమ ప్రాథమ్యంగా పేర్కొన్న అభ్యర్థులు.. అందుకు కారణమేంటి? అనే ప్రశ్నకు సమాధానంతో సిద్ధంగా ఉండాలి. ముఖ్యంగా సొంత రాష్ట్రాలు కాకుండా.. జోనల్ వ్యవస్థలో వేరే రాష్ట్రాలు ఉన్న జోన్‌లను ప్రాథమ్యంగా పేర్కొన్న అభ్యర్థులు.. ఆయా రాష్ట్రాల భౌగోళిక, సామాజిక అంశాల గురించి, అక్కడి పర్యావరణ, అటవీ సంబంధిత సమాచారం గురించి పరిపూర్ణ అవగాహన కలిగుండాలి.

టెక్ విద్యార్థులు.. మరింత ప్రత్యేకంగా

ఐఎఫ్ఎస్.. సైన్స్ గ్రాడ్యుయేట్లతోపాటు బీటెక్‌లోని కొన్ని బ్రాంచ్‌ల విద్యార్థులకు కూడా అర్హత ఉంటుంది. బీటెక్ అర్హతగా ఐఎఫ్ఎస్ మెయిన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు.. ఇంటర్వ్యూకు మరింత పక్కాగా ప్రిపేర్ అవ్వాలి. టెక్నికల్ డొమైన్ నుంచి ఐఎఫ్ఎస్ వైపు రావడం.. అందులోనూ భిన్నమైన విభాగం(పర్యావరణం, అడవులు)వైపు దృష్టిపెట్టడానికి గల కారణాలపై ఇంటర్వ్యూలో ప్రశ్నలు ఎదురవుతాయి. తమ సాంకేతిక నైపుణ్యాలను ఐఎఫ్ఎస్ సర్వీసు విధుల్లో ఎలా అన్వయించగలరో వివరించగలగాలి.

ఆప్షనల్ సబ్జెక్ట్స్

ఐఎఫ్ఎస్ మెయిన్ పరీక్షలో ఎంపిక చేసుకున్న ఆప్షనల్ సబ్జెక్ట్‌కు సంబంధించిన ప్రశ్నలు కూడా ఎదురవుతాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆప్షనల్ సబ్జెక్ట్‌లకు సంబంధించిన ముఖ్యాంశాలను మరోసారి చదువుకొని వెళ్లడం మేలు చేస్తుంది. కొన్ని సందర్భాల్లో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ఆప్షనల్ సబ్జెక్ట్‌ల నుంచే ప్రశ్న ప్రారంభమై.. దానిపైనే ఇంటర్వ్యూ మొత్తం కొనసాగే అవకాశముంది.

సమయ స్ఫూర్తి

ఇంటర్వ్యూ విజయంలో కీలక పాత్ర పోషించే మరో అంశం.. సమయస్ఫూర్తి. అకస్మాత్తుగా ఏదైనా ప్రశ్నను సంధించి.. దానికి సమాధానం రాబట్టేందుకు బోర్డ్ సభ్యులు ప్రయత్నిస్తారు. ఇలాంటి సందర్భాల్లో ఆందోళన చెందకుండా.. తమ పరిధిలో సదరు సమస్యను సానుకూల దృక్పథంతో ఎలా పరిష్కరించగలరో సమాధానం చెప్పే విధంగా సన్నద్ధం కావాలి. అభ్యర్థుల్లోని సమన్వయ ధోరణిని పరిశీలించే విధంగానూ ప్రశ్నలు అడిగే అవకాశముంది. ఇటీవల కాలంలో ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా పలు ప్రాంతాల్లో అటవీ శాఖకు, ఇతర శాఖలకు మధ్య కొంత సందిగ్ధత నెలకొంటోంది. ఉదాహరణకు.. అటవీ భూముల్లో రిజర్వాయర్ల నిర్మాణం, రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో రోడ్ల నిర్మాణం వంటివి. ఇలాంటి సందర్భాల్లో ఆయా శాఖలతో సమన్వయం చేయడం.. పర్యావరణానికి హాని కలగకుండా.. అదే సమయంలో అభివృద్ధి పనులు కొనసాగే విధంగా సంబంధిత శాఖలతో ఎలా సమన్వయం చేసుకుంటారు వంటి ప్రశ్నలు ఎదురవుతున్నాయి. వీటికి కూడా సమాధానం చెప్పేలా సన్నద్ధులై ఉండాలి.

పర్యావరణాంశాలు

ఐఎఫ్ఎస్ ఇంటర్వ్యూకు సన్నద్ధమవు తున్న అభ్యర్థులు పర్యావరణం, అడవులకు సంబంధించిన సమాచారంపై అవగాహన పెంచుకోవాలి. గతేడాది ఒక అభ్యర్థిని.. దేశంలో ప్రస్తుతం అడవుల విస్తీర్ణానికి సంబంధించిన ప్రాథమిక గణాంకాల గురిం చి ప్రశ్నలు అడిగారు. అదే విధంగా.. ప్రభు త్వ విధానాల ప్రకారం-మొత్తం భూభాగం లో 33 శాతం అటవీ భూములు ఉండే విధం గా ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే ప్రశ్న సైతం ఎదురైంది. న్యాయ పరమైన కోణంలో వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, నేషనల్ పార్క్‌కు మధ్య వ్యత్యాసం ఏంటనే ప్రశ్న కూడా అడిగారు. పారిస్ ఒప్పందం భవిష్యత్తుపై మీ అంచనా ఏంటని మరో అభ్యర్థికి ప్రశ్న ఎదురైంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుంటే.. ఐఎఫ్ఎస్ ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులు కచ్చితంగా అడవులు, పర్యావరణ పరిస్థితులకు సంబంధించిన గణాంక సహిత సమాచారంతో సన్నద్ధులై ఉండాలి.

సమకాలీన అంశాలు

ఇక.. అభ్యర్థులు దృష్టి పెట్టాల్సి మరో అంశం.. కాంటెంపరరీ ఇష్యూస్. యూపీ ఎస్సీ ప్రతి ఇంటర్వ్యూలో.. అభ్యర్థుల్లో సమ కాలీన అంశాలపై ఉన్న అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడగడం జరుగు తోంది. కాబట్టి అభ్యర్థులు ఇంటర్వ్యూ తేదీ నుంచి గత సంవత్సర కాలంలో సంభవించిన ముఖ్య పరిణామాల గురించి అవగాహన కలిగుండాలి.

ఐఎఫ్ఎస్-2017 ముఖ్యాంశాలు:

- మొత్తం పోస్ట్‌ల సంఖ్య: 110
- మెయిన్‌కు ఎంపికైన వారి సంఖ్య: 1353
- ఇంటర్వ్యూకు అర్హత సాధించిన వారి సంఖ్య: 301

ఐఎఫ్ఎస్ ఇంటర్వ్యూ కటాఫ్స్

మొత్తం 1700 మార్కులకు నిర్వహించే మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూలలో ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు 300. గత రెండేళ్లలో ఇంటర్వ్యూలో కేటగిరీ వారీగా కటాఫ్ మార్కుల వివరాలు..

సంవత్సరం	జనరల్	ఓబీసీ	ఎస్సీ	ఎస్టీ
2016	261	296	249	293
2015	249	235	220	244

ఫిజికల్ టెస్ట్ కూడా

ఇంటర్వ్యూలో విజయం సాధించిన అభ్యర్థు లకు ఫిజికల్ టెస్ట్ నిర్వహిస్తారు. నాలుగు గంటల్లో 25 కిలో మీటర్లు వాకింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. మహిళా అభ్యర్థులు నాలుగు గంటల్లో 14 కిలో మీటర్ల వాకింగ్ టెస్ట్ నిర్వహిస్తారు.

ఐఎఫ్ఎస్ జోనల్ వ్యవస్థ

జోన్-1 : ఏజీఎంయూటీ, జమ్ము-కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, రాజస్థాన్, హర్యానా
జోన్-2: ఉత్తర ప్రదేశ్, బీహార్, జార్ఖండ్, ఒడిశా
జోన్-3: గుజరాత్, మహరాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్
జోన్-4: పశ్చిమ బెంగాల్, సిక్కిం, అసోం-మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్
జోన్-5: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ

ఈ జోనల్ వ్యవస్థను 2017 పరీక్షల నుంచే అమల్లోకి తీసుకొస్తున్నట్లు డీఓపీటీ పేర్కొంది.

పర్సనల్ టు ప్రొఫెషనల్

ఐఎఫ్ఎస్ ఇంటర్వ్యూలో... పర్సనల్ బయోడేటా నుంచి ప్రొఫెషనల్ సంబంధిత అంశాల వరకు అన్నిటిపైనా ప్రశ్నలు అడుగుతారు. ముఖ్యంగా నాన్-సైన్స్, వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు కొన్ని భిన్నమైన ప్రశ్నలు ఎదురవుతాయి. సర్వీస్ పరంగా డైవర్సిటీ ఎందుకు కోరుకుంటున్నారు? నిజంగానే పబ్లిక్ సర్వీస్ ఆకాంక్ష ఉందా? లేదా? అనే కోణంలో ప్రశ్నలు ఉంటాయి. కాబట్టి వీటిని దృష్టిలో పెట్టుకుని అందుకు తగిన సమాధానాలు సిద్ధంగా ఉంచుకోవాలి.

– కొత్తపల్లి ప్రతాప్, ఐఎఫ్ఎస్-2016

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం 22-1-2018

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

	సెన్సెక్స్	నిఫ్టీ
మార్పు	251 ▲	78 ▲
ముగింపు	35,512	10,895

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు


సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	7,336	▲ 40
డోజోన్స్	26,072	▲ 54
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,731	▲ 30
డాక్స్	13,434	▲ 153
షాంఘై	3,489	▲ 14
నికాయ్	23,808	▲ 45

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బిఐ	64.45	64.58
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బిఐ	89.91	90.09
€	యూరో	ఎస్‌బిఐ	79.27	79.43
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బిఐ	58.35	58.47
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బిఐ	51.88	51.99
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బిఐ	49.01	49.11
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.40	18.26
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.76	18.43
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.04	11.42

'పన్ను' కోరికలు ఎన్నెన్నో!



మరో 10 రోజుల్లో కేంద్ర బడ్జెట్ మన ముందుకొస్తోంది. ప్రతిసారీ బడ్జెట్ అనగానే వివిధ వస్తువుల రేట్లు పెరుగుతాయో; తగ్గుతాయో అనే ఆందోళనలతో పాటు... సామాన్యుల ఉత్కంఠంతా ఆదాయపు పన్ను గురించే. 2018లో ఐదు రాష్ట్రాల ఎన్నికలు, 2019లో లోక్‌సభతో పాటు మరో మూడు రాష్ట్రాల ఎన్నికలు జరగనుండటంతో ఈ బడ్జెట్ పన్ను చెల్లింపుదారులకు అనుకూలంగా ఉండొచ్చన్న అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే బడ్జెట్‌లో ఏ తరహా చర్యలు ఆశిస్తున్నారన్న దానిపై వివిధ రంగాల నిపుణుల నుంచి వచ్చిన సూచనలు, అభిప్రాయాలే ఇవి...

విద్య నుంచి వైద్య ఖర్చుల దాకా భారీ పెరుగుదల

బడ్జెట్లో ప్రోత్సాహకాలపై నిపుణుల సూచనలు
- కాబట్టి పాత మినహాయింపులు సవరించాలి
- టర్మ్, బీమా వంటివి అత్యవసరాల కింద చేర్చాలి
- వాటిపైనా భారీ పన్నులు వేయటం సరికాదు
- మార్కెట్ రాబడులకు పన్ను దారి చూపించాలి
- సెక్షన్ 80సీలో ఇతర పథకాలకూ చోటివ్వాలి

బీమాపై జీఎస్టీ తగ్గించాలి



ఆశిష్ శ్రీవాస్తవ

''బీమా సంస్థలు పాలసీలపై జీఎస్టీ రేటు తగ్గించాలని కోరుతున్నాయి. జీఎస్టీకి ముందు 15 శాతం సేవా పన్ను ఉండేది. జీఎస్టీలో చేర్చిన తర్వాత పన్నును 18 శాతం చేయడంతో బీమా ఉత్పత్తులు ఖరీదుగా మారిపోయాయి. కనీసం జీవితానికి బీమా రక్షణనిచ్చే అసలైన ప్రొటెక్షన్ పాలసీలు (టర్మ్), వైద్య బీమా పాలసీలనయినా కనీస సేవలుగా పరిగణించి వాటి వరకు పూర్తిగా పన్ను మినహాయించాలి'' అని పీఎన్‌బీ మెట్‌లైఫ్ ఇండియా ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో ఆశిష్ శ్రీవాస్తవ కోరారు.

విరాళాలు, బహుమతులకూ ప్రోత్సాహం



కునాల్ బజాజ్

''పన్ను చట్టాలను సవరించడం ద్వారా లిస్టెడ్ స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్ వంటి వాటిని పన్ను లేకుండా విరాళాలు, బహుమతులుగా ఇచ్చేలా అనుమతించాలి. ప్రస్తుత నిబంధనల ప్రకారం సెక్యూరిటీలను విరాళంగా, బహుమతిగా ఇవ్వాలనుకుంటే వాటిని విక్రయించి ఆ నగదును బదిలీ చేయాలి. కానీ, ఈ ప్రక్రియ వల్ల మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి వస్తోంది. దీనికి బదులు వీటిని బదిలీ చేసిన రోజు ఉన్న పారదర్శకమైన మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుంటే సరిపోతుంది. దీనివల్ల దానం చేసేవారికి రెండు ప్రయోజనాలున్నాయి. సెక్యూరిటీలపై మూలధన లాభాల పన్ను మినహాయింపు లభిస్తుంది. తమ ఆదాయం నుంచి ఈ మేర పన్ను మినహాయింపూ పొందొచ్చు'' అని క్లియర్ ఫండ్స్ సీఈవో కునాల్ బజాజ్ సూచించారు. దీనివల్ల పన్ను పరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా సేవా కార్యక్రమాలకు విరాళాలు ఇచ్చేందుకు ప్రోత్సహించినట్టు అవుతుందన్నారు.

విద్యా రుణంపై మినహాయింపులు



రాజ్‌ఖోస్లా

''విద్యా రుణాన్ని బ్యాంకుల నుంచి తీసుకుంటే సెక్షన్ 80ఈ కింద వడ్డీ చెల్లింపులకు ఆదాయ పన్ను మినహాయింపు పొందొచ్చు. అయితే, ఈ ప్రయోజనం ఎనిమిది ఆర్థిక సంవత్సరాలకే వర్తిస్తుంది. 2006లో ఈ మినహాయింపు ప్రవేశపెట్టిన సమయంలో నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్స్‌కు రూ.3-4 లక్షలు, వైద్య డిగ్రీకి రూ.5-6 లక్షలు ఖర్చయ్యేది. కానీ, ఈ రోజు ఇంజనీరింగ్‌కు రూ.8-9 లక్షలు పెట్టాల్సి వస్తోంది. వైద్య విద్యకు రూ.12-14 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎంబీఏ కోర్సు వ్యయం రూ.25 లక్షలవుతోంది'' అని మనీమంత్రా ఎండీ రాజ్‌ఖోస్లా గుర్తు చేశారు. రూ.25 లక్షల రుణం, ఎనిమిదేళ్ల కాలానికి తీసుకుంటే ఈఎంఐ రూ.40,000 అవుతుంది. కానీ, సామాన్యులు నెలనెలా ఇంత ఈఎంఐ చెల్లించలేరు కనుక వారు మరింత కాలానికి రుణం తీసుకుంటారని, కనుక పూర్తి కాలానికి పన్ను మినహాయింపు ఉండాలని ఖోస్లా సూచించారు.

స్వయం ఉపాధికీ ఎన్‌పీఎస్ ప్రోత్సాహకం

స్వయం ఉపాధిలో ఉన్న వారికీ జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్)లో చేసే పెట్టుబడులకు ఉద్యోగుల మాదిరిగా ప్రోత్సాహకాలివ్వాలన్నది మరో సూచన. వాస్తవానికి స్వయం ఉపాధిలో ఉన్న వారికి ఎన్‌పీఎస్‌లో పెట్టుబడులపై పన్ను మినహాయింపులున్నప్పటికీ స్థూల ఆదాయంలో 20 శాతం వరకే, అదీ సెక్షన్ 80సీసీఈ కింద రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపు పరిధిలోనే ఉంది. అదే వేతన జీవులైతే ఆదాయంలో 10 శాతం వరకూ సెక్షన్ 80సీసీడీ(1) కింద మినహాయింపు పొందొచ్చు. దీనికి అదనంగా సదరు ఉద్యోగి తాలూకు సంస్థ ఎన్‌పీఎస్‌లో చేసే జమలకు వేతనంలో 10 శాతం వరకు సెక్షన్ 80సీసీడీ(2) కింద మినహాయింపులున్నాయి. స్వయం ఉపాధిలో ఉన్న వారికీ వేతన జీవుల మాదిరే పరిమితిని పెంచాలన్నది నిపుణుల సూచన. సెక్షన్ 80సీసీఈ కింద పరిమితిని రూ.5 లక్షలు లేదా స్థూల ఆదాయంలో 20 శాతం చేయాలని సూచిస్తున్నారు. దీనివల్ల స్వయం ఉపాధిలో ఉన్నవారు ఎన్‌పీఎస్‌లో మరింత ఇన్వెస్ట్ చేసేలా ప్రోత్సహించినట్టు అవుతుందనేది వారి మాట.

డివిడెండ్‌పై పన్ను రద్దు చేయాలి



కె.సురేష్

''డివిడెండ్ పంపిణీ పన్ను (డీడీటీ) అనేది కంపెనీలు వాటాదారులకు డివిడెండ్ చెల్లించకుండా నిరుత్సాహపరుస్తోంది. దీంతో ఇన్వెస్టర్ల నమ్మకం దెబ్బతింటోంది. అందుకే ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మెరుగుపరిచేందుకు డీడీటీని తొలగించాలి'' అని నేషనల్ ఎక్స్ఛేంజెస్ మెంబర్స్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ కె.సురేష్ సూచించారు.

పెన్షన్ పథకాలకూ పన్ను మినహాయింపు!!.



దివ్యబవేజా

''ఆర్‌బీఐ నివేదిక ప్రకారం చూస్తే... దేశంలో కేవలం కొద్ది మంది మాత్రమే ప్రైవేటు పెన్షన్ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తున్నారు. అధిక సంఖ్యలో జనాభాకు రిటైర్మెంట్ సమయంలో తగినంత ఆర్థిక రక్షణ ఉండటం లేదు. పెన్షన్ పథకాలపై పన్ను ఇందుకో కారణం. పెన్షన్ ప్లాన్ కాల వ్యవధి ముగిశాక యాన్యుటీ పథకాన్ని తీసుకోకపోతే అప్పటి వరకు ఉన్న నిధిలో 66 శాతంపై పన్ను పడుతుంది. అంతేకాదు, యాన్యుటీ పథకంలో ఇన్వెస్ట్‌మెంట్‌పై వచ్చే పెన్షన్ ఆదాయానికీ పన్ను మినహాయింపు లేదు. ఈ రెండు నిబంధనలనూ సరళీకరించి పెన్షన్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసేలా జనాన్ని ప్రోత్సహించాలి'' అని బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో తరుణ్ చుగ్ అభిప్రాయపడ్డారు. ''ఎన్‌పీఎస్‌పై పన్నును సైతం సమీక్షించాలి. 60 ఏళ్లపుడు 60 శాతాన్ని వెనక్కి తీసుకునే అవకాశం ఉండగా, ఇందులో 20 శాతానికే పన్ను మినహాయింపు ఉంది. మిగిలిన 40 శాతంపై పన్ను చెల్లించాలి. ఎన్‌పీఎస్‌లో ప్రజలు చేరాలని ప్రభుత్వం కోరుకుంటే ఈ నిబంధనలను సమీక్షించాల్సిందే'' అని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ దివ్యబవేజా చెప్పారు.

టర్మ్ ఇన్సూరెన్స్‌కు ప్రత్యేక ప్రయోజనం

''టర్మ్ ఇన్సూరెన్స్ అన్నది జీవిత బీమా కవరేజీనిచ్చే అతి చౌక సాధనం. కానీ, చాలా మంది దీన్ని డబ్బులు వృథా కింద పరిగణిస్తుంటారు. సెక్షన్ 80సీ కింద పరిమితిలో భాగంగా కాకుండా టర్మ్ ఇన్సూరెన్స్‌కు ప్రత్యేకంగా పన్ను మినహాయింపు కల్పించడం వల్ల చాలా మందిని ఈ పథకాల కొనుగోలుకు ప్రోత్సహించినట్టు అవుతుంది'' అని బ్యాంక్‌బజార్ సీఈవో అదిల్‌శెట్టి సూచించారు.

మెడికల్ అలవెన్స్‌పై పరిమితి పెంపు

''వైద్య ద్రవ్యోల్బణం ఏటేటా 18-20 స్థాయిలో పెరుగుతోంది. దీంతో వైద్య వ్యయాలు మెడికల్ అలవెన్స్ పరిమితయిన రూ.15,000 కంటే ఎక్కువే అవుతున్నాయి. సాధారణంగా కంపెనీలు కూడా పన్ను మినహాయింపు ఉన్న రూ.15,000 వరకే మెడికల్ అలవెన్స్‌ను పరిమితం చేస్తున్నాయి. ఈ పరిమితిని సవరిస్తే గనుక కంపెనీలు సైతం అలవెన్స్‌ను పెంచేందుకు ప్రోత్సహించినట్టు అవుతుంది'' అని టీటీకే హెల్త్ ఇన్సూరెన్స్ ఎండీ సందీప్ పటేల్ సూచించారు.

సెక్షన్ 80సీలో ఇతర పథకాలకూ చోటు...



రాధిక గుప్తా

''ఇటీవలి కాలంలో ఈక్విటీలు అద్భుతమైన రాబడులనిస్తున్నాయి. కానీ, రిస్క్ తీసుకునేందుకు అందరూ సిద్ధంగా లేరు. దీంతో చాలా మంది ఇన్వెస్టర్లు సెక్షన్ 80సీ కింద ప్రయోజనాల కోసం ఇప్పటికీ చిన్న మొత్తాల పొదుపు పథకాలు, ఎఫ్‌డీలనే ఆశ్రయిస్తున్నారు. వీటిపై రేట్లు బాగా తగ్గిపోయినందున... పన్ను ఆదా కలిగిన, తక్కువ రిస్క్ ఉండి, మెరుగైన రాబడులివ్వగల ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. సంప్రదాయ, తొలిసారి ఇన్వెస్టర్లకు హైబ్రిడ్ ఫండ్స్ అనేవి మంచి ప్రత్యామ్నాయం. సంప్రదాయ పథకాలతో పోలిస్తే ఇవి అధిక రాబడులనిచ్చే అవకాశముంది. ఈక్విటీ ఫండ్స్‌తో పోలిస్తే తక్కువ అస్థిరతలు ఉంటాయి'' అని ఎడెల్వీజ్ మ్యూచువల్ ఫండ్ సీఈవో రాధిక గుప్తా చెప్పారు. ఈ నేపథ్యంలో సెక్షన్ 80సీ పన్ను మినహాయింపులు హైబ్రిడ్ ఫండ్స్‌కు కూడా విస్తరింపజేయాలని, ఈఎల్‌ఎస్‌ఎస్ పథకాల్లో మాదిరిగా మూడేళ్ల లాకిన్‌తో ఇది చేయవచ్చని ఆమె సూచించారు.

ఇంటి బీమాను తప్పనిసరి చేయాలి



కేజీ కృష్ణమూర్తి

'ఇంటి బీమాను తప్పనిసరి చేయాలి. దీనికి చెల్లించే ప్రీమియానికి ఆదాయపన్ను మినహాయింపు కల్పించాలి. దీనివల్ల ఇంటికి ఏదైనా జరిగితే ఆర్థికంగా నష్టపోకుండా నివారించడంతోపాటు, బీమా వ్యాప్తిని సైతం పెంచుతుంది' అని ఫ్యూచర్ జనరాలి ఇండియా ఇన్సూరెన్స్ ఎండీ కృష్ణమూర్తి అన్నారు.

మహిళలూ... పదండి ముందుకు!



- వారి కోసం ప్రత్యేక రుణ పథకాలు
- వడ్డీ రేట్లలో డిస్కౌంట్లు
- ప్రాసెసింగ్ ఫీజులో రాయితీలు
- మహిళా కస్టమర్లకు బ్యాంకుల ప్రోత్సాహకాలు

ఇపుడు మహిళలు అన్ని రంగాల్లోకీ విస్తరించారని వేరే చెప్పాల్సిన పనిలేదు. కాకపోతే ఇప్పటికీ ఆస్తుల విషయంలో మగవారిదే పైచేయిగా ఉంటోంది. ఎందుకంటే వారే ఎక్కువగా సంపాదిస్తారు కనక సొంతింటి వంటివి వారి పేరిటే ఉండటం... స్వయం ఉపాధిలోనూ వారే ముందుండటం వంటివి జరుగుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చటానికి ప్రభుత్వ ప్రోత్సాహంతో బ్యాంకులు కాస్త తెలివైన పథకాలనే అమలు చేస్తున్నాయి. ఎలాగంటే గృహ రుణాల్లో మహిళల పేరిటైతే కాస్తంత వడ్డీ తగ్గిస్తున్నాయి. అలాగే స్వయం ఉపాధి విషయంలో కూడా!!. దీని వల్ల ఇల్లు కొనేవారు రుణం తీసుకోవటానికి తమ ఇంట్లోని మహిళలను కనీసం సహ భాగస్వామిగా నైనా చేసే వీలుంటుంది. సొంతిల్లు కల నెరవేర్చుకోవాలనుకుంటున్నారా...? సొంతంగా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టాలని ఉందా...? మీరు మహిళామణులా? అయితే బ్యాంకులు రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలుకుతున్నాయి. రుణానికి దరఖాస్తు చేసుకోవడం ఆలస్యం వేగంగా ప్రాసెస్ చేస్తున్నాయి. ఆడవారి కోసం ప్రత్యేక రుణ పథకాలు, వడ్డీ రేట్లలో రాయితీలను ఆఫర్ చేస్తున్నాయి.

వేతన జీవులు

ప్రభుత్వరంగంలోని అగ్రగామి బ్యాంకు ఎస్‌బీఐ మహిళల కోసం గృహరుణాల జారీకిగాను ప్రత్యేకంగా ఓ పథకాన్ని నిర్వహిస్తోంది. దీనిపేరు హర్‌ఘర్. వేతనం ఆర్జించేవారు, స్వయం ఉపాధిలో ఉన్న మహిళలకూ ఈ పథకాన్ని అమలు చేస్తోంది. వేతనం ఆర్జించే వారు అయి ఉండి రూ.30 లక్షల వరకు గృహ రుణం తీసుకోదలిస్తే 0.05% తక్కువగా 8.3% వడ్డీ రేటును ఆఫర్ చేస్తోంది. సాధారణంగా ఇతర కస్టమర్లకు ఇది 8.35 శాతంగా ఉంది. ఉదాహరణకు 20 ఏళ్ల కాల వ్యవధిపై రూ.30 లక్షల రుణం తీసుకుంటే 0.05% తక్కువ వడ్డీ రేటు కారణంగా మొత్తం మీద రూ.23,000 ఆదా అవుతుంది. 20 ఏళ్ల కాలంలో రుణంపై వడ్డీ రూపేణా రూ.31.57 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఇతరులకు అయితే రూ.31.8 లక్షలు వడ్డీ అవుతుంది. రూ.30 లక్షలకు పైన రూ.75 లక్షల వరకు ఉండే రుణాలపై వడ్డీ రేట్లు మహిళలకు 8.30-8.35%గా ఉన్నాయి. ఇతరులకు అయితే ఇంతే మొత్తం రుణాలపై వడ్డీ రేట్లు 0.10 శాతం ఎక్కువ. మహిళలకు ఈ స్వల్ప రాయితీ కారణంగా ఆదా అయ్యే మొత్తం 20 ఏళ్ల కాలంలో రూ.50,000 వరకు ఉంటుంది. రూ.75 లక్షలకు పైన రుణాల్లో ఉద్యోగులైన మహిళలకు 8.4-8.45%గా ఉండగా, ఇతరులకు 8.5% అమలవుతోంది. రూ.కోటి రూపాయల రుణంపై 20 ఏళ్ల కాలంలో వడ్డీపై తగ్గింపు రూపంలో మహిళలకు రూ.75,000 వరకు మిగులుతుంది.

స్వయం ఉపాధిలో ఉంటే...

ఉద్యోగం చేస్తున్న మహిళలతో పోలిస్తే తమకాళ్లపై తాము నిలబడిన స్వయం ఉపాధి మహిళల నుంచి బ్యాంకులు కొంచెం ఎక్కువ వడ్డీ రేటు రాబడుతున్నాయి. అయితే, స్వయం ఉపాధిలో ఉన్న ఇతర కస్టమర్లతో పోల్చుకుంటే మహిళలకు వడ్డీ రేటు రూ.30 లక్షల వరకు రుణంపై 0.05 శాతం మేర తక్కువకే ఆఫర్ చేస్తున్నాయి బ్యాంకులు. వడ్డీరేటు 8.4 శాతంగా ఉంది. రూ.30లక్షలకు పైన రూ.75 లక్షల వరకు రుణాలపైనా వడ్డీ రేటు 0.05 శాతం తక్కువే ఉంది. రూ.75లక్షలకు పైన రుణం కావాలంటే స్వయం ఉపాధి మహిళలకు ఎస్‌బీఐ 0.05 శాతం తక్కువగా 8.55 శాతం వరకు వడ్డీ రేటును అమలు చేస్తోంది. వడ్డీ రేట్లు రెండేళ్ల వరకు స్థిరంగా ఉండేలా ఆప్షన్ కూడా ఇస్తోంది. దీంతో రెండేళ్ల పాటు ఒకే వడ్డీ రేటు కొనసాగుతుంది.

ఇతర ఆఫర్లు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మహిళా కస్టమర్లకు రూ.30 లక్షల వరకు రుణాన్ని 8.35 శాతం వడ్డీ రేటుపై ఆఫర్ చేస్తోంది. ఇతరుల కంటే వడ్డీ రేటులో 0.05 శాతం తక్కువ. రూ.30-75లక్షల వరకు రుణాలను 8.4 శాతం వడ్డీ రేటుపై అందిస్తోంది. ఇతరులకు 8.45 శాతం వడ్డీ రేటు అమలు చేస్తోంది. అదే రూ.75 లక్షలకు పైబడిన రుణాలకు వడ్డీ రేటు 8.45 శాతం. ఇతరులతో పోలిస్తే వడ్డీ రేటు 0.05 శాతం తక్కువ. కొన్ని బ్యాంకులు కేవలం వడ్డీ రేట్ల రాయితీలతోనే సరిపుచ్చడం లేదు. ప్రాసెసింగ్ ఫీజులోనూ తగ్గింపునిస్తున్నాయి. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ ప్రాసెసింగ్ ఫీజులో మహిళా కస్టమర్లకు 50 శాతం తగ్గింపునిస్తోంది. ఇతరులకు ప్రాసెసింగ్ ఫీజు రూ.5,000 కాగా, మహిళల్లో ఉద్యోగులు, స్వయం ఉపాధిలో ఉన్న వారికి రూ.2,500 మాత్రమే తీసుకుంటోంది. ఈ చార్జీలపై జీఎస్టీ అదనం. ఒక్కరిగా, లేదా మరొకరితో కలసి ఉమ్మడిగా దరఖాస్తు చేసినప్పుడు, సంబంధిత ప్రాపర్టీ తమ పేరిట లేదా మరొకరితో కలసి ఉమ్మడిగా హక్కులు కలిగి ఉంటేనే రుణానికి అర్హులు.

వ్యాపారం కోసం...

సొంతంగా వ్యాపారం ప్రారంభించాలనుకుంటే లేదా ఉన్న వ్యాపారాన్ని విస్తరించాలనుకుంటే బ్యాంకులు వాణిజ్య రుణాలకు సంబంధించి అందిస్తున్న ప్రత్యేక పథకాలను పరిశీలించొచ్చు. సెంట్రల్ బ్యాంకు 'సెంట్ కల్యాణి', పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు 'ఉద్యోగిని' పథకం, దేనా బ్యాంకు అందించే 'దేనా శక్తి', పీఎన్‌బీ 'మహిళా ఉద్యమ్ నిధి' తదితర పథకాలు ఇందుకు సంబంధించినవే. సెంట్ కల్యాణి పథకం కింద సెంట్రల్ బ్యాంకు ప్రాసెసింగ్ ఫీజు మాఫీ చేస్తోంది. అలాగే, రూ.కోటి వరకు ఎటువంటి తనఖా లేకుండానే మంజూరు చేస్తోంది. పీఎన్‌బీ మహిళా ఉద్యమ్ పథకం కింద పదేళ్ల కాలంలో తిరిగి చెల్లించే వెసులుబాటు కల్పిస్తోంది. దేనా బ్యాంకు 0.25శాతం తక్కువ వడ్డీ రేటుకు రుణాలను అందిస్తోంది.

స్థిరాదాయం లేకుంటే ఇవి గుర్తుండాలి

ఖర్చులపై అదుపు; ముందే పొదుపు • తగినంత నిధి; ఆరోగ్యానికి బీమా

క్రమబద్ధంగా ఆదాయం వచ్చేటప్పుడు ప్రతి నెలా బడ్జెట్‌ను ప్లానింగ్ చేసుకోవడం కాస్త సులువుగానే ఉంటుంది. ఆదాయం ఎంత.. ఎంత ఖర్చు చేయొచ్చు.. ఎంత పొదుపు చేయొచ్చు లాంటి లెక్కలు వేసుకోగలం. అయితే, ఫ్రీలాన్స్ ప్రొఫెషనల్స్, స్వయం ఉపాధి పొందేవారి ఆదాయాలు క్రమబద్ధంగా కాకుండా.. అస్థిరంగానే ఉంటాయి. మరి వీరు ఆర్థిక సమస్యల్లో చిక్కుకోకుండా ఎలాంటి ప్రణాళిక కావాలి? దాన్నెలా అమలు చేయాలి? ఒకసారి చూద్దాం...

సాధారణంగా ఆదాయం కన్నా ఎక్కువ ఖర్చులు పెట్టడమనేది చాలా మందికి ఎదురయ్యే సమస్య. ఈ కోవలోకి రాకుండా ఉండాలంటే... ఖర్చు అలవాట్లను ఓ కంట కనిపెడుతుండాలి. వ్యయాలు ఆదాయాన్ని మించకుండా ఉండేలా చూసుకోవాలి. ఇలా ట్రాకింగ్ చేయడం కోసం ప్రస్తుతం చాలా మొబైల్ యాప్స్ ఉన్నాయి. వీటిని ఉపయోగించి స్థూలంగా మీ ఖర్చులు ఎంత ఉంటున్నాయన్నది ఓ అంచనాకు రావొచ్చు. ఇందుకోసం గడిచిన పన్నెండు నెలల్లో మీ ఖర్చుల తీరుతెన్నులను రాసిపెట్టుకోండి. సగటున ప్రతి నెలా ఎంత మేర ఖర్చులుంటున్నాయో లెక్కేయండి. రాబోయే రోజుల్లో ఖర్చుల ధోరణిని మెరుగుపర్చుకోవడానికి, ఆర్థిక అంశాలను ముందస్తుగా ప్లానింగ్ చేసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది.

తగినంత నగదు దగ్గర ఉంచుకోండి..

గత ఖర్చుల అలవాట్లను దృష్టిలో ఉంచుకుని తరచూ తలెత్తే వ్యయాలకు సరిపడేంత స్థాయిలో నగదు చేతిలో ఉండేలా చూసుకోవాలి (క్యాష్ రిజర్వ్). లేకపోతే, రుణాల వైపు చూడాల్సి వచ్చే ప్రమాదముంది. ఆదాయం మీ చేతికి రావడానికి 15- 30 రోజులు పట్టేలా ఉన్నప్పుడు.. ఆ సమయంలో గట్టెక్కడానికి వేర్వేరు బిల్లింగ్ తేదీలుండే క్రెడిట్ కార్డులను సమయోచితంగా ఉపయోగించుకోవచ్చు. అత్యవసర పరిస్థితుల కోసం కేటాయించే నిధిని, ఈ క్యాష్ రిజర్వ్‌ని వేర్వేరుగానే ఉంచాలి. ఆదాయం క్రమానుగతంగా లేనప్పుడు కూడా రోజువారీ ఖర్చులకు సర్దుబాటు చేసుకునేందుకు ఉపయోగపడేది క్యాష్ రిజర్వ్. ఆదాయం చేతికొచ్చేందుకు సాధారణం కన్నా మరింత ఎక్కువ సమయం పట్టేసే సందర్భాల్లో ఆదుకునేదే అత్యవసర నిధి.



అదిల్ శెట్టి, సీఈవో, బ్యాంక్ బజార్

అంతా ఒకే అకౌంటులో ఉండాలి..

మీ ఆదాయం అంతా కూడా ఒకే బ్యాంకు ఖాతాలో ఉండేలా చూసుకోవాలి. బాధ్యతారహితంగా చేసే ఖర్చులను నియంత్రించుకునేందుకు, విత్‌డ్రాయల్స్‌పై ఎప్పటికప్పుడు ఒక కన్నేసి ఉంచేందుకు ఇది ఉపయోగపడుతుంది. బ్యాంకు బ్యాలెన్స్ నిర్దిష్ట స్థాయి కన్నా కిందికి తగ్గకుండా మీ అంతట మీరే ఒక పరిమితిని నిర్దేశించుకోండి.

ముందు పొదుపు.. తర్వాతే ఖర్చులు

చేతిలో డబ్బు లేకుండా పోవడమనే సమస్య ఎదురు కాకుండా ఉండాలంటే బండగుర్తు ఒకటుంది. అదేంటంటే.. ముందుగా పొదుపు చేయాలి.. ఆ తర్వాతే ఖర్చులు చేయాలి. చాలా మంది తమ చేతిలోకి ఆదాయం రావడానికి ముందే దాన్ని క్రెడిట్ కార్డులు మొదలైన సాధనాలతో ఖర్చు చేసేస్తుంటారు. ఇలాంటి ధోరణులు తీవ్రమైన ఆర్థిక సమస్యలకు దారితీస్తాయి. రుణాలు తిరిగి చెల్లించలేని సంక్షోభ పరిస్థితి తలెత్తవచ్చు. అలా కాకుండా.. ముందు పొదుపునకు ప్రాధాన్యమిచ్చి మీ ఆర్థిక లక్ష్యానికి అనువైన సాధనంలో కొంత మొత్తాన్ని ఇన్వెస్ట్ చేయడం శ్రేయస్కరం. ఇది చేశాక మిగిలే మొత్తాన్నే ఖర్చుల కోసం ఉపయోగించడం అలవాటు చేసుకుంటే.. దీర్ఘకాలంలో తగినంత నిధిని పోగు చేసుకోగలుగుతారు.

బీమా రక్షణ ఉండాలి..

ఆరోగ్యపరమైన సమస్యలు, శారీరకపరమైన వైకల్యాల్లాంటివి ముందుగా చెప్పిరావు. వచ్చిన తర్వాత వీటిని చూసీ, చూడనట్లుగా వదిలేసే పరిస్థితి ఉండదు. అటూ, ఇటూగా ఆదాయం ఉండేటప్పుడు.. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనడం కష్టంగానే ఉంటుంది. అయితే, తగినంత బీమా రక్షణ ఉండేలా చూసుకోవడం ద్వారా వీటిని అధిగమించవచ్చు. ఇంటిపెద్దకి అనుకోనిది ఏదైనా జరిగితే కుటుంబానికి ఆర్థిక భరోసానిస్తుంది జీవిత బీమా పాలసీ. అలాగే, ఆరోగ్యపరమైన అత్యవసర పరిస్థితుల్లో మెడికల్ ఇన్సూరెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుంది. నగదురహిత ట్రీట్‌మెంట్ ఉండే హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని ఎంచుకుంటే.. చికిత్స కోసం తక్షణం డబ్బులు వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉండదు.

క్రమశిక్షణ కీలకం


ఆదాయం అస్థిరమైనదైనప్పుడు.. డబ్బుపరమైన సమస్యలు తలెత్తకుండా ఆర్థిక క్రమశిక్షణతో ఉండాలి. అనవసరమైన రుణాలకు దూరంగా ఉండాలి. ప్లానింగ్ లేకుండా ఖరీదైన ఉత్పత్తుల జోలికి వెళ్లొద్దు. ఆర్థిక లక్ష్యాలకు కట్టుబడి ఉండాలి. వ్యాపారం ఖర్చులు, వ్యక్తిగత ఖర్చులు వేర్వేరుగానే ఉంచాలి. దీంతో డబ్బు నిర్వహణ సులభతరంగా ఉంటుంది. కాబట్టి సరైన ప్రణాళిక వేసుకుని ఆర్థికంగా క్రమశిక్షణతో ఉంటే.. క్రమబద్ధమైన ఆదాయం ఉన్నవారిలాగానే హాయిగా జీవించొచ్చు.



ఎలాంటి రిస్క్ తీసుకోకపోవడమే అతిపెద్ద రిస్క్

- మార్క్ జుకర్‌బర్గ్, ఫేస్‌బుక్ సహ వ్యవస్థాపకుడు

పొదుపు-మదుపు



ఇప్పుడు... ఇదే బెటర్

టాటా ఈక్విటీ పీఈ

మార్కెట్లలో ఏడాదికి పైగా బలమైన ర్యాలీ తర్వాత ఇప్పుడు పెట్టుబడుల విషయంలో కాస్త జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. కాకపోతే ఈ సమయంలోనూ పెట్టుబడులకు అనువైన మ్యూచువల్ ఫండ్ పథకాలున్నాయి. అందులో టాటా ఈక్విటీ పీఈ ఫండ్ ఒకటని చెప్పొచ్చు. ఎందుకంటే ఇది డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్. స్టాక్స్‌ను ఎంచుకునే విషయంలో జాగ్రత్తగా, ఆచితూచి వ్యవహరిస్తుంది. సెన్సెక్స్‌తో పోలిస్తే తక్కువ విలువల వద్దే లభిస్తున్న షేర్లలో 70 శాతం నిధుల్ని ఈ పథకం ఇన్వెస్ట్ చేస్తుంది. దీంతో మార్కెట్లు అధిక విలువలకు చేరి కరెక్షన్ రిస్క్ ఉన్న తరుణంలో ఈ ఫండ్ పెట్టుబడుల తీరు ఒకింత రిస్క్ తగ్గించేదే అని చెప్పుకోవచ్చు.

ఇది మల్టీ క్యాప్ ఫండ్...

టాటా ఈక్విటీ పీఈ ఫండ్ అన్నది మల్టీక్యాప్ కిందకు వస్తుంది. మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్ ఎక్కువ లాభాలను ఇచ్చేందుకు అనువుగా ఉన్నాయనుకుంటే ఆ సమయంలో వాటికి 40–50 శాతం నిధులను కేటాయిస్తుంది. 2014 సమయంలో ఇదే చేసింది. 2015, 2016లో మార్కెట్లు అస్థిరతలకు గురైన సమయంలో మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో పెట్టుబడులను తగ్గించుకుంది. దీంతో ఈ పథకం ఫ్లెక్సీ క్యాప్ విధానంలో పనిచేస్తుందని చెప్పుకోవాల్సి ఉంటుంది. గడిచిన ఏడాదిగా మార్కెట్లు అంతకంతకూ పెరుగుతూ వెళుతుండడం, మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్ ధరలు అనూహ్యంగా పెరిగిపోతున్న దృష్ట్యా ఈ పథకం లార్జ్ క్యాప్ స్టాక్స్‌కు ప్రాధాన్యం పెంచింది. 2017 ప్రారంభంలో మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్ కోసం 31 శాతం కేటాయించగా... ఇపుడు ఆ కేటాయింపును 13 శాతానికి పరిమితం చేసింది. అలాగే, మార్కెట్లలో అనిశ్చితి పెరిగిందని సంకేతాలు కనిపిస్తే ముందు చూపుతో నగదు నిల్వలు పెంచుకోవడంతోపాటు, డెట్ విభాగానికి కూడా తగినంత కేటాయింపులు చేస్తుంది. ఏడాది, మూడేళ్లు, ఐదేళ్ల కాలంలో ఈ పథకం పనితీరును పరిశీలిస్తే బెంచ్ మార్క్ పనితీరు కంటే 10 శాతం ఎక్కువే రాబడులను ఇచ్చింది. ఇతర మల్టీక్యాప్ ఫండ్స్ అయిన ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వేల్యూ డిస్కవరీ, ఎస్‌బీఐ మ్యాగ్నమ్ మల్టీ క్యాప్, ఫ్రాంక్లిన్ ఫ్లెక్సీ క్యాప్ పథకాలకు మించి మెరుగైన పనితీరును టాటా ఈక్విటీ పీఈ ఫండ్ చూపించింది.

పోర్ట్‌ఫోలియోలో ఆటోకే ప్రాధాన్యం...

సాఫ్ట్‌వేర్ రంగం ఎదుర్కొంటున్న ప్రతికూలతలు, బలమైన రూపాయి నేపథ్యంలో ఈ రంగానికి కేటాయింపులను తగ్గించేసింది. డిసెంబర్ నాటి పోర్ట్‌ఫోలియోను గమనిస్తే ప్రధానంగా ఆటో, ఆటో యాన్సిలరీ విభాగానికి 18.4 శాతం నిధుల్ని కేటాయించింది. మారుతి సుజుకి, సియట్ విలువలు ఇటీవలి కాలంలో గణనీయంగా పెరగడంతో పెట్టుబడులను తగ్గించుకుంది. తక్కువ విలువల వద్ద లభిస్తున్న ఎంఅండ్ఎం, ఎక్సైడ్ ఇండస్ట్రీస్ షేర్లను పోర్ట్‌ఫోలియోలోకి చేర్చుకుంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగానికి చెందిన స్టాక్స్‌కు పెట్టుబడుల్లో అగ్ర ప్రాధాన్యం ఇచ్చింది. యెస్ బ్యాంకు, సిటీ యూనియన్ బ్యాంకు దీని పోర్ట్‌ఫోలియోలో ఉన్నాయి.

TATA EQUITY P/E FUND



డిసెంబర్ 31 నాటికి నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ రూ.2,492 కోట్లు

ఏ రంగానికి ఎంత మేర (శాతంలో)

ఆటోమొబైల్స్	12.3
బ్యాంకులు	10.9
ఫైనాన్స్	10.6
ఆటో యాన్సిలరీ	6.1
కన్‌స్ట్రక్షన్	5.9
పెట్రోలియం ప్రొడక్ట్స్	5.9
ఇతర రంగాలు	48.3

రాబడుల తీరు (శాతంలో)

కాలం	సెన్సెక్స్	టాటా ఈక్విటీ పీఈ
ఏడాది	27.5	38.7
మూడేళ్లు	6.8	17.1
ఐదేళ్లు	11.4	22.5

● యాప్‌కీ కహానీ...

ఐపీఓ గైడ్



రానున్న ఐపీఓలు, ఎస్ఎంఈ ఐపీఓలు, ఎన్‌సీడీలు, బాండ్లకు సంబంధించిన తాజా సమాచారాన్ని తెలుసుకునేందుకు 'ఐపీఓ గైడ్' యాప్ మార్కెట్‌లో అందుబాటులో ఉంది. దీన్ని గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్రత్యేకతలు

- రన్నింగ్/అప్‌కమింగ్ ఐపీఓల సమాచారం తెలుసుకోవచ్చు.
- రానున్న ఎస్ఎంఈ ఐపీఓలు, ఎన్‌సీడీలు, బాండ్లకు సంబంధించిన పూర్తి వివరాలు చూడొచ్చు.
- స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ఇన్వెస్ట్‌మెంట్లకు సంబంధించిన స్టాక్ టిప్స్ పొందొచ్చు.
- ఐపీఓలో పాల్గొన్నవారు అలాట్‌మెంట్ స్టేటస్‌ను తెలుసుకోవచ్చు. అలాగే రానున్న ఐపీఓలకు దరఖాస్తు చేసుకోవాలని భావిస్తున్నవారు బేసిక్ వివరాలు అందిస్తే సంస్థ ఎగ్జిక్యూటివ్స్ ఐపీఓ/ఎన్‌సీడీ/బాండ్ల దరఖాస్తుకు సహాయపడతారు.
- యాప్‌లో ఐపీఓ/ఎన్‌సీడీ/ ఎస్ఎంఈ ఐపీఓ/ బాండ్లకు సంబంధించిన ఐపీఓ తేదీ, ప్రైస్ బ్యాండ్, లిస్టింగ్ తేదీ, సబ్‌స్క్రిప్షన్ వివరాలు, కంపెనీ సమాచారం వంటి వివరాలు అందుబాటులో ఉన్నాయి.
- ఐపీఓల పనితీరు ఎలా ఉందో గమనించొచ్చు.
- ఐపీఓ ఎప్పుడు ప్రారంభమౌతుంది.. ఎప్పుడు ముగుస్తుంది.. ఎప్పుడు లిస్టవుతుంది.. వంటి విషయాలను అలర్ట్స్ రూపంలో పొందొచ్చు.
- ఐపీఓ క్యాలెండర్ కూడా అందుబాటులో ఉంది.

గమనిక: కేవలం ఈ యాప్ ఆధారంగా మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేయడం ఉత్తమం కాదు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే ముందు ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్‌ను సంప్రదించండి.

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, జనవరి 9 నాటికి (అంకెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు- ఏడాది	1–2 ఏళ్లు	5 ఏళ్లు, ఆపైన
ఆంధ్రా బ్యాంక్	6.25	6.50	6.25
యాక్సిస్ బ్యాంక్	6.25-6.5	6.25- 6.75	6.25
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.25	6.45- 6.55	6.25-6.5
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.60	6.25
కెనరా బ్యాంక్	6.35	6.3- 6.5	6.00
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.50	6.60	6.50
కార్పొరేషన్ బ్యాంక్	6-6.25	6.5-6.6	6.50
డీసీబీ బ్యాంక్	6.65	6.85- 7	7- 7.1
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.75-6.25	6.25 - 6.75	6.00
ఐసీఐసీఐ బ్యాంక్	6 - 6.50	6.6- 6.75	6.50
ఐడీబీఐ బ్యాంక్	6 - 6.5	6.5-6.75	6.00
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	5.75 - 6.25	6.50 - 6.75	6.00
ఇండస్‌ఇండ్ బ్యాంక్	6.25 - 6.5	6.75 - 6.85	6.50
కోటక్ మహీంద్రా బ్యాంక్	6.6- 6.7	6.7-6.85	6.25
ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.2-6.4	6.60	6.40
ఎస్‌బీఐ	6.25	6.25	6.00
సిండికేట్ బ్యాంక్	6.15	6.50	6.50

బ్యాంక్ బజార్. కామ్ అందించిన వివరాల ఆధారంగా...

ఐదు వారాల పరుగుకు విరామం!

- అయినా... పసిడి బులిష్ ధోరణే: నిపుణులు
- డాలర్ బలహీనత కలిసి వస్తుందని విశ్లేషణలు

అంతర్జాతీయ న్యూయార్క్ మర్కెంటైల్ ఎక్స్ఛేంజ్– నైమెక్స్‌లో పసిడి ఐదు వారాల పరుగుకు 19వ తేదీ శుక్రవారంతో ముగిసిన వారంలో కాస్త బ్రేక్ పడింది. ఔన్స్ (31.1గ్రా) ధర వారంలో దాదాపు నాలుగు డాలర్లు తగ్గి 1,331 డాలర్ల వద్ద ముగిసింది. అయితే వారంలో పసిడి 1,346 డాలర్ల గరిష్ట స్థాయిని తాకి అటు తర్వాత 1,326 డాలర్లకు కూడా పడింది. ఇకపై పసిడి దారి ఎటువైపు అన్న ప్రశ్నకు పలువురు విశ్లేషకుల నుంచి 'బులిష్' అనే మాటే వినిపిస్తోంది. డాలర్ ఇండెక్స్ బలహీన ధోరణిని వారు ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు.

డాలర్... మూడేళ్ల కనిష్టం

గత వారం ఒక దశలో 89.96 స్థాయిని (మూడేళ్ల కనిష్ట స్థాయి) కూడా చూసిన డాలర్ ఇండెక్స్ శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి 90.49 వద్దకు చేరింది. 52 వారాల గరిష్టం చూస్తే... 102 డాలర్ల పైన ఉన్న డాలర్ ఇండెక్స్ ఒడిదుడుకులతో ఏడాదిగా క్రమంగా పతనం అవుతూ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ ధోరణి కొనసాగితే, పసిడి బులిష్ ధోరణి కొనసాగుతుందన్నది నిపుణుల వాదన. అమెరికాలో రాజకీయ, బడ్జెట్ సంబంధ అనిశ్చితి కొనసాగితే, డాలర్ మరింత పతనం ఖాయమన్న వాదన వినిపిస్తోంది. కాబట్టి పసిడి ధర మున్ముందు పైకి కదిలే అవకాశాలే ఉన్నాయని శాక్సో బ్యాంక్‌లో కమోడిటీ వ్యూహ విభాగం చీఫ్‌గా వ్యవహరిస్తున్న ఓలీ హ్యాన్సన్ పేర్కొన్నారు. అయితే సోమవారం నుంచి ప్రారంభమయ్యే మార్కెట్‌లో కొంత లాభాల స్వీకరణకు అవకాశం ఉందని కూడా కొన్ని వర్గాలు భావిస్తున్నాయి.

దేశంలో ధరలు ఇలా...

ఇక దేశీయంగా ఎంసీఎక్స్‌లో పసిడి ఫ్యూచర్స్ ధర శుక్రవారంతో ముగిసిన వారంలో 10 గ్రాములకు స్వల్ప నష్టంతో రూ. 29,773 వద్ద ముగిసింది. ప్రధాన ముంబై స్పాట్ మార్కెట్‌లో పసిడి 99.9 స్వచ్ఛత, 99.5 స్వచ్ఛత ధరలు 10 గ్రాములకు వరుసగా రూ.30,175, రూ.30,025 వద్ద ముగిశాయి. వెండి కేజీ ధర రూ. 38,885కు చేరింది. కాగా వారంలో రూపాయి విలువ 64.84 వద్ద ముగిసింది.



మ్యూచువల్ ఫండ్ ఖాతాలు రయ్‌రయ్

గతేడాది 1.4 కోట్ల కొత్త ఫోలియోలు జత...



న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లు దూసుకెళ్తుండటంతో ఇన్వెస్టర్లు కూడా పెట్టుబడులకు సై అంటున్నారు. ప్రధానంగా రిటైల్ ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్స్(ఎంఎఫ్) వైపు దృష్టిసారిస్తుండటంతో ఫండ్స్ ఖాతాల(ఫోలియోలు) సంఖ్య గతేడాది ఆల్‌టైమ్ గరిష్టానికి చేరింది. 2017లో కొత్తగా 1.37 కోట్ల ఫోలియోలు జతైనట్లు మార్కెట్ నియంత్రణ సంస్థ తాజా గణాంకాల్లో వెల్లడైంది. దీంతో మొత్తం ఫోలియోలు 6.65 కోట్లకు ఎగబాకాయి. 2016లో కొత్తగా జతైన ఫండ్ ఫోలియోలు 70 లక్షలు మాత్రమే. దీంతో పోలిస్తే.. గతేడాది రెట్టింపు స్థాయిలో కొత్త ఖాతాలు వచ్చిచేరడం గమనార్హం. 'ముఖ్యంగా ఈక్విటీ, బ్యాలెన్స్‌డ్ పథకాలపై ఇన్వెస్టర్ల మొగ్గు కారణంగా ఫోలియోల సంఖ్య భారీగా పెరిగేందుకు దోహదం చేసింది. అదే విధంగా ఫండ్ పథకాలపై ఎంఎఫ్ సంస్థలు, నియంత్రణ సంస్థలు ఇన్వెస్టర్లలో అవగాహన పెంచే చర్యలను కొనసాగిస్తుండటం కూడా ఈ పరిశ్రమలో వృద్ధికి చేయూతనందిస్తోంది' అని కోటక్ మ్యూచువల్ ఫండ్ సీఐఓ(ఈక్విటీ) హర్ష ఉపాధ్యాయ పేర్కొన్నారు. కాగా, గతేడాది ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సేవింగ్స్ స్కీమ్స్(ఈఎల్ఎస్ఎస్), బ్యాలెన్స్‌డ్ విభాగాల్లో ఫోలియోల ఆధారిత రిటైల్ ఇన్వెస్టర్ల ఖాతాలు 1.24 కోట్లు జతయ్యాయి. దీంతో మొత్తం రిటైల్ ఖాతాలు 2017లో 5.46 కోట్లకు చేరాయి. దేశ జనాభా ప్రకారం చూస్తే.. ఇంకా ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టే ఇన్వెస్టర్లు మరింతగా పెరగాల్సిన అవసరం ఉందని... ఈ నేపథ్యంలో ఫండ్స్ పరిశ్రమ దీర్ఘకాలిక వృద్ధికి ఢోకా లేదని ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రెసిడెంట్ సంజయ్ సప్రే వ్యాఖ్యానించారు. కాగా, గతేడాది రికార్డు స్థాయిలో మ్యూచువల్ ఫండ్‌స్కీమ్స్‌లోకి పెట్టుబడులు రూ.2 లక్షల కోట్లకుపైగానే నమోదు కావడం గమనార్హం.

స్టాక్స్ వ్యూ

ఫెడరల్ బ్యాంక్ — కొనొచ్చు



బ్రోకరేజ్ సంస్థ: ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్
ప్రస్తుత ధర: రూ.103
టార్గెట్ ధర: రూ.152

ఎందుకంటే: ఈ మిడ్‌సైజ్ ప్రైవేట్ రంగ బ్యాంక్ కేరళ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాలు, ఢిల్లీ, ఎన్‌సీఆర్‌లతో పాటు 4 కేంద్ర పాలిత రాష్ట్రాల్లో సేవలందిస్తోంది. ఐడీబీఐతో కలిసి జాయింట్‌వెంచర్‌గా బీమా, ఎన్‌బీఎఫ్‌సీ వ్యాపారాలను కూడా నిర్వహిస్తోంది. 1,252 బ్రాంచ్‌లు, 1,679 ఏటీఎమ్‌లతో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలకు అనుగుణంగానే ఉన్నాయి. ఎస్ఎంఈ, రిటైల్ రుణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. బ్యాంక్ రుణాల్లో ఎస్ఎంఈ రుణాలు 22 శాతంగా, రిటైల్ రుణాలు 38 శాతంగా ఉన్నాయి. ఈ క్యూ3లో రుణాలు 22 శాతం వృద్ధి చెందాయి. నికర వడ్డీ ఆదాయం 20 శాతం పెరిగింది. నికర వడ్డీ మార్జిన్(ఎన్ఐఎమ్) 3.3 శాతంగా ఉంది. నిర్వహణ లాభం 35 శాతానికి ఎగసింది. ఈ జోరు కొనసాగుతుందని బ్యాంక్ అంచనా వేస్తోంది. 18 నెలల కాలంలో 50 కొత్త బ్రాంచ్‌లను ఏర్పాటు చేయాలనుకుంటోంది. టైర్–1 మూలధనం 13.8 శాతంగా ఉండడం, స్థూల నికరర్థ రుణాలు, రీస్ట్రక్చరింగ్, తదితర రుణాలన్నీ 5 శాతంలోపే ఉండటం, డిజిటల్ బ్యాంకింగ్ జోరు పెంచుకోవడానికి తీసుకున్న చర్యల ఫలాలు భవిష్యత్తులో అందనుండటం, సానుకూల అంశాలు. 2019–20 కల్లా రిటర్న్ ఆన్ అసెట్(ఆర్ఓఏ) 1 శాతంగానూ, ఆర్ఓఈ(రిటర్న్ ఆన్ ఈక్విటీ) 12.3 శాతానికి పెరుగుతాయని అంచనా వేస్తున్నాం. రెండేళ్లలో ఆదాయం 27 శాతం, ఆర్ఈఓ 12 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందుతాయని భావిస్తున్నాం. ఈ బ్యాంక్ డిపాజిట్లు అధికంగా ప్రవాస భారతీయుల నుంచే వస్తున్నాయి. బ్యాంక్ మొత్తం డిపాజిట్లలో ఎన్నారైల వాటా 48 శాతంగా ఉంది.

హిందుస్తాన్ యూనిలీవర్ — కొనొచ్చు




బ్రోకరేజ్ సంస్థ: రిలయన్స్ సెక్యూరిటీస్
ప్రస్తుత ధర: రూ.1,363
టార్గెట్ ధర: రూ.1,514

ఎందుకంటే: ఈ ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలను మించాయి. గత క్యూ3లో పెద్ద కరెన్సీ నోట్ల రద్దు కారణంగా అమ్మకాలు తక్కువగా ఉండడం వల్ల వృద్ధి కాస్త మందగించింది. ఈ లో–బేస్ ఎఫెక్ట్‌కు పెరుగుతున్న వృద్ధి జోరు జత కావడంతో ఈ క్యూ3లో మంచి ఫలితాలను ఈ కంపెనీ సాధించింది. నికర అమ్మకాలు రూ.8,320 కోట్లకు, ఇబిటా 24% వృద్ధితో రూ.1,680 కోట్లకు పెరిగాయి. అనుబంధ కంపెనీ నుంచి వచ్చిన డివిడెండ్ కారణంగా ఇతర ఆదాయం రూ.150 కోట్లు పెరిగి, నికర లాభం 83% ఎగసింది. హోమ్‌కేర్ సెగ్మెంట్ 20 శాతం, పర్సనల్ కేర్ సెగ్మెంట్ 17% చొప్పున వృద్ధి చెందాయి. పెద్ద కరెన్సీ నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు కారణంగా ఏర్పడిన అస్తవ్యస్త పరిస్థితులు ఇప్పుడిప్పుడే తొలగిపోయి డిమాండ్ పుంజుకుంటుండటంతో పరిస్థితులు మెరుగుపడుతున్నాయని కంపెనీ భావిస్తోంది. ఉత్పత్తి వ్యయాలు తక్కువగా ఉండటంతో స్థూల మార్జిన్‌లు 3 శాతం పెరిగి 53.1 శాతానికి చేరాయి. జీఎస్‌టీ సంబంధిత సమస్యలు సమసిపోతుండటంతో రానున్న క్వార్టర్లలో వృద్ధి జోరుగా పెరగగలదని భావిస్తున్నాం. కంపెనీ ఆదాయంలో దాదాపు 40% వరకూ గ్రామీణ ప్రాంతాల నుంచే వస్తోంది. గత రెండేళ్లుగా వర్షాలు విస్తారంగా కురియడం, కీలక పంటల మద్దతు ధరలు పెరగడం, విస్తృతమైన డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ కారణంగా గ్రామీణ మార్కెట్ల నుంచి డిమాండ్ బాగా వృద్ధి చెందగలదని భావిస్తున్నాం. ఆయుర్వేద విభాగంలో మరింతగా విస్తరిస్తోంది. ప్రీమియమ్ ఉత్పత్తుల జోరు పెంచుతోంది. ఫలితంగా రెండేళ్లలో ఆదాయం 12%, నికర లాభం 18% చొప్పున చక్రగతిన వృద్ధి చెందనున్నాయని అంచనా వేస్తున్నాం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజి సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

గతవారం బిజినెస్

ఎగుమతులు రయ్.. రయ్..



ఇంజినీరింగ్, పెట్రోలియం ఉత్పత్తుల ఊతంతో డిసెంబర్‌లో ఎగుమతులు 12.36% మేర వృద్ధి చెందాయి. విలువపరంగా 27.03 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అయితే, ముడిచమురు, పసిడి దిగుమతులు భారీగా పెరగడంతో ఇంపోర్ట్ బిల్లు సైతం 21.12% ఎగసి 41.91 బిలియన్ డాలర్లకు పెరిగింది. దీంతో వాణిజ్య లోటు మూడేళ్ల గరిష్ట స్థాయికి చేరింది.

విమానాల్లోనూ మొబైల్, ఇంటర్నెట్!

దేశీ విమాన ప్రయాణికులకిది శుభవార్తే. టెలికం రెగ్యులేటర్ ట్రాయ్... ఇన్–ఫ్లైట్ కనెక్టివిటీపై తన ప్రతిపాదనలను నివేదిక రూపంలో విడుదల చేసింది. ఇందులో శాటిలైట్, టెరిస్ట్రియల్ నెట్‌వర్క్ ద్వారా దేశీ విమాన ప్రయాణంలో మొబైల్ కనెక్టివిటీ, ఇంటర్నెట్ సేవల్ని అనుమతించాలని సిఫార్సు చేసింది.

846 టన్నుల బంగారం దిగుమతి

బంగారం దిగుమతులు గతేడాది భారీ ఎత్తున పెరిగాయి. ఏకంగా 846 టన్నుల పసిడి దేశంలోకి దిగుమతి అయింది. అంతర్జాతీయంగా ధరలు తక్కువ స్థాయిలో ఉండడంతో పాటు దేశీయంగా డిమాండ్ పెరగడమే దిగుమతులు అధికం కావడానికి కారణాలుగా ఎంఎంటీసీ– పీఏఎంపీ ఇండియా పేర్కొంది. 2016లో దిగుమతి అయిన బంగారం 550 టన్నులతో పోలిస్తే గతేడాది దిగుమతులు 53 శాతం పెరిగినట్లు తెలుస్తోంది.


భారత మార్కెట్లోకి థాయ్ రిటైల్ సంస్థ

థాయ్‌లాండ్‌కి చెందిన రిటైలింగ్ సంస్థ సియామ్ మాక్రో పీసీఎల్... భారత హోల్‌సేల్ మార్కెట్‌లోకి అడుగుపెట్టింది. వచ్చే ఐదేళ్లలో భారత క్యాష్ అండ్ క్యారీ విభాగంలో రూ.1,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు సంస్థ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సిరిపోర్న్ డెక్‌సింఘా తెలిపారు. లాట్స్ హోల్‌సేల్ సొల్యూషన్స్ పేరిట ఈ స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారామె.

పది రూపాయల నాణేలన్నీ చెల్లుతాయి

పది రూపాయల నాణేలకు సంబంధించి చెలామణిలో ఉన్న మొత్తం 14 డిజైన్లూ చెల్లుబాటవుతాయని రిజర్వ్ బ్యాంక్ స్పష్టం చేసింది. ఇవన్నీ చట్టబద్ధమైనవేనని పేర్కొంది. వ్యాపార వర్గాలు పది రూపాయల నాణేలను తీసుకోవడానికి నిరాకరిస్తున్న నేపథ్యంలో ఆర్‌బీఐ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రత్యక్ష పన్ను వసూళ్ల జోరు



ప్రత్యక్ష పన్ను వసూళ్లు అంచనాలు మించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి తొమ్మిదిన్నర నెలల కాలంలో (ఏప్రిల్ నుంచి జనవరి 15 వరకు) పన్ను వసూళ్లు 18.7 శాతం పెరిగి ఏకంగా రూ. 6.89 లక్షల కోట్లకు చేరాయి. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.9.8 లక్షల కోట్ల మేర ప్రత్యక్ష పన్ను వసూళ్లను ఆదాయపన్ను శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

3 నెలల కనిష్టానికి టోకు ద్రవ్యోల్బణం

ఆహార పదార్థాల రేట్లు తగ్గటంతో డిసెంబర్‌లో టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం కొంత తగ్గింది. గత నెల టోకు ధరల ఆధారిత సూచీ (డబ్ల్యూపీఐ) ప్రకారం ద్రవ్యోల్బణం 3.58 శాతంగా నమోదైంది. ఇది మూడు నెలల కనిష్టం. గత నవంబర్‌లో ఇది 3.93 శాతం.

మరో 1.20 లక్షల కంపెనీల రద్దు!

నల్లధనంపై పోరులో భాగంగా మరో 1.20 లక్షల కంపెనీల రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇప్పటికే 2.26 లక్షల కంపెనీల గుర్తింపును రద్దు చేయడంతోపాటు వీటితో అనుబంధం కలిగిన 3.09 లక్షల మంది డైరెక్టర్లను అనర్హులుగా ప్రకటించింది.

2017-18 క్యూ3 ఆర్థిక ఫలితాలు

కంపెనీ	నికర లాభం (కోట్లలో)			మొత్తం ఆదాయం (కోట్లలో)		
	2017–18	2016–17	వృ/క్షీ(%)	2017–18	2016–17	వృ/క్షీ(%)
ఫెడరల్ బ్యాంక్	260	206	26	2,730	2,557	7
ఐసీఐసీఐ లాంబార్డ్	232	220	5	2,020	1,843	10
భారతీ ఇన్‌ఫ్రాటెల్	585	620	-6	3,655	--	7
మైండ్‌ట్రీ	141	103	37	1,377	1,295	6
జీ ఎంటర్‌టైన్‌మెంట్	322	--	28	1,886	--	11
సైయంట్	108	94	15	983	--	7
యస్ బ్యాంక్	1,077	883	22	6,493	5,230	24
అదానీ ఎంటర్‌ప్రైజెస్	351	340	3	9,938	8,606	15
హిందుస్తాన్ జింక్	2,230	2,320	-4	6,220	5,975	4
ఎయిర్‌టెల్	306	504	-39	20,319	23,336	-13
అదానీ పోర్ట్స్	1,001	838	20	2,689	2,209	22
జుబిలంట్ ఫుడ్‌వర్క్స్	66	20	--	799	662	21
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	4,643	--	20	--	--	--
ఐడీఎఫ్‌సీ బ్యాంక్	146	191	-24	2,514	2,585	-3
ఆర్ఐఎల్	9,423	7,533	25	1,09,905	84,189	30
ఐటీసీ	3,090	2,647	17	10,579	14,258	-26
విప్రో	1,931	2,110	-8	13,669	13,688	--
హెచ్‌సీఎల్ టెక్	2,194	2,070	6	12,808	11,814	8

ఆటోమొబైల్స్



- జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇండియా తన రేంజ్ రోవర్ ఎవోక్ ల్యాండ్‌మార్క్ 2018 ఎడిషన్ ప్రత్యేక మోడల్‌ను ఆవిష్కరించింది. దీని ధర రూ.50.20 లక్షలు (ఎక్స్‌షోరూమ్).
- టెక్ దిగ్గజం శాంసంగ్.. గెలాక్సీ ఆన్7 ప్రైమ్ స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధర రూ.12,990.
- లగ్జరీ కార్ల తయారీ దిగ్గజం ఆడి తన ప్రీమియం ఎస్‌యూవీ క్యూ5లో కొత్త వెర్షన్‌ను భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. దీని ధర రూ.57.6 లక్షలు (ఎక్స్‌షోరూమ్ ఢిల్లీ).
- జర్మనీకి చెందిన ప్రముఖ వాహన తయారీ కంపెనీ 'మెర్సిడెస్ బెంజ్' తాజాగా బీఎస్–6 నిబంధనలకు అనువుగా ఉన్న 'ఎస్ క్లాస్' కారును భారత మార్కెట్లో ఆవిష్కరించింది.

డీల్స్..




- టెలికం రంగంలోని భారతీ ఎయిర్‌టెల్‌లో మెరిల్‌లించ్ తనకున్న వాటాల్లో సింహ భాగాన్ని విక్రయించేసింది. ఎయిర్‌టెల్‌లో మెరిల్ లించ్‌కు డిసెంబర్ త్రైమాసికం ముగిసే నాటికి 5.09 కోట్ల షేర్లుండగా, వీటిలో 3.87 కోట్ల షేర్లను సగటున ఒక్కో షేరును రూ.499.1 చొప్పున విక్రయించింది. ఇది 0.97 శాతం వాటాకు సమానం. ఈ షేర్లను ఎస్ఆర్ఎస్ పార్ట్‌నర్స్ (కేమాన్) ఎల్ఎల్‌సీ కొనుగోలు చేసింది. ఈ లావాదేవీ విలువ రూ.1,931.23 కోట్లు.
- మొబైల్ వాలెట్ కంపెనీ మొబిక్విక్‌లో 12.60 శాతం వాటాలు కొనుగోలు చేయనున్నట్లు బజాజ్ ఫైనాన్స్ వెల్లడించింది. నిజానికి రూ. 225 కోట్లతో 10.83 శాతం వాటా కొనుగోలు చేసేందుకు గతేడాది ఆగస్టులో ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ.. తాజాగా వాటా పరిమాణం కొంత పెరిగిందని, కన్వర్టబుల్ ప్రిఫరెన్స్ షేర్ల కన్వర్షన్ ధర మారటమే ఇందుకు కారణమని బజాజ్ ఫైనాన్స్ తెలియజేసింది. ఇందు కోసం గతంలో అంగీకరించిన మొత్తమే తప్ప .. కొత్తగా మరింత పెట్టుబడేమీ పెట్టలేదని కంపెనీ తెలిపింది.
- ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మరో భారీ డీల్‌ను చేజిక్కించుకుంది. యూకే, యూరోప్‌ల్లో సేవింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్స్ వ్యాపారాన్ని నిర్వహించే ప్రుడెన్షియల్ పీఎల్‌సీకి చెందిన ఎమ్ అండ్ జీ ప్రుడెన్షియల్ నుంచి డీల్‌ను సాధించామని టీసీఎస్ తెలిపింది. ఈ డీల్ విలువ సుమారుగా రూ.4,400 కోట్లు.

Dwaraka



బొమ్మ-బొరుసు

> నువ్వు విజయం సాధించాలని భావిస్తే..
> అందరూ నడిచే దారిలో కాకుండా కొత్త దారిలో ప్రయాణించు
> – జాన్ డి రాక్‌ఫెల్లర్, అమెరికా వ్యాపారవేత్త



బడ్జెట్లో 'ఐటీ' ఊరట!

ఆదాయ పన్ను రేట్లు, శ్లాబుల్లో మార్పులు

పన్ను మినహాయింపు పరిమితి పెంపునకు అవకాశం

డివిడెండ్‌పై పన్నులో మార్పులు చేయకపోవచ్చు

2018 బడ్జెట్‌పై ఎర్నెస్ట్ అండ్ యంగ్ సర్వేలో అంచనాలు



న్యూఢిల్లీ: రానున్న బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం ఆదాయపు పన్ను(ఐటీ) భారం నుంచి ప్రజలకు ఊరటక లిగించే అవకాశం ఉందా? కార్పొరేట్లు, నిపుణులు ఈ దిశగా చర్యలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఆదాయపన్ను రేట్లు, శ్లాబుల్లో మార్పులు చేయవచ్చని ఎర్నెస్ట్ అండ్ యంగ్ (ఈవై) అనే కన్సల్టెన్సీ సంస్థ నిర్వహించిన సర్వేలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. డివిడెండ్లపై ప్రస్తుత పన్నులో ఎటువంటి మార్పులు చేయకపోవచ్చని ఈ సర్వే పేర్కొంది.ప్రజల వినియోగాన్ని మరింత పెంచేందుకు వీలుగా పన్ను మినహాయింపు పరిమితిని మరింత పెంచే అవకాశం ఉందని బడ్జెట్‌కు ముందు ఈవై నిర్వహించిన ఈ సర్వేలో 69 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఈ నెలలోనే జరిగిన ఈ సర్వేలో 150 మంది కంపెనీల సీఎఫ్‌వోలు, పన్ను అధికారులు, ఆర్థిక శాఖ సీనియర్ నిపుణులు పాల్గొన్నారు. ఉద్యోగులపై పన్ను భారం తగ్గించేందుకు కాలం చెల్లిపోయిన మినహాయింపుల స్థానంలో ప్రామాణిక తగ్గింపును ప్రవేశపెట్టే అవకాశం ఉందని 59 శాతం మంది చెప్పారు. కార్పొరేట్ పన్నును ఆర్థిక మంత్రి 25 శాతానికి తగ్గించొచ్చని, సర్‌చార్జ్‌ను కొనసాగించొచ్చని 48 శాతం మంది చెప్పారు. డివిడెండ్ పంపిణీపై ప్రస్తుతమున్న పన్నులో మార్పు చేస్తారని ఆశించడం లేదంటూ 65 శాతం మంది చెప్పడం గమనార్హం. కార్పొరేట్ రంగంపై భారం తగ్గించేందుకు గాను పన్ను రేటును 10 శాతం తగ్గించాలని 24 శాతం మంది అభిప్రాయపడ్డారు. ''పన్ను విధానాల్లో స్థిరత్వం, క్రమబద్ధత, మోస్తరు పన్నులు ఉండాలన్న దానిపై భారత పారిశ్రామిక రంగంలో ఏకాభిప్రాయం ఉందని '2018 బడ్జెట్ ముందస్తు సర్వే' తెలియజేస్తోంది. ప్రత్యక్ష పన్ను వసూళ్లలో భారీ మార్పుల పట్ల తక్కువ అంచనాలే ఉన్నాయి'' అని ఈవై ఇండియా నేషనల్ ట్యాక్స్ లీడర్ సుధీర్ కపాడియా పేర్కొన్నారు. ఫిబ్రవరి 1న మోదీ సర్కారు తన చిట్టచివరి పూర్తిస్థాయి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది.

సెజ్‌లకు పన్ను రాయితీలు కొనసాగాలి...

ప్రత్యేక ఆర్థిక మండళ్లలోని యూనిట్లకు ప్రస్తుతమున్న పన్ను రాయితీలను కొనసాగించాలని వాణిజ్య శాఖ డిమాండ్ చేస్తోంది. ఎగుమతులు, ఉద్యోగాల కల్పనకు ఇది అవసరమని అభిప్రాయపడింది. ఈ మేరకు వాణిజ్య శాఖ ఓ లేఖను కేంద్ర ఆర్థిక శాఖకు రాసింది. సెజ్‌లపై ఉన్న కనీస ప్రత్యామ్నాయ పన్నును సైతం తొలగించాలని కోరడం గమనార్హం. నూతన సెజ్ యూనిట్లు 2020 మార్చి 31లోపు ప్రారంభమయ్యే వాటికే ఆదాయపన్ను ప్రయోజనాలు లభిస్తాయని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ 2016–17 బడ్జెట్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నిబంధన సెజ్‌ల అబివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపెడుతుందని, దీన్ని రద్దు చేయాలన్నది వాణిజ్య శాఖ డిమాండ్. లేకుంటే పెట్టుబడులపై ప్రభావం పడుతుందని లేఖలో వివరించింది. ప్రస్తుతం సెజ్‌ల నుంచి ఎగుమతులపై మొదటి ఐదేళ్లలో పూర్తిగా ఆదాయపన్ను మినహాయింపు ఉంది. ఆ తర్వాత ఐదేళ్ల పాటు 50 శాతం పన్ను రాయితీ పొందొచ్చు.

ద్రవ్యలోటుకు చెక్ పెట్టాలి

ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరుకునే విషయంలో మరింత పటిష్ట చర్యల్ని కేంద్ర ఆర్థిక బడ్జెట్‌లో భాగంగా ప్రకటించాలని ప్రముఖ ఆర్థిక నిపుణుడు టీఎన్ శ్రీనివాసన్ సూచించారు. యేల్ యూనివర్సిటీలో గౌరవ ఎకనమిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసన్ మాట్లాడుతూ... ఉద్యోగాల క్షీణతకు డీమోనిటైజేషన్, జీఎస్‌టీతో ముడిపెట్టడంలో అర్థరహితమని చెప్పారు. ''ద్రవ్యలోటును ఆర్థిక మంత్రి తనకు సాధ్యమైనంత వరకు కళ్లెం వేయాలి. అలాగే, ప్రాజెక్టులు సకాలంలో, సమర్థవంతంగా నిర్వహించేందుకు కూడా చర్యలు అవసరం'' అని శ్రీనివాసన్ సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2017–18)లో ద్రవ్యలోటును జీడీపీలో 3.2 శాతానికి పరిమితం చేయాలన్నది కేంద్ర సర్కారు విధించుకున్న లక్ష్యం.

ఎలక్ట్రిక్ వాహనాలకు ఇస్రో టెక్నాలజీ!

లిథియం అయాన్ బ్యాటరీలపై కమిటీ సూచన



న్యూఢిల్లీ: దేశంలో ఎలక్ట్రికల్ వాహనాలను పరుగులు పెట్టించేందుకు వీలుగా ఓ కీలకమైన సూచనను ఆర్థిక శాఖ కార్యదర్శి పి.కె.సిన్హా నేతృత్వంలోని కమిటీ కేంద్రం ముందుంచింది. భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) రూపొందించిన లిథియం అయాన్ బ్యాటరీల టెక్నాలజీని వాణిజ్య అవసరాలకు వినియోగించేందుకు అనుమతించాలన్నదే ఆ సూచన. అలాగే, వాహనాల బ్యాటరీల చార్జింగ్ సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు వీలుగా కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్‌తో కలసి విద్యుత్ శాఖ విద్యుత్ చార్జీలను, అనుసంధాన విధానాలను నిర్ణయించాలని ఈ కమిటీ సిఫారసు చేసింది. ''తగిన అమమతుల అనంతరం ఇస్రో లిథియం అయాన్ బ్యాటరీ టెక్నాలజీని 'మేకిన్ ఇండియా' కార్యక్రమం కింద వివక్షకు తావులేని వాణిజ్య అవసరాలకు అనుమతించే అంశాన్ని పరిశీలించాలి'' అని ఈ కమిటీ సూచించింది. ప్రస్తుతం దేశంలో వాణిజ్య ప్రాతిపదికన లిథియం అయాన్ బ్యాటరీలు తయారవడం లేదు. వీటిని జపాన్, చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దేశ చమురు అవసరాలకు ప్రస్తుతం ఏటా రూ.7 లక్షల కోట్లను వెచ్చించాల్సి వస్తుండడంతో, ఎలక్ట్రికల్ వాహనాల వినియోగాన్ని పెంచడం ద్వారా కాలుష్యానికి చెక్ పెట్టడంతోపాటు, దిగుమతుల బిల్లును తగ్గించుకోవచ్చని కేంద్రం భావిస్తున్న విషయం తెలిసిందే.

టీసీఎస్ నియామకాల్లో 20% విదేశాల్లోనే..



న్యూఢిల్లీ: దేశ ఐటీ దిగ్గజం టీసీఎస్ గడిచిన 12 నెలల కాలంలో నియమించుకున్న మొత్తం ఉద్యోగుల్లో 20 శాతం విదేశీయులు కావడం గమనార్హం. వీసా పరమైన సమస్యల నేపథ్యంలో ఐటీ కంపెనీలు విదేశాల్లో నియామకాలపై దృష్టి సారిస్తున్న విషయం తెలిసిందే. గడిచిన డిసెంబర్ త్రైమాసికం వరకే చూసినా టీసీఎస్ సుమారు 3,000 మందిని విదేశాల్లో ఉద్యోగులుగా తీసుకుంది. ''మొత్తం మీద గత ఏడాది కాలంలో 59,700 మందిని ఉద్యోగులుగా నియమించుకున్నాం. ఇందులో 1,2700 మంది విదేశాల్లోనే ఉన్నారు. ఉద్యోగుల్లో స్థానికులకు ప్రాధాన్యం అన్న తమ చొరవ ఏ విధంగా కొనసాగుతుందున్నదానికి ఇదే ప్రతీక'' అని టీసీఎస్ సీఈవో, ఎండీ రాజేష్ గోపినాథన్ అన్నారు. అయితే, ఏ దేశంలో ఎంత మందిని తీసుకున్నదనే వివరాలను టీసీఎస్ బయటకు వెల్లడించలేదు.

నేటి బోర్డ్ మీటింగ్స్



యాక్సిస్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, దివాన్ హౌసింగ్ ఫైనాన్స్, హావెల్స్ ఇండియా, జస్ట్ డయల్, ర్యాలీస్ ఇండియా, శాస్కేన్ టెక్నాలజీస్, వీగార్డ్ ఇండస్ట్రీస్, వక్రంగీ, వీడియోకాన్ ఇండస్ట్రీస్.

ఈ రోజు నుంచి 'బిజినెస్ క్విజ్'

వెబ్ పాఠకులు ఎప్పటికప్పుడు బిజినెస్ పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి, పరీక్షించుకోవడానికి సాక్షిబిజినెస్.కామ్ వినూత్న క్విజ్‌ను ఆరంభిస్తోంది. పలు ఛానళ్లలో అంతర్జాతీయ, జాతీయ క్విజ్‌లను రూపొందించిన 'సునీల్ ధవళ' అందిస్తున్న ఈ క్విజ్ వారంవారం సాక్షి బిజినెస్ వెబ్ పాఠకులకు 'సాక్షి స్పెషల్స్'లో...

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 22-1-2018

విశాఖ	412–00
చిత్తూరు	403–00
వరంగల్	404–00
ముంబై	447–00
చెన్నై	410–00
విజయవాడ	412–00
గోదావరి	412–00
నమక్కల్	395–00
21–1–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	402–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.60
బెంగళూరు	408–00
ఢిల్లీ	425–00
కోల్‌కతా	464–00

ఒడిదుడుకులు ఉండొచ్చు

- ఈ వారమే ఎఫ్ అండ్ ఓ ముగింపు
- క్యూ3 ఫలితాలే కీలకం...
- మార్కెట్ గమనంపై నిపుణులు
- శుక్రవారం రిపబ్లిక్ డే సెలవు
- ట్రేడింగ్ నాలుగు రోజులే...



కంపెనీల క్యూ3 ఫలితాలుఈవారం మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని నిపుణులంటున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న(శుక్రవారం) స్టాక్ మార్కెట్‌కు సెలవు. దీంతో ట్రేడింగ్ ఈ వారంలో నాలుగు రోజులకే పరిమితం కానున్నది. జనవరి సిరీస్ డెరివేటివ్స్ కాంట్రాక్టులు ఈ గురువారమే(ఈ నెల 25న) ముగియనున్నందున మార్కెట్లో ఒడిదుడుకులు చోటు చేసుకునే అవకాశాలూ ఉన్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ముడి చమురు ధరల గమనం, డాలర్‌తో రూపాయి మారకం, ప్రపంచ మార్కెట్ల పోకడ తదితర అంశాలు కూడా ఈ వారం మార్కెట్‌పై ప్రభావం చూపుతాయి.

కీలక కంపెనీల క్యూ3 ఫలితాలు

ఈ వారంలో యాక్సిస్ బ్యాంక్, మారుతీ సుజుకీ ఇండియా, కెనరా బ్యాంక్, ఐడియా సెల్యులర్, కోల్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఎల్ అండ్ టీ, తదితర కంపెనీలు తమ తమ క్యూ3 ఫలితాలను వెల్లడించనున్నాయి. ఇక అంతర్జాతీయ అంశాల పరంగా చూస్తే, జపాన్, యూరోపియన్ కేంద్ర బ్యాంక్‌లు వడ్డీ రేట్లపై ఈ వారంలో నిర్ణయం తీసుకోనున్నాయి. వడ్డీరేట్ల విషయంలో యథతథ స్థితి కొనసాగే అవకాశాలున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

నేడు అపోలో మైక్రో సిస్టమ్స్ లిస్టింగ్..

నేడు(సోమవారం) హైదరాబాద్‌కు చెందిన అపోలో మైక్రో సిస్టమ్స్ కంపెనీ స్టాక్ మార్కెట్లో లిస్టవుతోంది. ఈ నెల 10–12 మధ్య రూ.270–275 ప్రైస్‌బాండ్‌తో వచ్చిన ఈ కంపెనీ ఐపీఓ 249 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయింది.

విదేశీ పెట్టుబడుల జోరు...

మన క్యాపిటల్ మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ)జోరు కొనసాగుతోంది. ఈ నెలలో విదేశీ ఇన్వెస్టర్లు మన క్యాపిటల్ మార్కెట్లో ఇప్పటి దాకా రూ.8,700 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. డిపాజిటరీల గణాంకాల ప్రకారం, విదేశీ ఇన్వెస్టర్లు ఈక్విటీ మార్కెట్లో రూ.5,769 కోట్లు, డెట్‌మార్కెట్లో రూ.2,940 కోట్లు చొప్పున పెట్టుబడులు పెట్టారు.

11,200–11,500 స్థాయిలకు నిఫ్టీ

ఈ ఏడాది ప్రపంచంలో అత్యధిక వేగంగా వృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థగా చైనాను దాటేసి భారత్ అవతరిస్తుందని సంక్రమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ తాజా నివేదిక వెల్లడించింది. అంతే కాకుండా ప్రపంచంలోనే అతి పెద్ద ఐదవ ఈక్విటీ మార్కెట్‌గా కూడా ఈ ఏడాది భారత్ నిలుస్తుందని పేర్కొంది. స్థిరాదాయ సాధానాల కంటే 6–8 శాతం అధికంగా ఈక్విటీల్లో రాబడులు వస్తాయని ఈ సంస్థ అంచనా వేస్తోంది. నిఫ్టీ 10,590–10,580 స్థాయిల్లో నిలదొక్కుకోగలిగితే మధ్య కాలానికే 11,200–11,500 స్థాయిలను అందుకుంటుందని పేర్కొంది. ఈక్విటీ మార్కెట్లో దేశీయ కొనుగోలుదారుదే హవా అని తెలిపింది.

గత వారం హీరోలు

స్టాక్స్	19 ముగింపు	12 ముగింపు	మార్పు(%)
ఐసీఐసీఐ బ్యాంక్	354	318	11
హెచ్‌డీఎఫ్‌సీ	1,900	1,761	8
ఏబీబీ ఇండియా	1,580	1,471	7
టీసీఎస్	2,955	2,773	7
యాక్సిస్ బ్యాంక్	590	556	6
ఐబీ హౌసింగ్	1,301	1,227	6
గోద్రెజ్ కన్సూమర్	1,049	989	6
ఇన్ఫోసిస్	1,143	1,078	6
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1,951	1,866	5
కొటక్ బ్యాంక్	1,060	1,019	4

ఎందుకు పెరిగాయంటే...

ప్రైవేట్ బ్యాంకుల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని వంద శాతానికి పెంచే దిశగా ప్రభుత్వం యోచిస్తోందన్న వార్తల కారణంగా ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వంటి ప్రైవేట్ బ్యాంక్ షేర్లు 6–12 శాతం రేంజ్‌లో పెరిగాయి. ఫలితాలు అంచనాలను మించడంతో ఇన్ఫోసిస్, టీసీఎస్ లాభాలు ఈ వారం కూడా కొనసాగాయి. ఈ రెండు షేర్లు 6–7 శాతం రేంజ్‌లో లాభపడ్డాయి. క్యూ3 ఫలితాలు అంచనాలను మించడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు 4–5 శాతం రేంజ్‌లో పెరిగాయి.

గత వారం జీరోలు

స్టాక్స్	19 ముగింపు	12 ముగింపు	మార్పు(%)
ఐడీఎఫ్‌సీ బ్యాంక్	59	68	-13
ఫెడరల్ బ్యాంక్	103	115	-10
కోల్ ఇండియా	284	308	-8
భారతీ ఇన్‌ఫ్రాటెల్	346	374	-7
డీఎల్‌ఎఫ్	249	268	-7
టాటా పవర్	92	99	-7
గెయిల్ ఇండియా	469	500	-6
పెట్రోనెట్ ఎల్‌ఎన్‌జీ	237	252	-6
అశోక్ లేలాండ్	121	129	-6
ఐడియా	102	109	-6

ఎందుకు తగ్గాయంటే...

ఈ క్యూ3లో నికర లాభం 24 శాతం తగ్గడంతో ఐడీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ 13 శాతం పతనమైంది. రుణ నాణ్యత క్షీణించిన కారణంగా ఫెడరల్ బ్యాంక్ షేర్ 10 శాతం క్షీణించింది. ధర పెంపు కారణంగా అంతకు ముందటి వారంలో ఎగసిన కోల్ ఇండియాలో గత వారం లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. మరోపక్క, అంతర్జాతీయ మార్కెట్లో కమోడిటీల ధరల పతనం కూడా తోడవడంతో ఈ షేర్ 8 శాతం వరకూ తగ్గింది.

భారత జీడీపీకి 'మహిళా' మెరుపు!

- సమాన ప్రాతినిధ్యంతో ఆర్థిక వ్యవస్థకు బూస్ట్
- ఐఎంఎఫ్ చీఫ్ లగార్డ్ వ్యాఖ్య




న్యూఢిల్లీ: భారత్‌లో పని ప్రదేశాల్లో పురుషులతో సమానంగా మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచితే అది ఆ దేశ జీడీపీని 27 శాతం అధికం చేస్తుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థ చీఫ్ క్రిస్టీన్ లగార్డ్, నార్వే ప్రధాని ఎర్నా సోల్‌బెర్గ్ అన్నారు. దావోస్‌లో సోమవారం ప్రపంచ ఆర్థిక సదస్సు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వీరు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. మహిళలపై వివక్షకు, వేధింపులకు కాలం చెల్లిందన్నారు. మహిళల సాధికారత ఈ ఏడాది సదస్సులో ప్రధాన అంశంగా ఉండనుంది. మహిళల పట్ల గౌరవ భావం, అపార అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని వీరు పేర్కొన్నారు. ఈ ఏడాది సదస్సులో సుమారు 3,000 మంది ప్రముఖులు పాల్గొంటుండగా, అందులో 21% మహిళలే. వీరిలో లగార్డ్, సోల్‌బెర్గ్‌తోపాటు మన దేశానికి చెందిన మహిళా ఉద్యమకర్త చేతన సిన్హా కూడా ఉన్నారు. అలాగే, మన దేశ ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా అనేకమంది దిగ్గజాలు సదస్సుకు హాజరవుతున్నారు.

35,500పైన మరింత అప్‌ట్రెండ్

మార్కెట్ పంచాంగం


అమెరికా సూచీల నేతృత్వంలో కొత్త ఏడాదిలో ఊపందుకున్న ప్రపంచ ఈక్విటీల ర్యాలీ వేగంగా సాగుతోంది. అనూహ్య సంఘటనలేవీ చోటుచేసుకోకపోతే ఇది కొనసాగే అవకాశం వుందని విశ్లేషకులు అంటున్నారు. అటు అమెరికాలోనూ, ఇటు ఇండియాలోనూ కార్పొరేట్ల నుంచి వెలువడిన తొలి ఫలితాలు నిరుత్సాహపర్చకపోవడం ర్యాలీ వేగవంతం కావడానికి ప్రధాన కారణం. ఇక ఇండియాలోనైతే... గత శుక్రవారం మార్కెట్ ముగిసిన తర్వాత వెలువడిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ఫలితాలు ఆశ్చర్యకరమైనవే. జియో ఈ ఆర్థిక సంవత్సరంలోనే లాభాల్ని సాధించడం మార్కెట్‌కు మరింత ఉత్సాహాన్ని ఇవ్వవచ్చు. మరో 10 రోజుల్లో కేంద్ర బడ్జెట్ ప్రకటితం కానుంది. ఇందుకు ప్రపంచ మార్కెట్ల సానుకూలత తోడైతే.. సమీప భవిష్యత్తులో ర్యాలీ కొనసాగుతుందనేది విశ్లేషకుల అంచనా. ఇక సూచీల సాంకేతికాలకొస్తే...

సెన్సెక్స్ సాంకేతికాలు..



జనవరి 19తో ముగిసిన వారంలో క్రమేపీ పెరిగిన బీఎస్‌ఈ సెన్సెక్స్ 35,542 పాయింట్ల రికార్డు గరిష్ట స్థాయికి చేరిన తర్వాత చివరకు అంతక్రితం వారం కంటే 920 పాయింట్ల భారీ లాభంతో 35,512 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ ముగింపు తదుపరి రోజుల్లో ర్యాలీకి అత్యంత కీలకం. 35,500 పాయింట్లపైన సెన్సెక్స్ నిలబడితే ర్యాలీ వేగవంతమయ్యే చాన్సుంది. గతవారం మార్కెట్ ముగిసిన తర్వాత వచ్చిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆశ్చర్యకరమైన ఫలితాల ప్రభావం, అమెరికా మార్కెట్ రికార్డు స్థాయిలో ముగిసిన కారణంగా ఈ సోమవారం సెన్సెక్స్ గ్యాప్ అప్‌తో మొదలైతే 35,850 పాయింట్ల స్థాయిని అందుకోవచ్చు. ఈ స్థాయిని దాటితే 36,050 పాయింట్ల వద్దకు చేరవచ్చు. అటుపైన 36,400 పాయింట్ల స్థాయివరకూ క్రమేపీ ర్యాలీ జరపవచ్చు. ఈ సోమవారం నెగిటివ్‌గా మార్కెట్ మొదలైనా, తొలి నిరోధస్థాయిని అందుకోలేకపోయినా, 35,160 పాయింట్ల వద్ద కీలక మద్దతు లభిస్తున్నది. ఈ స్థాయిని ముగింపులో కోల్పోతే 34,640 పాయింట్ల వద్దకు క్షీణించవచ్చు. ఈ లోపున ముగిస్తే 34,340 పాయింట్ల వరకూ పతనం కొనసాగవచ్చు.

10,890పైన నిఫ్టీకి మరింత బలం...



గతవారం మార్కెట్ ముగింపు సమయంలో ఎన్ఎస్‌ఈ నిఫ్టీ 10,900 పాయింట్ల రికార్డు స్థాయిని టచ్ చేసింది. చివరకు అంతక్రితం వారం కంటే 214 పాయింట్ల లాభంతో 10,895 పాయింట్ల వద్ద ముగిసింది. అత్యధిక ట్రేడింగ్ పరిమాణంతో గతవారం నిఫ్టీ వరుసగా రెండు రోజులపాటు 10,900 పాయింట్ల స్థాయిని చాలెంజ్ చేయడం సాంకేతిక బలాన్ని సూచిస్తోంది. ఈ వారం నిఫ్టీ 10,890పైన నిలబడితే మరిన్ని రికార్డుల్ని సృష్టించే అవకాశం ఉంది. ఈ సోమవారం గ్యాప్ అప్‌తో మార్కెట్ మొదలైతే నిఫ్టీ చటుక్కున 10,990. 11,010 పాయింట్ల శ్రేణిని అందుకోవచ్చు. ఈ శ్రేణి పైన ముగిస్తే ర్యాలీ 11,100 పాయింట్ల వరకూ కొనసాగవచ్చు. అటుపైన 11,160 పాయింట్ల స్థాయిని చేరే చాన్సుంది. నిఫ్టీ 10,890పైన నిలబడలేకపోతే 10,780 పాయింట్ల వద్దకు పడిపోవచ్చు. ఈ కీలక మద్దతు లోపున ముగిస్తే 10,640 పాయింట్ల వద్దకు తగ్గవచ్చు. ఈ స్థాయిని కోల్పోతే 10,595 పాయింట్ల వరకూ పతనం కొనసాగవచ్చు. ఈ వారం జనవరి డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు నేపథ్యంలో 10,800 స్ట్రయిక్ వద్ద అధికంగా 58 లక్షల పుట్ బిల్డప్, 11,000 స్ట్రయిక్ వద్ద అత్యధికంగా 53 లక్షల కాల్ బిల్డప్ వుంది. ఈ నెలలో భారీ ర్యాలీ జరిగిన నేపథ్యంలో డెరివేటివ్స్ క్లోజింగ్ సమయానికి ఈ బిల్డప్ తక్కువేనని చెప్పవచ్చు. అంటే... 11,000 పాయింట్ల స్థాయిని దాటితే అప్‌ట్రెండ్ వేగవంతం కావొచ్చని, 10,800 స్థాయిని కోల్పోతే పతనం కూడా అంతే వేగంగా ఉండవచ్చని ఈ బిల్డప్స్ సూచిస్తున్నాయి.

– పి. సత్యప్రసాద్

ఎక్కువ మొత్తానికి గృహరుణం ఓకేనా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మల్టీక్యాప్ ఫండ్స్‌కు, డైనమిక్ ఫండ్స్‌కు మధ్య తేడా ఏమిటి ?

– మాధురి, విజయవాడ

ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే విధానాన్ని బట్టి మల్టీక్యాప్ ఫండ్స్‌కు, డైనమిక్ ఫండ్స్‌కు తేడా ఉంటుంది. ఎల్లప్పుడూ ఈక్విటీల్లోనే పూర్తిగా ఇన్వెస్ట్ చేసే ఫండ్స్‌ను మల్టీక్యాప్ ఫండ్స్‌గా చెప్పుకోవచ్చు. ఇక డైనమిక్ ఫండ్స్ కూడా దాదాపు అధిక స్థాయిల్లోనే ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. అయితే మార్కెట్ స్థితిగతులను బట్టి, ఈక్విటీ, స్థిరాదాయ సాధనాలకు సంబంధించిన పెట్టుబడుల కేటాయింపుల్లో మార్పుచేర్పులు చేస్తాయి. అంటే మార్కెట్ బాగా పెరిగిన పరిస్థితుల్లో ఈక్విటీల్లో తక్కువగానూ, మార్కెట్ పతనమైన పరిస్థితుల్లో ఈక్విటీల్లో ఎక్కువగానూ ఇన్వెస్ట్ చేస్తాయి. అందుకే వీటిని డైనమిక్ ఫండ్స్‌గా వ్యవహరిస్తారు. మార్కెట్ పరిస్థితులను బట్టి డైనమిక్ ఫండ్‌ను నిర్వహించే ఫండ్ మేనేజర్ ఒక్కోసారి స్థిరాదాయ సాధనాల్లో 25 శాతం నుంచి 30 శాతం వరకూ ఇన్వెస్ట్ చేయవచ్చు. ఇక మల్టీక్యాప్ ఫండ్స్ అయితే వివిధ రంగాలకు చెందిన కంపెనీల షేర్లలో ఇన్వెస్ట్ చేసి డైవర్సిఫికేషన్ ప్రయోజనాలు పొందుతాయి.

నా వయస్సు 40 సంవత్సరాలు. నా నికర వేతనం రూ.40,000. ఈ రోజుల్లో గృహ రుణాలపై వడ్డీరేట్లు చౌకగా ఉన్నాయి. అందుకని వీలైనంత ఎక్కువ మొత్తానికి(రూ.30-35 లక్షల వరకూ) గృహ రుణం తీసుకోవాలనుకుంటున్నాను. ఇది సరైన నిర్ణయమేనా ?

– రవి కుమార్, విశాఖపట్టణం

ఈ రోజుల్లో గృహరుణాలపై వడ్డీరేట్లు తక్కువగానే ఉన్నాయన్నది నిజమే. అయితే మీ విషయంలో ఎక్కువ మొత్తానికి గృహ రుణం తీసుకోవడమనేది సరైన నిర్ణయం కాదేమో అనిపిస్తోంది. మీకు వచ్చే ఆదాయంలో 60–80 శాతం వరకూ గృహ రుణ నెలసరి వాయిదాల చెల్లింపులకే పోవడం వల్ల మీ కుటుంబ ఇతర ఆర్థిక అవసరాలపై బాగానే ప్రభావం చూపుతుంది. అనుకోని పరిస్థితుల్లో మీరు ఉద్యోగం కోల్పోతే అప్పుడు పరిస్థితులు మరింత విషమిస్తాయి. ఉద్యోగం కోల్పోయిన కారణంగా ఈఎంఐలు చెల్లించలేక ఇల్లును కూడా కోల్పోవలసి వస్తుంది. అందుకని ఎవరైనా సరే, గృహ రుణానికి సంబంధించిన నెలసరి వాయిదా (ఈఎంఐ) వారి వారి వేతనంలో మూడో వంతుకు మించకుండా చూసుకోవాలి. మీ విషయానికొస్తే, మీ గృహ రుణ ఈఎంఐ రూ.10,000–14,000 రేంజ్‌లోనే ఉండేలా ప్లాన్ చేసుకోండి. ఈ సందర్భంలో మీరు ఉద్యోగం కోల్పోయినా, గృహ రుణ ఈఎంఐ చెల్లించే స్థాయిలోనైనా వెంటనే మరో చిన్న ఉద్యోగం సంపాదించుకొని, సొంత ఇంటిని చేజారకుండా చూసుకోవచ్చు. అయితే గృహ రుణాలు చౌకగా ఉన్నందున ఎక్కువ మొత్తంలో గృహ రుణం తీసుకోవడం ఒక్కోసారి మంచి ఫలితాలే ఇవ్వవచ్చు. గృహం విలువ భవిష్యత్తులో పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ పెరిగే విలువతో పోల్చితే, గృహ రుణంపై అయ్యే వ్యయాలు తక్కువగా ఉంటాయి. మీరు ఉద్యోగం కోల్పోయినా, విషమ పరిస్థితుల్లో ఈఎంఐ చెల్లింపులు కుంటుపడకుండా ఉండేటట్లయితే(మీ భార్య కూడా ఏదో ఒక ఉద్యోగం చేస్తూ గృహ రుణ ఈఎంఐ చెల్లింపులు చేయగలిగితే) వీలైనంత ఎక్కువ మొత్తంలో గృహ రుణం తీసుకోవచ్చు. అన్ని పరిస్థితులను బేరీజు వేసుకొని సరైన నిర్ణయం తీసుకోండి.

నేను ఎల్‌ఐసీ జీవన్ తరంగ్ పాలసీని 2011లో తీసుకున్నాను. పాలసీ వివరాలను మీకు పంపిస్తున్నాను. ఈ పాలసీని సరెండర్ చేద్దామనుకుంటున్నాను. ఈ పాలసీని సరెండర్ చేయడం వల్ల నేను ఏమైనా పన్నులు చెల్లించాల్సి ఉంటుందా ? ఈ పాలసీకి దీనికి బదులుగా టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకోవాలనుకుంటున్నాను. తగిన సలహా ఇవ్వండి.

– పవన్, హైదరాబాద్

జీవన్ తరంగ్ అనేది విత్ ప్రాఫిట్స్–హోల్ లైఫ్ ప్లాన్. మీరు పంపిన వివరాలను బట్టి చూస్తే, మీరు తీసుకున్న పాలసీకి బీమా కవరేజ్ రూ.9 కోట్లకు ఉంది. మీరు ఒక వేళ ఇప్పుడు ఈ పాలసీని సరెండర్ చేస్తే మీరు భారీగా నష్టపోతారు. మీరు ఇప్పటిదాకా చెల్లించిన ప్రీమియమ్‌ల్లో మొదటి ఏడాది ప్రీమియమ్‌ను మినహాయించి మిగిలిన దాంట్లో 30 శాతం మాత్రమే మీకు గ్యారంటీడ్ సరెండర్ వ్యాల్యూగా వస్తుంది. ఎల్‌ఐసీ ఒకోసారి స్పెషల్ సరెండర్ వ్యాల్యూని కూడా చెల్లించవచ్చు. ఇది గ్యారంటీడ్ సరెండర్ వ్యాల్యూ కంటే కొంచెం అధికంగానే ఉంటుంది. మీరు ఈ పాలసీ తీసుకుని మూడేళ్లు దాటింది కాబట్టి మీరు ఈ పాలసీని సరెండర్ చేయవచ్చు. ఈ పాలసీని సరెండర్ చేయడం వల్ల మీరు ఎలాంటి పన్నులు చెల్లించాల్సిన పనిలేదు. బీమా తీసుకోవాలనుకుంటే ప్యూర్ టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకోవడమే ఉత్తమమైన విధానం. టర్మ్ బీమా పాలసీలకు చెల్లించాల్సిన ప్రీమియమ్ తక్కువగా ఉంటుంది. పైగా బీమా కవరేజ్ అధికంగా ఉంటుంది. తక్కువ ప్రీమియమ్ చెల్లించడం ద్వారా అధిక మొత్తానికి బీమా కవరేజ్ పొందవచ్చు. బీమా, ఇన్వెస్ట్‌మెంట్‌కు ఒకే పాలసీని ఎప్పుడూ తీసుకోకూడదు. బీమాకు, ఇన్వెస్ట్‌మెంట్స్‌కు వేర్వేరుగా ఇన్వెస్ట్ చేయాలి. బీమా కోసం టర్మ్ పాలసీని తీసుకున్నట్లుగానే, దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల కోసం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలి. సొంత ఇల్లు సమకూర్చుకోవడం, రిటైర్మెంట్ నిధి ఏర్పాటు, పిల్లల ఉన్నత చదువులు వంటి దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల కోసం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ను ఎంచుకోవాలి. ఈ ఫండ్స్‌లో నెలకు కొంత మొత్తం చొప్పున సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్)విధానంలో ఇన్వెస్ట్‌చేస్తే దీర్ఘకాలంలో మంచి రాబడులు పొందవచ్చు.

సాక్షి స్పోర్ట్స్
సోమవారం 22-1-2018



హారిక ఖాతాలో ఆరో 'డ్రా'

టాటా స్టీల్ చాలెంజర్స్ చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఆరో 'డ్రా' నమోదు చేసింది. నెదర్లాండ్స్‌లోని విక్ ఆన్ జీ పట్టణంలో జరుగుతున్న ఈ టోర్నీలో ఆదివారం జరిగిన ఎనిమిదో రౌండ్‌లో హారిక 32 ఎత్తుల్లో అమెరికా గ్రాండ్‌మాస్టర్ జియాంగ్ జెఫ్రీని నిలువరించింది. ఇదే వేదికపై జరుగుతున్న మాస్టర్స్ టోర్నీలో పీటర్ స్విడ్లెర్ (రష్యా)తో జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌ను భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ 27 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు.


నాదల్

నాదల్ శ్రమించి...

మొదటి మూడు రౌండ్‌లలో సునాయాస విజయాలు సాధించిన ప్రపంచ నంబర్‌వన్ రాఫెల్ నాదల్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తొలిసారి అసలు పరీక్ష ఎదురైంది. అర్జెంటీనా యువతార డీగో ష్వార్ట్జ్‌మన్‌తో దాదాపు నాలుగు గంటలపాటు సాగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఈ స్పెయిన్ స్టార్ తన అనుభవాన్నంతా రంగరించి గట్టెక్కాడు. క్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ మారిన్ సిలిచ్‌తో తలపడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ కరోలిన్ వొజ్నియాకి, నాలుగో సీడ్ స్వితోలినా అలవోక విజయాలతో క్వార్టర్స్‌లోకి అడుగు పెట్టారు.

క్వార్టర్ ఫైనల్లోకి స్పెయిన్ స్టార్ ◆ ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ

మెల్‌బోర్న్: గతేడాది రెండు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించి జోరు మీదున్న స్పెయిన్ స్టార్ రాఫెల్ నాదల్ కొత్త సీజన్‌లోనూ దూసుకెళ్తున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలో ఈ టాప్ సీడ్ ప్లేయర్ క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకున్నాడు. 24వ సీడ్ డీగో ష్వార్ట్జ్‌మన్ (అర్జెంటీనా)తో 3 గంటల 51 నిమిషాలపాటు జరిగిన ప్రిక్వార్టర్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ నాదల్ 6–2, 6–7 (4/7), 6–3, 6–3తో గెలుపొంది పదోసారి ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించాడు. గతేడాది రన్నరప్‌గా నిలిచిన నాదల్ తాజా విజయంతో తన నంబర్‌వన్ ర్యాంక్‌ను పదిలం చేసుకున్నాడు. 'మ్యాచ్ గొప్పగా సాగింది. ఒకదశలో అలసిపోయినా తుదివరకు పోరాడగలిగి విజయం దక్కించుకున్నాను' అని నాదల్ వ్యాఖ్యానించాడు. గత మూడు మ్యాచ్‌ల్లో ఒక్క సెట్ కూడా కోల్పోని నాదల్ ఈ పోటీలో ఒక సెట్ చేజార్చుకున్నాడు. అంతేకాకుండా తన సర్వీస్ మూడుసార్లు కోల్పోయాడు. మరోవైపు ష్వార్ట్జ్‌మన్ 12 ఏస్‌లు సంధించడంతోపాటు శక్తివంతమైన గ్రౌండ్‌షాట్‌లతో నాదల్‌ను ఇబ్బంది పెట్టాడు. క్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా)తో నాదల్ తలపడతాడు. మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో సిలిచ్ 6–7 (2/7), 6–3, 7–6 (7/0), 7–6 (7/3)తో పదో సీడ్ పాబ్లో కరెనో బుస్టా (స్పెయిన్)ను ఓడించాడు. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మూడో సీడ్ దిమిత్రోవ్ (బల్గేరియా) 7–6 (7/3), 7–6 (7/4), 4–6, 7–6 (7/4)తో 17వ సీడ్ నిక్ కిరియోస్ (ఆస్ట్రేలియా)పై గెలుపొంది మూడోసారి ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరగా... బ్రిటన్ ఆశాకిరణం కైల్ ఎడ్మండ్ 6–7 (4/7), 7–5, 6–2, 6–3తో ఆంద్రియా సెప్పి (ఇటలీ)ని ఓడించి కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు.

స్వితోలినా తొలిసారి...

మహిళల సింగిల్స్‌లో ఆదివారం ఎలాంటి సంచలనాలు చోటు చేసుకోలేదు. రెండో సీడ్ కరోలిన్ వొజ్నియాకి (డెన్మార్క్) ఐదేళ్ల తర్వాత, నాలుగో సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) తొలిసారి ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లు ఖాయం చేసుకున్నారు. ప్రిక్వార్టర్ ఫైనల్లో వొజ్నియాకి 6–3, 6–0తో 19వ సీడ్ మగ్దలీనా రిబరికోవా (స్లొవేకియా)పై... స్వితోలినా 6–3, 6–0తో డెనిసా అలెర్టోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచారు. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో కార్లా సురెజ్ నవారో (స్పెయిన్) 4–6, 6–4, 8–6తో 32వ సీడ్ కొంటావీట్ (ఎస్తోనియా)పై, ఎలీస్ మెర్‌టెన్స్ (బెల్జియం) 7–6 (7/5), 7–5తో పెట్రా మార్టిక్ (క్రొయేషియా)పై విజయం సాధించారు.


వొజ్నియాకి

పేస్ జంట నిష్క్రమణ

పురుషుల డబుల్స్‌లో లియాండర్ పేస్–పురవ్ రాజా (భారత్) జంట పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో పేస్–పురవ్ ద్వయం 1–6, 2–6తో సెబాస్టియన్ కబాల్–రాబర్ట్ ఫరా (కొలంబియా) జంట చేతిలో ఓడిపోయింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)–తిమియా బాబోస్ (హంగేరి) జోడీ 6–2, 6–4తో విటింగ్టన్–ఎలెన్ పెరెజ్ (ఆస్ట్రేలియా) జంటపై గెలిచింది.

నన్ను అనుసరించాలని కోరుకోవట్లేదు!

తన పిల్లల గురించి ఫెడరర్



మెల్‌బోర్న్: టెన్నిస్ ఆల్‌టైమ్ గ్రేట్‌లలో అతను ఒకడు... 19 గ్రాండ్‌స్లామ్ టోర్నీల విజేత... సహజంగానే అతని పిల్లలు తండ్రి అడుగు జాడల్లో నడుస్తారని, భవిష్యత్తులో టెన్నిస్ స్టార్‌లుగా ఎదుగుతారని చాలా మంది భావిస్తారు. అయితే రోజర్ ఫెడరర్ మాత్రం అలా జరగాలని కోరుకోవట్లేదు. ఏదైనా ఆటలో ప్రవేశం ఉంటే మంచిదే కానీ తనలాగా ప్రొఫెషనల్ టెన్నిస్ ఆటగాళ్లుగా మారతారో లేదో చెప్పలేనన్నాడు. 'వారు నన్ను అనుసరించాలని ఆశించడం లేదు. ఎందుకంటే నా పిల్లలు కూడా మరో 25 ఏళ్ల పాటు ప్రొఫెషనల్‌గా మారి ప్రపంచవ్యాప్తంగా తిరుగుతూనే ఉండాలని నేను కోరుకోకపోవడమే దానికి కారణం. అయితే ఆటలు కానీ వ్యాపారంలాంటి మరో రంగంలోకి కానీ వారు వెళతానంటే మద్దతుగా నిలుస్తాను. చిన్నప్పుడే ఆటలు ఆడే మంచి అలవాటు వారికి రావాలి. అది ఏ ఆటైనా సరే. అయినా సరదాగానైనా ఫెడరర్ పిల్లలు టెన్నిస్ ఆడకుంటే ఆశ్చర్యం కానీ ఆడితే ఏముంది' అని ఈ దిగ్గజ ఆటగాడు వ్యాఖ్యానించాడు. ఫెడరర్, మిర్కా దంపతులకు కవలల జతలు ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు.

ప్రాక్టీస్ జోరుగా...

మూడో టెస్టుకు భారత ప్రధాన ఆటగాళ్ల సన్నాహాలు

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో ఇప్పటికే టెస్టు సిరీస్ కోల్పోయిన భారత్ మూడో టెస్టులోనైనా మెరుగ్గా ఆడాలని పట్టుదలగా ఉంది. ఈ నెల 24 నుంచి ఇక్కడి వాండరర్స్ మైదానంలో జరిగే ఈ మ్యాచ్ కోసం ఆటగాళ్లంతా తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఆదివారం వారంతా సుదీర్ఘ సమయం పాటు ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. సెంచూరియన్ పరాజయం తర్వాత మూడు రోజులు విశ్రాంతి తీసుకొని సరదాగా విహరించిన జట్టు సభ్యులంతా నెట్స్‌కు హాజరై చెమటోడ్చారు. ఫుట్‌బాల్ ఆడి వార్మప్ చేసిన తర్వాత ముందుగా జట్టు ఫీల్డింగ్‌పై దృష్టి పెట్టింది. పార్థివ్, రాహుల్, రహానే, రోహిత్, దినేశ్ కార్తీక్‌లతో కోచ్ ఆర్. శ్రీధర్ స్లిప్ ఫీల్డింగ్ ప్రాక్టీస్ చేయించారు. మంగళవారమే జొహన్నెస్‌బర్గ్ చేరుకున్న ప్రాక్టీస్ బౌలర్లు శార్దుల్ ఠాకూర్, నవదీప్ సైని బంతులు విసరగా రాహుల్, విజయ్, పుజారా ఒకేసారి సాధన చేశారు. విజయ్, రాహుల్‌కు స్పిన్నర్లు అశ్విన్, జడేజా కూడా ఎక్కువ సేపు బౌలింగ్ చేశారు. అనంతరం కోహ్లి, రహానే, పాండ్యా బ్యాటింగ్‌కు దిగారు. తొలి రెండు టెస్టులకు జట్టులో స్థానం లభించని రహానే చాలా సేపు ఆడటం విశేషం. ప్రధాన పేసర్లు భువీ, షమీ వీరికి బౌలింగ్ చేశారు. మరో వైపు పిచ్‌పై ఉన్న పచ్చికను ఆదివారం కొంతవరకు తొలగించారు. 'వికెట్‌పై తగినంత పచ్చిక ఉంచాం. మ్యాచ్‌కు ముందు దీనిని తగ్గించకపోవచ్చు. సరిపోయేంత నీటిని కూడా ఉపయోగిస్తున్నాం కాబట్టి సెంచూరియన్ తరహాలో పొడిబారిపోయే ప్రమాదం లేదు. దక్షిణాఫ్రికా జట్టు కోరిక మేరకే దీనిని సిద్ధం చేశాం. పేస్, బౌన్స్‌కు పిచ్ అనుకూలంగా ఉంటుంది' అని వాండరర్స్ క్యురేటర్ బేతుల్ బుతెలెజి చెప్పారు.


ప్రాక్టీస్ ముగిసిన అనంతరం పాండ్యా, దినేశ్ కార్తీక్, బుమ్రా

పంజాబ్‌కు 'సూపర్' విజయం

- మెరిసిన హర్భజన్, యువరాజ్
- ముస్తాక్ అలీ టి20 టోర్నీ



కోల్‌కతా: భారత వెటరన్ స్టార్స్ యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్ మెరుపులతో ఉత్కం'టై'న మ్యాచ్‌లో పంజాబ్ సూపర్ ఓవర్‌తో గెలిచింది. ముస్తాక్ అలీ టి20 ట్రోఫీ సూపర్‌లీగ్ గ్రూప్ 'ఎ'లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 4 పరుగుల తేడాతో కర్ణాటకపై నెగ్గింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక 20 ఓవర్లలో 7 వికెట్లకు 158 పరుగులు చేసింది. అనిరుధ జోషి (19 బంతుల్లో 40 నాటౌట్; 6 ఫోర్లు, 1 ఫోర్) ధాటిగా ఆడాడు. తర్వాత 159 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కూడా నిర్ణీత ఓవర్లు ముగిసే సరికి 9 వికెట్ల నష్టానికి సరిగ్గా 158 పరుగులే చేయడంతో మ్యాచ్ టై అయింది. పంజాబ్ ఓపెనర్ మన్‌దీప్ సింగ్ (45; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా, వన్‌డౌన్‌లో దిగిన కెప్టెన్ భజ్జీ (19 బంతుల్లో 33; 5 ఫోర్లు, 1 సిక్స్), యువీ (25 బంతుల్లో 29; 5 ఫోర్లు) తమ అనుభవాన్ని చాటారు. ఫలితం కోసం సూపర్ ఓవర్ ఆడించగా మొదట పంజాబ్ 15 పరుగులు చేసింది. తర్వాత కర్ణాటక 11 పరుగులే చేసి ఓడింది. గ్రూప్ 'ఎ'లో మరో మ్యాచ్‌లో ముంబై 13 పరుగుల తేడాతో జార్ఖండ్‌పై గెలిచింది. గ్రూప్ 'బి'లో రిషభ్ పంత్ (58; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) ధాటికి ఢిల్లీ 8 వికెట్ల తేడాతో తమిళనాడుపై... బరోడా 17 పరుగులతో బెంగాల్‌పై విజయం సాధించాయి.

రన్నరప్ భారత్

తౌరంగ (న్యూజిలాండ్): టైటిల్ పోరులో భారత హాకీ జట్టు పోరాడి ఓడింది. బెల్జియంతో ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో టీమిండియా 1–2 గోల్స్‌తో ఓడిపోయింది. దీంతో నాలుగు దేశాల ఇన్విటేషనల్ తొలి అంచె టోర్నీలో భారత్ రన్నరప్‌తో సరిపెట్టుకుంది. భారత్ తరపున నమోదైన ఏకైక గోల్‌ను మన్‌దీప్ సింగ్ 19వ నిమిషంలో సాధించగా... టామ్ బూన్ (4వ ని.),డాకియెర్ (36వ ని.) చెరో గోల్ చేసి బెల్జియంను గెలిపించారు. నాలుగో నిమిషంలోనే బెల్జియం సఫలమైంది. బూన్ చేసిన గోల్‌తో 1–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తర్వాత రెండో క్వార్టర్‌లో భారత్‌కు మన్‌దీప్ గోల్ సాధించి పెట్టాడు. దీంతో 1–1తో స్కోరు సమమైంది. అయితే మూడో క్వార్టర్ మొదలైన ఆరు నిమిషాలకే డాకియెర్ చేసిన గోల్‌తో మళ్లీ బెల్జియం ఆధిక్యంలోకి వెళ్లి దానిని నిలబెట్టుకుంది. రెండో అంచె టోర్నీ ఈనెల 24న మొదలవుతుంది.

దెబ్బకు దెబ్బ

వన్డే సిరీస్ ఇంగ్లండ్ సొంతం ● బట్లర్ అద్భుత సెంచరీ




సిడ్నీ: యాషెస్ సిరీస్‌లో చావు దెబ్బ తిన్న ఇంగ్లండ్ వన్డే సిరీస్‌లో మాత్రం అదరగొడుతోంది. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన మూడో వన్డేలో 16 పరుగులతో విజయం సాధించిన ఇంగ్లండ్ మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్‌ను 3–0తో చేజిక్కించుకుంది. జోస్ బట్లర్ (83 బంతుల్లో 100 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), వోక్స్ (36 బంతుల్లో 53 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగడంతో... తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 6 వికెట్లకు 302 పరుగులు చేసింది. అనంతరం ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 286 పరుగులకే పరిమితమైంది. సిరీస్‌లో నాలుగో వన్డే శుక్రవారం అడిలైడ్‌లో జరుగనుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ ఒక దశలో ఇంగ్లండ్ 189 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కానీ బట్లర్, వోక్స్ జోడి బౌండరీలతో చెలరేగి చివరి 10 ఓవర్లలో 102 పరుగులు సాధించడంతో స్కోరు 300 దాటింది. ఇన్నింగ్స్ చివరి బంతికి 2 పరుగులు తీసి బట్లర్ వన్డేల్లో ఐదో సెంచరీ పూర్తి చేసుకోవడం విశేషం. ఆ తర్వాత ఆస్ట్రేలియా తరపున ఫించ్ (62; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), స్మిత్ (45), మిచెల్ మార్ష్ (55) పోరాడినా కీలక సమయాల్లో వికెట్లు కోల్పోవడంతో ఆసీస్ వెనుకబడిపోయింది. మార్క్ వుడ్, వోక్స్, రషీద్‌లకు తలా రెండు వికెట్లు దక్కాయి.

శ్రీలంక గెలిచిందోచ్...

ఢాకా: వరుస ఓటములతో డీలాపడ్డ శ్రీలంకకు కాస్త ఊరట లభించింది. ముక్కోణపు వన్డే సిరీస్‌లో ఇప్పటికే రెండు మ్యాచుల్లో ఓటమి పాలైన లంక ఆదివారం జింబాబ్వేతో జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో ఐదు వికెట్లతో నెగ్గింది. తొలుత జింబాబ్వే 44 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌటవ్వగా... శ్రీలంక 44.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 202 పరుగులు చేసి గెలుపొందింది. లంక తరపున కుశాల్ పెరీరా (49), కెప్టెన్ చండిమాల్ (38 నాటౌట్), తిసారా పెరీరా (39 నాటౌట్) రాణించారు.

అప్పుడంత.. ఇప్పుడెంత?

"మా సుబ్బిగాడు.. ఒరేయ్ అప్పిగా.. అక్కడ ఎకరం పది వేలురా.. కొనరా అంటూ ఎన్నిసార్లు చెప్పాడో.. నేనే వినలేదు.. అక్కడెవరు కొంటారు అనే వాడిని.. ఇప్పుడు అక్కడ ఎకరం పాతిక లక్షలట.. వాడి మాట విని ఉంటే బాగుండేది.. మన టైం అలాగుంది.. ప్చ్'' ఇలా అనుకునేవాళ్లను మనం చాలామందిని చూసుంటాం. అప్పట్లో నేను అలా చేసుంటే.. ఇప్పుడిలా ఉండేది.. అంటూ ఫీలయ్యేవారెందరో.. ఇదే తీరులో 'హౌ మచ్.నెట్' సైటు వాళ్లు 10 ఏళ్ల క్రితం వెయ్యి డాలర్లు ఏదైనా కంపెనీలో పెట్టుబడి పెట్టుంటే.. అదిప్పుడు ఎంతయుండేది అన్న వివరాలను లెక్కేశారు.. 2007లో డాలరు విలువ సుమారు రూ.40. దాని ప్రకారం అప్పట్లో రూ.40 వేలు పెట్టుబడి పెట్టుంటే.. 2017(అక్టోబర్ నాటికి)లో ఎంత అయిండేది అన్నది అమెరికాలోని ప్రముఖ కంపెనీలవారీగా చూస్తే..



● ఈ పదేళ్లలో సదరు కంపెనీ ఇచ్చిన డివిడెండ్లను తిరిగి పెట్టుబడి పెట్టలేదని భావిస్తూ.. లెక్కేసిన విలువ ఇదీ..

\- సాక్షి, తెలంగాణ డెస్క్

'డ్యామ్'డుస్కేనా!

సాగర్, శ్రీశైలం డ్యామ్‌ల భద్రత కంటితుడుపే

భారీ వరదను ఎదుర్కొనే సన్నద్ధత కరువు

గతంలో నిపుణులిచ్చిన సూచనలకు చెల్లుచీటీ

రేపట్నుంచి తిరువనంతపురంలో డ్యామ్‌ల భద్రతపై సమావేశాలు

జాతీయ డ్యామ్‌ల భద్రతా బిల్లుకు తుదిరూపం ఇచ్చే అవకాశం



సాక్షి, హైదరాబాద్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని ప్రధాన డ్యామ్‌ల నిర్వహణను ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు గాలికొదిలేస్తున్నాయి. నాగార్జునసాగర్, శ్రీశైలం డ్యామ్‌లు ఎక్కువ కాలం మన్నికగా ఉండేందుకు, వరదల తాకిడిని తట్టుకునేందుకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. భారీ వరదలను ఎదుర్కొనే సన్నద్ధత విషయంలో నిర్లక్ష్యం చూపుతుండటంతో వాటి భద్రత గాలి బుడగలా మారింది. ఈ నేపథ్యంలో డ్యామ్‌ల భద్రతపై నేషనల్ కమిటీ ఆన్ డ్యామ్ సేఫ్టీ (ఎన్‌సీడీఎస్) నేతృత్వంలో మంగళవారం నుంచి రెండ్రోజులపాటు తిరువనంతపురంలో జరగనున్న సమావేశాలు కీలకం కానున్నాయి. ఈ సమావేశాల్లో డ్యామ్‌ల భద్రత బిల్లుకు తుదిరూపం ఇచ్చే అవకాశం ఉంది.

భద్రతా చర్యలేవీ..?

శ్రీశైలం, సాగర్ డ్యామ్‌ల భద్రత విషయంలో తెలుగు రాష్ట్రాలు చేస్తున్న అలసత్వం అంతా ఇంతా కాదు. శ్రీశైలం విషయానికొస్తే 216 టీఎంసీల సామర్థ్యంగల శ్రీశైలం డ్యామ్‌కు ఉన్న 12 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి నిర్వహణ చేపడుతున్నారు. ఈ ఎత్తులో, ప్రస్తుతం ఉన్న క్రస్ట్‌గేట్ల ద్వారా మొత్తంగా 15 లక్షల క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేసే అవకాశం ఉంది. అంతకుమించి ప్రవాహం వస్తే డ్యామ్ నిర్వహణ కష్టంగా మారుతోంది. 2009లో 25 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో డ్యామ్ నిర్వహణ కష్టసాధ్యమై భారీ నష్టం చేకూరింది. కుడి, ఎడమ కాల్వల కింద ఉన్న 1,670 మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రాలు ముంపునకు గురయ్యాయి. వరదను ఎదుర్కొనే సన్నద్ధతలో విఫలం కావడంతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. మరో రెండు అడుగుల నీరు చేరి ఉంటే డ్యామ్ పైనుంచే నీరు పారే పరిస్థితి వచ్చేది. అదే జరిగి ఉంటే మొత్తం డ్యామ్‌కే ప్రమాదం జరిగే పరిస్థితి తలెత్తేది. ఈ అనుభవాల దృష్ట్యా ప్రాజెక్టు స్పిల్‌వే సామర్థ్యాన్ని పెంచాలని ఎన్‌సీడీఎస్ సూచించింది. ప్రాజెక్టుకు వచ్చే వరదలో కొంత భాగాన్ని మళ్లించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సిఫార్సు చేసింది. డ్యామ్‌కు ఇరువైపులా కొండ ప్రాంతంలో ఐదేసి టన్నెళ్లను తవ్వించి రిజర్వాయర్ నుంచి నీటిని డ్యామ్‌కు కింది వైపున నేరుగా నదిలో వదలడానికి అవకాశాలను పరిశీలించాలని సూచించింది. అయితే ఇవేవీ పెద్దగా అమల్లోకి రాలేదు.

సాగర్ పరిస్థితీ అంతంతే...

ఇక నాగార్జున సాగర్ ప్రాజెక్టు వరదను తట్టుకునే సామర్థ్యం 12 లక్షల క్యూసెక్కులు మాత్రమే. కానీ 2009లో వచ్చిన వరదతో స్పిల్‌వే భారీగా దెబ్బతిన్నది. కేంద్ర జలవనరులశాఖ కమిషన్ మాజీ చైర్మన్ ఎం.ఎస్. రెడ్డి ఆధ్వర్యంలోని నిపుణుల బృందం గతంలో సాగర్ ప్రాజెక్టును పరిశీలించి ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది. భవిష్యత్తులో 2009 నాటి వరద పరిస్థితి పునరావృతమైనా లేదా వరద రెండు రోజులకన్నా ఎక్కువగా కొనసాగినా ఆ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రస్తుత ప్రభుత్వం వద్ద సరైన యంత్రాంగం లేదని కమిటీ తేల్చిచెప్పింది. ప్రాజెక్టును బలోపేతం చేసేందుకు ప్రభుత్వం వద్ద తగిన ప్రణాళిక లేదని పేర్కొంది. సాగర్‌కు ఇరువైపులా మట్టి కట్టలు (ఎడమ, కుడి ఎర్త్ డ్యాంలు) నిర్మించినా వరదలను ఛేదించే ప్రదేశాలను ఏర్పాటు చేయలేదని, తక్షణమే సాగర్ ప్రాజెక్టుకు వరద ఛేదక ప్రదేశాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నిపుణుల కమిటీ సూచించింది. వరద ఛేదక ప్రదేశాలు లేకపోవడం వల్ల వరదలను అదుపు చేయలేని పరిస్థితుల్లో స్పిల్‌వేలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంటుంది. అనుకోకుండా వరదలు వస్తే స్పిల్‌వే నిర్మాణాన్ని కాపాడేందుకు అవసరమైతే మట్టికట్టలను తొలగించేందుకు వరద ఛేదక ప్రదేశాలు ఉపయోగపడతాయి. ప్రాజెక్టులోకి చేరే నీటిని క్రమబద్ధీకరించాలని, వరద నీటిని నదీ తీరం నుంచే మళ్లించేందుకు చర్యలు చేపట్టాలని కమిటీ సూచించింది. అయితే ఇవేవీ అమల్లోకి రాలేదు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కేంద్రం జాతీయ డ్యామ్‌ల భద్రతా బిల్లును సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ముసాయిదాను తెచ్చిన జలసంఘం... మంగళవారం నుంచి జరిగే జాతీయ డ్యామ్‌ల భద్రతా కమిటీ సమావేశాల్లో చర్చించి తుది బిల్లును ఖరారు చేయనుంది.

అనుమతి లేకుండా 'ఆమె'ను తాకడం నిషిద్ధం

తొమ్మిదేళ్ల బాలికపై లైంగిక దాడి కేసులో ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ: అనుమతి లేకుండా మహిళను తాకడం కూడా తప్పేనని ఢిల్లీ కోర్టు స్పష్టం చేసింది. మహిళ శరీరంపై ఆమెకే పూర్తి అధికారం ఉంటుందని, సమ్మతి లేకుండా తన శరీరాన్ని ఇతరులు ఏ ఉద్దేశంతోనైనా తాకడం నిషిద్ధమని పేర్కొంది. తొమ్మిదేళ్ల బాలికపై లైంగిక దాడి కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసిన కోర్టు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిందితుడు చవి రామ్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. కామాంధుల చేతుల్లో మహిళలు ఇంకా సమిధలవుతూనే ఉన్నారని జడ్జి జస్టిస్ సీమా మణి ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల గోప్యత హక్కును పురుషులు ఇంకా గుర్తించనట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. 'సాంకేతికంగా దూసుకుపోతున్న భారత్ లాంటి స్వేచ్ఛాయుత దేశంలో మహిళలు, మైనర్ బాలికలపై లైంగిక వేధింపులు జరుగుతుండటం దురదృష్టకరం. రద్దీ మార్కెట్లు, సినిమా హాళ్లలో ఇవి నిత్యకృత్యంగా మారడం బాధాకరం' అని న్యాయమూర్తి పేర్కొన్నారు. నిందితుడు రామ్ కూడా 2014 సెప్టెంబర్ 25న రద్దీ మార్కెట్లో తొమ్మిదేళ్ల బాలికను అసభ్యంగా తాకుతూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని.. అతడు కామాంధుడని, క్షమార్హుడు కాదని జడ్జి పేర్కొన్నారు. రామ్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. బాధిత బాలికకు రూ.50 వేల పరిహారం చెల్లించాల్సిందిగా ఢిల్లీ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీని ఆదేశించారు.



సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం 'పట్నం వారం' నిర్వహించారు. దాదాపు లక్షన్నర మందికి పైగా భక్తులు తరలివచ్చి పట్నాలు వేసి మొక్కులు చెల్లించారు. శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్లతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. కాగా, సోమవారం హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాలకు చెందిన యాదవ భక్తులు మల్లన్న గుండాలు నిర్వహించనున్నారు. శివసత్తుల పూనకాల మధ్య భక్తులు ఈ అగ్నిగుండాలను దాటడం ఆనవాయితీగా వస్తోంది. –కొమురవెల్లి (సిద్దిపేట)

చర్చిలో పవన్ దంపతుల ప్రార్థనలు

హైదరాబాద్: సినీ నటుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం ఉదయం ఏడు గంటలకు సతీమణి అన్నా లెజ్నేవా, భారత్‌లో పోలాండ్ దేశ రాయబారి ఆడమ్ బురాకోవస్కీతో కలసి చర్చికి వచ్చిన పవన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. వీరి వెంట భారతీయ జీవనశైలి, విద్యావిధానాన్ని అధ్యయనం చేయడానికి వచ్చిన 20 ఏళ్లలోపు వయస్సుగల విద్యార్థుల బృందం, పోలాండ్ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. పవన్ తన భార్యతో రావడంతో వారిని చూడటానికి జనం ఆసక్తిని కనబరిచారు. అనంతరం ప్రశాసన్‌నగర్ జనసేన కార్యాలయంలో పవన్‌కల్యాణ్‌తో ఆడమ్ బురాకోవస్కీ, ఆ దేశ ప్రతినిధులు సమావేశమయ్యారు. జనసేన మీడియా హెడ్ పి.హరి ప్రసాద్ ఓ అధికారిక ప్రకటనలో తెలిపారు.



ప్రార్థనలో పాల్గొన్న పవన్ దంపతులు. చిత్రంలో ఆడమ్ బురాకోవస్కీ

గిరిజన తండాలో సినీనటి అమల సందడి



చిన్నారులతో అమల

కుల్కచర్ల: ప్రముఖ సినీనటి, బ్లూక్రాస్ సొసైటీ నిర్వాహకురాలు అక్కినేని అమల గిరిజన తండాలో సందడి చేశారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం రాంరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని అల్లాపూర్ తండాను ఆదివారం ఆమె సందర్శించారు. రాంరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ మాణెమ్మ ఇంటికి వెళ్లి ఆమె కుటుంబసభ్యులతో మాట్లాడారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా చిన్న కుటుంబాలే కనిపిస్తున్నాయని, ఇలాంటి సమయంలోనూ 36 మందితో ఉమ్మడి కుటుంబంగా జీవిస్తున్న మాణెమ్మ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అక్కినేని నాగేశ్వర్‌రావు స్థాపించిన అన్నపూర్ణ ఇంటర్నేషనల్ స్కూల్ అండ్ ఫిలిమ్స్ మీడియా పాఠశాలకు అమల డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఇందులో పనిచేసే సిబ్బందికి గ్రామీణ ప్రాంతాలు, వారి జీవన స్థితిగతులు, వ్యవసాయం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు తండాలను సందర్శించారు.

రాష్ట్ర సేంద్రియ స్టాల్‌కు రెండో స్థానం

సాక్షి, హైదరాబాద్: బెంగళూరులో జరిగిన అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలో తెలంగాణ వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, తెలంగాణ రాష్ట్ర విత్తన సేంద్రియ ధ్రువీకరణ సంస్థ(టీఎస్ఎస్‌వోసీఏ)ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేంద్రియ పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాల స్టాల్ రెండో స్థానంలో నిలిచిందని టీఎస్ఎస్‌వోసీఏ డైరెక్టర్ డాక్టర్ కె.కేశవులు ఆదివారం వెల్లడించారు. రాష్ట్రంలో సేంద్రియ పద్ధతుల్లో రైతులు పండిస్తున్న బత్తాయి, నిమ్మ, ఉసిరి, జామ, అరటి, సపోటా, పనస పండ్లు సహా పలు కూరగాయలను రాష్ట్ర స్టాల్‌లో ప్రదర్శించారు. జొన్న, సజ్జ, అరికెలు, కొర్రలు వంటి చిరుధాన్యాలను కూడా స్టాల్‌లో ఉంచినట్లు తెలిపారు.



Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District. Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.